

'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు.
పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు
ఉన్నత చదువులు చదవాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 150

బుధవారం 14-2-2024



శ్రీమతికి ప్రేమ లేఖ
నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు - ఫ్యామిలీలో




టాటా ఈవీలపై భారీ డిస్కౌంట్
నెక్సన్, టియాగో ఈవీలపై రూ.1.2 లక్షల వరకు తగ్గింపు - బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



300 యూనిట్ల దాకా ఉచితం
దేశంలో కోటి ఇళ్లకు ప్రతినెలా 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ లక్ష్యంగా 'పీఎం సూర్య ఘర్..'ను ప్రధాని మోదీ ప్రారంభించారు.
వివరాలు 6లో ▸



అబుదాబిలో ఆలయం
యూఏఈ రాజధాని అబుదాబిలో 27 ఎకరాల్లో నిర్మించిన ఆలయం బుధవారం ప్రధాని మోదీ చేతుల మీదుగా ఆరంభానికి సిద్ధమైంది.
వివరాలు 6లో ▸



బీజేపీలో చేరిన అశోక్ చవాన్
కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ మంగళవారం బీజేపీలో చేరారు.
వివరాలు 6లో ▸



నూతన ప్రభుత్వంలో చేరబోం
పాక్‌లో సంకీర్ణ ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతిస్తామని పీపీపీ నేత బిలావల్ భుట్టో ప్రకటించారు. నవాజ్ షరీఫ్ ప్రధాని కానున్నారు.
వివరాలు 6లో ▸

ఉన్నత విద్యలో మరో చరిత్ర



- ఎడెక్స్ ద్వారా అంతర్జాతీయ వర్సిటీల సర్టిఫికేషన్ కోర్సులు
- ప్రభుత్వ నిర్ణయంతో 12 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం
- దాదాపు రూ.30 వేలు విలువ చేసే కోర్సును ఉచితంగానే
- హార్వర్డ్, ఎంఐటీ లాంటి ప్రతిష్టాత్మక వర్సిటీల నుంచి వివిధ కోర్సులు అభ్యసించే చాన్స్
- 180కిపైగా అంతర్జాతీయ వర్సిటీల నుంచి 2 వేలకు పైగా వర్టికల్స్ చదివే అవకాశం
- డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్‌లో ఎడెక్స్ కోర్సు తప్పనిసరి చేసిన ఉన్నత విద్యా మండలి
- 16న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం

5లో

మహిళా క్రికెట్ విభాగంలో విజేతగా నిలిచిన ఎన్టీఆర్ జిల్లా సిద్ధార్థ నగర్ సచివాలయ జట్టుకు రూ.5 లక్షల చెక్కు, కప్‌ను అందించిన సీఎం జగన్



అటు ఆటలు.. ఇటు ఆరోగ్యం

ఇకపై ఏటా 'ఆడుదాం ఆంధ్రా': సీఎం వైఎస్ జగన్

- మట్టిలో మాణిక్యాల్ని వెలికితీద్దాం
- జాతీయ, అంతర్జాతీయ వేదికలకు పరిచయం చేద్దాం
- సచివాలయ స్థాయి నుంచే వ్యాయామం, ఆరోగ్యంపై అవగాహన పెంచుదాం
- 25.45 లక్షల మంది క్రీడాకారులు పాల్గొన్నారు
- వీరిలో 14 మంది మెరికల్ని ఎంపిక చేశాం
- సాన పెట్టేందుకు స్పాన్సర్లతో పాటు ప్రభుత్వం సహకరిస్తుంది
- కోడి రామ్మూర్తి గడ్డపై ముగింపు ఉత్సవాలు నిర్వహించడం గర్వ కారణం
- టాలెంట్ ప్లేయర్స్ లిస్ట్‌ని స్వయంగా ప్రకటించిన సీఎం.. ఐదు విభాగాల్లో విజేతలకు బహుమతులు

- వివరాలు 2లో

"మన ఊరిలో.. మన వార్డులో మట్టిలో మాణిక్యాలు ఎందరో ఉన్నారు. వారందరినీ గుర్తించి సాన పట్టగలిగితే జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేయవచ్చు. అలాంటి వారిని గుర్తించేందుకే 'ఆడుదాం ఆంధ్రా..' అనే బృహత్తర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. - సీఎం జగన్

సరిహద్దుల్లో రణరంగం

రైతుల 'ఢిల్లీ చలో' ర్యాలీలో తీవ్ర ఉద్రిక్తత



పటియాలా సమీపంలో రైతులపై బాష్పబాయువు ప్రయోగిస్తున్న పోలీసులు

పంజాబ్-హరియాణా సరిహద్దులో ట్రాక్టర్ల ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

రాళ్ల వర్షం కురిపించిన నిరసనకారులు

- వారిపైకి బాష్పవాయువు, జల ఫిరంగులు ప్రయోగించిన పోలీసులు
- 100 మందికి గాయాలు.. పలువురి అరెస్టు
- ఢిల్లీలో సరిహద్దుల్లో కట్టుదిట్టమైన భద్రత
- దేశ రాజధానికి చేరుకోలేకపోయిన రైతులు
- ర్యాలీకి నైట్ హాల్ట్, నేడు కొనసాగింపు

6లో

డిమాండ్లను పరిష్కరించాలి
రైతుల డిమాండ్ల పరిష్కారానికి కేంద్రం చర్యలు తీసుకోవాలి. రైతుల ఉద్యమంపై కఠినంగా వ్యవహరిస్తే అది ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది.
- భారతీయ కిసాన్ యూనియన్ అధ్యక్షుడు నరేశ్ తికాయత్

చట్టం తీసుకురాలేం
పంటలకు కనీస మద్దతు ధర కల్పించే విషయంలో ఇప్పటికిప్పుడు చట్టం తీసుకురాలేం. రాష్ట్రాలను సంప్రదించకుండా నిర్ణయం తీసుకోలేం.
- కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా

రిలయన్స్, బిర్లా భారీ పెట్టుబడులు

నేడు వర్చువల్‌గా సీఎం జగన్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

- రూ.1,700 కోట్లతో ఆదిత్య బిర్లా కార్బన్ బ్లాక్ మానుఫ్యాక్చర్ ఫెసిలిటీ
- రూ.1,024 కోట్లతో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్లు
- పలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభం
- మొత్తం 10 కంపెనీలు..
- రూ.4,883 కోట్ల పెట్టుబడులు
- 4,046 మందికి ఉద్యోగాలు

వివరాలు 2లో

మహిళా వర్సిటీ వీసీకి ఖాట్మండు ఆహ్వానం



తిరుపతి సిటీ: పద్మావతీ మహిళా వర్సిటీ వీసీ డీ భారతికి నేపాల్‌లోని ఖాట్మండ్ యూనివర్సిటీ నుంచి ఆహ్వానం అందింది. ఈ మేరకు మంగళవారం ఆమె నేపాల్ బయలుదేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య అంతర్జాతీయకరణలో భాగంగా ఇతర దేశాలలోని వర్సిటీలతో రీసెర్చ్ కొలాబరేషన్స్, ఫ్యాకల్టీ, స్టూడెంట్స్ ఎక్సేంజ్ ప్రోగ్రామ్, జాయింట్ డ్యుయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు, విదేశీ విద్యార్థులు భారత్‌లో చదివేలా ప్రోత్సహించడం వంటి వాటిపై ఖాట్మండ్ యూనివర్సిటీలో జరిగే సమ్మిట్‌లో చర్చించనున్నట్లు తెలిపారు. భారత్, నేపాల్‌లోని సుమారు 150 యూనివర్సిటీల నుంచి వీసీ, ప్రతినిధులు ఈ సమ్మిట్‌లో పాల్గొంటారని ఆమె తెలియజేశారు.



మహిళలు ఎంత ముందుకెళ్తున్నా 'సైన్స్'లో వెనుకబాటు..

విద్యార్థి స్థాయి నుంచి ప్రోత్సాహం లేక.. నైపుణ్యమున్నా అవకాశాలు అందక..

ఎంతో మేధాశక్తిని వృథా చేసుకుంటున్నామంటున్న నిపుణులు

వినూత్న ఆవిష్కరణలతో ప్రపంచానికే దారిచూపిన మహిళా శాస్త్రవేత్తలు

'ఆమె'కు అవకాశమిస్తే.. అద్భుత ప్రపంచం సాకారమే..

(రమేష్ గోగికారి)

'ఆకాశంలో సగం.. అవకాశాల్లో సగం' అంటూ ఎన్నో ఉపోద్ఘాతాలు.. రిజర్వేషన్ల కోసం పోరాటాలు.. ఎంతో కొంత మార్పు.. అయినా ఏదో వెలితి. కొన్ని రంగాలకే, ఓ స్థాయి వరకే మహిళలు పరిమితమవుతున్న పరిస్థితి. సైన్స్-టెక్నాలజీ రంగాల్లో, పరిశోధనల్లో వారు చాలా తక్కువ. మరి మహిళల మేధాశక్తి ఏమైనా తక్కువా? పురుషులతో సమానంగానే కాదు.. ఒకింత ఎక్కువే చేసి చూపగలమని నిరూపించిన మేరీ క్యూరీ వంటి శాస్త్రవేత్తలు ఎందరో. మహిళల భాగస్వామ్యం తక్కువగా ఉన్నప్పుడే ఇంత సాంకేతికత, అభివృద్ధి జరుగుతుంటే.. 'ఆమె' తోడుంటే ఇంకెంత గొప్ప ఆవిష్కరణలు వస్తాయో, మరెంత అభివృద్ధి సాధ్యమో. చేయాల్సిందల్లా.. 'ఆమె'కు అవకాశమివ్వడమే.

రెండేళ్లపాటు ప్రపంచాన్ని గడగడలాడించిన కోవిడ్ మొదలు.. భవిష్యత్తుపై భయం రేపుతున్న వాతావరణ మార్పుల (క్లైమేట్ చేంజ్) వరకు ఎన్నో సవాళ్లు. వాటిని ఎదుర్కొనే మార్గాలు, పరిష్కారాలను చూపగలిగేది సైన్స్ అండ్ టెక్నాలజీ. ప్రస్తుతం అత్యుత్తమ నైపుణ్యమున్న పరిశోధకుల కొరత ఈ రంగాలను వెంటాడుతోంది. ఇలాంటి సమయంలో ఆదుకోగలిగినది మహిళా శక్తే. ఇన్నాళ్లూ బాలికలు, మహిళలకు విద్యలో, అభిరుచికి తగిన రంగాల్లో సరైన అవకాశాలు అందక.. వారిలోని సామర్థ్యం వృథాగా పోతోంది. వారికి తగిన అవకాశాలిచ్చి ప్రోత్సహిస్తే.. ఆకాశమే హద్దుగా వినూత్నమైన, విభిన్నమైన, అత్యాధునిక ఆలోచనలు, సాంకేతికతలను సృష్టించడం, అభివృద్ధి చేయడం వీలవుతుందనేది నిపుణుల మాట. ఇందుకోసం విద్యా రంగంలో బాలికలకు సమాన అవకాశాలు దక్కేలా చూడాలని.. శాస్త్ర, సాంకేతిక, పరిశోధన రంగాల్లో వారి సామర్థ్యాన్ని వెలికితీసేలా చర్యలు చేపట్టాలని వారు సూచిస్తున్నారు.

'నోబెల్'కే ఘనతనిచ్చిన మేరీ క్యూరీ



ఆధునిక ఫిజిక్స్ రూపునిచ్చిన శాస్త్రవేత్తల్లో మేరీ క్యూరీ ఒకరు. రెండు వేర్వేరు రంగాల్లో నోబెల్ పొందిన ఏకైక శాస్త్రవేత్త ఆమె. రేడియో ధార్మిక మూలకాలైన రేడియం, పోలోనియంలను క్యూరీ గుర్తించారు. ఆ రేడియం పేరు మీదుగానే రేడియేషన్ పదం పుట్టింది. ఈ పరిశోధనకుగాను 1903లో 'ఫిజిక్స్ నోబెల్' అందుకున్నారు. తర్వాత కెమిస్ట్రీలో పరిశోధనకు 1911లో 'కెమిస్ట్రీ నోబెల్' పొందారు. తన పరిశోధనల సమయంలో క్యూరీ ఎంతగా రేడియేషన్‌కు గురయ్యారంటే..ఆమె రాసిన నోట్ పుస్తకాల నుంచి ఇప్పటికీ రేడియేషన్ వెలువడుతోంది.

అణుశక్తికి మార్గం చూపిన చీన్ షుంగ్ వు



చైనాలో పుట్టినా అమెరికాలో స్థిరపడి అణుశక్తికి బాటలు వేసిన శాస్త్రవేత్త చీన్ షుంగ్ వు. అణుబాంబుల తయారీ కోసం 'మాన్‌హట్టన్ ప్రాజెక్టు'లో ఆమె కీలకపాత్ర పోషించారు. రసాయనిక ప్రక్రియల ద్వారా యురేనియం ఉత్పత్తి చేసే విధానాన్ని ఆవిష్కరించారు.

కంప్యూటర్‌కు 'భాష' నేర్పిన గ్రేస్ హోపర్



తొలి ఎలక్ట్రానిక్-డిజిటల్ కంప్యూటర్ 'యూనివాక్'ను రూపొందించిన బృందంలో కీలక పాత్ర పోషించింది అమెరికన్ శాస్త్రవేత్త గ్రేస్ హోపర్. 'బైనరీ' భాషలోకి మార్చే తొలి కంపైలర్ ప్రోగ్రామ్‌ను రూపొందించినది ఆమెనే. 'కోబాల్' ప్రోగ్రామ్ రూపకల్పనలోనూ ఈమెది కీలకపాత్రే.

ప్రపంచగతిని మార్చిన మహిళా శాస్త్రవేత్తలు మరెందరో...

- 1910వ దశాబ్దంలోనే కుష్టు రోగానికి చికిత్సను కనుగొన్న అలైస్ అగస్టా బాల్..
- సూర్యుడు సహా విశ్వంలోని నక్షత్రాలన్నీ ఎక్కువభాగం హైడ్రోజన్, హీలియంతోనే నిండి ఉన్నాయని తొలిగా ప్రతిపాదించిన బ్రిటీష్-అమెరికన్ అంతరిక్ష శాస్త్రవేత్త సెసిలియా పేన్ గాపోష్కిన్.. ● అమెరికా అంతరిక్ష సంస్థ నాసా తమ ప్రయోగాల్లో కంప్యూటర్లను వినియోగించడానికి ముందు.. స్పేస్ ప్రయోగాల సమయాన్ని, వాటి ప్రయాణతీరును కచ్చితంగా గణించి చెప్పిన 'హ్యూమన్ కంప్యూటర్' కేథరిన్ జాన్సన్.. ● ఇన్సులిన్, పెన్సిలిన్, విటమిన్ బీ12 వంటి బయోరసాయనాల అణు నిర్మాణాన్ని ఎక్స్-రే క్రిస్టలోగ్రఫీ సాయంతో గుర్తించే విధానాన్ని అభివృద్ధి చేసిన డొరోతీ హాడ్కిన్ (ఇన్సులిన్ వంటి బయో మాలిక్యూల్స్‌ను కృత్రిమంగా తయారు చేయడానికి ఈ విధానం తోడ్పడింది).

మన దేశం నుంచీ ఎందరో..

- మొక్కల కణాల్లో శక్తి ఉత్పాదనకు కీలకమైన 'సైటోక్రోమ్ సీ' అనే ఎంజైమ్‌ను గుర్తించిన మధ్యప్రదేశ్ శాస్త్రవేత్త కమలా సాహోనీ
- కేన్సర్‌ను నిరోధించే 'వింకా ఆల్కలాయిడ్స్', మలేరియా చికిత్స కోసం వాడే ఔషధాలపై పరిశోధన చేసిన రసాయన శాస్త్రవేత్త అసిమా చటర్జీ (పశ్చిమబెంగాల్)..
- మైక్రోవేవ్ పరికరాలపై పరిశోధన చేసి, మన దేశంలో తొలి మైక్రోవేవ్ రీసెర్చ్ ల్యాబ్ నెలకొల్పిన శాస్త్రవేత్త రాజేశ్వరి చటర్జీ (కర్ణాటక)..

ఇటీవలి కాలాన్ని చూస్తే..

- కోవిడ్ వైరస్ ధాటిని ముందే గుర్తించి హెచ్చరించిన భారత శాస్త్రవేత్త, డబ్ల్యూహెచ్ఓ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్యా స్వామినాథన్..
- పుణె వైరాలజీ ల్యాబ్‌లో కోవిడ్ వైరస్‌ను ఐసోలేట్ చేసి..కోవ్యాక్సిన్ రూపకల్పనకు మార్గం వేసిన ల్యాబ్ డైరెక్టర్ ప్రియా అబ్రహం..
- అగ్ని-4,5 క్షిపణుల రూపకల్పన ప్రాజెక్టుకు హెడ్‌గా వ్యవహరించిన శాస్త్రవేత్త టెస్సీ థామస్.. ఇలా ఎందరో మహిళా శాస్త్రవేత్తలు ఈ రంగంలో స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులలో మహిళల శాతం: 33.3%	చూడటానికి ఈ శాతం ఓ మోస్తరుగానే ఉన్నా.. కొన్ని విభాగాల్లోనే మహిళలకు అవకాశాలు అందుతున్నాయి.
మహిళా పరిశోధకులకు సమాన అవకాశాలిస్తున్న దేశాలు: 30	చాలా దేశాల్లో మహిళా పరిశోధకుల సంఖ్య అతి తక్కువ. కీలక పరిశోధనలు చేసే అవకాశం, నిధుల వంటి అంశాల్లో వివక్ష ఎదురవుతోంది.
'స్టెమ్' విభాగాల్లోని విద్యార్థుల్లో మహిళలు: 35%	మెడికల్, కొంతవరకు టెక్నాలజీ రంగంలోనే మహిళలు ఎక్కువ. తల్లిదండ్రులు, ఫ్యాకల్టీ ఈ రంగాల దిశగా బాలికలను ప్రోత్సహిస్తున్నారు.
ఇప్పటివరకు నోబెల్ పొందిన మహిళలు: 22 మంది	పరిశోధన రంగంలో మహిళల భాగస్వామ్యం పెరిగినా.. ఉన్నతస్థాయి పోస్టులు, పరిశోధక బృందాలకు నేతృత్వం వహించే అవకాశాలు తక్కువ. దీనితో మంచి ప్రతిభ ఉన్నా అవార్డులకు, గుర్తింపునకు నోచుకోవడం లేదు.

UN WOMEN (యునెస్కో గణాంకాల ప్రకారం..)

మేరీ క్యూరీకి నివాళిగా..

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు, తగిన ప్రోత్సాహం కోసం 'మహిళలకు సైన్స్ కావాలి.. సైన్స్‌కు మహిళలు కావాలి' అని 'ఐక్యరాజ్యసమితి విద్యా, శాస్త్రీయ, సాంస్కృతిక విభాగం (యునెస్కో)' నినాదం ఇచ్చింది. ప్రఖ్యాత శాస్త్రవేత్త మేరీ క్యూరీ జయంతి అయిన ఫిబ్రవరి 11వ తేదీని 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ విమెన్ అండ్ గర్ల్స్ ఇన్ సైన్స్'గా నిర్వహించాలని 2015లో నిర్ణయించింది. సైన్స్-టెక్నాలజీ రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఏటా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

'స్టెమ్' రంగాల్లో ప్రోత్సాహం అవసరం

దశాబ్దాల ఎదురుచూపుల తర్వాత మన పార్లమెంటు 'మహిళా రిజర్వేషన్ల బిల్లు'ను ఆమోదించింది. అది చట్టరూపమూ దాల్చింది. 'నారీ శక్తి' అంటూ కేంద్ర ప్రభుత్వం రిపబ్లిక్ డే రోజున త్రివిధ దళాల్లో మహిళాశక్తిని చాటింది. ఈ 'నారీ శక్తి' మరింత విస్తృతమై 'స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మెడికల్)' రంగాల్లో సత్తా చాటితే.. దేశ అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుంది.


షేక్ సూరజ్


తనీష్ రెడ్డి

జేఈఈ మెయిన్‌లో మెరిసిన తెలుగు తేజాలు

- జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు నిర్వహించిన జేఈఈ మెయిన్స్-1లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. 23 మంది 100 శాతం స్కోర్ సాధించగా.. ఇందులో పది మంది తెలుగు విద్యార్థులే. ఏపీకి చెందిన షేక్ సూరజ్, తోట సాయి కార్తీక్, అన్నారెడ్డి తనీష్‌రెడ్డితో పాటు తెలంగాణకు చెందిన ఏడుగురు టాప్-23లో చోటు దక్కించుకున్నారు.

వివరాలు 5లో



లక్ష టిడ్కో ఇళ్లు పంపిణీ పూర్తి

- 35 యూఎల్బీల్లో 1,00,200 యూనిట్లు ఇచ్చిన అధికారులు
- 66 ప్రాంతాల్లో నూరు శాతం అందజేత
- నేడు నెల్లూరులో 15,504 వేల యూనిట్ల పంపిణీ
- ఈ నెలలో మరో 25 వేలు ఇవ్వనున్న ప్రభుత్వం
- మార్చిలో మరో 25 వేలు పంపిణీకి ఏర్పాట్లు

వివరాలు 3లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

పుట్టింటి బాధ్యత ప్రభుత్వమే తీసుకుంది



నాకు 2010లో వివాహమైంది. అప్పటి నుంచి చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం నడింపల్లెలో భర్త మంజునాథ్‌తో కలసి వ్యవసాయ కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుండేవాళ్లం. మాకు ఇద్దరు పిల్లలు. చిన్నోడు కడుపులో ఉండగానే 2020లో నా భర్త అనారోగ్యం బారిన పడ్డాడు. ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించినా ఆయనను కాపాడుకోలేకపోయాను. ఒక్కసారిగా నా జీవితం మొత్తం చీకటిగా మారిపోయింది. చిన్న పిల్లలతో ఎలా బతకాలో తెలియని అయోమయంలో పడ్డాను. బతకడానికి ఎన్ని పాట్లు పడాలోనని ఆందోళన చెందాను. అదృష్టవశాత్తు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చింది. అప్పటి నుంచి నా సమస్యలన్నీ పరిష్కారమైపోయాయి. ముఖ్యంగా నా భర్త మరణంతో బీమా రూ.2 లక్షలు నా బ్యాంకు అకౌంటులో వేశారు. కూలి పనులు చేస్తూ బిడ్డలను పోషించుకుంటున్న నాకు ప్రతి నెలా వితంతు పింఛన్ ఇస్తున్నారు. జగనన్న కాలనీలో ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూర్చారు. ఇంటి నిర్మాణం దాదాపు పూర్తి కావస్తోంది. ఆరో తరగతి చదువుతున్న పెద్ద కొడుకు చరణ్‌కుమార్‌కు అమ్మఒడి పథకం కింద ఏటా రూ. 15 వేలు వంతున వస్తోంది. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్న చిన్నోడు భరత్ పోషణ ప్రభుత్వమే చూస్తోంది. గత ఐదేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాలతో నా కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.8 లక్షలకు పైగానే వచ్చింది. అనుకోని కష్టం వచ్చిన ఆడబిడ్డను పుట్టింటి వారికన్నా గొప్పగా ఈ ప్రభుత్వం ఆదుకుంది. జన్మజన్మలకీ మా జగనన్న మేలు మరువలేను.

– చిన్నమ్మయ్య, నడింపల్లె
(ఎస్.జి. హరినాథ్, విలేకరి, శాంతిపురం)

మా 'ఇంటి'వేల్పు జగనన్న



మాది చాలా పేద కుటుంబం. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలంలోని యండగండి గ్రామంలో నేను ఆటో నడుపుతూ భార్య మాధవి, కుమార్తె శ్రావణి, కుమారుడు దావీదురాజును పోషించుకుంటున్నా. అన్ని రోజులూ గిరాకీ ఉండేది కాదు. వచ్చినపుడు ఏదోలా బతుకు సాగినా... గిరాకీ లేనినాడు నానా తిప్పలూ పడాల్సి వచ్చేది. ఆటోకి ఏదైనా మరమ్మతు వస్తే దానిని బాగు చేయించేందుకు అప్పులు చేయాల్సి వచ్చేది. దానిని తీర్చడానికి ఎన్నో ఇబ్బందులు పడ్డాను. కానీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మా జీవితం మారిపోయింది. నాకు వాహనమిత్ర పథకం ద్వారా ఏటా రూ.పది వేలు అందుతోంది. మా పిల్లలు ఇంగ్లిష్ మీడియం చదువుతున్నారు. అమ్మాయికి అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి రూ. 15 వేలు వస్తోంది. పిల్లలిద్దరికీ విద్యా కానుక ద్వారా ఉచిత పుస్తకాలు, బూట్లు, బెల్టు, టై అందుతున్నాయి. పాఠశాలలో జగనన్న గోరుముద్ద ద్వారా మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. మాకు ఇల్లు కట్టుకోవడమనేది ఓ కల. ఆటో నడిపే నేను ఇంటి స్థలం ఎలా కొనాలి అనుకునేవాడిని. కానీ జగనన్న ప్రభుత్వం ఇంటి స్థలం నా భార్య పేరుతో ఇవ్వడమే గాకుండా ఇల్లు కట్టుకునేందుకు రూ.1.80 లక్షలు ఇచ్చారు. ఇప్పుడు నేను సొంత ఇల్లు కట్టుకున్నాను. ఇప్పుడు అద్దె బాధ తప్పింది. మా ఇంట ఎలాంటి ఆర్థిక సమస్యలు లేవు. మాకు ఇంతకంటే ఏం కావాలి.. మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలి.

– ఎలకపల్లి శ్రీను, యండగండి
(చాలంటి రత్నరాజు, విలేకరి, ఉండి)

బతుకు బెంగ తీరింది



బార్బర్ వృత్తి మాది. శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం మామిళ్లపల్లి గ్రామంలో సెలూన్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నా. నాతో పాటు భార్య నాగరత్నమ్మ, కుమారుడు జగదీష్ ఉంటున్నారు. సెలూన్‌పై వచ్చే అరకొర ఆదాయంతో కుటుంబం మొత్తం గడవాలి. అన్ని రోజులూ ఒకేలా ఉండేవి కాదు. ఆదాయమే లేకుంటే బతకడానికి అప్పులు చేయాల్సి వచ్చేది. రోజొక గండంగా గడిచేది. కానీ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మా కుటుంబ సమస్యలన్నీ తీరిపోయాయి. బతకడానికి ఎలాంటి బెంగ లేకుండా పోయింది. జగనన్న చేదోడు పథకం కింద నాకు ప్రతి సంవత్సరం రూ.10 వేలు అందుతోంది. ఈ మొత్తంతో సెలూన్ షాపునకు అవసరమైన సామగ్రి తెచ్చుకుని ఎలాంటి ఇబ్బంది లేకుండా కుల వృత్తి చేసుకుంటున్నాను. గతంలో మాకు సొంతిల్లు లేక బాడుగ ఇళ్లలో ఉంటూ ఎన్నో కష్టాలు పడ్డాం. ఈ ప్రభుత్వం మాకు ఇంటి స్థలం మంజూరు చేసింది. రూ.1.80 లక్షల సాయం అందించటంతో సొంతిల్లు నిర్మించుకున్నాం. నా భార్యకు వైఎస్సార్ చేయూత పథకం కింద ఏటా రూ.18,750 అందుతోంది. ఇంటర్మీడియట్ చదువుతున్న నా కుమారుడికి ఏటా రూ.15 వేలు వంతున 'అమ్మఒడి' వస్తోంది. ఈ విధంగా మాలాంటి పేదవాళ్ల కోసం అనేక మంచి పథకాలు అమలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నా.

– బి.ఆంజనేయులు, మామిళ్లపల్లి
(వై.మహదేవరెడ్డి, విలేకరి, కనగానపల్లి)

రేపు సీఎం జగన్ కర్నూలు, గుంటూరు జిల్లాల పర్యటన

రేపూడిలో వలంటీర్ల అభినందన సభలో పాల్గొననున్న సీఎం

సాక్షి,అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 15వతేదీన కర్నూలు, గుంటూరు జిల్లాల్లో పర్యటించనున్నారు. కర్నూలులో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మనవడి వివాహానికి సీఎం హాజరవుతారు. అదేరోజు మధ్యాహ్నం తర్వాత గుంటూరు జిల్లా ఫిరంగిపురంలో వలంటీర్ల అభినందన సభలో సీఎం జగన్ పాల్గొననున్నారు. ఉదయం 9.30 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి కర్నూలు చేరుకుంటారు, అక్కడ బళ్లారి రోడ్‌లోని ఫంక్షన్ హాల్‌లో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మనవడి వివాహానికి సీఎం హాజరుకానున్నారు. అనంతరం మధ్యాహ్నం తాడేపల్లి చేరుకుంటారు, ఆ తర్వాత మధ్యాహ్నం 2.40 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం రేపూడిలో వలంటీర్ల అభినందన సభలో సీఎం పాల్గొననున్నారు. అనంతరం సాయంత్రం తాడేపల్లి చేరుకుంటారు.

రిలయన్స్, బిర్లా భారీ పెట్టుబడులు

నేడు వర్చువల్‌గా సీఎం జగన్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగ అభివృద్ధిలో మరో కీలక ఘట్టానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు శ్రీకారం చుడుతున్నారు. రిలయన్స్ బయో ఎనర్జీ, ఆదిత్య బిర్లా గ్రూప్‌తోపాటు పలు సంస్థలు రాష్ట్రంలో నెలకొల్పుతున్న పరిశ్రమలకు ముఖ్యమంత్రి జగన్ బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ.4,178 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటవుతున్న పలు పరిశ్రమలకు భూమి పూజ నిర్వహించనున్నారు. ఇవి కాకుండా రూ.655 కోట్లతో నెలకొల్పిన ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్లను ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించనున్నారు. మొత్తంగా సుమారు రూ.4,833 కోట్ల పెట్టుబడులు రానుండగా కొత్తగా 4,046 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.

తొలుత 8 చోట్ల రిలయన్స్ ప్లాంట్లు

రిలయన్స్ బయో ఎనర్జీ రాష్ట్రంలో 8 ప్రాంతాల్లో వ్యవసాయ వ్యర్థాల నుంచి బయో గ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. మొత్తం రూ.1,024 కోట్ల పెట్టుబడితో తొలి దశలో కాకినాడ, రాజమండ్రి, విజయవాడ, కర్నూలు, నెల్లూరులో బయో గ్యాస్ ప్లాంట్లను నెలకొల్పనుంది. తద్వారా 576 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఆదిత్య బిర్లా గ్రూప్ రూ.1,700 కోట్ల పెట్టుబడితో తిరుపతి జిల్లా నాయుడుపేటలో మాన్యుఫ్యాక్చరింగ్ ఆఫ్ కార్బన్ బ్లాక్‌ను ఏర్పాటు చేయనుంది. దీనిద్వారా 250 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. వీటితో పాటు హెల్లా ఇన్‌ఫ్రా, వెసువియస్ ఇండియా లిమిటెడ్, ఏపీఐఐసీ, ఏపీ ఎంఎస్ఎంఈ కార్పొరేషన్, అన ఒలియో ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన పలు ప్రాజెక్టులకు సీఎం జగన్ వర్చువల్‌గా శంకుస్థాపనలతో పాటు పలు యూనిట్లను ప్రారంభిస్తారు.



మహిళా కబడ్డీ విజేత విశాఖపట్నం జట్టుకు రూ.5 లక్షల నగదు, కప్‌ను అందించిన సీఎం జగన్



మహిళా వాలీబాల్ విజేత బాపట్ల జట్టుకు రూ.5 లక్షల నగదు, కప్‌ను అందించిన సీఎం వైఎస్ జగన్

అటు ఆటలు.. ఇటు ఆరోగ్యం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: సచివాలయ స్థాయి నుంచి ఆరోగ్యంపై శ్రద్ధ, ఆటలపై మక్కువ పెంచేందుకు 'ఆడుదాం ఆంధ్రా..' ఎంతో దోహదపడుతుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 25.45 లక్షల మంది క్రీడాకారులు ఇందులో పాలుపంచుకున్నారని, ఈ కార్యక్రమాన్ని ఏటా ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. 47 రోజుల పాటు ఉత్సాహభరితంగా నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా' ముగింపు ఉత్సవాలు మంగళవారం విశాఖలోని డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఘనంగా జరిగాయి. ముఖ్యమంత్రి జగన్ ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఇకపై ఏటా 'ఆడుదాం ఆంధ్రా': సీఎం జగన్



పురుషుల ఖోఖో విజేత బాపట్ల జట్టుకు రూ.5 లక్షల నగదు, కప్‌ను అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సభలో ప్రసంగిస్తున్న సీఎం జగన్

ఆరోగ్యం, వ్యాయామంపై అవగాహన పెంచేలా..

మన ఆరోగ్యానికి వ్యాయామం, క్రీడలు ఎంత అవసరం అనే అంశంపై రాష్ట్రంలోని ప్రతి ఇంటిలో, ప్రతి గ్రామంలో అవగాహన పెరగాలి. ఆడుదాం ఆంధ్రా ద్వారా ఆరోగ్యం, వ్యాయామం పట్ల అవగాహన పెరగాలన్నది ఒక ఉద్దేశమైతే గ్రామ స్థాయి నుంచి మట్టిలోని మాణిక్యాల్ని గుర్తించి వారి ప్రతిభకు సాన పెట్టి శిక్షణ ఇవ్వడం మరో లక్ష్యం. తద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన యువత రాణించేలా ప్రోత్సహించవచ్చు.

ఉత్తరాంధ్ర గడ్డపై సగర్వంగా...

ఆడుదాం ఆంధ్రా ద్వారా క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ తదితర ఐదు క్రీడల్లో గత 47 రోజులుగా గ్రామ స్థాయి నుంచి ప్రతిభను ప్రోత్సహించే కార్యక్రమాలు చేపట్టాం. 25.40 లక్షల మంది క్రీడాకారులు గ్రామ స్థాయి నుంచి పాల్గొన్నారు. 3.30 లక్షల పోటీలు గ్రామ, వార్డు స్థాయిలో జరిగాయి. 1.24 లక్షల పోటీలు మండల స్థాయిలో, 7,346 పోటీలు నియోజకవర్గ స్థాయిలో, 1,731 పోటీలు జిల్లా స్థాయిలో, 260 మ్యాచ్‌లు రాష్ట్ర స్థాయిలో నిర్వహించాం. ఫైనల్స్ ముగించుకొని మన విశాఖలో, మన ఉత్తరాంధ్రలో, మన కోడి రామ్మూర్తి గడ్డమీద సగర్వంగా ముగింపు సమావేశాలను నిర్వహిస్తున్నాం. దాదాపు 37 కోట్ల కిట్లు గ్రామ స్థాయి నుంచి పోటీ పడుతున్న పిల్లలందరికీ ఇచ్చాం. రూ.12.21 కోట్ల విలువైన బహుమతులు పోటీలో పాలుపంచుకున్న పిల్లలందరికీ అందిస్తున్నాం.

తమ్ముళ్లు, చెల్లెమ్మలకు ఆల్ ది బెస్ట్..

క్రికెట్‌లో ఇద్దరు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెమ్మలను టాలెంటెడ్ ప్లేయర్స్‌గా గుర్తించాం. కబడ్డీలో ముగ్గురు తమ్ముళ్లు, ఒక చెల్లెమ్మను గుర్తించాం. వాలీబాల్‌లో ఒక తమ్ముడు, ఒక చెల్లెమ్మ ప్రతిభను చాటుకున్నారు. ఖోఖోలో ఒక తమ్ముడు, చెల్లెమ్మ ప్రతిభను గుర్తించాం. బ్యాడ్మింటన్‌లో ఒక తమ్ముడు, చెల్లెమ్మ ప్రతిభ నిరూపించుకున్నారు. వారికి సరైన శిక్షణ ఇవ్వగలిగితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో ప్రోత్సహిస్తూ అడుగులు వేస్తున్నాం. ఎంపికైన తమ్ముళ్లు, చెల్లెమ్మలకు ఆల్ ద బెస్ట్.

14 మంది టాలెంటెడ్ ప్లేయర్స్ దత్తత...

ఈ బృహత్తర కార్యక్రమంలో చెన్నై సూపర్ కింగ్స్, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌తో పాటు ప్రో కబడ్డీ, బ్లాక్ హాక్స్, వాలీబాల్, ఏపీ ఖోఖో అసోసియేషన్, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ పాల్గొని ప్రతిభ చాటుకున్న 14 మందిని దత్తత తీసుకొని మరింత ట్రైనింగ్ ఇచ్చే దిశగా అడుగులు పడుతున్నాయి. క్రికెట్ నుంచి పవన్ (విజయనగరం), చెల్లెమ్మ కేవీఎం విష్ణువర్ధిని (ఎన్టీఆర్ జిల్లా)ని చెన్నై సూపర్ కింగ్స్ దత్తత తీసుకొని మరింత మెరుగైన శిక్షణ ఇస్తుంది. క్రికెట్ నుంచే శివ (అనపర్తి, తూర్పు గోదావరి జిల్లా), చెల్లెమ్మ గాయత్రి (కడప జిల్లా)ని దత్తత తీసుకోవడానికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ముందుకొచ్చింది. సతీష్ (తిరుపతి), బాలకృష్ణారెడ్డి (బాపట్ల)ని ప్రో కబడ్డీ టీమ్ దత్తత తీసుకుంది. సుమన్ (తిరుపతి), సంధ్య (విశాఖ)ను ఏపీ కబడ్డీ అసోసియేషన్ దత్తత తీసుకోవడానికి ముందుకొచ్చింది. వాలీబాల్‌కు సంబంధించి ఎం.సత్యం (శ్రీకాకుళం), మహిళల విభాగానికి సంబంధించి మౌనిక (బాపట్ల)ను దత్తత తీసుకునేందుకు బ్లాక్ హాక్స్ సంస్థ ముందుకొచ్చింది. ఖోఖోకు సంబంధించి కె.రామ్మోహన్ (బాపట్ల), హేమావతి (ప్రకాశం)లకు తర్ఫీదు ఇచ్చేందుకు ఏపీ ఖోఖో అసోసియేషన్ ముందుకొచ్చింది. బ్యాడ్మింటన్‌లో ఎ.వంశీకృష్ణంరాజు (ఏలూరు), ఎం.ఆకాంక్ష (బాపట్ల)ను ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ దత్తత తీసుకొనేందుకు ముందుకొచ్చింది. ఈ 14 మందికి రాష్ట్ర ప్రభుత్వం తోడుగా ఉంటుంది. ఆ సంస్థలు మన పిల్లలకు తర్ఫీదు ఇచ్చేందుకు అడుగులు ముందుకొచ్చాయి.

ఇక ఏటా 'ఆడుదాం ఆంధ్రా'...!

ఈరోజు మనం వేసిన అడుగు ఇక ప్రతి సంవత్సరం ముందుకు పడుతుంది. క్రీడల్లో మన యువత ప్రతిభను గుర్తించి మరింత తర్ఫీదు ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేస్తాం. సచివాలయాల స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహిస్తూ వ్యాయామం ఆవశ్యకత, ఆరోగ్య జీవన విధానాలను ముందుకు తీసుకెళతాం. వీటి వల్ల ఆటలకు మరింత ప్రోత్సాహం లభిస్తుంది.

ఆకట్టుకున్న లేజర్ షో

ముగింపు ఉత్సవాల సందర్భంగా 'ఆడుదాం ఆంధ్రా' ప్రత్యేక గీతాన్ని స్టేడియంలో ప్రదర్శించారు. ఈ పాటకు దాదాపు 5 నిమిషాల పాటు కళ్లు మిరుమిట్లు గొలిపేలా ప్రదర్శించిన లేజర్ షో ఆకట్టుకుంది. కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి ఆర్‌కే రోజా, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు విడదల రజని, బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ మల్లికార్జున, ఏసీఏ కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకటసత్యవతి, గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర పాల్గొన్నారు.



ఆడుదాం ఆంధ్రా ముగింపు వేడుకల సందర్భంగా విశాఖలోని డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బాణసంచా పేలుళ్ల ధగధగలు

కమాన్.. క్రికెట్ టీమ్!

క్రికెట్‌లో విజేతగా నిలిచిన ఏలూరు జట్టుకు చెందిన కెప్టెన్, వైస్ కెప్టెన్‌ని వేదికపైకి రావాలని తొలుత నిర్వాహకులు ఆహ్వానించగా ముఖ్యమంత్రి జగన్ జోక్యం చేసుకుని క్రికెట్ టీమ్ మొత్తం వేదికపైకి రావాలంటూ స్వయంగా చేతులు చాచి ఆహ్వానించడంతో జట్టు సభ్యులంతా ఉత్సాహంగా స్టేడియంలో పరుగులు తీస్తూ వచ్చారు. సీఎంతో కరచాలనం కోసం పోటీపడ్డారు. సెక్యూరిటీని వారించి సీఎం వారితో ఎక్కువ సేపు గడిపారు. విజేతలకు ట్రోఫీతో పాటు రూ.5 లక్షల ప్రైజ్ మనీని సీఎం జగన్ అందజేశారు. మహిళా క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్ విజేతలు, రన్నరప్‌లకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందించారు. ఐదు విభాగాల్లో ప్రతిభ చాటిన క్రీడాకారుల జాబితాను స్వయంగా ప్రకటించి బహుమతులు అందించారు. సీఎం జగన్ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి వారి పేర్లు అడిగి తెలుసుకున్నారు. జగనన్నని కలిశామన్న ఆనందం వారిలో కొట్టొచ్చినట్టు కనిపించింది.

అరగంట పాటు మ్యాచ్ వీక్షణ

క్రికెట్ మైదానానికి సాయంత్రం 6 గంటలకు చేరుకున్న ముఖ్యమంత్రి జగన్ క్రీడాకారులు, ప్రేక్షకులకు అభివాదం చేస్తూ వేదికపైకి చేరుకున్నారు. ఏలూరు, విశాఖ జట్ల మధ్య జరిగిన క్రికెట్ ఫైనల్స్‌ని అరగంట పాటు ఆసక్తిగా వీక్షించారు. వికెట్ పడినా.. ఫోర్లు, సిక్స్ కొట్టినా.. ఇరు జట్లనూ చప్పట్లతో ప్రోత్సహిస్తూ ఉత్సాహపరిచారు. ఈ మ్యాచ్‌లో ఏలూరు జట్టు 6 వికెట్ల తేడాతో నెగ్గి విజేతగా నిలిచింది.

విజేతలకు పురస్కారాలు

ట్రోఫీలు, చెక్కులు అందించిన సీఎం జగన్

విశాఖ స్పోర్ట్స్: యువత క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తూ నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా..' తొలి సీజన్ విజేతలకు ముఖ్యమంత్రి జగన్ మంగళవారం విశాఖలోని వైఎస్ఆర్ స్టేడియంలో ట్రోఫీలతో పాటు మెడల్స్, నగదు ప్రోత్సాహకాల్ని అందించారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ మెన్, వుమెన్ విజేతలకు చెక్కులను ట్రోఫీలతో పాటు అందించారు. బ్యాడ్మింటన్ తొలి మూడు స్థానాల్లో నిలిచిన జోడీలకు ట్రోఫీలతో పాటు నగదు ప్రోత్సాహకాల్ని అందించారు. క్రికెట్ పురుషుల విభాగంలో ఏలూరు జట్టు విజేతగా నిలవగా మహిళా విభాగంలో ఎన్టీఆర్ జిల్లా జట్టు గెలుపొందింది. వాలీబాల్ మెన్, వుమెన్ రెండు విభాగాల్లోనూ బాపట్ల విజేతగా నిలిచింది. ఖోఖో మెన్‌లో బాపట్ల, వుమెన్‌లో ప్రకాశం జిల్లాలు విజేతలుగా నిలిచాయి. బ్యాడ్మింటన్ మెన్‌లో ఏలూరు జోడి, వుమెన్‌లో బాపట్ల జోడి విజేతగా నిలిచింది. కబడ్డీ మెన్‌లో బాపట్ల, వుమెన్‌లో విశాఖ జట్లు విజేతలుగా నిలిచి సీఎం జగన్ చేతుల మీదుగా ట్రోఫీలతో పాటు చెక్కులను అందుకున్నాయి.



పురుషుల బ్యాడ్మింటన్ విజేత ఏలూరు జోడీకి రూ.3 లక్షల నగదు, కప్‌ను అందించిన సీఎం

క్రికెట్ విజేత ఏలూరు

విశాఖ వైఎస్ఆర్ స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో డే నైట్‌గా సాగిన పురుషుల క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నక్కవానిపాలెం (విశాఖ) జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 128 పరుగులు చేసింది. ప్రతిగా అశోక్ పిల్లర్ రోడ్ (ఏలూరు) జట్టు తొలి యాభై పరుగుల్ని వికెట్ కోల్పోకుండానే చేసింది. పది ఓవర్లకు మూడు వికెట్లు కోల్పోయినా 69 పరుగులు చేసి నాలుగో వికెట్‌ను 87 పరుగుల వద్ద కోల్పోయింది. అనంతరం వికెట్ కోల్పోకుండానే లక్ష్యాన్ని ఛేదించింది. 16వ ఓవర్‌లో చివరి రెండు బంతుల్ని సిక్సర్లుగా మలచడం ద్వారా టైటిల్‌ను సొంతం చేసుకుంది. దీంతో ఏలూరు జట్టు గెలుపొందగా విశాఖ రన్నరప్‌గా నిలిచింది. మెన్ క్రికెట్ టైటిల్ పోరును సీఎం జగన్ స్టేడియంలో ప్రత్యక్షంగా వీక్షించారు.

కబడ్డీలో బాపట్ల ఆధిక్యం..

కబడ్డీ పురుషుల ఫైనల్ పోటీ ఏయూ గ్రౌండ్స్‌లో జరిగింది. టాస్ గెలిచిన నాగులాపురం-1 (తిరుపతి) జట్టు కోర్టును ఎంచుకోగా కొత్తపాలెం-2 (బాపట్ల) జట్టు తొలి రైడ్ నుంచే ఆధిక్యాన్ని ప్రదర్శించింది. తొలి అర్ధభాగంలో బాపట్ల 15-7తో ఆధిక్యాన్ని ప్రదర్శించింది. తిరుపతి జట్టు రెండో అర్ధభాగంలో కాస్త పుంజుకున్నా ఆధిక్యాన్ని తగ్గించలేకపోయింది. ఇరు జట్లు రెండో అర్ధభాగంలో తొమ్మిదేసి పాయింట్లతో సమఉజ్జీగా నిలిచాయి. చివరికి కొత్తపాలెం 2 (బాపట్ల) 26-17తో నాగులాపురం 1 (తిరుపతి)పై గెలుపొంది మెన్ కబడ్డీ విజేతగా నిలిచింది. నాగులాపురం జట్టు రన్నరప్‌గా నిలిచింది. బాపట్ల తరఫున లక్ష్మీనారాయణ, రామకృష్ణ, శ్రీకాంత్, వెంకటేశ్వర, హరిప్రసాద్, బాలకృష్ణ, అనిల్ ప్రసాద్ కోర్టులోకి దిగగా తిరుపతి జట్టు తరఫున సతీష్, తరుణ్ కుమార్, సుమన్, చిన్నముత్తు, దేవేంద్ర, తమిళ్సైర్సన్, నరసింహ కోర్టులోకి దిగారు.



పురుషుల క్రికెట్ విజేత ఏలూరు జట్టుకు ట్రోఫీ అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

మురిసిన మాణిక్యాలు!

- 'ఆడుదాం ఆంధ్రా'లో 14 మంది టాలెంటెడ్ ప్లేయర్స్ గుర్తింపు
- క్రికెట్, కబడ్డీలో నలుగురు.. వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్‌లో ఇద్దరేసి ఎంపిక

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం-ఆంధ్రా' మెగా క్రీడా టోర్నమెంట్ ద్వారా ఆణిముత్యాల్లాంటి క్రీడాకారులు వెలుగులోకి వచ్చారు. ఈ క్రీడా మహా సంగ్రామంలో ప్రతిభ చాటుకుని టాలెంటెడ్ ప్లేయర్స్‌గా గుర్తించిన వారి వివరాలను సీఎం జగన్ మంగళవారం ప్రకటించారు. మొత్తం ఐదు క్రీడల్లో 14 మంది (8 మంది యువకులు, ఆరుగురు యువతులు) క్రీడాకారులను మట్టిలో మాణిక్యాలుగా గుర్తించి జాతీయ, అంతర్జాతీయ క్రీడా సంస్థలు దత్తత తీసుకున్నాయి. క్రికెట్, కబడ్డీలో నలుగురు చొప్పున ఎంపిక కాగా వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్‌లో ఇద్దరేసి చొప్పున టాలెంటెడ్ ప్లేయర్స్‌గా ఎంపికయ్యారు. వారికి మెరుగైన శిక్షణ అందించి తీర్చిదిద్దుతామని స్పాన్సర్ సంస్థలు ప్రకటించాయి.

చాలా సంతోషంగా ఉంది..



మాది తిరుపతి జిల్లా నాగులాపురం సచివాలయ పరిధిలో వెస్ట్ కాలనీ. డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్నా. మా కబడ్డీ టీమ్‌కు ద్వితీయ స్థానం వచ్చింది. చివరి వరకూ పోరాడాం. స్వల్ప తేడాతో బాపట్ల జిల్లా కొత్త పాలెం కబడ్డీ జట్టుపై ఓడిపోయాం. నా ఆట చూసి ఏపీ కబడ్డీ అసోసియేషన్ ద్వారా శిక్షణకు ఎంపిక చేసినందుకు చాలా సంతోషంగా ఉంది. సీఎం జగన్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

–ఎం.సుమన్, ఎంపికైన టాలెంటెడ్ కబడ్డీ క్రీడాకారుడు

ఇన్నాళ్లూ బ్యాక్‌గ్రౌండ్ లేక..



మాది తిరుపతి జిల్లా నాగులాపురం సచివాలయ పరిధిలో వెస్ట్‌కాలనీ. ప్రొ కబడ్డీలో ఆడాలన్న నా చిరకాల కోరిక నెరవేరుతోంది. బాగా ఆడుతున్నా నాకు బ్యాక్‌గ్రౌండ్ లేకపోవడంతో అంతవరకూ వెళ్లలేకపోయా. ఆడుదాం ఆంధ్ర మెగా టోర్నమెంట్‌లో టాలెంటెడ్‌గా కబడ్డీ ప్లేయర్‌గా ఎంపిక చేసినందుకు చాలా ఆనందంగా ఉంది. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

–ఎ. సతీష్, ఎంపికైన టాలెంటెడ్ కబడ్డీ క్రీడాకారుడు

సద్వినియోగం చేసుకుంటా



మాది బాపట్ల జిల్లా చిన గంజాం మండలం కొత్తపాలెం సచివాలయ పరిధిలో ములగ వారిపాలెం గ్రామం. సింగరాయకొండ పీఎస్‌సీఎం ప్రభుత్వ కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. మా కొత్తపాలెం కబడ్డీ టీం 'ఆడుదాం-ఆంధ్రా'లో విజేతగా నిలవడం సంతోషం. ఫైనల్లో తిరుపతి జిల్లా నాగులాపురం కబడ్డీ టీంపై గెలిచాం. ఆల్ రౌండర్‌గా (రైట్ కార్నర్ రైడర్)గా నా ప్రతిభ చాటుకున్నా. గతంలో తిరుపతి, విజయవాడల్లో నిర్వహించిన సీఎం కబడ్డీ కప్, జగనన్న క్రీడా సంబరాల్లోనూ మా టీమ్ విజేతగా నిలిచింది. టాలెంటెడ్ క్రీడాకారులకు గుర్తింపు కల్పిస్తున్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్రానికి, సీఎం జగన్‌కు మంచి పేరు తీసుకొస్తా. దేశం తరపున జాతీయ స్థాయిలో ఆడాలన్నదే నా కోరిక.

– పి.బాలకృష్ణారెడ్డి, టాలెంటెడ్ ప్లేయర్.

క్లుప్తంగా...

విద్యుత్‌ చార్జీలు పెంచే ఆలోచనే లేదు

ఏపీఈఆర్సీ చైర్మన్‌ జస్టిస్‌ నాగార్జునరెడ్డి



మాట్లాడుతున్న జస్టిస్‌ సీవీ నాగార్జునరెడ్డి, సభ్యులు రాంసింగ్, పీవీఆర్‌ రెడ్డి

తిరుపతి రూరల్‌: విద్యుత్‌ చార్జీలు పెంచే ఆలోచనే లేదని ఆంధ్రప్రదేశ్‌ విద్యుత్‌ నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) చైర్మన్‌ జస్టిస్‌ నాగార్జునరెడ్డి తెలిపారు. విద్యుత్‌ వినియోగదారుల సమస్యలు, శాఖ పనితీరుపై మంగళవారం తిరుపతిలో రాష్ట్ర విద్యుత్‌ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్‌ నాగార్జునరెడ్డి మీడియాతో మాట్లాడారు. సాధారణ విద్యుత్‌ చార్జీలు ఏ వర్గానికీ పెంచే ఆలోచన లేదని చెప్పారు. రాష్ట్ర పరిధిలో రైల్వే శాఖకు సరఫరా చేస్తున్న విద్యుత్‌కు మాత్రం చార్జీలు పెంచాలన్న ప్రతిపాదన ఉందన్నారు. దీనిపై ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర విద్యుత్‌ శాఖలో రూ.3 వేల కోట్లతో అభివృద్ధి, విస్తరణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యుత్‌ ఉత్పత్తి, సరఫరా విషయాల్లో లోటుపాట్లు లేకుండా ప్రతి జిల్లాలోనూ పర్యవేక్షణ అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. సబ్‌స్టేషన్ల పరిధిలో ఓవర్‌ లోడ్‌ను అధిగమించేందుకు చర్యలు వేగవంతం చేశామన్నారు. వ్యవసాయానికి ఇబ్బంది లేకుండా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ఏపీఈఆర్సీ సభ్యులు ఠాకూర్‌ రాంసింగ్, పీవీఆర్‌ రెడ్డి, డిస్కంల అధికారులు పాల్గొన్నారు.

ముస్లిం పిల్లల విద్యకు సీఎం జగన్‌ తోడ్పాటు

హజ్‌ కమిటీ చైర్మన్‌ గౌస్‌ లాజమ్‌



గౌస్‌లాజమ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉర్దూ టీచర్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ప్రతినిధులు

సాక్షి, అమరావతి: ముస్లిం పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దడం ద్వారా పేదరికానికి చెల్లుచీటి రాయాలనే గొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాపరంగా విప్లవాత్మక చర్యలు చేపట్టారని ఆంధ్రప్రదేశ్‌ హజ్‌ కమిటీ చైర్మన్‌ బీఎస్‌ గౌస్‌లాజమ్‌ అన్నారు. రాష్ట్ర ఉర్దూ టీచర్స్‌ అసోసియేషన్‌ (ఆర్‌యూటీఏ) సమావేశం మంగళవారం విజయవాడలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన గౌస్‌లాజమ్‌ మాట్లాడుతూ.. ముస్లింల సంక్షేమానికి, అభివృద్ధికి చర్యలు చేపట్టిన సీఎం జగన్‌ విద్యా, వైద్యం అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. రాష్ట్రంలో ప్రత్యేకంగా 175 మదర్సాలలో ఆధునిక విద్య బోధించేలా అవసరమైన చర్యలు చేపట్టారని వివరించారు. ముస్లిం పిల్లలకు పెద్ద చదువుల కోసం అనేక చర్యలు చేపట్టిన సీఎం జగన్‌కు అండగా నిలవాలని ఉర్దూ టీచర్లకు గౌస్‌లాజమ్‌ విజ్ఞప్తి చేశారు. ఆర్‌యూటీఏ అధ్యక్షుడు ఎంఎస్‌ ఇమాంబాషా జగన్‌ మహోన్నత ఆశయంతో ముస్లిం విద్యాసంస్థలను ఆధునాతనంగా తీర్చిదిద్దారన్నారు. మదర్సాలలో సమస్యల్ని పరిష్కరించి ముస్లిం పిల్లలకు విద్యా అవకాశాలు మెరుగుపరిచారు. ప్రధాన కార్యదర్శి సయ్యద్‌ ఇక్బాల్‌ కోఆర్డినేటర్‌ ఎస్‌ఎంబీ అయూబ్, అసోసియేట్‌ ప్రెసిడెంట్‌ అబ్దుల్‌ మునాఫ్, డైరీ కమిటీ చైర్మన్‌ అబ్దుల్‌ హకీం, అదనపు కార్యదర్శి బేపారి ఫకృద్దీన్, రాష్ట్ర కన్వీనర్‌ పఠాన్‌ జాగీర్, ఏపీ హజ్‌ కమిటీ సభ్యుడు ఇబాదుల్లా, ఏపీ మైనార్టీ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ షేక్‌ నిజాం మాట్లాడారు.

ఓటర్ల జాబితాలపై 'సుప్రీం' సంతృప్తి

ఎన్నికల సంఘం చర్యలు భేష్‌ అన్న సీజే నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం

- ఈ విషయంలో ఎలాంటి తదుపరి ఉత్తర్వులు అవసరం లేదని వెల్లడి
- సన్సద్‌ బచావో ట్రస్ట్‌ పిటిషన్‌లో సుప్రీంకోర్టు ఆదేశాలు
- రాష్ట్రంలో ఓటర్ల జాబితాలపై కొంతకాలంగా అడ్డగోలు ఆరోపణలు చేస్తున్న ఎల్లోమీడియా
- ఎన్నికల అధికారులే లక్ష్యంగా నిరాధార ఆరోపణలు.. తప్పుడు కథనాలు
- తాజా ఆదేశాలతో ఎల్లో మీడియా తుప్పు వదిల్చిన సుప్రీంకోర్టు



సాక్షి, అమరావతి: ఓటర్ల జాబితాల తయారీ విషయంలో ఎన్నికల అధికారులపై నిత్యం అడ్డగోలు ఆరోపణలు చేస్తూ నానా యాగీ చేస్తున్న ఎల్లో మీడియా నోళ్లు మూయిస్తూ సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు వెలువరించింది. ఓటర్ల జాబితాల విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) తీసుకుంటున్న చర్యలపై సుప్రీంకోర్టు పూర్తి సంతృప్తి వ్యక్తం చేసింది. ఎన్నికల సంఘం చర్యలు సంతృప్తికరంగా ఉన్నందున ఈ వ్యవహారంలో తదుపరి తమ నుంచి ఎలాంటి ఆదేశాలు అవసరం లేదని తేల్చి చెప్పింది. ఒక చిరునామా నుంచి మరో చిరునామాకు మారిన ఓటర్లు లేదా మరణించిన ఓటర్లు లేదా డూప్లికేట్‌గా నమోదైన ఓటర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించే విషయంలో చట్ట నిబంధనల మేరకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర ఎన్నికల సంఘం లిఖితపూర్వకంగా సమర్పించిన వివరాలు సంతృప్తికరంగా ఉన్నాయని స్పష్టం చేసింది. ఓటర్ల నమోదు ప్రక్రియ మొదలు, ఓటర్ల జాబితా సవరణ, తుది ఓటర్ల జాబితా తయారీ వరకు మొత్తం ప్రక్రియను అత్యంత పారదర్శకతతో చేపడుతున్నామన్న సీఈసీ వాదనతో సుప్రీం కోర్టు ఏకీభవించింది. ఓటర్ల జాబితా నుంచి తొలగించే ముందు చట్ట ప్రకారం వారికి నోటీసు ఇచ్చి వారి వివరణ తీసుకున్న తరువాతే తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కూడా ఎన్నికల సంఘం చెప్పిన అంశాన్ని సుప్రీం కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఎన్నికల సంఘం పారదర్శకంగా అన్ని చర్యలు తీసుకుంటున్నప్పుడు ఇక తదుపరి ఆదేశాలతో పనేముందని విచారణ సందర్భంగా పిటిషనర్‌ను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. పిటిషనర్‌ సందేహాలను ఎన్నికల కమిషన్‌ నివృత్తి చేసిందని సుప్రీం కోర్టు గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో తమ ముందున్న వ్యాజ్యంతో తదుపరి విచారణ అవసరం లేదంది. ఓటర్ల జాబితా విషయంలో అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులను ప్రతివాదులుగా చేర్చడంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యలను ప్రశ్నిస్తూ 'సన్సద్‌ బాచావో ట్రస్ట్‌' దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు పరిష్కరించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్‌ ధనుంజయ్‌ చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్‌ జంషెడ్‌ బుర్జోర్‌ పార్థీవాలా, జస్టిస్‌ మనోజ్‌ మిశ్రాతో కూడిన విస్తృత ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సన్సద్‌ బచావో ట్రస్ట్‌ పిటిషన్‌పై విచారణ

రాజ్యాంగంలోని అధికరణ 324 ప్రకారం సవరణ ఓటర్ల జాబితాలను తయారు చేసేలా ప్రధాన ఎన్నికల అధికారులను ఆదేశించాలని, అలాగే చిరునామా మారిన, మరణించిన, డూప్లికేట్‌గా నమోదైన ఓటర్ల విషయంలో ప్రజాప్రాతినిధ్య చట్ట నిబంధనల ప్రకారం వ్యవహరించేలా కూడా ఆదేశాలు ఇవ్వాలంటూ సన్సద్‌ బాచావో ట్రస్ట్‌ 2023లో సుప్రీంకోర్టులో పిటిషన్‌ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై సీజే నేతృత్వంలోని విస్తృత ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్‌ తరఫున సుప్రీంకోర్టు సీనియర్‌ న్యాయవాది ఆరోరా వాదనలు వినిపిస్తూ.. డూప్లికేట్‌ ఓటర్ల విషయంలో ఎన్నికల అధికారులు సరిగ్గా స్పందించడం లేదన్నారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది అమిత్‌ శర్మ స్పందిస్తూ.. డూప్లికేట్‌ ఓటర్లతో సహా ఓటర్ల జాబితా విషయంలో తాము తీసుకుంటున్న అన్ని చర్యలనూ వివరిస్తూ అఫిడవిట్‌ దాఖలు చేస్తామని చెప్పారు. ఇందుకు ధర్మాసనం అనుమతి ఇచ్చింది.

'చట్టానికి లోబడే చేస్తున్నాం'

ఈ నేపథ్యంలో అమిత్‌ శర్మ కేంద్ర ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ సమగ్ర కౌంటర్‌ దాఖలు చేశారు. అలాగే ఓ నోట్‌ కూడా ధర్మాసనం ముందుంచారు. సోమవారం ఈ వ్యాజ్యం విచారణకు వచ్చినప్పుడు సుప్రీం ధర్మాసనం ఆ నోట్‌ను క్షుణ్ణంగా పరిశీలించింది. చిరునామాలు మారడం, మరణించడం, భౌగోళికంగా ఒకే ప్రాంతంలో ఓటర్లుగా నమోదు కావడం వంటి విషయాల్లో తీసుకుంటున్న చర్యలను ఎన్నికల సంఘం తన కౌంటర్‌లో వివరించింది. చట్టానికి లోబడి తాము చేస్తున్న పనులన్నింటినీ కోర్టుకు తెలియచేసింది. ఓటర్ల జాబితా నుంచి ఎవరి పేరైనా తొలగించదలచుకుంటే వారికి నోటీసులు ఇచ్చి, అభ్యంతరాలు స్వీకరించి ఆ తరువాత మాత్రమే తదుపరి చర్యలు తీసుకుంటున్న విషయాన్ని సవివరంగా అత్యున్నత న్యాయస్థానానికి నివేదించింది. ప్రతి దశలో ఏం చేస్తున్నాయో తెలియజేసింది. డ్రాఫ్ట్‌ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తున్న విషయాన్ని కూడా చెప్పింది. లోపాలన్నింటినీ సవరించిన తరువాతే తుది జాబితాను ప్రకటిస్తున్నామని స్పష్టం చేసింది.

2024 ఫిబ్రవరి 8వ తేదీ నాటికి దేశవ్యాప్తంగా 96,85,01,358 మంది ఓటర్లు ఉన్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం తన అఫిడవిట్‌లో సుప్రీం కోర్టుకు తెలిపింది. ఇందులో 49.70 కోట్లు పురుషులు కాగా.. 47.13 కోట్లు మహిళా ఓటర్లు ఉన్నారని వివరించింది. 48,057 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని, దివ్యాంగ ఓటర్లు 88.24 లక్షలు ఉన్నారని వివరించింది. 18–19 సంవత్సరాల వయసు మధ్య 1.84 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని పేర్కొంది. 80 సంవత్సరాల పైబడిన వారు 1.86 కోట్లు ఉన్నారని వివరించింది. 100 ఏళ్లు దాటిన ఓటర్లు 2.40 లక్షల మంది ఉన్నారని తెలిపింది. 2024 స్పెషల్‌ సమ్మరీ రివిజన్‌ (ఎస్‌ఎస్‌ఆర్‌)లో కొత్తగా 2.63 కోట్ల మంది ఓటర్లుగా చేరారని వివరించింది. ఇందులో 1.41 కోట్ల మహిళలు ఉన్నారని కోర్టుకు తెలిపింది. కొత్తగా నమోదైన వారందరికీ ఫొటో గుర్తింపు కార్డులు ఇచ్చామని వివరించింది. 2024 ఎస్‌ఎస్‌ఆర్‌లో 1.65 కోట్ల మంది ఓటర్లను తొలగించడం జరిగిందని, ఇందులో 67.82 లక్షల మంది చనిపోయారని, 75.11 లక్షల మంది శాశ్వతంగా చిరునామాలు మారారని, 22.05 లక్షలు డూప్లికేట్‌ ఓటర్లు ఉన్నారని తెలిపింది. ప్రతి విషయాన్నీ క్షుణ్ణంగా సుప్రీం కోర్టుకు వివరించింది. పిటిషనర్‌ లేవనెత్తిన సందేహాలనూ నివృత్తి చేసింది. బహుళ ఎంట్రీలు, ఏకరూప ఫొటోలు, భౌగోళికంగా ఓ ప్రాంతంలో ఓటర్లుగా నమోదు కావడం వంటి విషయాల్లో ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని సీజే ధర్మాసనం స్పష్టం చేసింది. దీనిపై తదుపరి ఎలాంటి ఉత్తర్వులు అవసరం లేదంది. ఈ ఉత్తర్వులతో సన్సద్‌ బచావో ట్రస్ట్‌ దాఖలు చేసిన వ్యాజ్యంలో ప్రొసీడింగ్స్‌ను మూసివేస్తున్నట్టు తెలిపింది.

మొత్తం ఓటర్లు 96.85 కోట్ల మంది

ఎల్లో మీడియా నిత్య రాద్ధాంతం

ఏపీలో ఓటర్ల జాబితాల విషయంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగిపోతున్నాయని, టీడీపీ అధినేత చంద్రబాబు సహా ఇతర నేతలు చేసిన ఫిర్యాదులను కేంద్ర ఎన్నికల సంఘం పట్టించుకోవడం లేదంటూ ప్రతి రోజూ ఎల్లో మీడియా పుంఖానుపుంఖాలుగా కథనాలు వండివారుస్తోంది. రాష్ట్రంలో ఏదో జరిగిపోతోందన్న ఆందోళనను ప్రజల్లో కలిగించేందుకు సర్వశక్తులు ఒడ్డుతోంది. కొంతకాలంగా ఎన్నికల అధికారులను లక్ష్యంగా చేసుకుని అసత్యాలను ప్రచారం చేస్తోంది. ఎన్నికల అధికారులపై నిరాధార ఆరోపణలు చేయడానికి కూడా ఏ మాత్రం వెనుకాడటం లేదు. ఓటర్ల జాబితాల తయారీ విషయంలో ఎన్నికల అధికారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారంటూ నిరాధార ఆరోపణలు చేస్తోంది. రాష్ట్రంలో ఓటర్ల జాబితా తయారీలో స్వచ్ఛత లేదని నమ్మించే ప్రయత్నం చేస్తోంది. అడ్డగోలుగా ఓటర్ల జాబితా నుంచి తొలగింపులు చేస్తున్నారంటూ ఆరోపణలు గుప్పిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో సుప్రీం కోర్టు ఇచ్చిన తాజా ఉత్తర్వులు ఎల్లో మీడియాకు గట్టిగానే షాకిచ్చేవిగా ఉన్నాయి.

లక్ష టిడ్కో ఇళ్లు పంపిణీ పూర్తి

అన్నిచోట్లా పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన



సాక్షి, అమరావతి: పట్టణ పేదలకూ సొంతింటి కలను నిజం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఏపీ టౌన్‌షిప్‌ అండ్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ కార్పొరేషన్‌ (ఏపీ టిడ్కో) ఇప్పటివరకూ లక్ష ఇళ్లను పేదలకు అందజేసింది. ఈనెల 22కల్లా మరో 25,456 ఇళ్లను అందించనుంది. ఇందులో భాగంగా నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో నిర్మించిన 15,504 యూనిట్లను బుధవారం లబ్ధిదారులకు అందించేందుకు టిడ్కో అధికారులు ఏర్పాట్లుచేశారు. ఇప్పటికే 35 పట్టణ స్థానిక సంస్థ (యూఎల్బీ)ల్లోని 66 ప్రాంతాల్లో నిర్మించిన 1,00,200 ఇళ్లను లబ్ధిదారులకు అందించగా, తాజాగా నెల్లూరు, అనంతరం సాలూరు 1,056, విజయనగరం 1,120, పెద్దాపురం 1,584, మచిలీపట్నం 2,304, చిత్తూరు 2,016, మదనపల్లి 1,872 టిడ్కో ఇళ్ల పంపిణీకి ముహూర్తం ఖరారుచేశారు. ఈ మొత్తం ప్రక్రియ ముగియగానే 18 యూఎల్బీల్లో 24,812 యూనిట్లను మార్చిలో లబ్ధిదారులకు అందిస్తారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు ఫేజ్‌–1లో 1,51,298 టిడ్కో ఇళ్లు పూర్తిచేస్తారు. ఇలా రాష్ట్రంలోని 88 పట్టణ స్థానిక సంస్థల పరిధిలోని 163 ప్రాంతాల్లో జీ+3 విధానంలో 2,62,212 టిడ్కో ఇళ్లను ప్రభుత్వం నిర్మిస్తోంది. వీటిలో గత టీడీపీ ప్రభుత్వం నిరుపేదలపై మోపిన అధిక ధరలను పక్కనబెట్టి, సీఎం వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం 1,43,600 మంది నిరుపేదలకు ఉచితంగానే ఫ్లాట్లను అందిస్తోంది. మరో 1,18,616 మంది తక్కువ ఆదాయ వర్గాలకు గత ప్రభుత్వం మోపిన ఆర్థిక భారాన్ని సగం తగ్గించి ఇళ్లను కేటాయించింది.

అన్ని వసతులతో ఆధునిక పట్టణ ఇళ్లు..

జీ+3 విధానంలో నిర్మంచిన టిడ్కో ఇళ్లకు తాగు నీరు, డ్రైనేజీ, ఎస్టీపీ, విద్యుత్‌ సదుపాయం, రోడ్లు వంటి అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తోంది. ఆ తర్వాతనే లబ్ధిదారులకు కేటాయిస్తున్నారు. ప్రస్తుతమున్న నగరాలు, పట్టణాలకు సమీపంలో అనువైన ప్రాంతాల్లో ఉన్న ఈ అపార్ట్‌మెంట్లు సరికొత్త పట్టణాలను తలపిస్తున్నాయి. గుడివాడ, నంద్యాల, కర్నూలు, నెల్లూరు యూఎల్బీల పరిధిలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లు 10 వేల నుంచి 15 వేలకు పైగా ఉన్నాయి. ఒక్క నెల్లూరు పరిధిలోనే (అల్లిపురం, వెంకటేశ్వరపురం) రెండుచోట్ల మొత్తం 27 వేల ఇళ్లు నిర్మిస్తుండగా, బుధవారం 15,504 యూనిట్లను అందిస్తున్నారు. గేటెడ్‌ కమ్యూనిటీలను తలపిస్తున్న ఈ 163 ప్రాంతాల్లోని నివాసాలకు 'వైఎస్సార్‌ జగనన్న నగరాలు'గా నామకరణం చేసి, అంతర్గత నిర్వహణకు నివాసితులతో సంక్షేమ సంఘాలను సైతం ఏర్పాటుచేశారు. ఇక్కడి వారికి ఎలాంటి ఇబ్బందిలేకుండా జగనన్న నగరాల్లో (టిడ్కో ఇళ్లు) పట్టణ స్వయం సహాయక సంఘాలు స్వయంగా నిర్వహిస్తున్న జగనన్న మహిళా మార్టులను మెప్మా ఏర్పాటుచేస్తోంది.

లబ్ధిదారులకు జగన్‌ సర్కారు మేలు..

ఇదిలా ఉంటే.. సీఎం జగన్‌ ప్రభుత్వం మూడు కేటగిరీల్లో 2,62,216 టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఇందులో 300 చ.అ. విస్తీర్ణంలో 1,43,600 యూనిట్లు.. 365 చ.అ విస్తీర్ణంలో 44,304 యూనిట్లు.. 430 చ.అ విస్తీర్ణంలో 74,312 యూనిట్లు ఉన్నాయి. 300 చ.అ. ఇంటిని నిరుపేదలకు రూ.1కే కేటాయించి 1,43,600 మంది లబ్ధిదారులకు రూ.10,339 కోట్ల ప్రయోజనం చేకూర్చింది. అలాగే, 365 చ.అ ఇళ్లలో 44,304 మంది లబ్ధిదారులు రూ.50 వేలు, 430 చ.అ. ఇళ్లలో 74,312 మంది లబ్ధిదారులు రూ.లక్ష చొప్పున వాటా చెల్లించాలని గత ప్రభుత్వం నిబంధన పెడితే, దాన్ని సగానికి తగ్గించడంతో పాటు వారు చెల్లించాల్సిన రూ.482.32 కోట్లను ప్రస్తుత ప్రభుత్వమే చెల్లించింది. రెండు, మూడు కేటగిరీల్లోని లబ్ధిదారులకు గత ధరల ప్రకారం రూ.10,797 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఆ మొత్తం రూ.4,590 కోట్లకు తగ్గిపోయింది. మౌలిక సదుపాయాలకు సైతం గత సర్కారు రూ.306 కోట్లు కేటాయించి చేతులు దులుపుకుంటే జగన్‌ సర్కారు రూ.3,237 కోట్లతో సదుపాయాలు కల్పిస్తోంది. అంతేకాక.. రివర్స్‌ టెండరింగ్‌లో చ.అడుగు నిర్మాణ వ్యయాన్ని రూ.1,692కు తగ్గించడంతో పాటు, అన్ని పనుల్లోను దాదాపు రూ.4,368 కోట్ల ప్రజాధనాన్ని ఆదా చేసింది. ఇక అన్ని కేటగిరీల ఇళ్ల లబ్ధిదారులకు సేల్‌డీడ్, స్టాంప్‌ డ్యూటీ, రిజిస్ట్రేషన్‌ ఫీజులు, యూజర్‌ చార్జీలను మినహాయించడంతో లబ్ధిదారులు మొత్తంగా రూ.5,487.32 కోట్ల మేర లబ్ధిపొందారు.

ఇళ్ల పేరిట పేదలను ముంచిన చంద్రబాబు..

ఇక టిడ్కో ప్రాజెక్టులో చంద్రబాబు ప్రభుత్వం 3,13,832 ఇళ్ల నిర్మాణం తలపెట్టింది. వీటిలో 2019 మే నాటికి 1,90,944 యూనిట్లు పునాదిస్థాయి దాటాయి. మరో 1,22,888 యూనిట్లు పునాదుల్లోనే మిగిలిపోయాయి. చ.అడుగు నిర్మాణ వ్యయాన్ని రూ.1,879గా నిర్ణయించడంతో పాటు 63,744 యూనిట్ల నిర్మాణానికి రూ.3,232 కోట్లు వ్యయాన్ని ఖరారుచేశారు. అయితే, ఇందులో జరిగిన అక్రమాలను గుర్తించిన ప్రస్తుత జగన్‌ సర్కారు రివర్స్‌ టెండరింగ్‌ ద్వారా నిర్మాణ వ్యయాన్ని రూ.2,840 కోట్లకు తగ్గించి రూ.392 కోట్ల ప్రజాధనం ఆదా చేసింది. పేదలు 300 చ.అ. ఇంటికి బాబు ప్రభుత్వం రూ.7.5 లక్షలు భారం మోపి, 20 ఏళ్లపాటు ప్రతినెలా వాయిదాలు కట్టాలని షరతుపెట్టి రూ.3,805 భారం మోపింది. అలాగే, 365 చ.అ. ఇంటికి రూ.50 వేలు, 430 చ.అ. ఇంటికి రూ.లక్ష వసూలు చేసింది.

టిడ్కో ప్రాంగణాల్లో జేఎంఎం, కమ్యూనిటీ హాళ్లు

మరోవైపు.. టిడ్కో నివాసాల వద్ద పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పట్టణ మహిళా సంఘాలు విజయవంతంగా నిర్వహిస్తున్న జగనన్న మహిళా మార్టులను ఏర్పాటుచేయనున్నారు. వీటితో పాటు స్థానికుల అవసరాలకు అనుగుణంగా కమ్యూనిటీ హాళ్లను సైతం నిర్మిస్తున్నారు. తొలివిడతలో 21 యూఎల్బీల్లోని టిడ్కో నివాసాల వద్ద వీటిని ఏర్పాటుచేయనున్నారు. ఇందుకు ఇళ్ల ప్రాంగణాల్లో టిడ్కో విభాగం 1,000 చదరపు గజాల స్థలాన్ని కేటాయిస్తోంది. ఇక్కడ 4 వేల చదరపు అడుగుల్లో రెండు అంతస్తుల్లో భవనాన్ని నిర్మించనున్నారు. మొదటి అంతస్తులో జగనన్న మహిళా మార్టు, రెండో అంతస్తులో కమ్యూనిటీ హాల్‌ అందుబాటులోకి తేనున్నారు. టిడ్కో నివాసితుల్లో అధిక శాతం మెప్మా సభ్యులే. దాంతో అక్కడి వారికి ఉపాధితో పాటు ఆదాయ మార్గాలను కల్పించాలని ప్రభుత్వం సంకల్పించింది. వీటి నిర్వహణను సైతం స్థానిక టిడ్కో నివాసితులు, స్వయం సహాయక సంఘాల సభ్యులకే అప్పగించనున్నారు. జేఎంఎం నిర్మాణానికి ఇప్పటికే విజయనగరంలో పనులు ప్రారంభించగా, మంగళవారం తాడిపత్రిలోను, బుధవారం నెల్లూరు, గురువారం మదనపల్లిలోను పనులు చేపట్టనున్నారు.

నేడు దామోదరం సంజీవయ్య జయంతి

ఏటా అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను బుధవారం అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి కె.హర్షవర్ధన్‌ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై ఏటా ఫిబ్రవరి 14న దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను ఆయన జన్మించిన ప్రాంతం కర్నూలులో అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో పాటు అమరావతి, అన్ని జిల్లా కేంద్రాల్లోనూ సంజీవయ్య జయంతి నిర్వహించేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయించింది.

30 మంది డీఎస్పీల బదిలీ

సాక్షి, అమరావతి: ప్రభుత్వం 30 మంది డీఎస్పీలను బదిలీ చేసింది. ఈ మేరకు డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న బదిలీల్లో భాగంగా డీఎస్పీ బదిలీలూ జరిగాయి.

15న అధికారికంగా సేవాలాల్‌ మహారాజ్‌ జయంతి

ఎస్టీ కమిషన్‌ సభ్యుడు శంకర్‌నాయక్‌



సాక్షి, అమరావతి: బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్‌ మహారాజ్‌ జయంతి వేడుకలను ఈ నెల 15వ తేదీన అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయమై ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న బంజారా జాతి బిడ్డలకు శుభవార్త చెప్పింది. అనంతపురం జిల్లా స్థానిక పండుగగా అధికారికంగా వేడుకలు జరపాలని ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ముత్యాలరాజు రేవు మంగళవారం ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తమ విజ్ఞాపనను పరిశీలించి పెద్ద మనస్సుతో అవకాశం కల్పించిన సీఎం వైఎస్‌ జగన్‌కు ఏపీ ఎస్టీ కమిషన్‌ సభ్యుడు వడిత్యా శంకర్‌ నాయక్‌ గిరిజన ప్రజా సంఘాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన వేరొక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల అనంతపురం జిల్లా ఉరవకొండ పర్యటనకు వచ్చిన సీఎం జగన్‌ను కలిసి సేవాలాల్‌ మహారాజ్‌ జయంతి వేడుకలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని కోరినట్టు తెలిపారు. ఏ ముఖ్యమంత్రి స్పందించని విధంగా సేవాలాల్‌ మహారాజ్‌ జయంతిని అధికారికంగా నిర్వహించేలా ఉత్తర్వులు ఇచ్చిన నిజమైన నాయకుడు సీఎం జగన్‌ అని కితాబిచ్చారు. ఇది యావత్‌ బంజారా జాతి గర్వించదగ్గ విషయమన్నారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం సేవాఘడ్‌ నందు బంజారా జాతి ఆరాధ్య దైవం సేవాలాల్‌ మహారాజ్‌ జయంతిని అధికారికంగా నిర్వహిస్తారని, దీన్ని విజయవంతం చేయాలని శంకర్‌ నాయక్‌ కోరారు.

కొత్త గ్రూపులకు 'సారథి'!

టీడీపీలో చేరకముందే నూజివీడులో పార్థసారథి గ్రూపు రాజకీయాలు

- పార్థసారథికి స్వాగతం పేరిట పట్టణంలో ఫ్లెక్సీల ఏర్పాటు
- పార్టీలో చేరకుండానే ఎలా ఏర్పాటు చేశారని ముద్దరబోయిన వర్గం ఆగ్రహం
- పార్థసారథి ఫ్లెక్సీలో తమ నాయకుడి ఫొటో తొలగించాలని హెచ్చరిక
- పదేళ్ల నుంచి ఇన్‌చార్జిగా ఉన్న ముద్దరబోయినను అధిష్టానం విస్మరించడంపై టీడీపీ నేతల విస్మయం
- రానున్న ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన



సారథికి స్వాగతం పేరుతో ముద్దరబోయిన ఫొటోతో టీడీపీ నేత ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



ఫ్లెక్సీలో ఫొటో కత్తిరించిన ముద్దరబోయిన వర్గం

నూజివీడు: ఇంకా టీడీపీలో చేరనేలేదు... ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించలేదు... టికెట్‌ ఇస్తామని ప్రకటించలేదు... కానీ, అప్పుడే కొలుసు పార్థసారథి నూజివీడులో గ్రూపు రాజకీయాలు మొదలు పెట్టారు. దీంతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు వర్గం మండిపడుతోంది. ఇప్పటికే ఇక్కడ టీడీపీలో ఉన్న గ్రూపుల గోల సరిపోదన్నట్లు... పార్థసారథి రాకముందే మరో కొత్త గ్రూపును తయారు చేస్తున్నారని టీడీపీ సీనియర్‌ నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

మొదట ప్రగల్భాలు.. చివరకు సొంత సామాజికవర్గ నేతకు ఎసరు

గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పెనమలూరు నియోజకవర్గం నుంచి కొలుసు పార్థసారథి పోటీ చేసి విజయం సాధించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ పెనమలూరు నుంచి సీటు ఇవ్వడం సాధ్యం కాదని, ప్రత్యామ్నాయం ఆలోచిద్దామని వైఎస్సార్‌సీపీ అధిష్టానం పార్థసారథికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించింది. ఇందుకు ఆయన అంగీకరించకుండా తాను పెనమలూరు నుంచే పోటీ చేస్తానని ప్రకటించారు. అదే సమయంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును రహస్యంగా కలిసి ఈ మేరకు ఒప్పందం చేసుకున్నారు. కానీ, అక్కడ టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ అడ్డం తిరగడంతో చంద్రబాబు వెనక్కి తగ్గారు. పెనమలూరు తనకు కావాల్సిందేనని బోడే ప్రసాద్‌ గట్టిగా పట్టుపట్టారని, బీసీ నేత ముద్దరబోయిన అయితే మౌనంగా వెళ్లిపోతారని పార్థసారథిని నూజివీడు నుంచి పోటీ చేయాలని చంద్రబాబు సూచించినట్లు ప్రచారం సాగుతోంది. చివరకు తాను పెనమలూరు నుంచే పోటీ చేసి గెలుస్తానని ప్రగల్భాలు పలికిన పార్థసారథి కూడా అస్త్రసన్యాసం చేశారు. పెనమలూరులో బోడే ప్రసాద్‌ను తప్పించి తనకు సీటు ఇవ్వాలని చంద్రబాబును అడిగే ధైర్యం చేయలేక నూజివీడు వచ్చి పదేళ్లుగా టీడీపీని నమ్ముకుని ఉన్న తన సొంత సామాజికవర్గ నేతకు అన్యాయం చేయాలని నిర్ణయించుకున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

ముద్దరబోయిన ఫొటోల తొలగింపు

నూజివీడు మండలం రావిచర్లలోని ఓ టీడీపీ నాయకుడి ఇంట్లో బుధవారం జరిగే శుభకార్యానికి పార్థసారథి హాజరుకానున్నట్లు తెలిసింది. ఆయనకు స్వాగతం పలుకుతూ మంగళవారం నూజివీడు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు వెలిశాయి. వాటిలో ప్రస్తుత టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఫొటో కూడా ఉంది. పార్థసారథి కనీసం టీడీపీలో చేరకుండానే ఆయనకు స్వాగతం పేరిట ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై ముద్దరబోయిన వర్గం కంగుతింది. దీనిపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వ్యక్తిని వారు నిలదీయగా.. తనకు ఇద్దరు నాయకులు కావాలని, అందుకే ఇద్దరి ఫొటోలు వేశానని అతను చెప్పినట్టు సమాచారం. ఇద్దరి ఫొటోలు ఉండటానికి వీల్లేదని ముద్దరబోయిన వర్గం స్పష్టం చేసింది. ముద్దరబోయిన ఫొటోను తీసేయాలని, లేకపోతే తామే తమ నాయకుడి ఫొటోను తొలగిస్తామని హెచ్చరించింది. ఆ తర్వాత ఫ్లెక్సీలపై ఉన్న ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఫొటోను వారే కట్‌ చేశారు. ప్రస్తుతం ఈ విషయం నూజివీడులో హాట్‌ టాపిక్‌గా మారింది. పార్థసారథి అధికారికంగా టీడీపీలోకి రాకముందే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఈ గ్రూపుల గోల మరింత పెరిగే అవకాశం ఉందని టీడీపీ నేతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పదేళ్ల నుంచి పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న నేతను అధిష్టానం విస్మరించడం, మరోసారి వలస నేతను తీసుకురావడం, ఆయన మరో కొత్త వర్గాన్ని తయారు చేసుకునే పని ప్రారంభించడంపై నియోజకవర్గంలోని టీడీపీ సీనియర్‌ నాయకులు సైతం మండిపడుతున్నారు. నియోజకవర్గంలో గ్రూపుల గోల వల్ల ఇప్పటికే వరుసగా రెండు సార్లు ఓడిపోయామని, తాజా పరిణామాలు కూడా రానున్న ఎన్నికల్లో తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



ధ్యానాన్ని ప్రారంభించడానికి ముందు కావాల్సినవి:
ఇతరులతో పంచుకోగలిగే పెద్ద మనసును కలిగివుండటం,
గత చర్యల పట్ల నిరాకరణ లేదా పశ్చాత్తాపం లేకపోవడం.

– థానిస్సరో భిక్షు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 14 ఫిబ్రవరి 2024

దౌత్య విజయం

అధికారిక, అనధికారిక మార్గాల ద్వారా సాగించిన వివిధ దౌత్యయత్నాలు ఫలప్రదమయ్యాయి. భారత ప్రధానికీ, ఖతార్ అమీర్‌కూ మధ్య నిరుడు సాగిన సమావేశం ఫలించింది. మరణశిక్ష పడ్డ 8 మంది నౌకాదళ సీనియర్ సిబ్బందిని ఖతార్ ఎట్టకేలకు విడుదల చేసింది. వారిలో ఏడుగురు సోమవారం స్వదేశానికి చేరుకోగా, ఎనిమిదో వ్యక్తిని సైతం సాధ్యమైనంత త్వరగా భారత్ రప్పించే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఏణ్ణర్ధం పైగా అక్కడి జైలులో మగ్గుతూ, మరణదండనతో మృత్యుముఖం దాకా వెళ్ళి, చివరకు అన్ని అభియోగాల నుంచి విముక్తమై వారు తిరిగి రావడం అసాధారణం. ఇది భారత దౌత్య విజయం. బుధవారం ఖతార్‌లో భారత ప్రధాని మోదీ పర్యటించనున్న వేళ వెలువడ్డ ఈ ప్రకటన విశేషమైనది. అంతర్జాతీయంగా మన దేశానికి పెరుగుతున్న ప్రాముఖ్యానికీ, అరబ్ దేశాలతో మనం నెరపుతున్న స్నేహసంబంధాల సాఫల్యానికీ ఇది ఓ మచ్చుతునక.

జరిగిన కథలోకి వెళితే, విడుదలైన ఈ 8 మంది భారత నౌకాదళ మాజీ సిబ్బంది ఇజ్రాయెల్ పక్షాన గూఢచర్యం చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు వినవచ్చాయి. అందులో నిజం లేదంటూ, వారిని విడుదల చేయాలని భారత్ ప్రయత్నిస్తూ వచ్చింది. గత ఏడాది కాలంగా భారత విదేశాంగ శాఖ అజెండాలో ఓ ప్రధానాంశం – ఈ నౌకాదళ మాజీ అధికారుల విడుదల. అందుకు తగ్గట్టే మంత్రిత్వ శాఖలో సంబంధిత విభాగం, అలాగే ఖతార్‌లోని భారత దౌత్య కార్యాలయం నిర్విరామంగా శ్రమించాయి. ప్రచారానికి దూరంగా తమ పని తాము చేస్తూ, చివరకు ఆశించిన ఫలితాన్ని సాధించాయి. విదేశాంగ శాఖ గల్ఫ్ డివిజన్‌కు మునుపు సారథ్యం వహించిన విపుల్ గత ఏడాది ఖతార్‌కు వెళ్ళి, ఆ దేశంలో భారత రాయబారిగా బాధ్యతలు చేపట్టడం సైతం కలిసొచ్చింది. ఆయన సంబంధిత వర్గాలన్నిటితో మాట్లాడి, ఒప్పించగలిగారు. అదే సమయంలో, జాతీయ భద్రతా సలహాదారైన అజిత్ దోవల్ సారథ్యంలోని జాతీయ భద్రతా మండలి సచివాలయం సైతం ఖతార్ రాజధాని దోహాలోని తన సన్నిహితులతో మంతనాలు సాగించింది. ఓర్పుగా, నేర్పుగా వ్యవహారం నడిపిస్తూ, మన మాజీ అధికారులు విడుదలై, తిరిగివచ్చేవరకు కథను గుట్టుగా నడిపించడం విశేషం.

అసలు ఈ వివాదం ఏణ్ణర్ధం క్రితం మొదలైంది. 2022 ఆగస్ట్ 30న ఈ 8 మందిని అరెస్ట్ చేసి, ఏకాంతవాస శిక్ష విధించారు. ఖైదీలుగా ఉన్న మనవాళ్ళను ఆ ఏడాది అక్టోబర్ మొదట్లోనే భారత దౌత్య సిబ్బంది కలిశారు. నిజానికి, అరెస్టయినవారిలో అధికులు దహ్రా గ్లోబల్ అనే ఓ ప్రైవేట్ సంస్థకు పనిచేస్తూ వచ్చారు. ఖతారీ నౌకాదళంలో ఇటాలియన్ యూ212 రహస్య జలాంతర్గాముల్ని ప్రవేశపెట్టడంలో సాయపడేందుకు వారు ఖతార్‌కు వచ్చారన్నది కథనం. జైల్లో పడ్డ తమ సిబ్బందికి సాయం చేసేందుకు సదరు ప్రైవేట్ సంస్థ సీఈఓ సైతం ప్రయత్నించక పోలేదు. కానీ, ఆయనా జైల్లో పడి, రెండు నెలలు ఒంటరి చెరను అనుభవించి, అనంతరం జామీను మీద బయటపడాల్సి వచ్చింది. గడచిన 2023 మార్చి వచ్చేసరికి మన అధికారులు పెట్టుకున్న పలు జామీను అభ్యర్థనలు సైతం తిరస్కరణకు గురయ్యాయి. ఆ నెలాఖరున వారిపై ఖతార్ చట్టప్రకారం విచారణ మొదలైంది. చిత్రమేమంటే ఈ అధికారుల్లో ఒకరైన కెప్టెన్ నవ్‌తేజ్ గిల్ లాంటి వారు భారత నేవల్ అకాడెమీ నుంచి పట్టభద్రులైనప్పుడు తమ ప్రతిభా ప్రదర్శనకు ఏకంగా రాష్ట్రపతి స్వర్ణపతకం అందుకున్నారు. ప్రతిష్ఠాత్మక డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్‌లో బోధకుడిగా పనిచేశారు.

మొదట్లో గత అక్టోబర్‌లో ఈ నౌకాదళ మాజీ అధికారులందరికీ మరణ దండన విధించారు. ఆపైన మన దౌత్య యత్నాలు, భారత ప్రభుత్వ జోక్యం కారణంగా దాన్ని నిరవధిక జైలు శిక్షగా మార్చారు. బందీలుగా ఉన్న అధికారుల క్షేమం కోసం మన దేశం ఖతార్ అమీర్ కార్యాలయంతో సంప్రతింపులు సాగిస్తూ వచ్చింది. గత ఏడాది దుబాయ్‌లో 'కాప్–28' సదస్సు వేళ భారత ప్రధాని మోదీ, ఖతార్ అమీర్‌ను ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఇరు ప్రభుత్వాధినేతల స్నేహబంధం చివరకు పరిష్కారం చూపింది. మరోపక్క వీరు పనిచేసిన దహ్రా గ్లోబల్ సంస్థ నిరుడు మేలోనే దోహాలో తన కార్యకలాపాలకు స్వస్తి చెప్పింది. ఆ సంస్థలో అత్యధికులు భారతీయులే. వారు అప్పుడే భారత్‌కు తిరిగొచ్చేశారు. లెక్కచూస్తే, ఒక్క ఖతార్‌లోనే 8 లక్షల మంది భారతీయులు, 6 వేల భారతీయ కంపెనీలున్నాయి. రెండేళ్ళ క్రితమే ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 15.03 బిలియన్ డాలర్లుంది. ఇక, భారత్ చేసుకొనే ద్రవీభూత సహజవాయు (ఎల్ఎన్‌జీ) దిగుమతుల్లో 40 శాతం ఖతార్ నుంచే! వచ్చే 2048 దాకా ఆ దిగుమతుల కోసం 78 బిలియన్ డాలర్ల ఒప్పందాన్ని గత వారమే ఖతార్‌తో భారత్ కుదుర్చుకుంది. ఇవన్నీ ఇప్పుడు కలిసొచ్చాయి.

మొత్తం పశ్చిమాసియా సంగతికొస్తే 90 లక్షల మంది భారతీయులున్నారు. కొన్నేళ్ళుగా పశ్చిమాసియాలో, ప్రధానంగా సౌదీ అరేబియా, యూఏఈ, ఒమన్, కువైట్, ఖతార్‌ల వైపు భారత్ నిరంతరం స్నేహహస్తం చాస్తోంది. తాజా దౌత్య పరిష్కారం మన ఆ స్నేహానికి ఫలితం. పెరుగుతున్న భారత ప్రాబల్యానికి నిదర్శనం. ఈ ప్రాంత దేశాలన్నీ ఇంధన సరఫరాలో భారత్‌కు చిరకాలంగా సన్నిహితమైనా, విదేశాంగ విధానంలో పాకిస్తాన్ వైపు మొగ్గేవి. కొన్ని దశాబ్దాలుగా పాక్ అదృష్టం తలకిందులవడంతో, ఆర్థిక, భద్రతా అంశాల రీత్యా ఈ ప్రాంతంలో భారత్‌తో బలమైన సంబంధాలు అవసరమనే ఎరుక వాటికి కలిగింది. వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాంతంలో సమష్టి దౌత్య, భద్రతా లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని, భారత్‌ను అవి ఇప్పుడు విశ్వసనీయ మిత్రదేశంగా భావిస్తున్నాయి. నౌకాదళ అధికారుల విడుదలకు అదీ ఓ కారణమే. ఏమైనా ఇదే అదనుగా పశ్చిమాసియా దేశాలతో భారత్ దోస్తీ బలపడితే, మరిన్ని దౌత్య, వ్యూహాత్మక ప్రయోజనాలు తథ్యం.

స్త్రీ సాధికారతతోనే దేశ పురోగతి

విశ్లేషణ



డా॥ కత్తి పద్మారావు

ప్రపంచ వ్యాప్తంగా స్త్రీల రాజకీయ ఉన్నతి పెరుగుతున్నది. స్త్రీలలో వస్తున్న నిరంతర చైతన్యం, పెరుగుతున్న సానుకూల దృక్పథం, అంకిత భావం, పోరాట శక్తి వారిని మునుముందుకు నడిపిస్తున్నాయి. పార్లమెంటులో స్త్రీలు అధిక సంఖ్యలో ఉన్నప్పుడే వారి ప్రతిపాదనలు, హక్కులు నెరవేరతాయని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. స్త్రీ విద్యావంతురాలయితే ఆరోగ్యం, పరిసరాలు, సామాజిక ఘర్షణలన్నింటినీ చక్కగా అవగాహన చేసుకోగలుగుతుంది. స్త్రీలు తమ అస్తిత్వానికి సంబంధించి రాజీపడరు. వారు ఆత్మగౌరవ నిధులు. వారిలో జీవన ప్రతిభ ఎక్కువ. అందుకే వారు నాయకులుగా సులభంగా రాణించగలరు. అందుకే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో స్త్రీలకు గణనీయంగా స్థానాలు కేటాయించాలి.

స్త్రీ అత్యున్నతంగా విద్యావంతురాలైన కేరళ రాష్ట్రంలో సమాజ వికాసం గొప్పగా ఉంది. స్త్రీ విద్య తక్కువ వున్న రాజస్థాన్‌లో ఇంకా స్త్రీ పట్ల దురాచారాలు కొనసాగుతుండగా, కేరళ స్త్రీ ప్రపంచ ఎల్లలను తాకుతున్నది. కేరళలో ఇంగ్లీషు విద్యను కూడా స్త్రీలకు నేర్పగలిగారు. స్త్రీలకు ఏ భాష అయినా త్వరగా వస్తుంది. ఈ రోజున యాంకర్స్‌లో స్త్రీలు ప్రథమ స్థానంలో ఉన్నారు. ఇటీవల రిపబ్లిక్ డే పరేడ్‌లో జరిగిన విన్యాసాలలో అసమానమైన ప్రతిభా పాటవాలు వారు చూపారు. స్త్రీలు ఈ రోజు శాస్త్ర రంగంలో, సాంకేతిక రంగంలో, జ్ఞాన రంగంలో అత్యున్నత దశలో ఉండడానికి కారణం వారికి విద్యార్జన శక్తి అత్యుత్తమంగా ఉండటమే!

'నేను ఆలోచిస్తున్నాను కనుక నేను ఉన్నాను' అని ప్రముఖ తత్వవేత్త డెకార్ట్ అన్నట్లుగా... 'నేను బాధను అనుభవిస్తున్నాను, కాబట్టే నేను ఉన్నాను' అనుకొనే స్వభావం, బాధలో సౌఖ్యాన్ననుభవించే గుణం స్త్రీల స్వభావంలోనే ఉందనే నిందను స్త్రీవాదులు ఎదుర్కొన్నారు. నటాలీ షైన్ అనే న్యూయార్క్ మానసిక వైద్యురాలు చెప్పినట్లు, 'స్త్రీ మానసిక శాస్త్రం ఒక సమగ్ర దర్శనంగా రూపొందినప్పుడే స్త్రీకి ఉన్న అన్ని కోణాలు, అంతరాంతరాల్లో ఆమె ఆలోచన సమగ్రంగా దర్శితమవుతాయి.' స్త్రీలను సాహిత్యం, మనస్తత్వ శాస్త్రంతో పాటు మతం బలంగా పురుష పెత్తనం కిందికి నెట్టింది. అది హిందూమతంలోనే కాదు, అన్ని మతాల్లోను కొనసాగింది. స్త్రీ మానసికంగా బలహీనమైనదని చెబుతున్నవన్నీ అబద్ధాలు. ఆమె ఒక పని తీసుకుంటే ఆ పని పూర్తి అయ్యేవరకు నిదురపోదు. ప్రపంచంలో మానసిక తత్వవేత్తలు అందరూ ఇప్పుడు స్త్రీ ఆత్మ స్థైర్యం మీద సానుకూలంగా స్పందిస్తున్నారు. అందుకే ఆమె ఒక్కొక్క మెట్టు ఎదుగుతూ పోతున్నది. నిజానికి స్త్రీ ఒక తల్లిగా, ఒక చెల్లిగా కుటుంబ నిర్వహణ సామర్థ్యాన్ని కలిగి ఉండడమే కాదు... ఆమె రాజ్య, ప్రభుత్వ నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకుంటూ పోతున్నదని అర్థమవుతుంది.

ఈనాడే కాదు, స్వతంత్ర భావాలు కలిగిన స్త్రీలు ఆయా దేశాల్లో ఎన్నో అడ్డంకులను ఎదుర్కొని ముందుకు వెళ్ళారు. క్లియో పాత్రా (ఈజిప్ట్), క్వీన్ ఎలిజబెత్ (బ్రిటన్), కేథరిన్ ది గ్రేట్ (రష్యా), మేడమ్ డె పాంపెడర్ (ఫ్రాన్స్), సిరిమావో బండారునాయకే (శ్రీలంక), మార్గరెట్ థాచర్ (బ్రిటన్), ఇవా పెరాన్(అర్జెంటీనా), గోల్డా మెయిర్ (ఇజ్రాయెల్) లాంటి నాయకురాళ్ళు పితృస్వామ్య వ్యవస్థలోనే రాజకీయ ఆధిపత్యాన్ని వహించగలిగారు.

ఇకపోతే 17వ లోక్‌సభలో స్త్రీల సంఖ్య పెరగడం గుణాత్మకమైన మార్పు అనక తప్పదు. యువకులు, విద్యావంతులైన నాయకులతో కూడిన సభగా 17వ లోక్‌సభ నిలిచింది. గతంలో కంటే లింగ నిష్పత్తి మెరుగైంది. లింగ నిష్పత్తిలో చాలా దేశాల కంటే వెనుకంజలో ఉన్నప్పటికీ మెరుగుదల కనిపించింది. మొదటిసారి ఎంపీలు దాదాపు సగం (260 మంది) ఉన్నారు. తిరిగి ఎన్నికైన ఎంపీల సంఖ్య కూడా



పెరిగింది. 70 ఏళ్ల పైబడిన ఎంపీలు తగ్గి, 40 ఏళ్ళ కంటే తక్కువ వయస్సుగల ఎంపీలు పెరిగారు. ఎంపీల సగటు వయస్సు 54 ఏళ్లుగా ఉంది. తొలి లోక్‌సభలో 26 శాతం మంది యువ ఎంపీలు ఉంటే, 16వ లోక్‌సభ నాటికి 40 ఏళ్ల లోపు వారు 8 శాతం మందే ఉన్నారు. ఇప్పుడు 12 శాతానికి పెరిగింది. పిన్నవయస్సుగల సభ్యురాలిగా 25 ఏళ్లకు ఎంపీగా ఎన్నికైన బిజూ జనతా దళ్ నేత చంద్రాణి ముర్ము (ఒడిషా) నిలిచారు. వయోవృద్ధుడిగా ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సమాజ్‌వాదీ ఎంపీ షఫీకుర్ రెహమాన్ బర్క్ (90) ఉన్నారు. పురుషుల కంటే తక్కువ వయస్సు గల మహిళా ఎంపీలు ఈ సభలో ఉన్నారు.

2019 ఎన్నికల్లో మహిళా అభ్యర్థులు 716 మంది ఉంటే, 78 మంది ఎన్నికయ్యారు. 2014లో 62 మంది మహిళా ఎంపీలు ఉన్నారు. అయితే చాలా దేశాల్లో మహిళా ఎంపీల శాతం ఎక్కువగా ఉంది. రువాండాలో 61 శాతంగా, దక్షిణాఫ్రికాలో 43 శాతంగా, బ్రిటన్‌లో 32 శాతంగా, అమెరికాలో 24 శాతంగా, బంగ్లాదేశ్‌లో 21 శాతంగా ఉంది. 17వ లోక్‌సభ ఎంపీల్లో 39 శాతం మంది తమ వృత్తిని రాజకీయాలు, సామాజిక సేవగా పేర్కొన్నారు. వ్యవసాయం చేస్తామని 38 శాతం మంది, వ్యాపారవేత్తలమని 23 శాతం మంది వెల్లడించారు.

ఇకపోతే స్త్రీలు తమ విద్యా సంపత్తితో పాటు రాజకీయ అవగాహనను కూడా పెంచుకోవాల్సి ఉంది. నిజానికి రాజ్యాంగంలో ఉన్న ప్రాథమిక హక్కులు, విధులు, ఆదేశిక సూత్రాలు అన్నీ స్త్రీ, పురుషుల సమానత్వాన్ని చాటి చెబుతున్నాయి. 2016లో నిర్వహించిన లింగ సమానత్వ సూచిలో 87వ ర్యాంక్ పొందిన ఇండియా... 2023 నాటికి 146 దేశాల్లో 144వ స్థానానికి పరిమితమయ్యింది. 2021 నాటికి దేశంలో కార్మికుల్లో స్త్రీల శాతం (19.2) మాత్రమే అని ప్రపంచ బ్యాంకు నివేదించింది. 2022–23కు 37 శాతానికి పెరిగినప్పటికీ, బంగ్లాదేశ్, చైనా లాంటి దేశాలతో పోలిస్తే బాగా వెనుకబడి ఉంది. చైనా ఇప్పుడు 61 శాతం స్త్రీ శ్రామిక శక్తిని కలిగింది. ఈ విష యాలన్నీ పార్లమెంటులో ఎత్తిచూపి నిలవేయాలంటే దళి తులు ఎక్కువగా పార్లమెంటు, అసెంబ్లీ సభ్యులు కావలసి ఉంది. వ్యాపార రంగంలోనూ, విద్యా రంగంలోనూ, శాస్త్ర రంగంలోనూ, సాంకేతిక రంగంలోనూ స్త్రీలు మరింతగా ఎదగాలంటే రాజకీయరంగంలో స్త్రీల సంఖ్య పెరగాలి.

మరో పక్క మహిళలపై తీవ్రమైన దాడులు జరుగుతున్నాయి. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు పెరుగు తున్నాయి. వాస్తవంలో మహిళలపై దాష్టీకాల ఘటనలు అధిక సంఖ్యలో ఉంటాయనీ, చాలా వరకు అవి బయటకు రావనీ పరిశీలనలు చెబుతున్నాయి. అసంఘటితరంగంలో ఈ వేధింపులు మరింత అధికంగా ఉంటాయని అధ్యయ నాలు వెల్లడిస్తున్నాయి. ఒక్క పని ప్రదేశం అని ఏముంది... ఆర్టీసీ బస్సులు, వ్యాపార సముదాయాలు, రహదారులు, ఇలా అన్ని చోట్లా మహిళలు లైంగిక వేధింపులకు గురవుతున్నారు. పనిచేసే చోట ఇలాంటి అకృత్యాలకు గురయ్యే మహిళల్లో దాదాపు 69 శాతం మంది బయటకు చెప్పుకోవడానికి సైతం సంకోచిస్తున్నారని 'ఉమెన్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ' సర్వే వెల్లడించింది. న్యాయం జరుగుతుందన్న నమ్మకం కొరవడటం, వృత్తిపర మైన ఎదుగుదలకు అవరోధంగా మారుతుందన్న భయంతో బాధిత మహిళల్లో చాలామంది ఫిర్యాదు చేయడానికి వెనకంజ వేస్తున్నారు. ఉద్యోగం మాన్పించేస్తారన్న భయంతో చాలామంది కుటుంబ సభ్యులకు సైతం చెప్పుకోవడం లేదు.

ఇకపోతే పురుషుల మానసిక వ్యవస్థలలో వస్తున్న వికృతమయిన మార్పులవల్ల బాలికలపై కూడా దాడులు పెరుగుతున్నాయి. 11, 12 సంవత్సరాల బాలికలపై దాడులు జరుగుతున్న ప్రాంతాలలో ముంబయి, అమృత్‌సర్, వడోదరా, అహ్మదాబాద్, మీరట్ ముందు వరుసలో ఉన్నాయి. చివరకు తండ్రే కూతురిని వేధించే అసహ్యకరమైన కేసులు కూడా బయటకు వస్తున్నాయి. ఈ పరిస్థితులలో రాజ్యాధికారంలో స్త్రీల సంఖ్య గణనీయంగా పెరగాల్సిన చారిత్రక అవసరం ముందుకు వచ్చింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించిన కేంద్ర బడ్జెట్‌లో స్త్రీల విద్య, సామాజిక, ఆర్థిక, ఆరోగ్య అభివృద్ధికి తగిన నిధులు కేటాయించలేదని మహిళా ఎంపీలు చైతన్యవంతంగా మాట్లాడుతున్నారు. ఇది శుభ పరిణామం. స్త్రీ సాధికారత జాతీయ పురోగతికి తోడ్పడుతుంది. కరుణ, ప్రేమ, ప్రజ్ఞల విస్తృతికి తోడ్పడుతుంది. ఆ దిశగా మనమందరం నడుద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు । 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

స్ఫూర్తి ప్రదాత



'భారత కోకిల' సరోజినీ నాయుడు జయంతి (13 ఫిబ్రవరి) సందర్భంగా వినమ్ర నివాళులు. కవయిత్రి, మహిళా హక్కుల కార్యకర్త, స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సరోజిని... దేశ నిర్మాణానికి చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తిని ఇస్తూనే ఉంటుంది.

– నవీన్ పట్నాయక్, ఒడిశా ముఖ్యమంత్రి

అదే 'జీ'వితమా?



జీ (జె.ఇ.ఇ.) ఫలితాలు వెలువడి, తన ఐఐటీ కలను నిజం చేసుకోలేకపోయిన మరొక కోటా(రాజస్థాన్) హాస్టల్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. మంచి భవిష్యత్తు ఉన్న ఎంతోమంది యువకులు ఇలా నిస్పృహ చెందటం హృదయ విదారకం. తమ పిల్లలను ఇక్కడకు పంపే ముందే తల్లితండ్రులు వారికి మంచి మాటలు చెప్పి, మానసిక స్థైర్యం ఇవ్వడం అవసరం.

– గార్గీ రావత్, న్యూస్ యాంకర్

అన్నదాత పైనా?



రైతులు దేశం కోసం పంట నాట్లు వేస్తారు : కానీ దేశ ప్రధాని రైతుల కోసం మేకులు నాటించి, ముళ్ల కంచెలు వేయిస్తున్నారు! తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం వేలాదిగా రైతులు ఢిల్లీ వరకు రాక తప్పని దుస్థితిని కల్పించడమే కాక, వారిని బాష్పవాయు గోళాలతో చెదరగొట్టించారు.

– ఐశ్వర్యా చౌధరి, సామాజిక కార్యకర్త

రుజువైంది కదా!



అమెరికా గూఢచార సంస్థ 'సీఐఏ'కు లడ్డూలా దొరికిన ఖలిస్తాన్ తీవ్రవాది గుర్పత్‌వంత్ సింగ్ పన్నూ ఫిబ్రవరి 13న ఢిల్లీలో రైతు నిరసనలను చూపించే ఒక వీడియోను అమెరికా నుంచి విడుదల చేశారు. రైతుల ప్రదర్శనల వెనుక కాంగ్రెస్, కేజ్రీవాల్ వంటి భారత వ్యతిరేక శక్తులు ఉన్నాయని చెప్పటానికి ఇంతకంటే రుజువు అక్కర్లేదు.

– సంజయ్ రాణా, పొలిటికల్ ఎనలిస్ట్

అట్నుంచి రండి



నిజంగా మీరు స్టార్టప్‌ని ప్రారంభించాలనుకుంటే, మొదట వాస్తవ ప్రపంచంలోకి వెళ్లి ప్రజల కోసం ఏదో ఒక పని చేయడం మొదలు పెట్టండి. అక్కడ కొంత డబ్బు సంపాదించిన తర్వాత మీ వ్యాపారాన్ని నిర్మించుకోండి.

– నిక్ హ్యాబర్, ఆంట్రప్రెన్యూర్

ఇన్ బాక్స్

యాంగ్రీ సెక్యులరిస్టు కథకుడు

మరాఠీ రచయిత హమీద్ దల్వాయి 1932–77 మధ్య 44 ఏళ్లు మాత్రమే బతికాడు. జ్యోతి బా ఫూలే స్ఫూర్తితో 'ముస్లిం సత్య శోధక్ మండలి' స్థాపించాడు. ఆయన 1950 ప్రాంతంలో ప్రతిపాదించిన ట్రిపుల్ తలాక్ రద్దు, మత విద్యకు బదులు ప్రగతిశీల విద్య, ఉమ్మడి పౌర స్మృతి వంటివి ఇప్పుడు రాజకీయాల్లో ప్రచార అస్త్రాలుగా మారాయంటే ఆశ్చర్యం కలుగుతుంది.

నిజానికి ముస్లిముల్లో హమీద్‌కు 'హిందూ వాది' అని పేరుంది. రాజా రామ్మోహన్ రాయ్ వంటి వాళ్ల పుణ్యమాని హిందూ మతం అనేక మూఢనమ్మకాలను వదులుకుని ముందుకు వెళ్తోంది. ముస్లిం సమాజం కూడా అలా ముందుకు వెళ్లాలనేది హమీద్ ఆలోచన. 'ముస్లిం పాలిటిక్స్ ఇన్ సెక్యులర్ ఇండియా' (1968) పుస్తకం రాశాడు. ముస్లిములు తమను తాము మరింత ఉదారంగా మార్చుకోవడం ద్వారా మాత్రమే ఈ దేశంలో హిందూ అతివాదాన్ని ఎదుర్కోవచ్చు అని ప్రతిపాదించాడు. అలా అని హిందూమత వాదులను వెనకేసుకుని వచ్చాడా... అంటే లేదు. గోవధ నిషేధ ఆలోచనను వ్యతిరేకించాడు. ఆర్ఎస్ఎస్ నేత గోల్వాల్కర్ గురూజీ చనిపోయినప్పుడు (1973) సంతాప సభకు వెళ్లి, మనుస్మృతికి వ్యతిరేకంగా మాట్లాడి వచ్చాడని 'హమీద్ ది అన్‌సంగ్ హ్యూమనిస్ట్' (2020) డాక్యుమెంటరీ చెబుతోంది.



హమీద్ దల్వాయి

'నిన్ను నీవు ముస్లింగా అంగీకరిస్తావా?' అని విలేఖరి అడిగిన ప్రశ్నకు, 'తప్పకుండా అంగీకరిస్తాను. నెహ్రూ ఏ విధంగా నాస్తికుడైనప్పటికీ హిందువు అవుతాడో, నేను కూడా నమాజు, ఉపవాస దీక్షలు పాటించనప్పటికీ పుట్టుకతో ముస్లిం అవుతాను' అంటాడు. 'కులాంతర, మతాంతర వివాహాలకు సమాజంలో ఆంక్షలు ఉండకూడదు' అంటాడు. 'దేశంలో జరుగుతున్న మత హింసకు ఎవరిది బాధ్యత?' అని అడిగితే 'హిందువులు, ముస్లిములు ఇద్దరిదీ' అంటాడు. వాజ్‌పేయి ఏకంగా 'హమీద్ దల్వాయి వంటి సంఘ సంస్కర్త ఒకరు హిందువులకు కూడా కావాలి' అన్నాడంటే ఆయన ప్రభావం ఎంతగా ఉండిందో అర్థం చేసుకోవచ్చు.

రామచంద్ర గుహ 'మేకర్స్ ఆఫ్ మోడర్న్ ఇండియా' (2010) పుస్తకంలో హమీద్ 'భారతదేశపు చిట్టచివరి సంఘ సంస్కర్త' అన్నాడు. హమీద్‌కు 'ది యాంగ్రీ యంగ్ సెక్యులరిస్టు' అని పేరు. ఉర్దూ భాషను మతపరం చేయడాన్ని ఆయన నిరసించాడు. సమకాలీకులంతా ఉర్దూలో సాహిత్య సృజన చేస్తుంటే మరాఠీలోనే రచనలు చేశాడు. 'హమీద్ దల్వాయి కథలు' పుస్తకాన్ని తెలుగులోకి ఓల్గా అనువదిస్తే, ఎలమీ ప్రచురణల వారు ప్రచురించారు. జర్నలిస్టు, యాక్టివిస్టు, మానవతావాది, సంఘ సంస్కర్తే కాకుండా కథకుడుగా కూడా హమీద్ గట్టివాడు. 1950 నాటి వాతావరణ పరిస్థితులను కళ్లకు కట్టినట్టు రాశాడు. వ్యక్తిగతంగా రచయితలు ఏ సిద్ధాంతాన్ని నమ్మినప్పటికీ సృజన దగ్గరికి వచ్చేసరికి ఎంత నిర్మమకారంగా ఉండాలో ఈ కథలు చెబుతాయి.

– వేంపల్లె షరీఫ్ । జర్నలిస్టు, కథా రచయిత

(నేడు హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో 'హమీద్ దల్వాయి కథలు' ఆవిష్కరణ)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

అదరహో రంగస్థల మహోత్సవ్

కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా' (ఎన్ఎస్‌డీ, న్యూఢిల్లీ) వారు దేశవ్యాప్తంగా 'భారత్ రంగస్థల మహోత్సవ్' జరుపుతున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 1 – 21 తేదీల మధ్య వంద అంతర్జాతీయ బహుభాషా నాటకాలను 15 నగరాల్లో ప్రదర్శిస్తున్నారు. విజయవాడలోనూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సహకారంతో ఫిబ్రవరి 6 నుంచి 11 వరకూ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నాటకోత్సవాలను జయప్రదంగా నిర్వహించారు. నాటకాభిమానులు రోజూ పెద్ద సంఖ్యలో విచ్చేసి నాటకాల్ని ఆనందించారు. ఆ యా సమాజాల ప్రెజెంటేషన్, స్టేజీ, లైటింగ్, మ్యూజిక్ తదితరాలు ప్రేక్షకుల్ని మంత్ర ముగ్ధుల్ని చేశాయంటే ఈషణ్మాత్రం అతిశయోక్తి కాదు. కళాకారులు, తెర వెనుక సిబ్బంది అత్యద్భుత సమన్వయంతో ప్రదర్శనలు ఆసాంతం రక్తిగట్టాయి. గంటన్నర పైగా సాగిన ప్రతి ప్రదర్శన అనంతరం ప్రేక్షకుల సందేహ నివృత్తికి దర్శకుడి లేదా ప్రధాన పాత్రధారి ఇంటరాక్షన్ ఆసక్తిగా, ఉపయుక్తంగా సాగింది.

మొదటి రోజు... ఎన్ఎస్‌డీ రిపర్టరీ కంపెనీ వారు 'మాయీ రీ మై కాసే కహూ' హిందీ నాటకాన్ని ప్రదర్శించారు. మహిళ తన భావోద్వేగాలు, కోరికలు, సామాజిక కట్టుబాట్ల మధ్య పడే అంతర్మథనమే ఇతివృత్తం. విజయదాన్ దేతా రచన 'దువిధ' కథ ఆధారంగా రూపొందిన ఈ నాటకాన్ని అజయ్ కుమార్ దర్శక ప్రతిభతో కళాకారులు వీధినాటకం ప్రక్రియలో రక్తిగట్టించారు.

రెండో రోజు... శివానంద రచన, దర్శకత్వంలో శ్రీ ఇడగుంజీ మహాగణపతి యక్షగాన మండలి, కెరెమనె, కర్ణాటక వారు 'గదా యుద్ధ' నాటకాన్ని యక్షగాన రూపంలో అద్భుతంగా పండించారు. కురుక్షేత్ర యుద్ధానంతరం ద్వైపాయన సరస్సులో దాక్కున్న దుర్యోధనుడిని కవ్వించి, వెలికి రప్పించి, గదా యుద్ధంలో భీముడు వధించడం ప్రధాన ఇతివృత్తం.

మూడో రోజు... మోనోలిత్ థియేటర్ గ్రూప్, మహారాష్ట్ర వారు 'ఎండ్ గేమ్' ఆంగ్ల నాటకాన్ని ప్రదర్శించారు. నలుగురే నటులు. ఇద్దరు సమాధుల్లో ఉంటారు; మిగిలినవారిలో ఒకరు కుంటి, మరొకరు గుడ్డి. ప్రపంచ యుద్ధానంతరం సర్వం కోల్పోయిన నేపథ్యంలో మరణం తప్ప మరింక దేనికీ ఎదురుచూడని ఓ కుటుంబ నిస్సహాయ స్థితిని చాటిన ఈ అసంబద్ధ (అబ్సర్డ్) విషాద ఏకాంక నాటకాన్ని నోబెల్ బహుమతి గ్రహీత శామ్యూల్ బెకెట్ రచించారు. డైరెక్టర్ సోనూ పిలానియా.





'గదా యుద్ధ', 'ఎండ్ గేమ్' నాటకాలలోని దృశ్యాలు

నాలుగో రోజు... బోతలా పెర్ఫార్మెన్స్ స్పేస్, బంగ్లాదేశ్ వారు మహమ్మద్ అలీ దర్శకత్వంలో ప్రదర్శించిన 'ఖోనా' ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. కప్పల పెళ్లి, రైతు – నాగలి, కోలాటం ఇత్యాది సన్నివేశాలు మన నాటకాల్లోని సన్నివేశాలతో పోలి రసస్ఫూర్తిని కలిగించాయి. కళాకారులు పాత్రల్లో ఒదిగిపోయి రక్తి కట్టించారు.

ఐదో రోజు... రంగ్ విదూషక్, భోపాల్, మధ్యప్రదేశ్ వారు 'కహాన్ కబీర్' హిందీ నాటకాన్ని ప్రదర్శించారు. కబీర్ శ్లోకాల ఆధారంగా రూపొందిన ఈ నాటకంలో కబీర్‌ను సాధువుగా కాక సాంఘిక దురాచారాలను నిరసించిన అభ్యుదయ, చైతన్యమూర్తిగా చూస్తాం. సువిశాల రంగస్థలాన్ని ఆద్యంతం సమతూకంగా వినియోగించుకోవడంలో బన్సీ కౌల్ దర్శకత్వ ప్రతిభను ప్రశంసించి తీరాల్సిందే.

ఆఖరి రోజు... ఇండియన్ థియేటర్ ఫౌండేషన్, మైసూర్, కర్ణాటక వారి 'అయోధ్య కాండ' కన్నడ నాటకం రచయిత ప్రసన్న స్వీయ దర్శకత్వంలో హృద్యంగా ప్రదర్శితమైంది. రంగస్థలంపై ఏ విధమైన సెట్స్, పరికరాలు లేవు. మధ్యలో చిన్న స్టూల్ మాత్రం ఉంచారు. నటనలో పర్ఫెక్షన్ కనబడింది. ముఖ్యంగా మంథర, దశరథ మహారాజు, కైకేయి పాత్రధారుల్ని ప్రత్యేకంగా ప్రస్తావించాలి. రామాయణం ద్వారా నాగరికతను పునఃప్రతిష్ఠిద్దామని ప్రతిపాదించడాన్ని ఇందులో చూస్తాం. ముగింపు ఉత్సవంలో ప్రదర్శనలిచ్చిన వారితో పాటు స్థానిక సీనియర్ కళాకారుల్ని సైతం ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ వారు సన్మానించారు. మొత్తమ్మీద ఆరు రోజులూ విభిన్నంగా ప్రదర్శించిన నాటకాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

– జీ.వి. రంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్

తపః కాలం

క్రీస్తు పుట్టిందానికీ, బోధలకూ, అద్భుతాలకూ ఎంతటి ప్రత్యేకత ఉందో, మరణించి తిరిగి లేచిందానికీ మరంతటి ప్రాధాన్యం ఉంది. ఈ రెండు సంఘటనలూ, ఆయన ఔన్నత్యాన్ని చాటేవి. కానీ ఆయన లోంచి మానవునికి అందే సందేశ సందర్భం మరొకటి విశేషంగా కనిపిస్తోంది. అది ఆయన మరణ ఘడియలకు సంబంధించింది. క్రైస్తవులు క్రీస్తు మరణానికి దారితీసిన పరిస్థితుల్ని స్మరించుకొంటారు. అలా చేయడం వల్ల మానవ ప్రవర్తన మారడానికి కారణమవుతుంది. 'ప్రభువు నా కోసం మరణించాడా? ఎందుకు?' అనే చింతన మొదలై, సాటి మానవుల్ని హింసించకుండా ప్రేమతో ప్రవర్తించాలన్న సామాజిక నైతిక ప్రవర్తన అలవడుతుంది.



ఈ శ్రమ లను 'భస్మ బుధవారం' నుంచి ప్రారంభిస్తారు. చేసిన పాపాలకు పశ్చాత్తాపపడటం, గత దోషాలు సరిదిద్దుకోవటం, ఇకపై చేయనని దేవుని దగ్గర మాట తీసుకోవటం ... ఇందులోని ప్రధానాంశాలు.

భస్మ బుధవారం నుంచే ఉపవాస ఘడియలూ ప్రారంభమవుతాయి. వీటిని 'శ్రమ దినాల'ని అంటారు. వీటిని 44 రోజుల పాటు పాటిస్తారు. మానవ దేహంలో వెలిగే జ్యోతి ఆరిపోతే ఆ దేహం శూన్యమై పోతుందనీ, భస్మమై మిగిలి పోతుందనీ, ఇంత ప్రక్రియ జరిగే ఈ 'భస్మం' ఓసారి స్మరించబడాలనీ 'భస్మ బుధవారా'న్ని పాటిస్తారు. పుట్టిన ప్రతీ వ్యక్తీ భౌతికంగా మృత్యు ముఖం చూడాల్సిందే. అందుకే తాను బ్రతికున్న సమయంలోనే నిత్యజీవనానికి సోపానాలు నిర్మించుకోవాలి. ఈ నేపథ్యంలో క్రైస్తవ సంస్కృతి ప్రభు శ్రమల్ని స్మరించుకుంటోంది. 'మన కోసం మరణించిన క్రీస్తుకు మనం ఏం చేస్తున్నాం?' అని ప్రశ్నించుకొంటోంది. ఆయన మరణం ముందు మన సమస్యలు గానీ, తగిలిన ఎదురుదెబ్బలు గానీ పెద్ద లెక్క కాదనే అంశాన్ని గుర్తెరిగి, 'శ్రమదినా'ల్ని పాటిస్తారు. ఇవి 'గుడ్ ఫ్రైడే'(క్రీస్తు మరణం) వరకూ కొనసాగుతాయి. క్రీస్తు కోసం పంచేంద్రియ సుఖ సౌఖ్యాలకు ఈ కాలంలో దూరంగా ఉండాలి. అందుకే ఈ శ్రమ దినాల్నే రోమన్ కతోలికులు తపఃకాలం అంటారు.

– డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు

(నేడు భస్మ బుధవారం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.పంచమి సా.6.17 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** రేవతి సా.4.38 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ప.2.21 నుండి 3.50 వరకు, **అమృత ఘడియలు:** ఉ.11.10 నుండి 12.41 వరకు, మదనపంచమి, శ్రీపంచమి ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.32, **సూర్యాస్తమయం:** 5.57.

జేఈఈ మెయిన్‌లో...
మెరిసిన తెలుగు తేజాలు

- టాప్–23లో ముగ్గురు ఏపీ విద్యార్థులు
- మెయిన్ తొలి విడత ఫలితాలు వెల్లడించిన ఎన్‌టీఏ

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన తొలి విడత ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్–1)లో తెలుగు విద్యార్థులు ఈ ఏడాది కూడా సత్తా చాటారు. జేఈఈ మెయిన్–1 ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) మంగళవారం వెల్లడించింది. ఏపీకి చెందిన షేక్ సూరజ్, తెలంగాణకు చెందిన రిషి శేఖర్ శుక్లా సహా పదిమంది 100శాతం స్కోర్‌ను సాధించారు. వీరిలో ముగ్గురు ఏపీ విద్యార్థులు కాగా, తెలంగాణ నుంచి ఏడుగురు ఉన్నారు. మొత్తంమ్మీద టాప్–23లో పది మంది తెలుగు విద్యార్థులు చోటు దక్కించుకోవడం విశేషం. హరియాణాకు చెందిన ఆరవ్ భట్ దేశంలో టాపర్‌గా నిలిచారు. దేశవ్యాప్తంగా 291 నగరాల్లో 544 కేంద్రాల్లో జేఈఈ మెయిన్ పరీక్షను జనవరి 27, 29, 30, 31, ఫిబ్రవరి 1 తేదీల్లో నిర్వహించారు. తొలి దశలో కేవలం స్కోరు మాత్రమే ప్రకటించారు. రెండో దశ పరీక్షను ఏప్రిల్‌లో నిర్వహించనున్నారు.

300కు 300 మార్కులు

జేఈఈ మెయిన్ 300 మార్కులకు 300 మార్కులు సాధించిన మొదటి 23 మంది వివరాలను ఎన్టీఏ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షేక్ సూరజ్, తోట సాయి కార్తీక్, అన్నారెడ్డి వెంకట తనీష్‌రెడ్డి వంద శాతం మార్కులు సాధించారు. తెలంగాణ నుంచి రిషి శేఖర్ శుక్లా, రోహన్ సాయి పబ్బా, ముత్తవరపు అనూప్, హందేకర్ విదిత్, వెంకట సాయితేజ మాదినేని, శ్రీయషాస్ మోహన్ కల్లూరి, తవ్వా దినేష్ రెడ్డి కూడా 100% మార్కులు పొందారు. పురుషుల కేటగిరీలోనూ పదిమంది తెలుగు విద్యార్థులే టాపర్లుగా నిలిచారు.

జేఈఈ మెయిన్‌లో సత్తాచాటిన 'ఆదిత్య'

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఈఈ మెయిన్–2024 ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి మంగళవారం తెలిపారు. తమ విద్యార్థులు 62 మంది 99.00 పర్సంటైల్‌కు పైగా సాధించారని చెప్పారు. బి.రఘురామ సహన్ 99.95, జి.జగదీష్ వెంకట సీతారామ్ 99.95, ఏహెచ్ సత్య నిహాంత్ 99.94, ఎ.చరణ్ ఉమేష్ 99.94 పర్సంటైల్ సాధించారని వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి దీపక్‌రెడ్డి, హాస్టల్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ, కో–ఆర్డినేటర్ కె.లక్ష్మీకుమార్ అభినందించారు.

శశి వేలివెన్ను విద్యార్థుల ప్రభంజనం

ఉండ్రాజవరం: జేఈఈ మెయిన్–2024 ఫలితాల్లో తమ విద్యార్థులు మరోసారి జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించారని శశి విద్యా సంస్థల ఫౌండర్ చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వేలివెన్ను శశి చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ మంగళవారం తెలిపారు. ఎస్.దిలీప్‌వెంకటసతీష్ 99.94, జె.శ్రీహర్షిత్ 99.92, సీహెచ్ పురంధర్‌సత్య 99.91, ఎస్.నాగేశ్వర విశ్వాంత్ 99.89, జె.వెంకట హర్షవర్ధన్ 99.76 పర్సంటైల్ సాధించారని పేర్కొన్నారు. వీరితోపాటు 99 పర్సంటైల్ పైన 40 మంది, 98 పర్సంటైల్ పైన 22 మంది, 95 పర్సంటైల్ పైన 130 మంది, 97 పర్సటైల్ పైన 36 మంది, 95 పర్సంటైల్ పైన 53 మంది, 90 పర్సంటైల్ పైన 221 మంది సాధించారని వివరించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని శశి విద్యా సంస్థల వైస్ చైర్‌పర్సన్ బూరుగుపల్లి లక్ష్మీసుప్రియ, అకడమిక్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధ అభినందించారు.

తిరుమల విద్యార్థుల జయకేతనం

రాజమహేంద్రవరం రూరల్: జేఈఈ మెయిన్ ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. యు.సుధీర్, ఎన్.యశ్వంత్, ఎంజీవీ మహేష్ 99.99 సాధించారని, 99.90పైన 14 మంది, 99.0 పైన 158 మంది, 98పైన 282 మంది, 95పైన 606 మంది, 90పైన 1,022 మంది సాధించారని వెల్లడించారు. అత్యుత్తమ స్కోర్‌లు సాధించిన విద్యార్థులను తిరుమలరావు, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి అభినందించారు.

భళా భాష్యం విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్ ఫలితాల్లో భాష్యం ఐఐటీ–జేఈఈ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ తెలిపారు. తమ విద్యార్థులు ఎం.జిష్ణుసాయి, కె.మనీష్ చౌదరి 99.99 పర్సంటైల్‌తో ఓపెన్ కేటగిరీలో టాపర్లుగా నిలిచినట్లు వివరించారు. అదే విధంగా 99.9 పర్సంటైల్ పైన 21 మంది, 99.7 పైన 47 మంది, 99.5 పైన 62 మంది, 99 పర్సంటైల్ పైన 110 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. విద్యార్థులను భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు అభినందించారు.

టాప్ టెన్‌లో ఫిట్జి విద్యార్థులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): జేఈఈ మెయిన్‌లో విజయవాడలోని ఫిట్జి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనపరిచినట్లు ఆ విద్యాసంస్థల డైరెక్టర్ పి.రమేష్‌బాబు తెలిపారు. విజయవాడలోని ఫిట్జి కళాశాలలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ జేఈఈ మెయిన్ ఫలితాల్లో విజయవాడకు చెందిన తమ విద్యార్థి తోట సాయి కార్తీక్ 100/100శాతం స్కోరు సాధించి దేశంలోనే టాప్‌లో నిలిచాడని చెప్పారు. గణితంలో మరో ఐదుగురు, ఫిజిక్స్‌లో నలుగురు, కెమిస్ట్రీలో ముగ్గురు విద్యార్థులు 100శాతం స్కోర్ సాధించినట్లు వివరించారు. విద్యార్థులతోపాటు అధ్యాపక బృందానికి, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

'శ్రీ శ్రీనివాస గ్రావిటీ'ప్రతిభ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జేఈఈ మెయిన్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని శ్రీ శ్రీనివాస గ్రావిటీ కళాశాల చైర్మన్ పరుచూరి శ్రీనివాస్ తెలిపారు. విజయవాడ మొగల్రాజపురంలోని కళాశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు అన్నే భరత్ 99.7, శివరామకృష్ణ 99.3, కె.నూతనశ్రీ 97.5 పర్సంటైల్ సాధించారని చెప్పారు. మరో 20 మందికి పైగా విద్యార్థులు 90 పర్సంటైల్ సాధించారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

శ్రీ చైతన్య విజయదుందుబి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జేఈఈ మెయిన్ ఫలితాల్లో తమ విద్యార్థులు విజయదుందుబి మోగించారని శ్రీ చైతన్య ఐఐటీ అకాడమీ ఎగ్జిక్యూటివ్ డీన్ కె.శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ ఏజీఎంఎం మురళీకృష్ణ చెప్పారు. చైతన్య కళాశాలలో మంగళవారం విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ జేఈఈ మెయిన్–2024 సెషన్–1 ఫలితాల్లో తమ విద్యార్థి అన్నారెడ్డి వెంకట తనీష్‌రెడ్డి 300 మార్కులకు 300 మార్కులు సాధించారని చెప్పారు. సబ్జెక్టుల వారీగా గణితంలో 14 మంది, ఫిజిక్స్‌లో 12, కెమిస్ట్రీలో 22 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ సాధించారని తెలిపారు. మొత్తంగా విజయవాడ క్యాంపస్ నుంచి 99 పర్సంటైల్ పైన సాధించిన వారు 28 మంది విద్యార్థులు ఉన్నారని వివరించారు. అకాడమీ ఎగ్జిక్యూటివ్ డీన్స్ మురళీరావు, కృష్ణారెడ్డి, శరత్ పాల్గొన్నారు.

'విజ్ఞాన్' విజయపరంపర

చేబ్రోలు: జేఈఈ మెయిన్‌లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు విజ్ఞాన్ విద్యాసంస్థల సమన్వయకర్త జి.శ్రీకూర్మనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా వడ్లమూడిలోని విజ్ఞాన్ జూనియర్ కాలేజీలో, గుంటూరులోని విజ్ఞాన్ మహిళా జూనియర్ కళాశాలలో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. తమ విద్యార్థులు ఐ.హనీత్(99.67), ఎం.స్నేహ (99.46), రోహన్(98.48), కె.లీలావతి(98.30), బి.యోగ విజయ్ కుమార్(98.07), ఎస్.వెంకట గాయత్రి(96.32), ఎ.దీపిక(95.78), టి.సంజయ్ తేజ(94.71), పి.గౌతమ్(94.61), ఎం.నాగసాయి ప్రకాష్ (93.66), వి.అభిరామ్(93.57), నాగ మానస(93.56), ఎ.చంద్రిక (93.07), ఎ.థాఫిల్(93.50), జి.వైశాలి (92.76), సి.రేవంత్(92.11), జి.పుల్లారెడ్డి(92.05), వి.నందిని(91.60), వై.నాగకార్తికేయ(90.96) ప్రతిభ కనబరిచినట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ జె.మోహనరావు, వై.వెంకటేశ్వరరావు వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు విజ్ఞాన్ చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ శ్రీకృష్ణదేవరాయలు, అధ్యాపక సిబ్బంది అభినందనలు తెలిపారు.

ప్రతివాదులుగా ఎల్లో మీడియా ప్రతినిధులు

హైకోర్టు జడ్జిలు, ఏసీబీ న్యాయాధికారిపై అసభ్య, అభ్యంతరకర పోస్టుల్ని తొలగించండి

- ఆన్‌లైన్ సామాజిక మాధ్యమ సంస్థలకు హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ మార్చి 26కి వాయిదా



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో టీడీపీ అధినేత చంద్రబాబుకు రిమాండ్ విధించడంతోపాటు కేసు కొట్టేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చుతూ తీర్పునిచ్చినందుకు ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులతోపాటు ఏసీబీ కోర్టు జడ్జిని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో అసభ్య పోస్టింగ్‌లు, కామెంట్లు పెట్టడంపై దాఖలైన క్రిమినల్ కోర్టు ధిక్కార వ్యాజ్యంలో ఎల్లో మీడియా చానల్స్ టీవీ 5, మహాన్యూస్, మైరా మీడియా సంస్థలను హైకోర్టు ప్రతివాదులుగా చేర్చింది. హైకోర్టు న్యాయమూర్తులు, ఏసీబీ కోర్టు న్యాయాధికారిపై యూట్యూబ్‌లో ఉంచిన అసభ్యకర, అభ్యంతరకర పోస్టులను తొలగించాలని గూగుల్ ఎల్ఎల్‌సీని ఆదేశించింది. కాగా.. తమ మాధ్యమాల్లో ఉంచిన అసభ్యకర, అభ్యంతరకర పోస్టులను ఇప్పటికే తొలగించామని ప్రముఖ ఆన్‌లైన్ సామాజిక మాధ్యమ సంస్థలైన ఎక్స్, ఫేస్‌బుక్ హైకోర్టుకు నివేదించాయి. ఈ వివరాలను హైకోర్టు రికార్డ్ చేసింది. ఈ కోర్టు ధిక్కార వ్యాజ్యంలో పలువురికి ఇంకా నోటీసులు అందచేయాల్సి ఉందని, అందువల్ల నోటీసులు అందజేసేందుకు మరికొంత గడువు ఇవ్వాలని అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ హైకోర్టును అభ్యర్థించారు. ఇందుకు అంగీకరించిన హైకోర్టు తదుపరి విచారణను మార్చి 26వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పచ్చ సైన్యం అసభ్య, అభ్యంతరకర పోస్టులు

స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటులో రూ.వందలాది కోట్ల ప్రజాధనాన్ని స్వాహా చేసినందుకు చంద్రబాబుతో పాటు పలువురిపై సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో చంద్రబాబును అరెస్ట్ చేయగా.. ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. ఆ తరువాత తనపై సీఐడీ నమోదు చేసిన కేసును కొట్టేయడంతో పాటు రిమాండ్ ఉత్తర్వులను సైతం కొట్టేయాలంటూ చంద్రబాబు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి క్వాష్ పిటిషన్‌ను కొట్టేశారు. ఈ నేపథ్యంలో ఏసీబీ కోర్టు న్యాయాధికారితో పాటు జస్టిస్ శ్రీనివాసరెడ్డి, మరో న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డిని లక్ష్యం చేసుకుంటూ సోషల్ మీడియాలో అసభ్య, అభ్యంతరకర పోస్టులు, కామెంట్లు వెల్లువెత్తాయి. కులం పేరుతో కూడా వారిని దూషించారు. ఈ విషయాన్ని న్యాయవాది వసంత్ కుమార్ లిఖితపూర్వకంగా అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే హైకోర్టు న్యాయవాది ఎం.సుజాత సైతం ఇదే విషయంపై ఏజీకి లేఖ రాశారు. నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు చేసిన వ్యాఖ్యలను సైతం ఆ లేఖలకు జత చేశారు. న్యాయవ్యవస్థ ప్రతిష్టను దిగజార్చేలా సోషల్ మీడియాలో పోస్టులు, కామెంట్లు, విమర్శలు చేసిన వారిపై క్రిమినల్ ధిక్కార పిటిషన్ దాఖలు చేసేందుకు అనుమతి కోరారు.

ఆ పోస్టులను తొలగించలేదు

తాజాగా మంగళవారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు వచ్చింది. అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. న్యాయమూర్తులు, న్యాయాధికారిపై పోస్టులకు సంబంధించిన యూఆర్ఎల్‌ను యూట్యూబ్ ఇప్పటికీ తొలగించలేదని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. వాస్తవానికి కోర్టు ధిక్కార వ్యాజ్యాన్ని హైకోర్టు విచారణకు స్వీకరించిన వెంటనే సామాజిక మాధ్యమ సంస్థలు తమ ఆన్‌లైన్ వేదికలపై ఉన్న పోస్టులన్నింటినీ తొలగించాల్సి ఉంటుందని, ఆ సంస్థ ఆ పని చేయలేదని తెలిపారు. యూట్యూబ్ తరఫున సీనియర్ న్యాయవాది సజన్ పూవయ్య వాదనలు వినిపిస్తూ.. కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పుడు లేదా కేంద్రం నియమించిన అధీకృత అధికారి ఆదేశాలు ఇచ్చినప్పుడు మాత్రమే తాము ఆ పోస్టులను తొలగిస్తామన్నారు. కోర్టు ఆదేశిస్తే తొలగించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం అసభ్య, అభ్యంతరకర పోస్టులను తొలగించాలని గూగుల్‌ను ఆదేశించింది. ఎల్లో మీడియా చానళ్లను ప్రతివాదులుగా చేర్చింది. తదుపరి విచారణను మార్చి 26వ తేదీకి వాయిదా వేసింది.

టీడీపీ నేతలకు గతంలోనే నోటీసులు

ఈ లేఖలను వాటితో పాటు జత చేసిన సోషల్ మీడియా తాలూకు కామెంట్లు, పోస్టింగ్‌లు, విమర్శలు, దూషణలను పరిశీలించిన అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ స్వయంగా కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో న్యాయమూర్తులు, న్యాయాధికారిపై కామెంట్లు చేసిన వారందరినీ ప్రతివాదులుగా చేర్చారు. టీడీపీ నాయకులు బుద్దా వెంకన్న, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, సస్పెన్షన్‌లో ఉన్న న్యాయాధికారి ఎస్.రామకృష్ణ, ముప్పా తారకకృష్ణ యాదవ్, రవికుమార్ ముదిరాజ్, రుమాల రమేష్, యల్లారావు, కళ్యాణి, ఎన్.చిరంజీవి, చైతన్య కుమార్‌రెడ్డి, ఆనంద్, కిషోర్‌కుమార్ తదితరులను ప్రతివాదులుగా చేర్చారు. ఈ వ్యాజ్యంపై ఇప్పటికే విచారణ జరిపిన హైకోర్టు టీడీపీ నేతలతో సహా గూగుల్ ఇండియా, ట్విట్టర్ కమ్యూనికేషన్స్, ఫేస్‌బుక్ ఇండియాలతో కలిపి మొత్తం 27 మందికి నోటీసులు ఇచ్చింది. అసభ్యకర, అభ్యంతరకర పోస్టులు, కామెంట్లు పెట్టినందుకు ఎందుకు ధిక్కార చర్యలు తీసుకోరాదో వివరించాలని వీరందరినీ ఆదేశించిన సంగతి తెలిసిందే.

టోఫెల్ బాధ్యత డీఈవోలదే

- 3, 9 తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్ నైపుణ్యాలపై దృష్టి పెట్టాలి
- పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రపంచ స్థాయి పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన టోఫెల్ తరగతులు ప్రతి పాఠశాలలోను తప్పనిసరిగా నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ డీఈవోలు, ఆర్జేడీలను ఆదేశించారు. పిల్లల్లో ప్రాథమిక స్థాయి నుంచే స్పోకెన్ ఇంగ్లిష్ నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. ఈ మేరకు అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా టోఫెల్ సర్టిఫికేషన్ కోసం ఈటీఎస్, ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ, ఎస్సీఈఆర్టీ, రాష్ట్ర విద్యాశాఖ మధ్య జరిగే సంయుక్త మూల్యాంకన (రెడీనెస్ సర్టిఫికేషన్) అంశాలను మంగళవారం ఓ ప్రకటనలో వివరించారు. 3 నుంచి 9వ తరగతుల విద్యార్థులకు రోజువారీ టోఫెల్ తరగతులను నిర్వహించడం, వినడం, మాట్లాడే నైపుణ్యాలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలని డీఈవోలకు సూచించారు. ఇప్పటికే నిర్ణయించిన షెడ్యూల్ మేరకు 3, 4, 5 తరగతులకు ఏప్రిల్ 10న, 6 నుంచి 9వ తరగతి వరకు ఏప్రిల్ 12న మూల్యాంకనం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఇప్పటికే ఎస్సీఈఆర్టీ ఆడియో, విజువల్ కంటెంట్‌ను అందించిందని, విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ఈ కంటెంట్ ఉపయోగపడుతుందన్నారు. కొన్ని పాఠశాలల్లో రోజువారీ టోఫెల్ తరగతులు నిర్వహించడం లేదన్న అంశాన్ని తాను గమనించానని ప్రవీణ్ ప్రకాశ్ అన్నారు. ఈ పరిస్థితి ఎక్కడా పునరావృతం కారాదని, ప్రతి పాఠశాలలో ప్రతి తరగతిలో తప్పనిసరిగా టోఫెల్ తరగతులు నిర్వహించేలా డీఈవోలు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. టోఫెల్ తరగతుల నిర్వహణలో విఫలమైతే డీఈవోలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఉన్నత విద్యలో మరో చరిత్ర

ఎడెక్స్ ద్వారా అంతర్జాతీయ వర్సిటీల సర్టిఫికేషన్ కోర్సులు

సాక్షి, అమరావతి: ప్రపంచవ్యాప్తంగా వేగంగా చోటు చేసుకుంటున్న శాస్త్ర, సాంకేతిక మార్పులకు అనుగుణంగా మన విద్యార్థులను సన్నద్ధం చేస్తూ విద్యా రంగ సంస్కరణలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా మరో కీలక అడుగు వేసింది. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, హార్వర్డ్, ఎంఐటీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి లాంటి అత్యుత్తమ వర్సిటీలు అందించే కోర్సులను విదేశాలకు వెళ్లి చదువుకోలేని పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచితంగా వీటిని అందుబాటులోకి తెస్తోంది. ఈమేరకు ఇప్పటికే ప్రఖ్యాత మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సుల సంస్థ 'ఎడెక్స్'తో ఒప్పందం చేసుకుంది. పాఠ్యప్రణాళిక కోర్సుల్లో విద్యార్థి తనకు నచ్చిన వర్టికల్‌ను చదువుకునే అవకాశం కల్పిస్తోంది. ఈ నెల 16వ తేదీ నుంచి వర్సిటీల్లో ఎడెక్స్ కోర్సులను సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభించేలా కసరత్తు జరుగుతోంది.

ఉచితంగా రూ.30 వేల విలువైన కోర్సు..

ఎడెక్స్ ప్రపంచంలోనే ప్రముఖ ఈ–లెర్నింగ్ ప్లాట్‌ఫారమ్‌గా పేరొందింది. ఇందులో 180కిపైగా వరల్డ్‌క్లాస్ వర్సిటీలు రూపొందించిన వివిధ కోర్సుల్లోని 2 వేలకు పైగా వర్టికల్స్‌ను చదువుకోవచ్చు. ఒక్కో కోర్సు చేయాలంటే సుమారు రూ.30 వేలు ఖర్చు అవుతుంది. ఇంత ఖరీదైన కోర్సులను రాష్ట్ర ప్రభుత్వం 12 లక్షల మందికిపైగా విద్యార్థులు, టీచర్లకు ఉచితంగా అందిస్తోంది. దీనికోసం ఏడాదికి సుమారు రూ.50 కోట్లకు పైగా వెచ్చించనుంది.

అసైన్‌మెంట్స్, ప్రతిభ ఆధారంగా

రాష్ట్రంలోని సాంప్రదాయ వర్సిటీలతో పాటు సాంకేతిక విశ్వవిద్యాలయాలు, వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ లాంటి 20 విశ్వవిద్యాలయాల పరిధిలోని విద్యార్థులకు ఎడెక్స్ కోర్సులను అందిస్తారు. ఉదాహరణకు డిగ్రీ సెమిస్టర్‌లో ఆరు సబ్జెక్టులు ఉంటే ఒకటి ఎడెక్స్ కోర్సుతో భర్తీ చేస్తారు. ఆయా కళాశాలలు, వర్సిటీలు ఎంపిక చేసిన కోర్సును విద్యార్థులు తప్పనిసరిగా చదవాల్సి ఉంటుంది. ఎడెక్స్ సంస్థ సంబంధిత అంతర్జాతీయ వర్సిటీతో కలిసి విద్యార్థి అసైన్‌మెంట్స్, ప్రతిభ ఆధారంగా సర్టిఫికెట్ అందిస్తుంది. రాత పరీక్షను ఎడెక్స్ రూపొందించిన ప్రశ్నాపత్రంతో వర్సిటీలే నిర్వహిస్తాయి. క్రెడిట్స్‌ను కూడా వర్సిటీలే ఇస్తాయి. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఒకటి కంటే ఎక్కువ కోర్సులను కూడా చేయవచ్చు. వాటిని వాల్యూ యాడెడ్ కోర్సులుగా పరిగణించి సర్టిఫికెట్ ఇస్తారు.

ఎడెక్స్ కోర్సు ఇలా..

డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ విద్యార్థులు తప్పనిసరిగా ఎడెక్స్ కోర్సులు అభ్యసించేలా కరిక్యులమ్‌లో భాగం చేశారు. డిగ్రీ, పీజీ స్థాయిలో 2, 4వ సెమిస్టర్, ఇంజనీరింగ్‌లో 2, 4వ, 6వ సెమిస్టర్‌లలో ప్రతి విద్యార్థి వర్సిటీ/కళాశాల ఎంపిక చేసిన ఎడెక్స్ కోర్సును పూర్తి చేయాల్సి ఉంటుంది. విద్యార్థులతో పాటు అధ్యాపకులు కూడా ఎడెక్స్ అందించే అంతర్జాతీయ కోర్సులను అభ్యసించేందుకు అవకాశం ఉంది. తద్వారా వారు నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు మరింత అర్థవంతంగా బోధించేందుకు వీలుంటుంది.

విద్యార్థికి నచ్చిన సమయంలో..

విద్యార్థులు ఎడెక్స్ ఆన్‌లైన్ కోర్సును తమకు అనువైన సమయంలో చదువుకునే వెసులుబాటు ఉంటుంది. వారానికి నాలుగు గంటల పాటు క్లాసులు ఉంటాయి. ప్రతి విద్యార్థి ప్రత్యేక లాగిన్ ద్వారా మొబైల్ యాప్‌లో క్లాసులకు హాజరు కావచ్చు. సందేహాలను నివృత్తి చేసేందుకు ఆన్‌లైన్ సపోర్టింగ్ సిస్టమ్‌లో మెంటార్లు ఉంటారు. తద్వారా విద్యార్థులు స్వయంగా నేర్చుకునే సామర్థ్యాలు పెరుగుతాయి. ఉదాహరణకు బీకామ్ విద్యార్థులు హార్వర్డ్ వర్సిటీ అందించే సీఎస్ 50 ఇంట్రడక్షన్ టు కంప్యూటర్ సైన్స్, కొలంబియా వర్సిటీ నుంచి ఫ్రీ క్యాస్ ఫ్లో అనాలసిస్, మసాచుసెట్స్ వర్సిటీ నుంచి మేథమెటికల్ మెథడ్స్ ఫర్ క్వాంటిటేటివ్ ఫైనల్స్ లాంటి విభిన్న వర్టికల్స్‌ను చదువుకోవచ్చు. ఇలా ఇంజనీరింగ్, బీఏ, బీఎస్సీ, ఫార్మా, ఎంబీఏ, వ్యవసాయం, అనుబంధ రంగాలకు చెందిన విభిన్న, వినూత్న కోర్సులను అభ్యసించవచ్చు. దేశంలో అందుబాటులో లేని విప్లవాత్మక కోర్సులను ఎడెక్స్‌తో ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోంది. తద్వారా వివిధ కోర్సుల్లో స్థానికంగా అందుబాటులో లేని బోధనా సిబ్బంది కొరతను అధిగమించవచ్చు.

మెరుగైన ఉపాధి..

ఎడెక్స్‌తో రెగ్యులర్ కోర్సులు కాకుండా మార్కెట్ ఓరియంటెడ్ విద్య లభిస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా మైనింగ్, డేటా అనలిటిక్స్, వర్చువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, క్వాంటం కంప్యూటింగ్, పైథాన్ లాంటివి ప్రస్తుతం ప్రపంచంలో అభివృద్ధి చెందిన టెక్నాలజీ కోవలో ఉన్నాయి. వీటిని నేర్చుకోవాలంటే బోధనా విధానంతో పాటు అందుబాటులో ఉన్న కంటెంట్‌ను మెరుగుపరచాలి. అత్యున్నత విశ్వవిద్యాలయాలు/సంస్థలకు చెందిన అధ్యాపకులతో మన విద్యార్థులకు బోధించేలా ఎడెక్స్ దోహదం చేస్తుంది. తద్వారా విద్యార్థుల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ప్రొఫెషనల్, సంప్రదాయ డిగ్రీ విద్యలో లోటుపాట్లను గుర్తించి స్కిల్ ఓరియంటెడ్ కోర్సులను అందించడం ద్వారా నైపుణ్యం కలిగిన మానవ వనరులు అందుబాటులోకి వస్తాయి.

టీడీపీలో వ్యతిరేక 'పవనం'

తెలుగుదేశం గ్రూపు విభేదాలే కారణం

సాక్షి ప్రతినిధి, ఏలూరు/సాక్షి అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు టీడీపీ నేతలు షాకిచ్చారు. భీమవరం టీడీపీలో గ్రూపు తగాదాలు, జనసేనపై వ్యతిరేకత నెలకొన్నాయని, ఈ సమస్యలన్నీ సర్దుబాటు చేశాక పవన్ పర్యటిస్తే బాగుంటుందని టీడీపీ ముఖ్యనేతలు సలహా ఇవ్వడంతో పవన్ భీమవరం రద్దు చేసుకున్నట్టు చర్చ జరుగుతోంది.

చాన్నాళ్లుగా తెలుగుదేశంలో స్తబ్దత

జనసేన, టీడీపీ పొత్తులో భాగంగా పవన్‌కళ్యాణ్ భీమవరం నుంచి పోటీ చేస్తారని కొద్ది నెలలుగా జనసేన విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఇది త్యాగం చేయాల్సిన సీటు కావడంతో టీడీపీ శ్రేణులు స్తబ్దుగా ఉండిపోయారు. పార్టీ కార్యక్రమాలను నిర్వహించడం లేదు. బాబు అరెస్టు సమయంలోనూ నామమాత్రంగా దీక్షలు చేపట్టారు. దీనికితోడు స్థానిక నేతల మధ్య నెలకొన్న గ్రూపు విభేదాలూ రోజురోజుకూ ముదురుతున్నాయి. మాజీ ఎంపీ, నియోజకవర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పులవర్తి రామాంజనేయులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మూడు గ్రూపులుగా విడిపోయారు. వీరి మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. ఈ నేపథ్యంలో ఉభయగోదావరి జిల్లాల్లో బుధవారం నుంచి నాలుగురోజుల పాటు పవన్ పర్యటిస్తారని క్యాడర్‌తో, టీడీపీ నేతలతో సమావేశాలు ఇరు పార్టీల సమన్వయ సమావేశాల్లో పాల్గొంటారని, భీమవరంలోనే మూడు రోజులు మకాం ఉండి ఉభయగోదావరి జిల్లాల్లోని నియోజకవర్గాల్లో పర్యటిస్తారని గత వారం జనసేన రాష్ట్ర పార్టీ షెడ్యూల్ ఖరారు చేసింది. దీంతో జనసేన నాయకులు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. టీడీపీ నేతలకు ఆహ్వానాలు పంపారు. అయితే వారి నుంచి స్పందన లేకపోయింది. దీంతో మూడువర్గాల మధ్య పరిస్థితులన్నీ చక్కబడ్డాక పవన్ పర్యటిస్తే బాగుంటుందని, లేకుంటే పరువు రోడ్డున పడుతుందని టీడీపీ నేతలే చెప్పడంతో మంగళవారం ఆకస్మికంగా పవన్ పర్యటన రద్దు చేసుకున్నారు.

హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అనుమతించలేదంటూ

పవన్ కళ్యాణ్ భీమవరం పర్యటన రద్దుపై జనసేన పార్టీ మంగళవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేసింది. హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అధికారులు అనుమతించకపోవడం వల్లే పర్యటనను వాయిదా వేసుకున్నట్టు వెల్లడించింది. అయితే హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అనుమతి లేదనేది కేవలం సాకు మాత్రమే అనే వాదన రాజకీయవర్గాల్లో వినిపిస్తోంది.

'పరిటాల' అనుచరుడి టోకరా

రుణాల ఎగవేతకు స్కెచ్

సాక్షి, పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో టీడీపీ మాజీమంత్రి పరిటాల సునీత ప్రధాన అనుచరుడు బోయపాటి ప్రభాకర్ నాయుడు.. ఆయన తనయుడు బోయపాటి అవినాశ్ మోసాలు వెలుగుచూస్తున్నాయి. 'భారత్ పే' ద్వారా రుణం తీసుకుని కనగానపల్లి మండలం వేపకుంట గ్రామానికి చెందిన పలువురి ఆధార్ కార్డులను జామీను కింద అప్‌లోడ్ చేశారు. అనంతరం బ్యాంకులకు రుణాలు తిరిగి చెల్లించకుండా.. వారి ఫోన్లకు స్పందించకుండా ఉండటంతో బ్యాంకుల నుంచి నేరుగా జామీను వేసిన వారికి ఫోన్లు వస్తున్నాయి. దీంతో బాధితులు బెంబేలెత్తిపోతున్నారు. కొందరు ప్రభాకర్‌ను నిలదీశారు. మరికొందరు అవినాశ్‌కు ఫోన్ చేయగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. బోయపాటి ప్రభాకర్ నాయుడు స్వగ్రామం కనగానపల్లి మండలం వేపకుంట. గ్రామానికి చెందిన పలువురి ఆధార్ వివరాలను భారత్ పేలో అప్‌లోడ్ చేసి రుణాలు తీసుకున్నట్లు సమాచారం. వాటిని తిరిగి చెల్లించకపోవడంతో ఆధార్ కార్డుల్లో నమోదైన మొబైల్ నంబర్లకు బ్యాంకర్లు ఫోన్ చేస్తున్నారు. దీనిపై ప్రభాకర్, అవినాశ్ నోరు విప్పడంలేదు. ఒక్కొక్కరి జామీనుపై రూ.2 లక్షల చొప్పున సుమారు రూ.కోటి వరకు తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మాజీమంత్రి పరిటాల రవీంద్ర రాజకీయ అరంగేట్రం చేసిన నాటి నుంచి వాళ్ల కుటుంబానికి ప్రభాకర్ నాయుడు సన్నిహితంగా ఉన్నాడు. పరిటాల సునీత మంత్రిగా ఉన్న సమయంలో సన్నిహితంగా ఉన్న వారికే ప్రభుత్వ పథకాలు అమలయ్యేలా వ్యవహరించాడు. మరోవైపు.. అవినాశ్‌కు అప్పుల బాధలున్నాయని కొంతకాలంగా విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే భారత్ పే యాప్ ద్వారా లోన్ తీసుకుని కొందరి పేర్లను ష్యూరిటీగా పెట్టినట్లు చెబుతున్నారు.

'రాజధాని' అడవిలా మారేందుకు బాబే కారణం

1,234వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు



రిలే నిరాహార దీక్షలలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: రాజధాని ప్రాంతం అడవిలా మారేందుకు చంద్రబాబే కారణమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు విమర్శించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,234వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో మంగళవారం పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఆచరణ సాధ్యం కాని పనులకు చంద్రబాబు ఆద్యుడన్నారు. గతంలో విజన్ 2020 అంటూ ప్రజలను మోసం చేసిన బాబు ఇప్పుడు అమరావతి పేరుతో రైతులు, ఈ ప్రాంత ప్రజలను నిలువునా ముంచి, రూ.లక్షల కోట్లు దోచి పక్క రాష్ట్రంలో దాక్కుంటున్నాడని మండిపడ్డారు. తన అవినీతిని కాపాడుకునేందుకు ఈ ప్రాంత అభివృద్ధి జరగకుండా బాబు తప్పుడు కేసులు వేయించినందునే ఈ దుస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వం చట్టబద్ధంగా సభల్లో ఆమోదించిన తర్వాత అమరావతితో పాటు ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలను కూడా అభివృద్ధి చేసేందుకు నిర్ణయం తీసుకుంటే దానిని సైతం అడ్డుకునేందుకు బాబు అండ్ కో తప్పుడు కేసులు వేసిందని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధి నిరోధకుడు చంద్రబాబే అనేది అందరికీ తెలిసిన నిజమన్నారు. అన్నివర్గాలకు ప్రాధాన్యత ఇస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి బహుజనులు ఎప్పటికీ అండగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు ఈపూరి ఆదాం, బూదాల సలోమి, పులి దాసు, మాదిగాని గురునాథం, బూదాల సౌమ్య, బొలిమేర శ్యామ్యూల్, కుమ్మరపల్లి కిషోర్ బాబు, ఇందుపల్లి సుభాషిణి, కారుమూరి పుష్పరాజు, బేతపూడి సాంబయ్య, పల్లె బాబు, జంగా విజయలక్ష్మి, ఉష, నూతక్కి జోషి పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

'రెడ్ డైరీ' కేసు విచారణ 21కి వాయిదా

కౌంటర్ దాఖలుకు మరోసారి గడువు కోరిన లోకేశ్ న్యాయవాదులు

సాక్షి, అమరావతి: 'రెడ్ డైరీ' కేసులో లోకేశ్ మరోసారి నాన్చుడు ధోరణి అవలంబించారు. ఈ కేసులో కౌంటర్ దాఖలు చేసేందుకు ఆయన తరఫు న్యాయవాదులు గడువు కావాలని విజయవాడ ఏసీబీ న్యాయస్థానాన్ని మంగళవారం కోరారు. దాంతో ఈ కేసు విచారణను న్యాయస్థానం ఈ నెల 21కి వాయిదా వేసింది. ఈ కేసులో కౌంటర్ దాఖలు చేసేందుకు గడువు కోరడం వరుసగా ఇది మూడోసారి. టీడీపీ ప్రభుత్వ హయాంలో కుంభకోణాలపై కేసును ప్రభావితం చేసేందుకు కీలక సాక్షులను లోకేశ్ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని సీఐడీ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. టీడీపీ ప్రభుత్వ హయాంలో కుంభకోణాల కేసుల విచారణ సందర్భంగా లోకేశ్‌కు ఇచ్చిన 41ఏ నోటీసులకు విరుద్ధంగా ఆయన వ్యవహరిస్తున్నారని సీఐడీ అధికారులు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. గతంలో 41ఏ నోటీస్ కింద సీఐడీ విచారణకు హాజరైన సందర్భంగా విధించిన ఆంక్షలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించడం, ఈ కేసుల్లో కీలక సాక్షులుగా ఉన్న అధికారులు, న్యాయస్థానంలో వాంగ్మూలాలు ఇచ్చిన అధికారుల పేర్లను రెడ్‌డైరీలో రాశానని.. వారి సంగతి తేలుస్తానని లోకేశ్ మీడియా ముఖంగానూ, బహిరంగంగానూ బెదిరించిన విషయాన్ని ఆధారాలతో సహా నివేదించింది. రెడ్ డైరీ పేరుతో కీలక సాక్షులను బెదిరిస్తున్న లోకేశ్‌ను అరెస్ట్ చేసేందుకు అనుమతించాలని పిటిషన్‌లో కోరింది. కాగా ఈ కేసులో జారీ చేసిన నోటీసులను తీసుకునేందుకు లోకేశ్ సుముఖత చూపలేదు. ఆ నోటీసులు అందించేందుకు వెళ్లిన సీఐడీ అధికారులకు ఆయన అందుబాటులోకి రాలేదు. రెండుసార్లు ఆయన నివాసానికి వెళ్లినా అధికారులను కలిసేందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. దాంతో నోటీసులను పోస్టులో లోకేశ్ నివాసానికి పంపారు. వాటిని తీసుకునేందుకు లోకేశ్ నిరాకరించారు. నోటీసులను లోకేశ్ మొబైల్‌కు వాట్సాప్ ద్వారా పంపించినా ఆయన స్పందించలేదు. దాంతో ఆ విషయాన్ని కూడా సీఐడీ అధికారులు న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో న్యాయస్థానం ద్వారా నోటీసులు జారీ చేయాలని కోర్టు రిజిస్ట్రార్‌ను న్యాయమూర్తి ఆదేశించారు. లోకేశ్ గానీ, ఆయన తరఫు న్యాయవాదులు గానీ విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. కాగా ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేసేందుకు గడువు కావాలని లోకేశ్ తరఫు న్యాయవాదులు వరుసగా మూడోసారి గడువు కోరారు.

అరబ్బుల రాజధానిలో...
అబ్బురాల ఆలయం

అబుదాబిలో తొలి హిందూ ఆలయం ● నేడు మోదీ చేతులమీదుగా ప్రారంభం

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో హిందూ ఆలయం. కొన్నాళ్ల క్రితం దాకా అసాధ్యమైన ఊహగా తోచిన ఆ ఆలోచన ఇప్పుడు సాకారమైంది. యూఏఈ రాజధాని అబుదాబిలో ఏకంగా 27 ఎకరాల్లో సువిశాలమైన ఆలయం సర్వాంగ సుందరంగా రూపొందింది. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆరంభానికి సిద్ధమైంది. అదే బోచసన్వాసి శ్రీ అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ్ సంస్థ (బీఏపీఎస్) మందిరం. యూఏఈలోనే గాక మొత్తం మధ్యప్రాచ్యంలోనే పూర్తి హిందూ సంప్రదాయ రీతుల్లో నిర్మితమైన తొలి రాతి ఆలయమిది. భారత్‌తో యూఏఈ పటిష్ట బంధానికే గాక ఆ దేశ మత సామరస్యానికి కూడా ప్రతీకగా ఈ మందిరం అలరారనుంది...

విశేషాలెన్నో...

బాప్స్ ఆలయం ప్రత్యేకతలు అన్నీ ఇన్నీ కావు. దాదాపు 30 లక్షల దాకా భారతీయులున్న యూఏఈలో ఆలయాలు లేకపోలేదు. దుబాయ్‌లో ఇప్పటికే రెండు హిందూ దేవాలయాలు, ఒక సిక్కు గురుద్వారా ఉన్నాయి. అయితే అవి చూసేందుకు విల్లాల మాదిరిగా ఉంటాయి. యూఏఈ మొత్తంలో పూర్తి హిందూ శైలిలో రూపొందిన తొలి ఆలయం బాప్స్ మందిరమే...

- ఇది దుబాయ్–అబుదాబి హైవే సమీపంలో వద్ద 27 ఎకరాల్లో నిర్మితమైంది.
- దీని నిర్మాణానికి రూ.700 కోట్లు ఖర్చయింది. మొత్తం నిర్మాణం బాప్స్ సంస్థ కనుసన్నల్లో జరిగింది.
- 108 అడుగల ఎత్తు, 262 అడుగుల పొడవు, 180 అడుగుల వెడల్పుతో మొత్తం 55 వేల చదరపు మీటర్ల వైశాల్యంలో ఆలయం రూపుదిద్దుకుంది.
- దీని నిర్మాణానికి దాదాపు మూడున్నరేళ్లు పట్టింది. రాజస్తాన్, గుజరాత్‌కు చెందిన 2 వేల మందికి పైగా కార్మికులు, నిపుణులు మూడేళ్ల పాటు శ్రమించి 402 తెల్లని పాలరాతి స్తంభాలను చెక్కారు.
- ఆలయ నిర్మాణంలో స్టీల్, కాంక్రీట్, సిమెంట్ ఏ మాత్రమూ వాడలేదు. అయోధ్య రామాలయం మాదిరిగానే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో రాళ్ల వరుసలను నేర్పుగా పరస్పరం కలుపుతూ పోయారు.
- ఆలయం నిర్మాణంలో ఉపయోగించిన పాలరాతి తదితరాలను పూర్తిగా రాజస్తాన్‌లోని భరత్‌పూర్ నుంచి, శిల్పాలను భిల్వారా నుంచి తెప్పించారు. లోపలి నిర్మాణాల్లో ఇటాలియన్ మార్బుల్ వాడారు.
- మందిర పునాదుల్లో 100కు పైగా సెన్సర్లను కూడా ఏర్పాటు చేయడం విశేషం. భూకంపాలతో పాటు ఉష్ణోగ్రత, ఒత్తిళ్లు తదితరాల్లో మార్పులను ఇవి ఎప్పటికప్పుడు పట్టిస్తాయి.
- వీటిని మొత్తం 25 వేల పై చిలుకు విడి భాగాలుగా భారత్‌లో నిపుణులైన పనివాళ్లతో తయారు చేయించి యూఏఈలో జోడించడం విశేషం!
- ఆలయ కాంప్లెక్సులో ప్రార్థన మందిరం, సందర్శకుల కేంద్రం, థీమాటిక్ గార్డెన్లు, గ్రంథాలయం, గ్యాలరీ, ఎగ్జిబిషన్ సెంటర్లు, ఏకంగా 5,000 మంది పట్టే రెండు కమ్యూనిటీ హాళ్లతో పాటు ప్రత్యేకించి పిల్లల కోసం ఆటస్థలం కూడా ఉన్నాయి.
- మందిర ప్రారంభోత్సవంలో పాల్గొనాలనుకునే వారికోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్ ప్రారంభించారు. సోమవారం ఆలయంలో యజ్ఞం నిర్వహించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఏడు ఎమిరేట్లకు ప్రతీకగా...

- ఆలయంలోని ఏడు గోపురాలను యూఏఈలోని ఏడు ఎమిరేట్లకు ప్రతీకగా తీర్చిదిద్దడం మరో విశేషం.
- రామాయణ ఇతివృత్తాలను ఆలయ గోడలపై అందంగా చెక్కారు.
- ఆలయం బయటి గోడలపై ప్రపంచ ప్రసిద్ధ నాగరికతలన్నింటినీ చక్కగా చెక్కారు. తద్వారా ఈ ఆలయాన్ని మత సామరస్యానికి ప్రతీకగా తీర్చిదిద్దారు.
- భక్తుల బస తదితరాలకు ఆలయ సమీపంలో భవనం కూడా ఏర్పాటైంది. దీన్ని అరేబియన్, ఇస్లామిక్ వాస్తు రీతుల్లో నిర్మించడం విశేషం.



ఇలా పురుడు పోసుకుంది...

2014లో మోదీ తొలిసారి ప్రధాని పదవి చేపట్టిన కొద్దికాలానికే ఈ హిందూ ఆలయ నిర్మాణానికి బీజం పడింది. 2015లో మోదీ యూఏఈ పర్యటన అనంతరం వేగం పుంజుకుంది. 1981 తర్వాత అక్కడ పర్యటించిన తొలి భారత ప్రధాని మోదీయే. ఇప్పటిదాకా యూఏఈలో ఆరుసార్లు పర్యటించారాయన. తాజాగా ఏడో పర్యటనలో ఉన్నారు.

- 2015 పర్యటన సందర్భంగా యూఏఈ యువరాజుగా ఉన్న షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో పలు అంశాలపై మోదీ లోతుగా చర్చలు జరిపారు.
- ఆ వెంటనే ఆలయ నిర్మాణానికి యూఏఈ సర్కారు నిర్ణయం తీసుకోవడమే గాక 13.5 ఎకరాల భూమి కూడా కేటాయించింది. అనంతరం 2019లో మత సహన ఏడాది ఉత్సవాల సందర్భంగా ఈ ఆలయానికి మరో 13.5 ఎకరాలు ప్రకటించింది. అలా ఆలయానికి 27 ఎకరాల భూమి సమకూరింది.
- 2018లో మోదీ తన రెండో యూఏఈ పర్యటన సందర్భంగా బాప్స్ హిందూ ఆలయ నిర్మాణానికి దుబాయ్ ఒపెరా హౌజ్ నుంచి వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేశారు.



మంగళవారం రాత్రి అబుదాబిలో అహ్లాన్ మోదీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రధాని

భారత్ యూఏఈ దోస్తీ జిందాబాద్

అబుదాబిలో ప్రవాసులతో మోదీ

అబుదాబి: యూఏఈ, భారత్ మైత్రి ప్రపంచానికే ఆదర్శనీయమని ప్రధాని నరేంద్ర మోదీ శ్లాఘించారు. మంగళవారం అబూదాబిలోని జాయెద్ స్పోర్ట్స్ స్టేడియంలో ప్రవాస భారతీయులు నిర్వహించిన 'అహ్లాన్ (హలో) మోదీ' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దాదాపు 50,000 మంది పాల్గొన్న కార్యక్రమం 'హర్ హర్ మోదీ, ఘర్ ఘర్ మోదీ', 'వుయ్ లవ్ మోదీ', ' భారత్ మాతా కీ జై', 'జై శ్రీరామ్' నినాదాలతో హోరెత్తిపోయింది. స్టేడియం బయట మోదీకి యూఏఈ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జయేద్ సాదర స్వాగతం పలికారు. ప్రేక్షకుల నుద్దేశించి మోదీ ఏమన్నారంటే...

''యూఏఈ నలుమూలల నుంచి భారీ సంఖ్యలో వచ్చి మీరంతా చరిత్ర సృష్టించారు. భారత్‌లోని విభిన్న రాష్ట్రాల నుంచి వచ్చిన వారూ ఉన్నారు. అందరి హృదయాలను యూఏఈ కలిపింది. ఇక్కడి ప్రతి ఒక్కరి శ్వాస, గుండె చప్పుడు, స్వరం, ప్రతి గళం 'భారత్, యూఏఈ దోస్తీ జిందాబాద్' అని నినదిస్తోంది. ఇరు దేశాల మైత్రి ప్రపంచానికే ఒక మోడల్‌గా మారింది. 21వ శతాబ్ది మూడో దశకంలో కొత్త చరిత్రను లిఖిస్తున్నాయి. రెండు దేశాల భాగస్వామ్యం అన్ని రంగాల్లోనూ సమున్నత శిఖరాలకు చేరుతోంది. రోజు రోజుకూ ఈ బంధం మరింత బలపడాలని భారత్ మనసారా కోరుకుంటోంది. ప్రతిభ, సృజన, సంస్కృతిలో మన అనుబంధం దాగి ఉంది'' అని మోదీ అన్నారు. భారతీయ భాషల్లో అంతర్భాగంగా కలిసిపోయిన అరబిక్ పదాలను ప్రస్తావించారు. ఆ పదాలను మోదీ ఉచ్చరించినప్పుడల్లా ప్రేక్షకుల నుంచి విపరీతమైన స్పందన వచ్చింది.

మిమ్మల్ని చూసి భారత్ గర్విస్తోంది

'140 మంది భారతీయుల సందేశాన్నిమోసుకొచ్చా. అదేంటంటే.. మిమ్మల్ని చూసి భారత్ గర్విస్తోంది. ఈ పదేళ్లలో ఏడు సార్లు ఇక్కడికొచ్చా. ఈరోజు కార్యక్రమం నా స్మృతిపథంలో శాశ్వతంగా నిలిచి ఉంటుంది. యూఏఈ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ జయేద్' నాకు రావడం నిజంగా నా అదృష్టం. ఇది నాకు మాత్రమే కాదు 140 కోట్ల భారతీయులకు గర్వకారణం. సుఖమయ జీవనం, సులభతర వాణిజ్యానికి ఇరు దేశాలు కృషిచేస్తున్నాయి. 2047 కల్లా 'అభివృద్ధి చెందిన భారత్' ప్రతి ఒక్క భారతీయుడి లక్ష్యం. మోదీ గ్యారెంటీ అంటే ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చడమే. ప్రధానిగా మూడో దఫా పాలనలో భారత్‌ను ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా మారుస్తానని గ్యారెంటీ ఇస్తున్నా'' అని మోదీ వ్యాఖ్యానించారు. తర్వాత స్టేడియంలో ఓపెన్‌టాప్ బ్యాటరీ వాహనంలో స్టేడియంలో అంతా కలియతిరిగారు. ప్రేక్షకులకు అభివాదం చేశారు. జాతీయ జెండాలతో, సంప్రదాయ భారతీయ వస్త్రధారణలో విచ్చేసిన జనంతో స్టేడియం భారతీయతను సంతరించుకుంది. మోదీ తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం భాషల్లో కొన్ని వాక్యాలు మాట్లాడారు.

యూఏఈతో భాగస్వామ్యం బలపడుతోంది: మోదీ

అబుదాబి: ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం యూఏఈ చేరుకున్నారు. అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్–నహ్యాన్‌తో సమావేశమయ్యారు. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంపై సమీక్షించారు. వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఫిన్‌టెక్, ఇంధనం తదితర రంగాల్లో భారత్, యూఏఈ మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం బలపడుతుండడాన్ని వారు స్వాగతించారు. ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం (బీఐటీ)తో పాటు ఎనిమిది కీలక ఒప్పందాలపై సంతకాలు చేశారు. నహ్యాన్‌తో అద్భుతమైన సమావేశం జరిగిందంటూ 'ఎక్స్'లో మోదీ పోస్టు చేశారు.

రూపే కార్డు సేవలు ప్రారంభం

యూపీఐ రూపే కార్డు, యూఏఈకి చెందిన జీవాన్ కార్డు సేవలను మోదీ, అల్–నహ్యాన్ ప్రారంభించారు. ఈ కార్డులతో నూతన ఫిన్‌టెక్ ఏరియాలోకి ప్రవేశించామని మోదీ అన్నారు. రూపే, జీవాన్ కార్డు ఇంటర్‌లింక్ ఒప్పందంపై సంతకం చేశారు. తర్వాత అబూదాబిలో ఐఐటీ ఢిల్లీ–అబూదాబీ క్యాంపస్ తొలి బ్యాచ్ విద్యార్థులతో మోదీ సమావేశమయ్యారు. బుధవారం బాప్స్ మందిరాన్ని ప్రారంభించాక దోహాలో పర్యటిస్తారు.

ప్రభుత్వంలో చేరబోం

బయటి నుంచి మద్దతిస్తాం: బిలావల్

ఇస్లామాబాద్: మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ నేతృత్వంలోని పాకిస్తాన్ ముస్లిం లీగ్–నవాజ్(పీఎంఎల్–ఎన్), బిలావల్ భుట్టో నేతృత్వంలోని పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ)ల సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుఖాయమైన వేళ బిలావల్ భిన్నమైన ప్రకటన చేశారు. తాము ప్రభుత్వంలో చేరబోమని, బయటి నుంచి మద్దతు ఇస్తామని ఆయన స్పష్టంచేశారు. ''ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులు పొందటంలో మేం విఫలమయ్యాం. గెలిచిన సీట్ల సంఖ్యలో మేం మూడోస్థానానికే పరిమితమయ్యాం. అందుకే ప్రభుత్వంలో చేరొద్దని, ఏ మంత్రి పదవులూ స్వీకరించవద్దని మా పార్టీ నిర్ణయించింది. దేశంలో రాజకీయ సంక్షోభాన్ని మేం కోరుకోవట్లేదు. దేశంలో రాజకీయ సుస్థిరతే మాకు ముఖ్యం'' అని పార్టీ అత్యున్నత కేంద్ర కార్యనిర్వాహక కమిటీ సమావేశం తర్వాత బిలావల్ మీడియాతో చెప్పారు. దీంతో నవాజ్ షరీఫ్ రికార్డుస్థాయిలో నాలుగోసారి ప్రధా ట కావడం ఖాయమైంది. మరోవైపు కేంద్రంలో, రెండు ప్రావిన్సుల్లో ప్రభుత్వాల ఏర్పాటుకు ఇమ్రాన్ నేతృత్వం పీటీఐ ప్రయత్నిస్తోంది. ఎండబ్ల్యూఎం పార్టీతో కలసి కేంద్రంలో, పంజాబ్ ప్రావిన్స్‌లో.. జమాతే ఇస్లామీ పార్టీతో కలిసి ఖైబర్–పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ప్రభుత్వం ఏర్పాటుకు ప్రయత్నిస్తామని పీటీఐ పేర్కొంది.



మంగళవారం పంజాబ్–హరియాణా సరిహద్దుల్లో రైతులపైకి టియర్ గ్యాస్ ప్రయోగం


ఢిల్లీ సరిహద్దుల్లోని సింఘు వద్ద బారికేడ్లు, భారీగా మోహరించిన భద్రతా బలగాలు

సరిహద్దులో రణరంగం

రైతుల 'ఢిల్లీ చలో' ర్యాలీలో తీవ్ర ఉద్రిక్తత

- ట్రాక్టర్ల ర్యాలీని అడ్డుకున్న పోలీసులు
- రాళ్ల వర్షం కురిపించిన నిరసనకారులు
- వారిపైకి బాష్పవాయువు, జల ఫిరంగులు
- 100 మందికి గాయాలు.. పలువురి అరెస్టు
- ఢిల్లీ సరిహద్దుల్లో కట్టుదిట్టమైన భద్రత
- దేశ రాజధానికి చేరుకోలేకపోయిన రైతులు
- ర్యాలీకి 'నైట్ హాల్ట్', నేడు కొనసాగింపు



న్యూఢిల్లీ/చండీగఢ్: పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)కు చట్టబద్ధత కల్పించడంతో పాటు ఇతర డిమాండ్ల సాధనకు దాదాపు 200 రైతు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాతలు చేపట్టిన 'చలో ఢిల్లీ' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పంజాబ్, హరియాణా రాష్ట్రాల నుంచి ట్రాక్టర్లపై ర్యాలీగా బయలుదేరిన వేలాది మంది రైతులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. పంజాబ్, హరియాణా శంభు సరిహద్దులో పోలీసులపై నిరసనకారుల రాళ్ల దాడులు, బారికేడ్ల విధ్వంసం, రైతన్నలపై బాష్పవాయువు ప్రయోగం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. నిరసనకారులను చెదరగొట్టడానికి పోలీసులు బాష్పవాయువుతో పాటు జల ఫిరంగులు ప్రయోగించారు. దాదాపు 100 మంది రైతులు గాయపడ్డారని రైతు సంఘాల నాయకులు చెప్పారు. శంభు బోర్డర్ వద్ద రోజంతా ఉద్రిక్తత కొనసాగింది. మరోవైపు ఢిల్లీ శివార్లలోని సింఘు, చిల్లా, తిక్రీ, ఘాజీపూర్ బోర్డర్ పాయింట్ల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో పార్లమెంట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టాలన్న రైతు సంఘాల ప్రణాళిక అమలు కాలేదు. 'చలో ఢిల్లీ'ని మంగళవారం రాత్రికి నిలిపివేస్తున్నామని, బుధవారం ఉదయం కొనసాగిస్తామని రైతు సంఘాల నేతలు ప్రకటించారు. ఎలాగైనా ఢిల్లీకి చేరుకొని, తమ గళం వినిపించడం ఖాయమన్నారు.

శంభు సరిహద్దులో యుద్ధ వాతావరణం

శంభు సరిహద్దు వద్ద ట్రాక్టర్ల ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. రైతులను ముందుకు వెళ్లనివ్వలేదు. చలో ఢిల్లీకి అనుమతి లేదని, వెనక్కి వెళ్లిపోవాలని సూచించారు. ఆగ్రహానికి గురైన రైతులు పోలీసులపై రాళ్లు రువ్వారు. వంతెనపై బారికేడ్లను నదిలోకి తోసేశారు. సిమెంట్ బారికేడ్లను ట్రాక్టర్లతో తొలగించేందుకు ప్రయత్నించారు. పరిస్థితి చెయ్యి దాటుతుండటంతో పోలీసులు జల ఫిరంగులు, డ్రోన్లతో బాష్పవాయు గోళాలు ప్రయోగించి రైతులను చెదరగొట్టారు. నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు.

చర్చలు అసంపూర్ణం

రైతు సంఘాలతో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అర్జున్ ముండా సోమవారం రాత్రి జరిపిన చర్చలు అసంపూర్తిగా ముగిశాయి. ర్యాలీని విరమించాలని మంత్రులు కోరగా నేతలు అంగీకరించలేదు. డిమాండ్లు నెరవేరే దాకా ఉద్యమం కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. చాలా అంశాలపై ఏకాభిప్రాయానికి వచ్చామని మంత్రులు చెప్పారు. మిగతా డిమాండ్ల పరిష్కారానికి కమిటీ వేస్తామని ప్రతిపాదించగా నేతలు ఒప్పుకోలేదు. 2020–21 ఉద్యమంలో పాల్గొన్న రైతులపై కేసుల ఉపసంహరణకు, మరణించిన వారి కటుంబాలకు పరిహారం ఇచ్చేందుకు అప్పట్లోనే కేంద్రం ముందుకొచ్చింది. అవిప్పటికీ నెరవేరలేదని నేతలు ఆక్షేపించారు. పంటలు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాల్సిందేనని వారు మరోసారి తేల్చిచెప్పారు.

తక్షణం చర్చలు ప్రారంభించాలి

రైతులతో ప్రభుత్వం వెంటనే చర్చలు ప్రారంభించాలని, డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ) అధ్యక్షుడు నరేశ్ తికాయత్ చెప్పారు. ఉద్యమంపై కఠినంగా వ్యవహరిస్తే ప్రమాదకరంగా మారవచ్చన్నారు. ఈ నెల 16న బంద్ పిలుపు ఇవ్వాలన్న ప్రతిపాదన ఉందన్నారు. తామెప్పుడూ రైతుల పక్షానే ఉంటామని స్పష్టం చేశారు. ''డిమాండ్లు నెరవేరాలంటే రైతన్నలు ప్రతిసారీ ఉద్యమబాట పట్టాల్సిందేనా? ఢిల్లీకి వెళ్లాల్సిందేనా? ప్రభుత్వానికి బాధ్యత లేదా?'' అని ప్రశ్నించారు.

ఇప్పటికిప్పుడు చట్టం తేలేం: కేంద్రం

న్యూఢిల్లీ: పంటలకు కనీస మద్దతు ధర కల్పించే విషయంలో ఇప్పటికిప్పుడు చట్టం తీసుకురాలేమని కేంద్ర వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా అభిప్రాయపడ్డారు. భాగస్వామ్యపక్షాలతో చర్చించకుండా వేగంగా నిర్ణయం తీసుకోలేమన్నారు. రైతు సంఘాలు సంయమనం పాటించాలని, ప్రభుత్వంతో నిర్మాణాత్మక చర్చలకు ముందుకు రావాలని మంగళవారం కోరారు. రైతు ఉద్యమం ముసుగులో సంఘ విద్రోహ శక్తులు స్వార్థ ప్రయోజనాల కోసం అరాచకాలకు పాల్పడే ప్రమాదముందన్నారు. కొందరు వ్యక్తులు రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి రైతుల ఉద్యమాన్ని అప్రతిష్టపాలు చేసే అవకాశం ఉందని చెప్పారు. ''రైతు సంఘాలతో రెండు సార్లు చర్చించాం. చాలా డిమాండ్లకు అంగీకరించాం. కొన్నింటి పై చర్చలు జరుగుతున్నాయి'' అని వివరించారు. రైతుల డిమాండ్ల పట్ల కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని స్పష్టం చేశారు.

మేమొస్తే ఎంఎస్‌పీకి చట్టబద్ధత: రాహుల్

న్యూఢిల్లీ: శాంతియుతంగా నిరసన చేసేందుకు వస్తున్న రైతులపై కేంద్రం అణచివేత చర్యలకు పాల్పడుతోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లో భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)కు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీన్ని 'కిసాన్ న్యాయ్ గ్యారంటీ'గా అభివర్ణించారు. ఇదొక చరిత్రాత్మక దినమన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేసే అంశాన్ని తమ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేరుస్తామని సంకేతాలిచ్చారు. డిమాండ్లు నెరవేర్చాలని అడిగినందుకు రైతులపై మోదీ ప్రభుత్వం బాష్పవాయువు ప్రయోగించిందని, జైల్లో పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది అనాగరిక ప్రభుత్వమంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

'పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన'

కోటి ఇళ్లకు ప్రతినెలా 300 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్	ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటన

న్యూఢిల్లీ: దేశంలో సుస్థిరాభివృద్ధి, ప్రజా సంక్షేమంలో భాగంగా సౌర విద్యుత్ వినియోగానికి మరింత ప్రోత్సాహం ఇచ్చే దిశగా 'పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన'ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం ప్రకటించారు. దేశవ్యాప్తంగా కోటి ఇళ్లకు ప్రతినెలా 300 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయడం ఈ పథకం లక్ష్యం. రూ.75,000 కోట్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నట్లు ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఈ పథకం కింద ప్రభుత్వం ఇచ్చే రాయితీని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకే బదిలీ చేస్తామన్నారు. తక్కువ వడ్డీకే బ్యాంకుల నుంచి రుణం పొందవచ్చని సూచించారు. లబ్ధిదారులపై ఎలాంటి భారం పడకుండా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. తమ పరిధిలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటుకు కృషి చేసే పంచాయతీలకు, పట్టణ స్థానిక సంస్థలకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. 'పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన'తో ప్రజలకు మరింత ఆదాయం వస్తుందని, కరెంటు బిల్లుల భారం తగ్గుతుందని, కొత్తగా చాలామందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు. https://pmsuryaghar.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రధానమంత్రి సూచించారు.

ఈసీల నియామక చట్టంపై స్టే ఇవ్వలేం

సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేరు చేర్చకుండా కొలువుతీరిన ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎలక్షన్ కమిషనర్ల నియామక సంబంధ చట్టంపై స్టే ఇవ్వడం కుదరదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. మోదీ సర్కార్ కొత్తగా తెచ్చిన సీఈసీ, ఈసీల(నియామకం, సేవలు, షరతులు) చట్టం–2023 చట్టబద్ధతను సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం విచారించింది. ఈ పిటిషన్‌ను అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) అనే స్వచ్ఛంద సంస్థ దాఖలుచేసింది. సీఈసీ, ఈసీల ఎంపికకు సంబంధించిన నియామక ప్యానెల్‌లో సీజేఐను తప్పకచేర్చాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉల్లంఘిస్తూ ఈ చట్టం తెచ్చారని, అందుకే ఈ చట్టం అమలుకాకుండా స్టే విధించాలని ఏడీఆర్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు. 'పార్లమెంట్ చేసిన చట్టాన్ని ఈ తరహాలో నిలుపుదల చేయలేం. న్యాయసమీక్ష పరిధిలోకి ఈ అంశం వస్తుందో లేదో మేం మొదట పరిశీలించాలి. ఇదే అంశంపై ఇప్పటికే దాఖలైన మరో రెండు పిటిషన్లతో కలిపి దీనినీ ఏప్రిల్‌లో విచారిస్తాం'' అని జస్టిస్ ఖన్నా చెప్పారు.

కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక్క సీటే: ఆప్

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో ఢిల్లీ పరిధిలోని ఏడు లోక్‌సభ స్థానాలకు గాను కాంగ్రెస్‌కు ఒక్క స్థానమే ఇస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ తేల్చిచెప్పింది. కాంగ్రెస్‌తో సీట్ల పంపకాలపై నెలరోజులకుపైగా వేచిచూసి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని పార్టీ నేత సందీప్ పాఠక్ చెప్పారు. ఢిల్లీలో కాంగ్రెస్ బలాన్ని బట్టి ఒక్క సీటు కూడా ఎక్కువేనన్నారు.

బీజేపీలోకి అశోక్ చవాన్

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మరుసటి రోజు మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం ముంబైలోని బీజేపీ కార్యాలయంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రకాంత్ బవాంకులే సమక్షంలో చవాన్ కమలదళంలో చేరారు. ఈ సందర్భంగా చవాన్ మాట్లాడారు. ''ప్రధాని మోదీ పాలనాదక్షత చూసి, సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ నినాదం స్ఫూర్తితో బీజేపీలో చేరా. మహారాష్ట్రలో బీజేపీ మరిన్ని ఎక్కువ సీట్లు గెలుపొందేందుకు కృషిచేస్తా. ఈ రోజు నుంచి నా కొత్త రాజకీయ జీవితం మొదలవుతుంది' అని ప్రకటించారు.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

కోటా(రాజస్తాన్): శిక్షణ కేంద్రాలకు చిరునామాగా నిలిచిన రాజస్తాన్‌లోని కోటా పట్టణం.. విద్యార్థులకు బలవన్మరణాలకూ చిరునామా అవుతోంది. ఏటా లక్షలాది మంది పరీక్షార్థులు ఇంజనీరింగ్, మెడికల్ ప్రవేశ పరీక్షల కోసం కోచింగ్ తీసుకునేందుకు కోటాకు వస్తుంటారు. వీరిలో మరో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జేఈఈ–మెయిన్–2024 తొలి ఎడిషన్ జవాబులకీ విడుదలైన కొద్ది గంటలకే ఈ ఆత్మహత్య ఘటన చోటుచేసుకోవడం స్థానికంగా విషాదం నింపింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 16 ఏళ్ల శుభ్ చౌదరి గత రెండేళ్లుగా ఇక్కడి జవహర్‌నగర్‌లో ఉంటూ జేఈఈ–మెయిన్‌కు కోచింగ్ తీసుకుంటున్నాడు. ఆ పరీక్ష ఆన్సర్ కీ వెల్లడైన కొద్దిసేపటికే సోమవారం రాత్రి తన హాస్టల్ గదిలోకి వెళ్లి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు డీఎస్పీ భవానీ చెప్పారు. పోస్ట్‌మార్టమ్ తర్వాతే పూర్తి వివరాలు చెప్పగలమని పోలీసులు అన్నారు. కోటా పట్టణంలో ఈ ఏడాది విద్యార్థుల ఆత్మహత్యలకు సంబంధించి ఇది మూడో దుర్ఘటన.

ఎట్టకేలకు ఉక్రెయిన్‌కు అమెరికా సాయం

వాషింగ్టన్: రష్యాతో రెండేళ్లుగా సాగుతున్న యుద్ధంలో ఆయుధాలు, ఇతర కీలక సైనిక సామగ్రి కొరతతో సతమతమవుతున్న ఉక్రెయిన్‌కు శుభవార్త. ఆ దేశం సహా ఇజ్రాయెల్, తైవాన్‌లకు కలిపి మొత్తం 95.3 బిలియన్ డాలర్ల (సుమారు 7.90 లక్షల కోట్లు) సాయం అందించేందుకు ఉద్దేశించిన ప్యాకేజీకి అమెరికా సెనేట్ ఆమోదం తెలిపింది. ఇందులో ఉక్రెయిన్‌కు 60 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4.98 లక్షల కోట్లు)ను ప్రత్యేకించారు. సొంత సమస్యలను పరిష్కరించడానికి బదులుగా ఇతర దేశాల సమస్యల కోసం నిధులను వెచ్చించడాన్ని రిపబ్లికన్ సభ్యులు కొందరు వ్యతిరేకించారు. దీనిపై చర్చించిన సెనేట్ చివరికి ఈ బిల్లుకు 70–29 ఓట్ల తేడాతో ఆమోదం తెలిపింది.

కాల్పుల విరమణపై కీలక చర్చలు

కైరో: భూతల, గగనతల దాడులతో మరుభూమిగా మారుతున్న గాజా స్ట్రిప్‌లో కాల్పుల విరమణే లక్ష్యంగా హమాస్, ఇజ్రాయెల్ ప్రతినిధుల మధ్య ఈజిప్ట్ రాజధాని నగరంలో విస్తృతస్థాయి చర్చలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ సైన్యం రఫా పట్టణంలో సోమవారం దాడిచేసి 74 మంది పాలస్తీనియన్లను పొట్టనబెట్టుకున్న నేపథ్యంలో ఈ చర్చల ఫలితంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. యుద్ధం ఐదోనెలలోకి అడుగిడిన ఈ తరుణంలో కాల్పుల విరమణ అమల్లోకి వస్తే నిత్యావసరాలకు సైతం కటకటలాడుతున్న గాజా వాసులకు కాస్తయినా అంతర్జాతీయ మానవతా సాయం అందుతుంది.

తమిళ మంత్రి సెంథిల్ బాలాజీ రాజీనామా

చెన్నై: ఉద్యోగాల కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్ట్ చేసిన తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఈ నెల 12న సీఎం ఎంకే స్టాలిన్ నుంచి అందిన సిఫారసు లేఖ మేరకు గవర్నర్ ఆర్‌ఎన్ రవి మంత్రి బాలాజీ రాజీనామాను ఆమోదించినట్లు మంగళవారం రాజ్‌భవన్ తెలిపింది. కరూర్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బాలాజీ గత ఏఐఏడీఎంకే ప్రభుత్వంలో రవాణా మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో ఆయన అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపిస్తూ ఈడీ గత ఏడాది జూన్‌లో అరెస్ట్ చేసింది.

న్యూయార్క్‌లో కాల్పులు.. ఒకరు మృతి

న్యూయార్క్: అమెరికాలోని న్యూయార్క్ సిటీ సబ్‌వే స్టేషన్‌లో సోమవారం జరిగిన కాల్పుల్లో ఒకరు చనిపోగా మరో అయిదుగురు గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. బ్రాంక్స్‌లోని ఎలివేటెడ్ ట్రైన్ ప్లాట్‌ఫాంపై రద్దీ ఎక్కువగా ఉండే సాయంత్రం 4.30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైలులో ప్రయాణిస్తున్న రెండు టీనేజర్ల గ్రూపుల మధ్య వివాదం చెలరేగింది. స్టేషన్ సమీపిస్తున్న సమయంలో అందులో కొందరు తుపాకీలతో కాల్పులకు దిగారు. స్టేషన్‌లో రైలు ఆగిన తర్వాత కూడా ప్లాట్‌ఫాంపై జనంపైకి కాల్పులు కొనసాగాయి. మృతుడికి 34 ఏళ్లుంటాయని, క్షతగాత్రుల్లో ఒక బాలుడు, బాలిక ఉన్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024

వేసవి ఛాయ

ఎండాకాలం ఛాయలు అప్పుడే కనిపిస్తున్నాయి. మంగళవారం బెళగావి జిల్లా బైలహొంగల వద్ద తగ్గిన మలప్రభ నది మట్టం



న్యూస్‌రీల్

విదేశీ కానుక పేరుతో రూ. 31 లక్షల బురిడీ



బనశంకరి: విదేశీ కానుక వస్తుందనే ఆశతో ఓ మహిళ వెనుకా ముందు ఆలోచించకుండా సైబర్ మోసగాళ్లు చెప్పినట్లు విని రూ.31 లక్షలను పోగొట్టుకుంది. బెంగళూరు జయనగర మూడోబ్లాక్ నివాసి అనుపమా కిరణ్ ఈ మేరకు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గతేడాది డిసెంబరులో రూ.5 కోట్ల విలువైన అమెరికన్ డాలర్లను గిఫ్టుగా పంపుతామని ఆమె మొబైల్‌కు ఈ–మెయిల్ వచ్చింది. సరేనని ఆమె బదులిచ్చింది. తరువాత రేమండ్ ఆస్టిన్ అనే పేరుతో ఢిల్లీలోని అమెరికా ఎంబసీ నుంచి సంప్రదిస్తారని, గిఫ్ట్ కావాలంటే కొంత ఫీజు చెల్లించాలని ఆమెకు తెలిపారు. ఇలా మోసగాళ్లు ఆమెతో మాట్లాడుతూ 15 రోజుల్లో వివిధ ఫీజుల పేరుతో భారీగా డబ్బును తమ ఖాతాల్లో వేసుకున్నారు. డిసెంబరు 28వ తేదీన గుణ అనే వ్యక్తి ఆమె ఇంటికి వచ్చి కొన్ని అమెరికన్ డాలర్లను ఇవ్వగా వాటిని అనుపమ మార్చుకోగా రూ. 45 వేలు వచ్చాయి. ఈ దఫా నమ్మకం కలగడంతో మరింతగా డబ్బు పంపించింది. చివరకు రూ. 31 లక్షల్ని మోసగాళ్ల ఖాతాలకు బదిలీ చేశాక వంచనను గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

డెత్‌నోట్ రాసి వైద్యుడు ఆత్మహత్య



వైద్యుడు శశిధర, కాంగ్రెస్ నాయకుడు శరణగౌడ పాటిల్ (ఫైల్)

యశవంతపుర: తన చావుకు కాంగ్రెస్ నాయకుడే కారణమని రాసి వైద్యుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గదగ జిల్లా రోణ తాలూకా హిరేహాళ గ్రామంలో సోమవారం జరిగింది. డాక్టర్ శశిధర హట్టి డెత్‌నోటు రాసి పంచెతో ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు.. కాంగ్రెస్ నేత శరణగౌడ పాటిల్ మూడు నెల క్రితం రోణ తాలూకా హొళె మణ్ణూరు వద్ద ఇసుక పాయింట్ పెట్టుకున్నారు. ఇందులో రాజు సిరగుంపి, అశోక వాసవి శెట్టర్, వైద్యుడు శశిధర హట్టి భాగస్వాములుగా ఉన్నారు. వ్యాపారం కోసం శరణగౌడ పాటిల్, వైద్యుడు శశిధరకు నిత్యం ఫోన్ చేసి డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేసేవాడు. పాటిల్ ఒత్తిడిని తట్టుకోలేక శశిధర్ ఇంటిలో ఉరి వేసుకొన్నాడు. డెత్‌నోట్‌లో ధన దాహి శరణగౌడ పాటిల్ నా చావుకు కారణం, డబ్బుల కోసం వేధించడంతో ఆత్మహత్య చేసుకుంటున్నా. బొమ్మసాగర దుర్గమ్మ శాపం శరణగౌడ పాటిల్‌కు తగలాలని రాశారు. రోణ పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి డెత్‌నోట్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

గ్యాస్ రీఫిల్లింగ్ దందా రట్టు

దొడ్డబళ్లాపురం: అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న స్థావరంపై సీసీబీ పోలీసులు దాడి చేసి రూ.8 లక్షల విలువ చేసే 110 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు సోలదేనహళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గృహ వినియోగ సిలిండర్ల ఏజెన్సీలో, మరో గోడౌన్‌లో అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్నారని సమాచారం వచ్చింది. దీంతో ఆకస్మిక సోదాలను జరిపారు. నాసిరకంగా ఉన్న పాత సిలిండర్లలోకి గ్యాస్ రీఫిల్లింగ్ చేసి ప్రముఖ కంపెనీల లేబుల్స్‌ని అంటించి హోటళ్లకు సరఫరా చేసేవారని తేలింది. పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. 110 గ్యాస్ సిలిండర్లు, రీఫిల్లింగ్ రాడ్‌లు, రెండు గూడ్స్ క్యాంటర్లను స్వాధీనం చేసుకున్నారు.

నదిలోకి దూకి తల్లీకూతురు ఆత్మహత్య



కూతురు వర్ష, తల్లి సుమలత (ఫైల్)

యశవంతపుర: ఎంత కష్టం వచ్చిందోగానీ తల్లీకూతురు నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన కలబురగి జిల్లా శహబాద్ దగ్గర కాగిణా నదిలో జరిగింది. కలబురగి నగరంలోని ఎంబీ నగరలో నివసించే తల్లి సుమలత (45), కూతురు వర్ష (22) సోమవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు వెతికినా కనిపించలేదు. రాత్రి కాగిణా నదిలో దూకారు. మంగళవారం వీరి మృతదేహాలను పోలీసులు కనుగొన్నారు. జీవితంపై విరక్తి కలిగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. శహబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. వారింట్లో కుటుంబ కలహాలు ఉన్నట్లు ఇరుగుపొరుగు చెప్పారు.

శాంతి భద్రతలు అసలున్నాయా?

- విధానసభలో బీజేపీ ఆరోపణ
- తక్షణం చర్చించాలని వాయిదా తీర్మానానికి పట్టు
- ఇరువర్గాల మాటల యుద్ధం



హోంమంత్రి ఆగ్రహం



ఇటీవల మడికెరిలో ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

శివాజీనగర: అసెంబ్లీ సమావేశాల రెండోరోజు మంగళవారం వాడీవేడిగా సాగింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారాయని ప్రతిపక్ష పార్టీలు చేసిన ఆరోపణ విధానసభలో ఘాటు చర్చకు దారితీసింది. ఉదయం 9.40 గంటలకు సమావేశాలు ఆరంభం కాగానే స్పీకర్ యూటీ ఖాదర్ ప్రశ్నోత్తరాలను చేపట్టేందుకు సిద్ధమయ్యారు. మధ్యలో ప్రవేశం చేసిన బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్, హావేరిలో మహిళపై సామూహిక అత్యాచారం జరిగింది, బెళగావిలో మహిళను వివస్త్రను చేసి ఊరేగించారు, శివమొగ్గలో మారణాయుధాలతో బ్యానర్‌లు వేస్తున్నారు. భగవాన్ ధ్వజం ఏర్పాటు చేయబోతే కొట్లాటలు చేస్తున్నారు, సైబర్ క్రైమ్‌లు పెరిగాయి. రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నాయా?, ఈ విషయాలను వాయిదా తీర్మానం కింద చర్చించాలని డిమాండ్ చేశారు. మీకు కుడివైపే కాదు, ప్రతిపక్ష పార్టీల సభ్యులు ఉన్న ఎడమ వైపు కూడా చూడాలని స్పీకర్‌ను కోరారు.

హోం మంత్రి జీ.పరమేశ్వర్ స్పందిస్తూ సభాధ్యక్షుడు ఎడమవైపు గాని కుడి వైపు గానీ చూడాల్సిన అవసరం లేదు. నేరుగా చూడని, చర్చ జరిగేందుకు మాకు అభ్యంతరం లేదు. వారికాలంలో బెంగళూరులో ఎలా హత్యలు జరిగాయో అన్నీ చెబుతానన్నారు. బీజేపీ ఎమ్మెల్యేలైన సునీల్ కుమార్, అరగ జ్ఞానేంద్ర లేచి నిలబడి శాంతిభద్రతల దిగజారడంపై మొదట చర్చించాలని కోరారు. మంత్రి ప్రియాంక ఖర్గే మాట్లాడుతూ శాంతిభద్రతలు దిగజారేందుకు కారణం మీరే. ఇక్కడ చర్చించేదీ మీరే. పీఎస్ఐ ఉద్యోగాల స్కాం గురించి చర్చించాలని అని పలు అంశాలను లేవనెత్తారు. ఈ ప్రభుత్వానికి కళ్లు, చెవులు, హృదయం లేదని అరగ జ్ఞానేంద్ర ఆరోపించారు.



మాట్లాడుతున్న బీజేపీ పక్ష నేత అశోక్



అసెంబ్లీ సమావేశాలను తిలకిస్తున్న పాఠశాల విద్యార్థులు

కాసేపు గందరగోళం

కొబ్బరి పంటకి తగిన ధర ఇవ్వాలని జేడీఎస్ సభ్యులు హెచ్.డీ.రేవణ్ణ, బాలకృష్ణ వాయిదా తీర్మానం చేశారు. ఆ తరువాత బీజేపీ సభ్యులు శాంతిభద్రతలు గురించి చర్చ జరగాలని సూచించారు. పరిశీలిస్తానని సభాధ్యక్షుడు తెలిపారు. బీజేపీ అంశం, వాయిదా తీర్మానం కిందకు వస్తుందా, రాదా అనేది లోతుగా చర్చ సాగింది. అధికార, ప్రతిపక్ష సభ్యులు గట్టిగా కేకలు వేసుకోవడంతో గందరగోళం మొదలైంది. శాంతిభద్రతల గురించి ప్రస్తావన ఇస్తే చర్చకు పరిశీలిస్తానని స్పీకర్ బీజేపీ నేతలకు సూచించారు.

మాఘ మాస పూజలు



బనశంకరి: మాఘ మాసం సందర్భంగా బనశంకరీదేవి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. మంగళవారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ఆలయ అర్చకులు ఏ.చంద్రమోహన్ అభిషేకం, అర్చన చేపట్టి మూలవిరాట్‌ను అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

టీచర్ల మధ్య విభేదం.. బాలలతో టాయ్‌లెట్ శుభ్రం

యశవంతపుర: టీచర్ల మధ్య ఏర్పడిన వైషమ్యం కారణంగా విద్యార్థులచే మరుగుదొడ్డిని శుభ్రం చేయించిన ఘటన దావణగెరె తాలుకా మల్లెకట్ట ప్రభుత్వ హైస్కూల్‌లో జరిగింది. మహిళా హెడ్‌మాస్టర్‌తో విభేదాలున్న ఇద్దరు ఉపాధ్యాయినులు కావాలనే బాలికలతో మరుగుదొడ్డిని శుభ్రం చేయించి ఆ వీడియోను వైరల్ చేశారు. తద్వారా హెడ్‌మాస్టర్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని అనుకున్నారు. మీ గొడవలతో పిల్లలను బద్నాం చేస్తారా? అని గ్రామస్థులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణకు సంబంధించి టీచర్లకు హెచ్‌ఎంకు గొడవలు వచ్చాయి. ముఖ్యోపాధ్యాయురాలిపై కక్ష సాధించటానికి ఇద్దరు ఉపాధ్యాయినులు 10 తరగతి బాలికలచే శుభ్రం చేయించారు. దీనిపై విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని పిల్లల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

టీకా వేసిన చిన్నారి మృతి



శిశువు ఇంటి వద్ద గుమిగూడిన జనం

దొడ్డబళ్లాపురం: రోగ నిరోధక వ్యాక్సిన్ తీసుకున్న కొన్ని గంటల వ్యవధిలోనే చిన్నారి మృతి చెందిన సంఘటన చెన్నపట్టణ తాలూకా భైరాపట్టణ గ్రామంలో చోటుచేసుకుంది. స్ఫూర్తి, మోహన్ దంపతులకు ఒకటిన్నర ఏడాది చిన్నారి ఉంది. ఉదయం 11గంటల సమయంలో ఆరోగ్య కార్యకర్త డీపీటీ టీకా ఇచ్చారు. మధ్యాహ్నం ఒంటిగంటకు చిన్నారి కన్నుమూసింది. దీంతో కన్నవారు శోకసంద్రంలో మునిగిపోయారు. టీకా తీసుకున్న మరో 17 మంది పిల్లలు ఆరోగ్యంగానే ఉన్నారు. తాలూకా వైద్యాధికారి రాజు మాట్లాడుతూ టీకా వల్ల చిన్నారి మరణించే అవకాశం లేదన్నారు. పోస్టుమార్టం నిర్వహిస్తే మృతికి కారణాలు తెలుస్తాయని చెప్పగా, తల్లిదండ్రులు పోస్టుమార్టం చేయడానికి నిరాకరించారు.

డీకేశి ఆస్తులపై లోకాయుక్త కేసు

శివాజీనగర: అక్రమ ఆస్తుల కేసులో డిప్యూటీ సీఎం డీ.కే. శివకుమార్‌కు మరింత క్లిష్ట పరిస్థితి ఎదురైంది. డీకే పై లోకాయుక్త పోలీసులు కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. డీకేపై గతంలో యడియూరప్ప సర్కారు సీబీఐ విచారణకు ఇచ్చిన అనుమతిని ప్రస్తుత ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. దీనిపై బీజేపీ ఎమ్మెల్యే బసవనగౌడ పాటిల్ యత్నాళ్ హైకోర్టులో కేసు వేశారు. ఇంతలో తాము కూడా విచారణ జరుపుతామని లోకాయుక్త కేసు నమోదు చేయడం డీకేశికి ఉలికిపాటైంది.

తల్లీ కూతురు.. సుపారీ కథ

- ఇంటి పెద్దనే తుదముట్టించారు

తుమకూరు: కూతురి ప్రేమకు అడ్డుగా నిలిచాడని భర్తను భార్య సుపారీ ఇచ్చి హత్య చేయించింది. జిల్లాలోని కుణిగల్ తాలూకాలోని కుళ్ళినంజయ్యన పాళ్యలో గురువారం పార్ట్‌టైం ఉపాధ్యాయుడు కే.జీ. మరియప్పను కొందరు దుండగులు వెంటాడి హత్య చేయడం తెలిసిందే. ఈ ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేసి మరియప్ప భార్య శోభ, కుమార్తె హేమలతను విచారించారు. దీంతో గుట్టు వీడింది. హేమలత అదే గ్రామానికి చెందిన శాంతకుమార్‌ను ప్రేమిస్తోంది. ఇది గిట్టని మరియప్ప కూతురిని కొట్టాడు.

ప్రియునికి సుపారీ ఇచ్చి

దీంతో తల్లీకూతుళ్లు మరియప్ప మీద కక్షగట్టి శాంతకుమార్‌కు సుపారీ ఇచ్చారు. అతడు బెంగళూరులో ఉండే సంతు, హేమంత్ అనేవారిని పిలిపించి కాపుకాసి మొదట పెప్పర్ స్ప్రే కొట్టి, ఆపై హత్య చేయించాడు. మరియప్పకు ఫోన్ చేస్తు అతని కదలికల గురించి తల్లీ బిడ్డ హంతకులకు సమాచారమిచ్చారు. హత్య జరిగిన రోజు బెంగళూరులో శాంతకుమార్, హేమంత్ ఇళ్లలో పోలీసులు సోదాలు చేసి హత్యకు ఉపయోగించి వస్తువులను స్వాధీనం చేస్తున్నారు. మొత్తం 8 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.



మృతదేహం వద్ద తల్లీ బిడ్డ శోభ, హేమ



● ప్రేమ సందేశం

బనశంకరి: ప్రేమికుల దినోత్సవం సందర్భంగా పెటా కార్యకర్తలు మంగళవారం నగరంలోని బ్రిగేడ్ రోడ్డులో ప్రేమ సందేశమిచ్చారు. యువతులు ఎర్ర గౌన్లు ధరించి గులాబీ పుష్పాలతో కనువిందు చేశారు. శాకాహారిగా మారండి అంటూ గో వెగాన్ బోర్డులు చేతపట్టుకున్నారు. దారినపోయే దంపతులు, ప్రేమికులకు ఎర్రగులాబీలను వితరణ చేశారు.

మూఢ నమ్మకాలను తరిమేయాలి



మాట్లాడుతున్న చైర్మన్ నారాయణస్వామి

తుమకూరు: మూఢ నమ్మకాల పేరుతో గర్భిణి మహిళలు, బాలింతలు, ఆడపిల్లలను ఇంటి బయట ఉంచడం సరికాదని, ఇలాంటివి మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తాయని, వీటికి స్వస్తి పలకాలని మానవ హక్కుల కమిషన్ అధ్యక్షుడు జస్టిస్ ఎల్.నారాయణస్వామి అన్నారు. కమిషన్ ఆధ్వర్యంలో మంగళవారం బాల భవనంలో జిల్లా స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. దేశంలో ఉన్న ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందన్నారు. పిల్లలు, మహిళలు సహా మానవ హక్కులకు భంగం కలగకుండా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామాలలో కొనసాగుతున్న మూఢ నమ్మకాలను పారదోలాలని చెప్పారు. గ్రామ పంచాయతీ సిబ్బంది ఇందుకు కృషి చేయాలన్నారు. కాగా, జిల్లాలో బాలింతలను ఆచారం పేరుతో ఇంటి బయట గుడిసెల్లో ఉంచడం వార్తల్లోకెక్కింది. ఈ నేపథ్యంలో కమిషన్ పర్యటన చోటుచేసుకుంది.

సర్కారీ ఆఫీసుల్లో బసవణ్ణ చిత్రాలు



బసవణ్ణ చిత్రంతో సీఎం, సభాపతులు

శివాజీనగర: రాష్ట్ర సాంస్కృతిక నేతగా బసవణ్ణ ఫోటో, వచన వివేక పుస్తకాన్ని సీఎం సిద్ధరామయ్య విడుదల చేశారు. మంగళవారం విధానసౌధలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ నెల 17న రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో బసవణ్ణ నూతన ఫోటోను ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. బుద్ధ, బసవణ్ణ, గాంధీ, అంబేద్కర్‌లు సమాజంలో ఉన్న లోపాలను సవరించి, ఆరోగ్యకర సమాజ నిర్మాణం చేశారన్నారు. బసవణ్ణ ప్రజలకు అర్థమయ్యే విధానంలో వచనాలను రచించారని అన్నారు. ఈ సభాపతులు యూ.టీ.ఖాదర్, బసవరాజ హొరట్టి, మంత్రులు పాల్గొన్నారు.

కారులో క్యాష్ మర్చిపోయి..

శివమొగ్గ: ఒక వ్యక్తి అద్దె కారులో ప్రయాణిస్తూ నగదు ఉన్న బాక్స్‌ను, మరికొన్ని రికార్డులను కారులోనే మరిచిపోయాడు. మళ్లీ అతడు శివమొగ్గ నగర పశ్చిమ విభాగం ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కారును కనిపెట్టి వాటిని ఇప్పించారు. వివరాలు.. శివమొగ్గ నగరానికి చెందిన పవన్ అనే వ్యక్తి నగదు కడూరు నుంచి శివమొగ్గకి అద్దె కారులో వచ్చాడు. ఈ సమయంలో తొందరపాటులో ఉండి డిక్కీలో పెట్టిన నగదు, రికార్డుల సంచులను మరిచిపోయి ఇంటికి వెళ్లాడు. కొంతసేపటికి గుర్తుకు వచ్చింది, కానీ ఫోన్ చేద్దామంటే కారు డ్రైవరు ఫోన్ నంబరు లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆ మార్గంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. కారును పట్టుకొని నగదు, రికార్డులను అందజేయడంతో బాధితుడు హమ్మయ్య అనుకున్నాడు.

రూ. 85 కోట్ల కబ్జా భూమి స్వాధీనం



షెడ్లను కూల్చివేస్తున్న దృశ్యం

బనశంకరి: బెంగళూరు పాలికె పరిధిలోని బ్యాటరాయనపుర విభాగం కొడిగేహళ్లి వార్డులో ఆక్రమణకు గురైన కోట్లాది రూపాయల విలువ చేసే భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం యలహంక వలయ అధికారులు, రెవెన్యూ, పోలీస్ శాఖతో కలిసి జేసీబీలతో షెడ్లను నేలమట్టం చేశారు. 2.7 ఎకరాలలోని కబ్జాలను కూల్చివేశారు. ఈ ఆస్తి విలువ రూ.85 కోట్లు అని తెలిపారు. చుట్టూ ఫెన్సింగ్ అమర్చారు.

వేర్వేరు చోట్ల రెండు చిరుతల బందీ





బోనులో పట్టుబడిన చిరుతలు

మైసూరు: మైసూరు జిల్లాలోని ఒకే రోజు రెండు చిరుత పులులు బోనుల్లో చిక్కాయి. టి.నరిసిపుర తాలూకాలోని కురుబాళ హుండి గ్రామంలో 4 ఏళ్ల వయసున్న మగ చిరుత, నంజనగూడు తాలూకా రామాపురలో 5 ఏళ్ల మరో మగ చిరుత బోనులో పడ్డాయి. ఇక్కడ చిరుతలు తిరుగుతున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో అటవీ సిబ్బంది వాటిని పట్టుకునేందుకు బోనులను ఏర్పాటు చేశారు. దీంతో అవి బోనుల్లోకి పడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కురుబాళహుండి వద్ద గతంలో కూడా ఐదు సంవత్సరాల వయసున్న మగ చిరుత చిక్కింది.

మా జీతానికి గండి కొట్టొద్దు

- ఆశాల ఆందోళన

శివాజీనగర: ఆశా కార్యకర్తలకు నెలకు రూ.15 వేల జీతం ఇవ్వాలి, శ్రమను దోచుకునేలా ఉన్న ప్రస్తుత జీతం చెల్లింపు విధానాన్ని రద్దు చేయాలని వేలాది మంది ఆశా కార్యకర్తలు చలో విధానసౌధ జరిపారు. మంగళవారం నగరంలో ఫ్రీడం పార్కు మైదానంలో ఏఐయూటీయూసీ అధ్వర్యంలో ఆశా కార్యకర్తలు తరలివచ్చారు. తమకు శ్రమకు తగినట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీతం నిర్ధారించాలి. సమస్యగా ఉన్న ఆర్‌సీహెచ్ పోర్టల్‌ను జీతం చెల్లింపు ప్రక్రియనుండి తొలగించాలని, మొబైల్ యాప్‌ల భర్తీ పనులకు ప్రోత్సాహ ధనం ఇవ్వాలి అని పలు డిమాండ్లను ఏకరువు పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్‌సీహెచ్ పోర్టల్‌కు లింక్ చేసి జీతం మంజూరు చేసే ప్రక్రియ ఆశా కార్యకర్తలకు పెద్ద శాపంగా మారిందన్నారు. కష్టపడి సంపాదించిన సొమ్ము లీకేజ్ అవుతోందని వాపోయారు.



పింక్‌మయమైన ధర్నా స్థలి, నినాదాలు చేస్తున్న ఆశా కార్యకర్తలు

క్లుప్తంగా

శంకరాచార్య మఠంలో పూజలు



విశేష పూజల్లో పాల్గొన్న స్వామీజీ, భక్తులు

గంగావతి: నగరంలోని జయనగర్‌లో ఉన్న శంకరాచార్య మఠంలో సమానత ధర్మ ప్రవచకులు విధుశేఖర మహాస్వామీజీ సన్యాసం పుచ్చుకున్న రోజున విశేష పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి పలు రకాల అభిషేకాలు, విశేష అలంకరణ, పారాయణం లాంటి ధార్మిక కార్యక్రమాలను జరిపారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ నేటితో సన్యాసం స్వీకరించి 9వ సంవత్సరం పూర్తయినందున విశేష పూజలు జరిపామన్నారు. భక్తులకు స్వామి వారు ప్రవచనాలను వల్లించారు. కార్యక్రమంలో శంకరాచార్య మఠం ప్రముఖులు ఎస్‌బీహెచ్ నారాయణరావ్ తదితర ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

కందగల్లులో ఈశ్వర రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

హొసపేటె: తాలూకాలోని కందగల్లులో వెలసిన ఈశ్వర స్వామి రథోత్సవం వేలాది మంది భక్తుల జయజయ ధ్వానాల మధ్య ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో ఈశ్వర విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామ న్యాయవాది మల్లనగౌడ సిద్ధనగౌడ రూ.11,500లకు స్వామివారి రథోత్సవ బాణసంచాను వేలంలో దక్కించుకున్నారు. అనంతరం వేలాది మంది భక్తులు స్వామి వారి రథాన్ని లాగారు. భక్తులు రథంపైకి అరటిపండ్లు, పూలు విసిరి భక్తిని చాటుకున్నారు.

వాసవీ కన్యకా పరమేశ్వరికి విశేష పూజలు



అమ్మవారి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న ఆర్యవైశ్య నేతలు

కంప్లి: సండూరు తాలూకా ఆర్యవైశ్య సమాజం పరంగా మంగళవారం సోవేనహళ్లి గ్రామంలోని ఆంజనేయ దేవస్థానంలో మాత వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఉత్సవ మూర్తికి విశేష పూజలు సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం అన్న సంతర్పణ సమితి, ఆర్యవైశ్య ఛత్ర నిర్మాణ సమితి తరపున గ్రామంలో సామూహికంగా చిత్రపటంతో పాదయాత్ర, మృత్యుంజయ హోమం, హవనం నిర్వహించినట్లు తాలూకా అధ్యక్షుడు రామశెట్టి తెలిపారు.

క్రీడాంగణం నిర్మాణానికి భూమిపూజ

కంప్లి: కురుగోడు తాలూకా కోళూరులోని ప్రభుత్వ పాఠశాలకు భూదానం చేసిన సిద్ధనగౌడ చేతుల మీదుగా మంగళవారం క్రీడాంగణం నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. నరేగ తాలూకా సహాయక డైరెక్టర్ పీ.శివరామరెడ్డి మాట్లాడుతూ భూదాత ఉదారతకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు ఇకపై క్రీడాంగణంలో హాయిగా ఆడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పీడీఓ జుబేదా, సాంకేతిక సహాయకురాలు అరుణ తదితరులు పాల్గొన్నారు.

పైవంతెన నిర్మాణానికి స్థల పరిశీలన

గంగావతి: కొప్పళ తాలూకా కిడదాళ 68వ రైల్వే గేట్ వద్ద పైవంతెన నిర్మాణానికి డీపీఆర్ తయారీకి పరిశీలన బృందం విచ్చేసింది. వీరి వెంట కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ విచ్చేసి రైల్వే గేట్ వద్దకు బృందాన్ని తీసుకెళ్లి పరిశీలన చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణానికి రూ.35 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసిన అనంతరం పనులను ప్రారంభిస్తారన్నారు. కుష్టిగి వద్ద నిర్మించిన వంతెనలా నిర్మించాలని అధికారులకు సూచించారు.

గాయపడిన వృద్ధుడు మృతి

రొళ్ల: దాసప్పపాళ్యం గ్రామానికి చెందిన ఈరక్యాతరాయప్ప (64) అనే వ్యక్తి బెంగళూరులోని ఈఎస్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతు మంగళవారం రాత్రి చనిపోయాడు. ఆదివారం రాత్రి శిరకు వెళ్లి వస్తుండగా అగళి వద్ద పెళ్లి బృందం బొలెరోని సిమెంటు లారీ ఢీకొని 3 మరణించగా, 10 మందికి పైగా గాయపడడం తెలిసిందే. తీవ్రంగా గాయ పడిన ఈరక్యాతరాయప్పను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించినా లాభం లేకపోయింది. మరో ఇద్దరు నాగన్న, నరసింహమూర్తి ఇద్దరి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. వరుస మరణాలతో దాసప్పపాళ్యం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అడవులు వెలవెల.. వన్యప్రాణులు విలవిల



ఉమ్మడి జిల్లాలో తిరుగుతున్న చిరుత



జనావాసాల్లోకి ప్రవేశిస్తున్న ఎలుగుబంటి



సండూరు అడవిలో తాత్కాలికంగా నిర్మిస్తున్న నీటితొట్టి

- ఆహారం, నీటి కోసం జనావాసాల్లోకి చొరబాట్లు
- బిక్కుబిక్కుమంటున్న సమీప గ్రామాల ప్రజలు

సాక్షి,బళ్లారి: వరుణుడు ముఖం చాటేస్తే ప్రజలకే కాకుండా పశుపక్షాదులు, అడవి జంతువుల జీవన మనుగడపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడటం వల్ల రైతన్నలు పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల పాలై, రబీలో పంటలు పెట్టడానికి నీటి సదుపాయం లేక వలసలు వెళుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు తలెత్తుతున్నాయి. గ్రామాలే కాకుండా పట్టణాలు, నగరాల్లో కూడా వర్షాభావ పరిస్థితులతో కరువు ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులతో అడవుల్లో జీవించే వన్యప్రాణులు, పశుపక్షాదులు కూడా తాగునీరు, ఆహారం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఉమ్మడి బళ్లారి జిల్లాలో సండూరు, కుడితిని, తోరణగల్లు, విజయనగర జిల్లాలోని గుడేకోటె తదితర ప్రాంతాల్లో వేల ఎకరాల్లో అటవీ ప్రాంతాలు విస్తరించాయి. అడవుల్లో చిరుతలు, ఎలుగుబంట్లు, జింకలు, నక్కలు తదితర ఎన్నో జంతువులు నివాసం ఉంటున్నాయి. వర్షాలు బాగా కురిస్తే వన్యప్రాణులకు నీటి సమస్య ఉండదు. అడవుల్లో అక్కడక్కడ ఉన్న నీటి గుంతలు, చెరువులు, సెలయేళ్ల ద్వారా దాహం తీర్చుకుంటాయి.

నీటి కొరత నివారణకు చర్యలు

ఈ ఏడాది వర్షాలు పూర్తిగా తగ్గిపోవడం వల్ల అటవీ ప్రాంతాల్లో చెట్లు పూర్తిగా ఎండిపోవడంతో పాటు నీటి గుంతల్లో చుక్క నీరు కూడా లేకుండా పోయాయి. దీంతో అడవుల్లో జీవించే జంతువులు ఆహారం కొరతతో పాటు ముఖ్యంగా నీటి సమస్య ఏర్పడటంతో అడవులను వీడి జనావాసాల్లోకి వచ్చే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సాధారణంగా ఎండాకాలం వచ్చిందంటే అటవీ ప్రాంతాల చుట్టుపక్కల గ్రామాల్లో ప్రతి ఏటా ఎలుగుబంట్లు, చిరుత దాడుల్లో ప్రజలు గాయపడడం ప్రతి ఏటా చూస్తున్నాం. ఈ ఏడాది కరువు ఛాయలు వన్యప్రాణులపై కూడా పడడంతో విస్తారంగా అటవీ భూముల చుట్టుపక్కల గ్రామాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వన్యప్రాణులు ఎక్కువగా నివసించే అటవీ భూముల్లో నీటి తొట్టెలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. నీటి తొట్టెలకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసి వన్యప్రాణుల దాహం తీర్చేందుకు అటవీ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నా అడవుల్లో జీవించే వన్యప్రాణులకు ఆహార, నీటి సమస్యతో పాటు విపరీతమైన ఎండలు ఏర్పడే అవకాశం ఉండటంతో అవి విచ్చలవిడిగా తిరిగే ప్రమాదం ఉందని, జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

రూ.1.45 కోట్ల పొగాకు ఉత్పత్తుల సీజ్



సరుకుతో పలువురు నిందితులు

బనశంకరి: బెంగళూరు నగర సెంట్రల్ క్రైంబ్రాంచ్ పోలీసులు మంగళవారం 9 మంది అక్రమ వ్యాపారులను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.1 కోటి 45 లక్షల విలువచేసే పొగాకు ఉత్పత్తులు, ఈ-సిగరెట్ల సామగ్రి, 11 మొబైల్స్, రూ.1.10 లక్షల నగదు, టాటా ఏస్ గూడ్స్ సీజ్ చేసినట్లు పోలీస్ కమిషనర్ బీ.దయానంద తెలిపారు. మంగళవారం ఆయన వివరాలను వెల్లడించారు. చామరాజపేటే, రామమూర్తినగర, మహదేవపుర పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిషేధిత పొగాకు, నికోటిన్ ఉత్పత్తులను అమ్ముతున్న వ్యాపారులపై దాడులు చేసినట్లు తెలిపారు. 9 మంది ని అరెస్ట్ చేసి పెద్ద మొత్తంలో నిషేధిత ఉత్పత్తులను సీజ్ చేశామని తెలిపారు.

మతిస్థిమితం లేక హల్‌చల్

- ఢిల్లీ పోలీసుల రాక

పావగడ: కేంద్ర హోం శాఖ కార్యదర్శికి ఫోన్ చేసి దూషించిన సంఘటనలో ఢిల్లీ పోలీసులు పట్టణ పోలీస్ స్టేషన్‌కు మంగళవారం వచ్చారు. స్థానిక పోలీసుల సహకారంతో వారు తాలూకాలోని వెంకటాపురం గ్రామానికి చేరుకుని నిందితుని ఇంటిని శోధించారు. నిందితుడు రజనీశ్ తలుపు వేసుకుని లోపలే ఉన్నాడు. పోలీసులు తలుపు ఎంత తట్టినా తెరువలేదు. తరువాత బయటకు వచ్చిన రజనీశ్ ఎలాంటి నోటికి వచ్చినట్లు మాట్లాడసాగాడు. అతని ప్రవర్తన చూసి పోలీసులు ఆశ్చర్యపోయారు. 40 ఏళ్ల రజనీశ్ ఇంజినీరింగ్ చదువుకుని ఉద్యోగం లేక మానసిక రుగ్మతకు గురై పిచ్చివానిలా ప్రవర్తించే వాడు. ఊరికే బస్సులో తిరిగే వాడు. ఇటీవల ఇంటిపట్టునే ఉంటూ గూగుల్‌లో బడా బాబుల ఫోన్ నంబర్లను సేకరించి వారితో ఫోన్లలో మాట్లాడేవాడు. గత శనివారం కేంద్ర హోం శాఖ కార్యదర్శికి సైతం ఫోన్ చేసి బెదిరింపు ధోరణి తో మాట్లాడాడు. దీంతో ఢిల్లీ పోలీసులు అతనిని అరెస్టు చేసి తరలించడానికి యత్నించారు. అతని మానసిక పరిస్థితి బాగాలేదని చుట్టుపక్కలవారు నచ్చజెప్పడంతో ఢిల్లీ పోలీసులు వెనుతిరిగారు.

కోడలి ఆత్మహత్య కేసులో మామకు జైలు

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోట పోలీస్ స్టేషన్ పరిధి కి చెందిన కోటగుడ్డ గ్రామంలో 2021 ఆగస్టులో ఓ మహిళ తన ఇంటిలో చీర తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మామ హనుమంతరాయప్ప వేధింపుల వల్లనే ప్రాణాలు తీసుకుందని తెలిసి ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో మధుగిరి కోర్టు హనుమంతరాయప్పకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ 20 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పుచెప్పింది. వివరాల మేరకు.. నిందితుడు హనుమంతరాయప్ప ఇంటిలో ఎవరూ లేని సమయంలో తన కోడలితో అసభ్యంగా ప్రవర్తించేవాడని, ఆమెను వేధించేవాడని, స్నానం చేసే వేళ తొంగి చూడడం వంటి వికృత చేష్టలు చేసేవాడని తేలింది. తన మాట వినకుంటే చావు అని సతాయించేవాడు. మామ లైంగిక వేధింపులను భరించలేక ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విచారణలో నేరం రుజువు కావడంతో జడ్జి ఈ మేరకు తీర్పు వెలువరించారు. పోలీసులు దోషిని జైలుకు తరలించారు.

జాతరకు శ్రీకారం



జాతరలో వృషభాలు

మైసూరు: మైసూరు జిల్లాలోని టి. నరిసిపుర తాలూకాలోని మూడకుతొరె మల్లికార్జున స్వామి జాతర ఘనంగా ప్రారంభమైంది. భ్రమరాంబ, మల్లికార్జున స్వామి దేవాలయం జీర్ణోద్ధరణ పనులు పూర్తి కాకపోవడంతో ఈసారి రథోత్సవం, తెప్పోత్సవం తదితరాలను రద్దు చేశారు. 17వ తేదీన పశువుల జాతర జరుగుతుంది. పలు జిల్లాల నుంచి భక్తులు, ఆవులు, ఎద్దులతో రైతులు వస్తున్నారు.

వింత దూడ జననం

కంప్లి: కురుగోడు తాలూకా వద్దట్టి గ్రామంలో రైతు బసప్ప ఇంట్లో పెంచుకుంటున్న ఆవుకు మంగళవారం 2 తలలు, 6 కాళ్లుగల వింత ఆవుదూడ జన్మించింది. అయితే పుట్టిన కొద్దిసేపటికే దూడ మృతి చెందింది. ఈ విషయం దావానలంలా వ్యాపించడంతో వింతను తిలకించేందుకు గ్రామస్తులు బారులు తీరారు.

రాజ్యాంగంపై జాగృతి జాతా

కంప్లి: బాదనహట్టి గ్రామం నుంచి కురుగోడు పట్టణం వరకు మంగళవారం రాజ్యాంగ జాగృతి జాతా నిర్వహించారు. దొడ్డ బసవేశ్వర దేవస్థానానికి చేరిన జాతా అనంతరం గెణికెహాళ్, ముష్టగట్టి, వీరాపుర తదితర గ్రామాల మీదుగా సాగింది. సమాజ కళ్యాణ అధికారి మమత జాతాను ప్రారంభించి మాట్లాడుతూ రాజ్యాంగం మనకు ఇచ్చిన కర్తవ్యాల మేరకు ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు.

హొసపేటె: సమసమాజ స్థాపన కోసం జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న రాజ్యాంగంపై చైతన్య జాతా విజయవంతంగా సాగుతోందని జిల్లాధికారి దివాకర్ తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 90 జీపీలు, 9 పట్టణాల్లో ఈ జాతాను చేపట్టామన్నారు. జిల్లాలోని కొట్టూరులో ఈ నెల 23 నుంచి రెండో విడత ప్రారంభిస్తామన్నారు. రాజ్యాంగం గురించి కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహిస్తామన్నారు.

కమిషనర్ హామీతో ధర్నా విరమణ

హుబ్లీ: చట్టబద్ధంగా నగర పాలక సంస్థలో వార్డు కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ హుబ్లీ ధార్వాడ వార్డు సమితి సభ్యులు పాలికె ఆవరణలో సోమవారం చేపట్టిన రాత్రింబగళ్ల ధర్నాను కమిషనర్ హామీ ఇచ్చిన నేపథ్యంలో ఉపసంహరించుకున్నారు. వార్డు కమిటీలకు ఇప్పటికే అభ్యర్థులు సమర్పించిన దరఖాస్తులు పరిశీలనకు మూడు రోజుల్లోగా కమిటీని ఏర్పాటు చేస్తామని పాలికె కమిషనర్ డాక్టర్ ఈశ్వర్ ఉళ్లాగడ్డి హామీ ఇచ్చారు. దీంతో ధర్నాను తాత్కాలికంగా విరమించుకున్నామని సదరు సంఘం కన్వీనర్ లింగరాజ్ తెలిపారు. కమిటీ సభ్యత్వానికి 1080 పైగా దరఖాస్తులు సమర్పించారు. వీటిని పరిశీలించి అవసరం మేరకు కొత్తగా దరఖాస్తులను కోరడం ద్వారా పరస్పరం చర్చించుకొని తీర్మానం చేద్దామని కమిషనర్ సలహాకు కమిటీ సభ్యులు అంగీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుభాష్, శివానంద, జగదీశ్, పుల్లయ్య, సుధీర్, హుస్సేన్‌బాషా, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహనకు ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న నగరవాసులు

మైసూరు: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టి రాజ్యాంగ జాగృతి యాత్రను పురస్కరించుకొని మైసూరులో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. టౌన్‌హాల్ సర్కిల్‌వద్ద ర్యాలీని కలెక్టర్ డాక్టర్ కేవీ రాజేంద్ర ప్రారంభించి మాట్లాడారు. రాజ్యాంగ గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ ప్రముఖ వీధుల్లో కొనసాగింది. నగరవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

హస్తం అభ్యర్థికి బీజేపీ ఎమ్మెల్యే మద్దతు



కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరుతున్న ఎమ్మెల్యే సోమశేఖర్

యశవంతపుర: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తరపున బీజేపీ ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయ స్థానానికి ఈ నెల 16న ఎన్నిక జరగనుంది. కాంగ్రెస్ నుంచి బరిలో ఉన్న పుట్టణ్ణ తరపున యశవంతపుర బీజేపీ ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్ తన కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. పుట్టణ్ణకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ఇటీవల మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప రెండు సార్లు సోమశేఖర్‌ను కలిసి చర్చలు జరిపారు. చర్చలు విఫలం కావటంతో సోమశేఖర్ కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

సేవాలాల్ మాలధారుల పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న సేవాలాల్ భక్తులు

హొసపేటె: బంజారా సామాజిక వర్గానికి చెందిన సంత సేవాలాల్ జయంతిలో భాగంగా తాలూకాలోని లింగనాయకనహళ్లి తండాకు చెందిన సేవాలాల్ మాలధారులు సంత సేవాలాల్ జన్మస్థలం సూరగొండనకొప్పకు పాదయాత్రను ప్రారంభించారు. 19వ సంవత్సరం పాదయాత్ర ప్రారంభించిన తాండా భక్తబృందానికి గ్రామస్తులు పూలమాలలు వేసి ఘనంగా వీడ్కోలు పలికారు. గ్రామంలో 60 మందికి పైగా భక్తులు పవిత్ర సేవాలాల్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫిబ్రవరి 15న దావణగెరె జిల్లా న్యామతి తాలూకా సూరగొండనకొప్పలో సేవాలాల్ 285వ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఆ రోజు తీర్థయాత్రకు వెళ్లిన మాలధారులు పూలదండను కప్పి సాధువుల ఆశీస్సులు పొంది తిరిగి పట్టణానికి చేరుకుంటారు.

కోలారు వార్తలు...

ఇంటింటికీ తాగునీరే ధ్యేయం



జేజేఎం పనులకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

కోలారు: ప్రతి ఇంటికీ రక్షిత తాగునీటిని అందించడమే జలజీవన్ మిషన్(జేజేఎం) పథకం ముఖ్య ఉద్దేశమని కొండరాజనహళ్లి జీపీ అధ్యక్షుడు విజయనగర మంజునాథ్ తెలిపారు. మంగళవారం అమ్మేరహళ్లి, విజయనగరలో రూ.1.5 కోట్ల వ్యయంతో ఇంటింటికీ తాగునీటిని అందించే జేజేఎం పథకం పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జేజేఎం పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ సహకారంతో కొండరాజనహళ్లి జీపీని తాలూకాలోనే ఆదర్శ జీపీగా తీర్చిదిద్దుతామన్నారు. జీపీ మాజీ ఉపాధ్యక్షుడు అమ్మేరహళ్లి నాగేష్, ఉపాధ్యక్షురాలు నారాయణమ్మ, సభ్యులు గోవింద, రిజ్వాన్‌తాజ్, అక్రం తదితరులు పాల్గొన్నారు.

జేజేఎం పనులు ప్రారంభం

తాలూకాలోని చొక్కహళ్లి, గొల్లహళ్లి, సుగలాపుర గ్రామాల్లో జేజేఎం పథకం పనులను మంగళవారం సూలూరు జీపీ అధ్యక్షుడు పెమ్మశెట్టిహళ్లి ఏ.సురేష్ ప్రారంభించారు. ప్రతి ఇంటికీ తాగునీటిని అందించే ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేశారు. కేంద్ర ప్రభుత్వం జేజేఎం పథకంలో భాగంగా ప్రతి ఇంటికీ నీటిని అందిస్తోందన్నారు. పేదలు, శ్రీమంతులు అనే భేదభావం లేకుండా ప్రతి ఇంటికీ నీటిని అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని, వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానన్నారు. సూలూరు జీపీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. పంచాయతీకి అధిక నిధులను ఇప్పించడంలో ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్ సహకరించారన్నారు. జీపీ ఉపాధ్యక్షుడు రూప విజయ్, సభ్యులు శ్యామలమ్మ జగదీష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడాపోటీలకు జిల్లా క్రీడాకారులు




పోటీల్లో పాల్గొనడానికి వెళ్లిన కోలారు అథ్లెటిక్స్ బృందం

కోలారు: గుజరాత్‌లో ఈ నెల 16 నుంచి 19 వరకు జరిగే 19వ అంతర జిల్లా జాతీయ అథ్లెటిక్స్ క్రీడా పోటీల్లో పాల్గొనడానికి జిల్లా నుంచి అథ్లెటిక్స్ క్రీడాకారుల బృందం బయలుదేరి వెళ్లింది. క్రీడాకారులకు వీడ్కోలు పలికి మాట్లాడిన కలెక్టర్ అక్రం పాషా క్రీడా పోటీల్లో జిల్లా బృందం సభ్యులు ఉత్తమ ప్రదర్శనతో జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు. ఇదే క్రీడాకారులకు ట్రాక్ సూట్‌లను అందించారు. సమాజ సేవకుడు సీఎంఆర్ శ్రీనాథ్ మాట్లాడుతూ క్రీడాకారులు పోటీల్లో క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. యువజన సబలీకరణ, క్రీడాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.గీతా, లత, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.మునియప్ప పాల్గొన్నారు.

క్షతగాత్రుడి మృతి

మైసూరు: బైక్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న సాలిగ్రామ తాలూకా కర్తాలు గ్రామానికి చెందిన జవరెగౌడ మృతి చెందాడు. ఈయన్ను వేగంగావచ్చిన ఒక బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయ పడ్డాడు.మైసూరులోని కేఆర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని సాలిగ్రామ పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యుత్ లైన్ మార్గంలో భూమికి పరిహారం



మాట్లాడుతున్న జిల్లాధికారి అక్రంపాషా

కోలారు: నరసాపుర పారిశ్రామిక ప్రాంతంలో ప్రభుత్వం కేఐఏడీబీ నుంచి 220/66/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని స్థాపించి విద్యుత్ లైన్ వెళ్లే మార్గంలో భూమికి చదరపు మీటర్‌కు రూ.4 వేల పరిహారధనం చెల్లిస్తామని జిల్లాధికారి అక్రంపాషా తెలిపారు. జిల్లాధికారి కార్యాలయంలో నిర్వహించిన పరిహార సంధాన సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. జిల్లాలోని మాలూరు, దొడ్డసబ్బేనహళ్లి, అగ్రహార, శివారపట్టణ, మిండహళ్లి, తాలూకాలోని బంకనహళ్లి, మైలాడహళ్లి గ్రామాల్లో కేపీటీసీఎల్ నుంచి విద్యుత్ ప్రసార మార్గానికి ఇప్పటికే స్థలం గుర్తించామన్నారు. విద్యుత్ లైన్ మార్గంలో భూములు కలిగిన రైతులకు మాత్రం పరిహారం అందిస్తామన్నారు. ఇటీవల జిల్లాలోని భూముల రిజిస్టర్, స్టాంపు విలువలను పెంచారన్నారు. కేపీటీసీఎల్ స్టాంపు విలువను ఆధారంగా చేసుకుని పరిహారం ఇవ్వడానికి నిర్ణయించామన్నారు. అయితే రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని రూ.4 వేల పరిహారం ఇవ్వడానికి నిర్ణయించినట్లు తెలిపారు. భూముల్లోని చెట్లు, ఇతర ఆస్తి నష్టానికి కూడా పరిహారం అందిస్తామన్నారు. రైతులు సహకరించాలని కోరారు. సమావేశంలో కేపీటీసీఎల్ ఏఈఈ వెంకటేశప్ప, కేఐఏడీబీ ఏఈఈ రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

జయంతుల నిర్వహణ తప్పనిసరి



మాట్లాడుతున్న తహసీల్దార్

శ్రీనివాసపురం: ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని జీపీ కార్యాలయాల్లో తప్పనిసరిగా జాతీయ జయంతులను నిర్వహించాలని తహసీల్దార్ జీఎన్ సుధీంద్ర తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సంత సేవాలాల్ జయంతి, కాయక శరణర జయంతి, ఛత్రపతి శివాజీ జయంతి, సర్వజ్ఞ జయంతి నిర్వహణపై సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సమాజ ముఖ్య వాహినిలోకి రావాలనే ఉద్దేశంతో జయంతులను నిర్వహిస్తున్నారని, ఆయా సమాజ ఆశయాలకు అనుగుణంగా జయంతులను నిర్వహించాలన్నారు. ఆయా సముదాయం ప్రభుత్వంతో చేతులు కలిపి జయంతులను విజయవంతంగా నిర్వహించడానికి సహకరించాలన్నారు. జయంతులకు గైర్హాజరయ్యే అధికారులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. సమావేశంలో తహసీల్దార్ కేఎల్ జయరాం, టీపీ మేనేజర్ మంజునాథ్, బీసీఎం అసిస్టెంట్ డైరెక్టర్ హెచ్‌ఎం ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి దేహశుద్ధి

రాయచూరు రూరల్: ఆలయంలో చోరీకి పాల్పడ్డ నిందితుడికి దేహశుద్ధి చేసిన ఘటన రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకాలో చోటు చేసుకుంది. తాలూకాలోని నాగోలిలో వెలసిన ద్యావమ్మ, బీరలింగేశ్వర, బసవేశ్వర ఆలయంలో దొంగ చొరబడి రూ.10 లక్షలు విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించుకెళుతుండగా గ్రామస్తులు యువకుడిని పట్టుకొని చితకబాది పోలీసులకు అప్పగించారు. నిందితుడిని మాన్వి తాలూకా కప్పగల్ గ్రామానికి చెందిన శరణ బసవగా పోలీసులు గుర్తించారు. ఘటనపై దేవదుర్గ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

హుబ్లీ: నవలగుంద తాలూకా కన్నూర గ్రామంలో మోట బసవేశ్వర దేవస్థానం దగ్గర మినీ వాహనం, ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాద స్థలంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మృతురాలిని టీపీ సభ్యురాలు శాంతవ్వ(65)గా గుర్తించారు. మినీ వాహనం డ్రైవర్ నాగరాజ్ తీవ్రంగా గాయపడి హుబ్లీ కిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. గాయపడిన మరో నలుగురిని నవలగుంద ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మినీ వాహనంలో ఉన్న వారంతా ఆ తాలూకా తడహాళ గ్రామ వాసులే. ఒకే కుటుంబానికి చెందిన ప్రశాంత్(22), రత్నవ్వ (45), పారవ్వ(40), శకుంతల(20) ఇబ్రహీంపుర నుంచి తడహాళకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటన తర్వాత ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పామాయిల్ పంపిణీ వద్దు



ఆందోళన చేస్తున్న రైతులు

కెలమంగలం: తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో అందజేస్తున్న పామాయిల్‌ను మార్చి వేరుసెనగ, కొబ్బరి నూనెను అందజేయాలని పోచ్చంపల్లి తాలూకాలోని పులియూర్ గ్రామంలో మంగళవారం రైతు రక్షణ సంఘం ఆందోళన నిర్వహించింది. రైతులు ఉత్పత్తి చేస్తున్న కొబ్బరిని కొనుగోలు చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చిందని, కానీ ఇంతవరకు ఆ ఊసే లేదని తెలిపారు. ఇండోనేషియా, మలేషియా తదితర దేశాల నుంచి పామాయిల్‌ను దిగుమతి చేసుకుని పంపిణీ చేస్తోందని, రాష్ట్రంలో రైతుల పొట్ట కొడుతోందని దుయ్యబట్టారు.

బస్టాండ్ పనులను పరిశీలించిన కలెక్టర్

తుమకూరు: తుమకూరు నగరం మధ్యలో 3.17 ఎకరాల విస్తీర్ణంలో రూ.111.25 కోట్లతో జరుగుతున్న బస్టాండ్ నిర్మాణ పనులను కలెక్టర్ శుభకళ్యాణ్ మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న పనులు మిగిలి ఉన్నాయన్నారు. మార్చి 15నుంచి ఇక్కడినుంచి బస్సుల సంచారం ప్రారంభం అవుతుందన్నారు. అనంతరం కలెక్టర్ దిబ్బూరు సర్కిల్, శిరాగేట్ రింగ్ రోడ్డు పనులను పరిశీలించారు.

మత్తు పదార్థాలకు బానిస కారాదు



మాట్లాడుతున్న జడ్జి సునీల్ హొసమని

కోలారు: నగరంలో మత్తు రహిత సమాజం కోసం మంగళవారం జిల్లా యంత్రాంగం, జెడ్పీ, జిల్లా న్యాయ సేవల ప్రాధికార ఆధ్వర్యంలో అభియాన్‌ను నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి సునీల్ ఎస్ హొసమని మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కారాదన్నారు. ఇందుకు సంబంధించిన చట్టాల గురించి విద్యార్థులందరూ తెలుసుకోవాలన్నారు. జెడ్పీ ఉప కార్యదర్శి డి.శివకుమార్ మాట్లాడుతూ పిల్లలు ఉజ్వల భవిష్యత్తు కోసం దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. యువ శక్తి దేశ అభ్యుదయం కోసం శ్రమించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలత ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

ప్రకృతి సోయగం కెమ్మనగుండి


కెమ్మనగుండిపై పరుచుకున్న పచ్చదనం


కెమ్మనగుండి జెడ్‌పాయింట్ వ్యూ పై పర్యాటకురాలు

- లోయలు, జలపాతాలకు పెట్టింది పేరు
- చిక్కమగళూరు జిల్లాలో ఆకట్టుకుంటున్న హిల్‌స్టేషన్

బనశంకరి: చిక్కమగళూరు జిల్లాలో కెమ్మనగుండి హిల్‌స్టేషన్ పర్యాటకులను అబ్బురపరుస్తోంది. శీతాకాలంలో ఇక్కడికి వెళితే కొత్త అందాలను ఆస్వాదించవచ్చు. అందమైన జలపాతాలు, ఆహ్లాద పరిచే వాతావరణం, పురాతన దేవాలయాలు, దట్టమైన అటవీప్రాంతం పర్యాటకులను కనువిందు చేస్తాయి. చిక్కమగళూరు జిల్లా తరికేరి తాలూకాలోని కెమ్మనగుండి హిల్‌స్టేషన్ శీతాకాలం ప్రారంభ సమయంలో వెళితే పొగమంచు అందాలతో ఆ ప్రాంతం మరింత ప్రత్యేక ఆకర్షణగా పర్యాటకుల మరో ప్రపంచంలో విహరిస్తున్నట్లు ఉంటుంది.

దట్టమైన అటవీప్రాంతం

కెమ్మనగుండి పశ్చిమ కనుమల్లో సముద్ర మట్టానికి 1,434 మీటర్ల ఎత్తులో దట్టమైన అటవీప్రాంతంలో ఉంది. పూర్వం ఇక్కడ కృష్ణరాజ ఒడియార్ అనే రాజు పాలించడంతో ఈ హిల్‌స్టేషన్‌ను శ్రీకృష్ణరాజేంద్ర హిల్‌స్టేషన్‌గా పిలుస్తారు. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని కర్ణాటక హార్టికల్చర్ విభాగం టూరిజంగా అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకట్టుకుంటున్నారు. ఇక్కడ వీకెండ్‌లో హిల్ ను చూడటానికి పెద్ద ఎత్తున సందర్శకులు తరలివస్తారు. అక్కడ పచ్చని కొండలు, లోయలు, దట్టమైన అటవీ ప్రాంతం, పురాతన దేవాలయాలతో పాటు జలపాతాలు, ఉద్యానవనాలు పర్యాటకులను ఆకట్టుకుంటాయి.

జెడ్ పాయింట్ వ్యూ...

కెమ్మనగుండిలో జెడ్ పాయింట్ అనేది అందమైన వ్యూ పాయింట్. ఇది కొండ అంచుప్రాంతం కావడంలో సుమారు 45 నిమిషాల ట్రెక్కింగ్ చేయాల్సి ఉంటుంది. రాజ్‌భవన్ నుంచి ఈ నడకదారి ప్రారంభమౌతుంది. మధ్యలో శాంతివాటర్ ఫాల్స్ ఉంటుంది. ఇక్కడ నుంచి ట్రెక్కింగ్ కాస్త కష్టతరంగా ఉంటుంది. కొండపైకి వెళ్లగానే అక్కడ అందాలను వీక్షిస్తే మీ అలసట మాయమైపోతుంది.

శాంతివాటర్ ఫాల్స్

జెడ్ పాయింట్‌కు వెళ్లే దారిలో ఈ అందమైన వాటర్ ఫాల్స్ కూడా పర్యాటకులకు స్వాగతం పలుకుతుంది. చుట్టూ అందమైన ప్రాంతం పచ్చని చెట్ల మధ్య ఉండే ఈ చిన్నపాటి వాటర్‌ఫాల్స్ మిమ్మల్ని గిలిగింతలు పెడుతుంది. కొండకోనలు నుంచి వచ్చే ఈ నీరు చల్లగా ఉండటంతో మీరు తడిసిముద్దవ్వచ్చు.

అబ్బే వాటర్ ఫాల్స్..

ఈ ప్రాంతంలో మరో అందమైన లోకేషన్ అంటే అబ్బేవాటర్ ఫాల్స్ ఇది దట్టమైన అటవీ ప్రాంతంలో ఉండటంతో అక్కడికి వెళ్లడం కొంచెం కష్టం. అక్కడకు వాహనాలను అనుమతించరు. దీంతో చెక్ పోస్ట్ నుంచి ఫారెస్ట్ డిపార్టుమెంట్ వారి షేరింగ్ జీపులో వెళ్లాలి. వాహనంలో వెళ్లినప్పటికీ కొద్ది దూరం కాలినడకన వెళ్లాల్సి ఉంటుంది. పర్యాటకులు అడవిలో ట్రెక్కింగ్ చేసే అవకాశం లభిస్తుంది. అబ్బే వాటర్ ఫాల్స్ దగ్గరికి చేరుకున్నాక మీరు ఆశ్చర్యపోవాల్సిందే. రాక్‌గార్డెన్ చాలా అందంగా ఉంటుంది. ఈ గార్డెన్‌లో రాళ్లను అందంగా మలచడంతో పాటు అనేక రకాల మొక్కలను పెంచారు. రాక్ గార్డెన్ నుంచి సూర్యాస్తమయం చాలా అద్భుతంగా ఉంటుంది.

పురాతన శివాలయం

కెమ్మనగుండిలో పురాతన శివాలయం కూడా ఉంది. ఇది పచ్చని చెట్ల మధ్య అందమైన ప్రదేశంలో ఉండటంతో భక్తులకు కనులవిందుగా ఉంటుంది. అలాగే గుడి పక్కన ఉంటే వాటర్‌పాల్స్ కూడా పర్యాటకుల్ని ఆకర్షిస్తాయి. గుడి నిర్మాణం కూడా రాళ్లతో అందంగా తీర్చిదిద్దారు. అలాగే కెమ్మెనగుండి 10 కిలోమీటర్లు దూరంలో ఉన్న వీరభద్రుడు ఆలయం , కాళహట్టి వాటర్‌ఫాల్స్ కూడా వీక్షించవచ్చు.


పురాతన వీరభద్రస్వామి ఆలయం వద్ద పరవళ్లు తొక్కుతున్న జలపాతం


అందమైన పర్వతంపైకి రోడ్డు మార్గం


అబ్బే వాటర్‌పాల్స్

క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శ్రీకారం


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ

కృష్ణరాజపురం: బెంగళూరు గ్రామీణ జిల్లా హొసకోటె నగరం 1వ వార్డులో స్వామి వివేకానందనగర మెయిన్ రోడ్డులో రూ.80 లక్షలతో రోడ్లు, డ్రైయిన్ పనులకు ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ మంగళవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బీవీ బైరేగౌడ, అధికారులు పాల్గొన్నారు.

శివరాత్రికి కబడ్డీ పోటీలు


పోటీలను ప్రారంభించిన రక్షారామయ్య

గౌరిబిదనూరు: శివరాత్రి రాబోతున్న సందర్భంగా నేతాజీ క్రీడా మైదానంలో కబడ్డీ టోర్నీని నిర్వహిస్తున్నట్లు, యువత పెద్దసంఖ్యలో పాల్గొనాలని యువజన కాంగ్రెస్ నేత రక్షా రామయ్య తెలిపారు. మంగళవారం సినీ నటుడు రోషన్ భైర్య సహకారంతో కబడ్డీ టీంల వేలంపాటలో పాల్గొన్నారు. నేడు క్రీడలలో రాణించిన వారికి వివిధ రంగాలలో ఉద్యోగావకాశాలు సైతం మెండుగా ఉన్నాయన్నారు. క్రీడాకారుడు అర్ అశోక్‌కుమార్, రెఫరీ ప్రకాశ్, మంజునాథ్, అర్జున్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

కించపరిచే పోస్టు.. వకీలు అరెస్టు


అరెస్టయిన లాయర్ జాన్ బాషా

దొడ్డబళ్లాపురం: ఉత్తర ప్రదేశ్‌లోని జ్ఞానవాపి మసీదులో పూజలు చేసుకోవడానికి కోర్టు అనుమతి ఇవ్వడంపై అసంబద్ధంగా పోస్టు చేసిన ఓ లాయర్‌ను రామనగర పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌డీపీఐ నేత, వకీలు అయిన జాన్ బాషా కోర్టు తీర్పును కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడు. దీనిపై బీజేపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని జాన్ బాషాను అరెస్టు చేశారు.

వలస కూలీ హత్య?

దొడ్డబళ్లాపురం: తలపై బండరాయితో బాది యువకున్ని హత్య చేసిన సంఘటన మాదనాయకనహళ్లి పరిధిలోని కడబగెరె క్రాస్ బస్టాండు వద్ద చోటుచేసుకుంది. మాగడి మెయిన్ రోడ్డులోని కడబగెరె క్రాస్ వద్ద అపరిచిత యువకుని మృతదేహం పడి ఉంది. తలపై బండరాయితో మోదడంతో తల ఛిద్రమయింది. ఉత్తర భారతదేశానికి చెందినవాడిగా వలస కూలీ అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

రైలు పట్టాలపై మృతదేహం


పట్టాలపై గంగాధరప్ప మృతదేహం

గౌరిబిదనూరు: పట్టణ సమీపంలో ఉత్తర పినాకినీ నది రైల్వే వంతెనపై ఇదే పట్టణ సమీపంలోని పుట్టపురహళ్లికి చెందిన రంగస్వామి కుమారుడు గంగాధరప్ప(38) శవమై తేలాడు. మద్యానికి బానిసైన ఈయన రోజూ కుటుంబ సభ్యులతో గొడవపడేవాడని సమాచారం. ఈక్రమంలో ఇతను పట్టాలపై శవమై కనిపించాడు. ఇతను ఆత్మహత్య చేసుకున్నాడా? మత్తులో పట్టాలు దాటుతూ రైలు కిందపడ్డాడా? అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది. రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతడిని మద్యవ్యసనిగా గుర్తించి దొడ్డబళ్లాపురం రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

దొడ్డబళ్లాపురం: దొడ్డబళ్లాపురం తాలూకా కణివెపుర సమీపంలోని మునేశ్వర దేవాలయంలో ఇస్లాంపురకు చెందిన శ్రీనివాస్(50) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పులబాధ తాళలేక విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడని స్థానికులు అంటున్నారు. దొడ్డ గ్రామీణ పోలీసులు వచ్చి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

- రూ.26 లక్షల సొత్తు స్వాధీనం

మైసూరు : చోరీలు, దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరిని మైసూరు నగర సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులనుంచి రూ.26 లక్షల విలువైన 416 గ్రాముల బంగారు ఆభరణాలు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. గతయేడాది డిసెంబర్ 28న విజయనగర పోలీస్‌స్టేషన్ పరిధిలో నిందితులు చోరీకి పాల్పడ్డారు. మైసురు నగరలోని అశోక్ రోడ్డుకు చెందిన ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా దొంగ అని తేలింది. అతను ఇచ్చిన సమాచారంతో మరొక దొంగను అరెస్ట్ చేశారు.

డ్రగ్స్, ఇతర నేరాలపై ఉక్కుపాదం

- జనవరి నుంచి ఇప్పటివరకు 140 కేసులు
- 310 మంది అరెస్ట్


స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ వివరాలు వెల్లడిస్తున్న నగర పోలీస్ కమిషనర్ బీ దయానంద

బనశంకరి: దేశ ఐటీ రాజధానిగా వెలుగొందుతున్న బెంగళూరు నగరం రానురాను మత్తుభూతంగా మారుతోంది. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో డ్రగ్స్ విక్రయాలు వెలుగు చూస్తున్నాయి. దీనికితోడు ఇతర నేరాలు పెచ్చుమీరాయి. సైబర్ మోసాలు, కొరియర్ పేరుతో వంచనలు, ఉద్యోగాల పేరుతో మోసాల కుపాల్పడుతున్నారు. దీంతో బెంగళూరు నగరం అంతర్జాతీయంగా చెడ్డపేరు మూటగట్టుకుంటోంది. దీంతో పోలీసు శాఖ అప్రమత్తమై డ్రగ్స్ విక్రయాలు, వంచకులపై ఉక్కుపాదం మోపింది. ఈ ఏడాది కొత్త సంవత్సర వేడుకలు జరిగినప్పటినుంచి ఇప్పటివరకు డ్రగ్స్, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి మొత్తం 140 కేసుల్లో 310 మందిని అరెస్ట్‌చేశామని నగర పోలీస్ కమిషనర్ బీ.దయానంద మంగళవారం విలేకరులకు తెలిపారు. బెంగళూరు నగరపరిధిలో జనవరి నెలలో 36 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేసి 8 మంది విదేశీయులతో పాటు మొత్తం 57 మందిని అరెస్ట్‌చేసి 85 కిలోల మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ముందుజాగ్రత్త చర్యల కింద మొత్తం 164 పీఏఆర్ కేసులు నమోదు చేశామన్నారు. ముగ్గురు వ్యక్తులపై బాండ్ విలువ మొత్తం స్వాధీనం చేసుకున్నామని, పరారీలో ఉన్న 13 కేసుల్లో డ్రగ్స్ విక్రేతల ఆచూకీ కనిపెట్టి కోర్టులో హాజరుపరిచామన్నారు. మరో 9 మంది ఆచూకీ కనిపెట్టి 174 ఏ ఐపీసీ సెక్షన్ కేసు నమోదు చేశామని కమిషనర్ తెలిపారు. ఇలా 24 మందిపై 229 ఏ ఐపీసీ సెక్షన్ కింద కేసు నమోదుచేసి విచారణ చేపడుతున్నామని తెలిపారు. ఇంకా రౌడీషీటర్లపై 229 ఏ ఐపీసీ సెక్షన్ కింద 5 కేసులు, 174 ఏ ఐపీసీ కింద 5 కేసులు నమోదు చేశామన్నారు. జనవరినెలలో 1308 కేసులు విచారణ చేపట్టి 762 కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సీసీబీ పోలీసులు ఇద్దరు అంతర్జాతీయ డ్రగ్స్ పెడ్లర్లను అరెస్ట్‌చేసి సుమారు రూ.50 లక్షల విలువచేసే 505 గ్రాముల ఎండీఎంఏ క్రిస్టల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో కేసులో విదేశీ డ్రగ్స్‌పెడ్లర్లను అరెస్ట్‌చేసి సుమారు రూ.71 లక్షల విలువచేసే కొకైన్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సైబర్ కేసుల్లో నిందితుల ఆచూకీకోసం డీసీపీ నేతృత్వంలో ప్రత్యేకబృందాలను ఏర్పాటుచేశామన్నారు. కొరియర్ పేరుతో వంచనకు పాల్పడుతున్న ముఠా ఆచూకీకనిపెట్టి 14 మందిని అరెస్ట్‌చేసి దేశవ్యాప్తంగా నమోదైన మొత్తం 546 కేసులను చేధించినట్లు తెలిపారు. ప్రజలకు వాట్సాప్, టెలిగ్రామ్ యాప్‌ల ద్వారా వర్క్ ఫ్రం హోమ్ ఉద్యోగం ఇస్తామని నమ్మించి ప్రజలనుంచి లక్షలాదిరూపాయలు పెట్టుబడిగా పెట్టించుకుని వంచనకు పాల్పడుతున్న 9 మంది అంతర్ రాష్ట్ర వంచకులను అరెస్ట్‌చేసి 30 బ్యాంకు అకౌంట్లలో రూ.62,83,080 ఫ్రీజ్ చేసినట్లు తెలిపారు.

అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఫిర్యాదు

శివాజీనగర: ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్, ప్రాథమికోన్నత విద్యా శాఖ మంత్రి మధుబంగారప్పకు వ్యతిరేకంగా జేడీఎస్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. బెంగళూరు ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి రామనగర, బెంగళూరు గ్రామీణ జిల్లా, బెంగళూరు నగర జిల్లా డీడీపీఐ, బీఈఓలతో మధు బంగారప్ప, డీకే శివకుమార్ సభ జరిపి కాంగ్రెస్ అభ్యర్థి తరపున ప్రచారం చేయాలని చెప్పి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, వారిపై చర్యలు తీసుకోవాలని జేడీఎస్ తన ఫిర్యాదులో పేర్కొంది. అదేవిధంగా కాంగ్రెస్ సోషల్ మీడియాపై బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర కోర్టులో ఫిర్యాదు చేశారు. బీజేపీ సీనియర్ నాయకులను అవమానిస్తూ కాంగ్రెస్ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారని, కాంగ్రెస్ మాధ్యమంపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

సంప్‌లో గుర్తు తెలియని మహిళ మృతదేహం

దొడ్డబళ్లాపురం: బెంగళూరు ఉత్తర తాలూకా లక్ష్మీపుర గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి సంప్‌లో గుర్తు తెలియని మహిళ శవమై తేలింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో మాదనాయకనహళ్లి పోలీసులు వచ్చి పరిశీలించారు. మృతురాలికి 40 సంవత్సరాల వయస్సు ఉంటుందని, మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండటంతో ఆమె మృతి చెంది మూడు, నాలుగు రోజులై ఉంటుందని నిర్ధారణ చేశారు. అనంతరం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించాడు. హతురాలి వివరాలు తెలియాల్సి ఉంది.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్టాండ్ పనులను పరిశీలించిన కలెక్టర్

తుమకూరు: తుమకూరు నగరం మధ్యలో 3.17 ఎకరాల్లో రూ.111.25 కోట్లతో జరుగుతున్న బస్టాండ్ నిర్మాణ పనులను కలెక్టర్ శుభకళ్యాణ్ మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న పనులు మిగిలి ఉన్నాయన్నారు. మార్చి 15నుంచి ఇక్కడినుంచి బస్సుల సంచారం ప్రారంభం అవుతుందన్నారు. అనంతరం కలెక్టర్ దిబ్బూరు సర్కిల్, శిరా గేట్ రింగ్ రోడ్డు పనులను పరిశీలించారు.

ఓటర్లకు తాయిలాలు



పుట్టణ్ణ పేరుతో పంపిణీ చేసిన వెండి బహుమతులు

దొడ్డబళ్లాపురం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి పుట్టణ్ణ టీచర్లకు వెండి బహుమతులు పంపిణీ చేస్తున్నట్లు జేడీఎస్ నేత శేషాద్రి ఆరోపించారు. పుట్టణ్ణ పేరుతో పంపిణీ చేసిన బహుమతులను మంగళవారం ఆయన మీడియాకు చూపించారు. హారోహళ్లి తాలూకాలోని అనేక గ్రామాల్లో ఇప్పటికే పలువురు ఉపాధ్యాయుల ఇళ్లకు పుట్టణ్ణ అనుచరులు వెళ్లి వెండి వస్తువులు బహుమతులుగా ఇస్తున్నట్లు ఆరోపించారు. ఎన్నికల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఐ లవ్ మైసూరు బోర్డుకు మసి

మైసూరు: పర్యాటకులను ఆకర్షించేందుకు మైసూరులో ఏర్పాటు చేసిన ఐలవ్ మైసూరు బోర్డుకు కన్నడపర సంఘాల నాయకులు మసిపూశారు. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన మైసూరుకు దేశవిదేశాలనుంచి నిత్యం వేల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. వీరిని ఆకట్టుకునేందుకు నగరంలోని కోటె ఆంజనేయస్వామి ఆవరణ వద్ద ఆంగ్ల భాషలో ఐలవ్ మైసూరు అని మూడు రోజుల క్రితం పాలికె అధికారులు డిజిటల్ బోర్డు ఏర్పాటు చేశారు. నిబంధనల ప్రకారం నామ ఫలకంలో 60 శాతం కన్నడ, 40 శాతం ఆంగ్లం ఉండాలి. ఈ బోర్డు మొత్తం ఆంగ్ల భాషలో ఉండటంతో ఆందోళనకారులు మసిపూసి వెళ్లిపోయారు. పాలికె సిబ్బంది వచ్చి బోర్డును తొలగించారు. నామఫలకాలు కన్నడలోనే ఉండాలని కన్నడ సంఘాల నాయకులు కొంతకాలంగా ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే.

అవమానిస్తూ వాట్సాప్ మెసేజ్

- ఉపాధ్యాయుడి తీరుతో విద్యార్థిని ఆత్మహత్య


బాధిత విద్యార్థిని, నిందితుడు రూపేశ్(ఫైల్)

బనశంకరి/యశవంతపుర: అవమానిస్తూ ఉపాధ్యాయుడు మెసేజ్‌చేయడంతో మనో వేదనతో ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థిని ప్రాణాలు వదిలింది. ఈ ఘటన దక్షిణ కన్నడ జిల్లా ధర్మస్థలలో చోటుచేసుకుంది. ఇక్కడి ప్రైవేటు స్కూల్‌లో ఎస్ఎస్ఎల్‌సీ చదువుతున్న విద్యార్థినిని అవమానిస్తూ ఇదే పాఠశాల ఉపాధ్యాయుడు రూపేష్ ఆమె స్నేహితుల సెల్‌ఫోన్‌కు వాట్సాప్ మెసేజ్ పంపాడు. ఈ విషయంపై బాధితురాలి తల్లి పాఠశాలకు వెళ్లి రూపేష్‌ను దండించింది. మరో వైపు ఉపాధ్యాయుడి తీరుపై మనో వేదనకు గురైన విద్యార్థిని ఈనెల7న పురుగుల మందు తాగింది. బెంగళూరు విక్టోరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. విద్యార్థిని తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో ఉపాధ్యాయుడిపై ధర్మస్థల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు రూపేష్‌ను అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరచగా మధ్యంతర బెయిల్ మంజూరైంది.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య

హోసూరు: హోసూరు, బర్గూరు ప్రాంతాల్లో ఒక కూలీ, మహిళ వేర్వేరుగా ఆత్మహత్య చేసుకొన్నారు. వివరాల మేరకు తిరువళ్లూరు జిల్లా పొన్నేరి ప్రాంతానికి చెందిన ఐజక్ (33). హోసూరు తేరుపేటలో నివాసముంటూ కూలిపనులు చేస్తున్నాడు. కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన ఐసక్ రెండు రోజుల క్రితం ఉరివేసుకున్నాడు. గమనించిన స్థానికులు అతన్ని ఉరి నుంచి రక్షించి క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఫలితం లేక సోమవారం రాత్రి మృతి చెందాడు. అలాగే బర్గూరు సమీపంలోని బాలేపల్లి గ్రామానికి చెందిన శారద (57) అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతూ ఉండేది. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఉరివేసుకొని ప్రాణాల్ని తీసుకొంది. కందికుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు.

వీలింగ్‌పై పోలీసుల స్పెషల్ డ్రైవ్

దొడ్డబళ్లాపురం: రద్దీగా ఉడే రోడ్లపై వీలింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న బైకిస్టులపై జ్ఞానభారతి ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వీలింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు బైకిస్టులపై కేసు నమోదు చేశారు. విజయ నేత్రాలయ జంక్షన్‌లో పోలీసులు మఫ్టీలో ఉండగా నాగరబావి సర్కిల్ నుంచి సుమనహళ్లి వైపు వెళ్లే ఔటర్ రింగ్ రోడ్డుపై వీలింగ్ చేస్తూ వచ్చిన ఒక యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు.అదేవిధంగా రిచ్మండ్ రోడ్డులో వీలింగ్ చేస్తున్న మరో మైనర్ బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

ఎర్రచందనం స్వాధీనం


పట్టుబడిన దుంగలు

కృష్ణరాజపురం: హొసకోటె పట్టణం తిమ్మసంద్రలో భారీగా ఎర్రచందనం దుంగలు పట్టుబడ్డాయి. మంజునాథ్ అనే వ్యక్తి ఇంటి పక్కన షెడ్డులో మంగళవారం సూలెబెలె పోలీసులు తనిఖీలు చేపట్టగా 882 కిలోల ఎర్ర చందనం దుంగలు పట్టుబడ్డాయి. వీటి విలువ రూ.28 క్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఇర్ఫాన్‌ఖాన్, వాసింఖాన్, జమీర్‌ఖాన్, షేక్‌షంషుద్దీన్, షేక్ ఇమ్రాన్, మంజునాథ్ అనే నిందితులను అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పులి దాడిలో గొర్రెల కాపరులకు గాయాలు

మైసూరు : పులి దాడిలో ఇద్దరు గొర్రెల కాపరులు గాయపడ్డారు. ఈఘటన చామరాజనగర జిల్లా గుండ్లుపెట తాలూకా బండీపుర పులుల సంరక్షణ ఆటవీ ప్రాంతంలోని జీ.ఎస్‌బెట్ట విభాగం పరిధిలో ఉన్న శివపుర గ్రామం తెంగెతట్టు ప్రాంతంలో జరిగింది. గ్రామానికి చెందిన శివశెట్టి, జవరయ్య అనే వ్యక్తులు తమ పొలాల్లో గొర్రెలు మేపుతుండగా పులి దాడి చేసింది. బాధితుల అరుపులు విన్న స్థానికులు గట్టిగా కేకలు వేయడంతో పులి ఉడాయించింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ ఆస్పత్రికి తరలించారు.

హోసూరు వార్తలు..

స్థలాలు ఒకరివి, పరిహారం ఇతరులకు

- క్రిష్ణగిరిలో బాధితుల ధర్నా

క్రిష్ణగిరి: జాతీయ రహదారి నిర్మాణానికి తీసుకొన్న భూమికి పరిహారాన్ని వేరే వ్యక్తికి అందజేశారని ఆరోపిస్తూ యజమాని కుటుంబస్తులు క్రిష్ణగిరిలో రహదారుల శాఖ రెవెన్యూ విభాగం కార్యాలయం ముందు ఆందోళన చేశారు. హోసూరు సమీపంలోని మత్తిగిరి వద్ద నాలుగు రోడ్ల హైవే నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. రోడ్డు నిర్మాణానికి అనేకమంది నుంచి అధికారులు స్థలాలను సేకరించారు. ఇందులో భూమిని కోల్పోయిన నాగరాజ్, వరలక్ష్మి, రంజిత్‌కుమార్ తదితర పదిమందికిపైగా జిల్లా కేంద్రం క్రిష్ణగిరిలో ఆందోళన నిర్వహించారు. రోడ్డు నిర్మాణానికి తమకు సొంతమైన ఎకరా స్థలాన్ని కోల్పోయామని, ఆ స్థలానికి పరిహారాన్ని వేరే వ్యక్తికి అందజేశారని వాపోయారు. వెంటనే తమకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో చర్చించారు. అనంతరం బాధితుడు నాగరాజ్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశాడు. పరిశీలించి తగు చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

బావిలో శవం

కురుబరపల్లి సమీపంలో జింజుపల్లిలో రైతు బావిలో ఓ వ్యక్తి శవం బయటపడింది. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని స్వాధీనపరుచుకొని క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి సుమారు 45 ఏళ్ల వయస్సు ఉంటుందని, ఆచూకీ కోసం విచారణ జరుపుతున్నట్లు కురుబరపల్లి పోలీసులు తెలిపారు.

వలస కూలీలపై దాడి, పలువురు అరెస్టు

హోసూరు: క్రిష్ణగిరి ప్రాంతంలోని ప్రైవేట్ పరిశ్రమల్లో ఉద్యోగం ఇప్పిస్తామని ఉత్తర భారతీయులను రప్పించి వారి వద్ద డబ్బు డిమాండ్ చేసిన ముఠాను కురుబరపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకెళితే ఈరోడ్ జిల్లా కాంచికోయిల్ ప్రాంతానికి చెందిన సెల్వం (30) ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం చత్తీస్‌గడ్ రాష్ట్రానికి చెందిన మోహన్‌రామ్ (26), పరశురామ్ (24) సహా ఏడుమందిని జోలార్‌పేటకు రైలులో రప్పించుకున్నారు. సెల్వం అనుచరులు వారిని క్రిష్ణగిరి సమీపంలోని కురుబరపల్లి వద్దకు తీసుకెళ్లి ఉద్యోగం కోసం తలా రూ. 20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ వద్ద డబ్బు లేవనడంతో దాడి చేశారు. బాధితులు తప్పించుకుని కురుబరపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోచ్చంపల్లి ప్రాంతానికి చెందిన నిశాంత్ (26), అరుణ్ (28), ప్రభు(28), అరవింద్(23), మణిగంటన్ (29)లను అరెస్ట్ చేశారు. వారి వద్ద ఉన్న ఓ కారుతో పాటు రూ. 1500 నగదు, 7 సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనపరుచుకొన్నారు.


అన్న చేతిలో తమ్ముడు హతం


ఘటనా స్థలంలో దేవరాజ్ మృతదేహం

క్రిష్ణగిరి: సూళగిరి తాలూకా ఉద్దనపల్లి సమీపంలో అన్నదమ్ముల మధ్య ఏర్పడిన ఆస్తి తగాదాల్లో అన్న చేతిలో తమ్ముడు దారుణహత్యకు గురయ్యాడు. వివరాల మేరకు ఉద్దనపల్లి దగ్గర లాలికల్ గ్రామానికి చెందిన రైతు వెంకటేశప్పకు ఆరుగురు కొడుకులున్నారు. మంగళవారం అన్నదమ్ముల మధ్య ఆస్తి పంపకాలపై ఘర్షణ మొదలైంది. ఈ సమయంలో పెద్ద కొడుకు మంజునాథ్ (48), తమ్ముడు దేవరాజ్ (42) పై మారణాయుధాలతో దాడి చేసి చంపాడు. విషయం తెలుసుకొన్న ఉద్దనపల్లి పోలీసులు చేరుకొని శవాన్ని హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

అడవులు బూడిద కారాదు

- అటవీశాఖ జాగృతి


హోసూరు సమీపంలో అడవులు

హోసూరు: వేసవి ఎండలు పెరుగుతుండడంతో దట్టమైన అటవీ ప్రాంతాల్లో అగ్నిప్రమాదాల నివారణకు అటవీ శాఖాధికారులు చర్యలు చేపడుతున్నారు. క్రిష్ణగిరి జిల్లాలో 1,700 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో దట్టమైన అటవీ ప్రాంతాలున్నాయి. ప్రధానంగా కావేరి పరివాహక ప్రాంతం, సూళగిరి సమీపంలోని మేలుమలై కొండలు, అంచెట్టి అటవీ ప్రాంతం, అయ్యూరు అటవీ ప్రాంతం తదితర దట్టమైన అటవీ ప్రాంతాలున్నాయి. ఈ అటవీ ప్రాంతాలు కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు రాష్ట్ర సరిహద్దులను కలుపుతున్నాయి. దీంతో పాటు క్రిష్ణగిరి జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో దక్షిణ పెన్నా, కావేరి, సనత్ కుమార్ నదులు ప్రవహిస్తున్నాయి.

పశువుల కాపర్లకు హెచ్చరిక

వేసవి కాలం ఆరంభం కావడంతో ఎండుటాకులు రాలి పడుతున్నాయి. ఈ సమయంలో కార్చిచ్చు సులభంగా రగుల్కొంటుంది. అటువంటి ప్రమాద స్థలాలను గుర్తించి నివారణ చర్యలు చేపడతామని జిల్లా అటవీ అధికారులు తెలిపారు. పశువుల కాపర్లు అటవీ ప్రాంతాల్లోకి వెళ్లినప్పుడు చుట్టు బీడీ వంటివి తాగరాదని, మంట పెట్టరాదని తెలిపారు. మంటల వల్ల విలువైన చెట్లు కాలిపోవడంతో పాటు వన్యమృగాలు కనుమరుగవుతాయన్నారు. అడవులను కాపాడుకోవాలని తెలిపారు.

మీ బుద్ధే కలుషితం

గుంటూరు నగరంలో సక్రమంగానే మంచినీరు

- తుప్పు పైపులైన్లకు కాదు.. మీ బుర్రకే
- అంతర్గత పైపు లైన్ల కోసం రూ. 44 కోట్లు కేటాయింపు
- మంచినీటి సరఫరా మెరుగుదలకు రూ. 123.15 కోట్లు
- తాజాగా అమృత్ పథకం కింద 184 కోట్ల రూపాయలు మంజూరు
- వేసవికి ముందే పైపులైన్ల మరమ్మతులు
- పైపులైన్ల ఇంటర్ కనెక్షన్, రైల్వే క్రాసింగ్‌లతో సరఫరా మెరుగు
- కక్ష కట్టి పచ్చమీడియా కలుషిత వార్తలు




గుంటూరు నగరంలో జరుగుతున్న పైపులైన్ మరమ్మతు పనులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు : గుంటూరు నగరంలో ఎన్నడూ లేనివిధంగా నాలుగేళ్లలో రూ.కోట్ల ఖర్చుతో అంతర్గత నీటి సరఫరా, నూతన పైపులైన్లు, ఇంటర్ కనెక్షన్లు ఏర్పాటు చేశారు. కానీ రెండు రోజులుగా గుంటూరుతో పాటు పలు ప్రాంతాల నుంచి వాంతులు, విరోచనాలతో కొంతమంది ప్రభుత్వాసుపత్రిలో చేరడంతో దానిపై పచ్చ మీడియా రాద్ధాంతం చేస్తోంది. కలుషిత నీటితో ప్రాణాలు పోతున్నా పట్టవా అంటూ తుప్పు పట్టిన వార్తతో ఈనాడు పత్రికలో తప్పుడు కథనాలు రాసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది. పైపులైన్లు ప్రాణసంకటంగా మారాయని కలుషిత వార్తను వండివార్చింది. వాస్తవంగా పరిశీలిస్తే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక పైపులైన్లను మార్చుతూ వచ్చింది. కానీ ఇవన్నీ కప్పిపుచ్చి పైపులైన్లు మార్చకపోవడం వల్లే ఈ పరిస్థితి వస్తుందంటూ పచ్చమీడియా కట్టుకథలు అల్లింది. వాతావరణ మార్పులు, కృష్ణానదిలో వస్తున్న నీటిలో తేడా వల్ల కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే గత 15 రోజులుగా నగరపాలక సంస్థ సరఫరా చేస్తున్న నీటిని కాచి చల్లార్చి తాగాలంటూ మున్సిపల్ కమిషనర్ ప్రకటనలు ఇస్తూనే ఉన్నారు.

దశలవారీగా పైపులైన్లు మార్పు

ఆరేడు దశాబ్దాల క్రితం వేసిన పైపులైన్లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దశలవారీగా మారుస్తూ వస్తోంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మంచినీటి సరఫరా మెరుగు కోసం చర్యలు చేపట్టలేదు. కొత్తగా పైపులైన్లు వేసిన చోట కూడా ఇంటర్ కనెక్షన్లు ఇవ్వకపోవడం వల్ల అవి నిరర్థకంగా మారాయి. వైఎస్సార్‌సీపీ గుంటూరులో పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎన్నడూ లేని విధంగా నగరంలో రూ.123.15 కోట్ల అంచనాలతో మంచినీటి సరఫరా కోసం ఖర్చు చేస్తున్నారు. అంతర్గత పైపులైన్లు మార్చడం కోసమే ప్రత్యేకంగా రూ. 44 కోట్లు ఖర్చు పెడుతున్నారు. గతంలో పైప్‌లైన్లు వేసినప్పటికీ ఇంటర్ కనెక్షన్, సంజీవయ్యనగర్ రైల్వే ట్రాక్ క్రాసింగ్ చేయకపోవడం వల్ల తాగునీటి సమస్యలు వచ్చేవి. ప్రస్తుతం సంజీవయ్య నగర్ వద్ద ట్రాక్ క్రాసింగ్ చేయడం, ఇంటర్ కనెక్షన్ ఏర్పాటు చేశారు. నెహ్రూ నగర్ రిజర్వాయర్ నుంచి పశ్చిమ నియోజకవర్గానికి 800 డయా పైప్‌లైన్ అందుబాటులోకి తీసుకురావడం ద్వారా నీటి సరఫరాలో గతంలో ఉన్న సమస్యలు లేకుండా పోయాయి. తక్కెళ్లపాడు హెడ్ వాటర్‌వర్క్స్ నుంచి గోరంట్ల కొండమీదకి పైపులైన్, కొండపై రిజర్వాయర్, కొండ నుంచి చిల్లీస్ రెస్టారెంట్ జంక్షన్ వరకూ 500 ఎంఎం గ్రావిటీ డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ కోసం రూ. 33 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారు. కోటీ 15 లక్షల రూపాయలతో సంగం జాగర్లమూడి హెడ్‌వాటర్‌వర్క్స్‌లోని పాత ఫిల్టరేషన్ ప్లాంట్‌ను పునరుద్ధరించారు. నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి సంజీవనగర్ రైల్వేగేట్‌కు 900 ఎంఎం పైపు లైన్ కోసం రూ. కోటీ 15 లక్షలు, సంజీవ్‌నగర్ రైల్వే గేట్ వద్ద ఇంటర్ కనెక్షన్‌కు రెండు కోట్ల రూపాయలు, నగరంలో స్కాడా వ్యవస్థ ఏర్పాటుకు రూ. 12 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు.

నగరంలో కొత్త పైపులైన్లు

ఇవి కాకుండా గుంటూరు నగరంలో ప్రధానమైన పైపులైన్లతో పాటు అంతర్గత పైపులైన్లను ఎప్పటికప్పుడు మారుస్తూ వస్తున్నారు. తాజాగా అమృత్ పథకం కింద రూ. 184 కోట్ల రూపాయలు గుంటూరు నగరానికి మంజూరు అయ్యాయి. కృష్ణానది పక్కన ఉండవల్లి నుంచి మంగళగిరి వరకూ పాత పైపులైన్ మార్చడంతో పాటు అదనంగా కొత్త పైపులైన్ వేశారు. మంగళగిరి నుంచి గుంటూరు నగరంలోని తక్కెళ్లపాడుకు, సంగం జాగర్లమూడి నుంచి గుంటూరు నగరానికి కొత్త పైపులైన్లు వేయడంతో పాటు అంతర్గత పైపులైన్లు మార్చేందుకు ఈ రూ. 184 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి. వీటికి సంబంధించిన డీపీఆర్‌లు సిద్ధం అవుతున్నాయి. వీటన్నింటిని మరుగునపెట్టి బురద జల్లడమే పనిగా పచ్చమీడియా పెట్టుకుంది.

హత్యకు తెగబడ్డ టీడీపీ వర్గీయులు

- వైఎస్సార్‌సీపీకి చెందిన యువకుడి హత్య
- దారికాచి చంపిన పచ్చమూక
- బొగ్గుల బట్టీలో మృతదేహాన్ని పూడ్చిపెట్టిన నిందితులు
- వైఎస్సార్ జిల్లాలో దారుణం



కుంచాల రామ్మోహన్‌రెడ్డి (ఫైల్)


బ్రహ్మంగారి మఠం: వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారి మఠం మండలం మలుగుడుపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ వర్గీయుడు కుంచాల పిచ్చిరెడ్డి కుమారుడు రామ్మోహన్‌రెడ్డి (28)ని అదే గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయుడు కుంచాల వెంకటరెడ్డి, మరికొందరు కలిసి దారుణంగా హత్య చేశారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బొగ్గుల వ్యాపారం విషయంలో కుంచాల రామ్మోహన్ రెడ్డి, కుంచాల వెంకటరెడ్డి మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలోనే కొన్ని నెలల క్రితం వీరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో రామ్మోహన్‌రెడ్డి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఉద్యోగంలో చేరాడు. 20 రోజుల క్రితం ఊరికి రాగా.. అవకాశం కోసం ఎదురుచూస్తున్న వెంకటరెడ్డి అతడిని మట్టుబెట్టాలనుకున్నాడు. ఈ నెల 9న రామ్మోహన్‌రెడ్డి తన ఇంటి నుంచి బైక్‌పై బద్వేలు వెళ్లాడు. పథకం ప్రకారం రామ్మోహన్‌రెడ్డికి తిరుగు ప్రయాణంలో అతడి స్నేహితుడి ద్వారా మద్యం తాగించారు. 7.30 గంటల సమయంలో బైక్‌పై వస్తున్న రామ్మోహన్ రెడ్డిని బి.కోడూరు మండలం తుమ్మలపల్లె దగ్గర వెంకటరెడ్డి, ఆయన తమ్ముడు గురివిరెడ్డి, మరో ఐదుగురు దాడిచేసి చంపేశారు. మృతదేహాన్ని ట్రాక్టర్‌లో వంకమర్రి తీసుకెళ్లి.. అక్కడకు సమీపంలోని వెంకటరెడ్డి బొగ్గుల బట్టీ దగ్గర పూడ్చారు. రామ్మోహన్‌రెడ్డి తండ్రి పిచ్చిరెడ్డి ఫిర్యాదు మేరకు బి.మఠం ఎస్‌ఐ విద్యాసాగర్ సోమవారం మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వెంకటరెడ్డి, అతడి కుటుంబ సభ్యులపై అనుమానం రావడంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా విషయం బయటపడింది. మంగళవారం వంకమర్రి దగ్గరకు వెళ్లి బొగ్గుల బట్టీ దగ్గర రామ్మోహన్‌రెడ్డి శవాన్ని పోలీసులు వెలికి తీయించారు.

టీడీపీ సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు

హత్య చేసింది టీడీపీ వర్గీయులైతే.. వైఎస్సార్‌సీపీ వారే హత్య చేయించారంటూ సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటని హతుడు రామ్మోహన్‌రెడ్డి అన్న వెంకటరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. టీడీపీకి చెందిన బొగ్గుల వ్యాపారి కుంచాల వెంకటరెడ్డి, ఆయన అనుచరులు, కుటుంబ సభ్యులు తమ కుటుంబంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడే వారన్నారు. చివరకు తన తమ్ముడిని హత్యచేయడమే కాకుండా టీడీపీ వర్గీయుడిని వైఎస్సార్‌సీపీ నాయకులు హత్య చేసినట్టు ప్రచారానికి పూనుకున్నారన్నారు.

బీసీలకు రాజ్యాధికారం.. జగన్ ఘనతే

రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్



పెనుగొండ: సామాజిక న్యాయం కోసం నిరంతరం తపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజ్యాధికారంలో బీసీలకు అత్యంత ప్రాధాన్యత కల్పించారని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలంలోని ఆచంట, పెనుమంచిలి, ఆచంట వేమవరం, కోడేరు, కొడమంచిలి గ్రామాల్లో నిర్వహించిన పలు ప్రారంభోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. బోస్ మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పుడూ బీసీలను ఓటర్లుగానే భావించి.. రాజ్యాధికారానికి దూరంగా ఉంచేవారన్నారు. బీసీలు జడ్జిలుగా పనికిరారంటూ వ్యాఖ్యానాలు చేయడయే ఇందుకు నిదర్శనమని చెప్పారు. చంద్రబాబు మాటలకే పరిమితమయ్యే వ్యక్తి అని, సీఎం జగన్ సామాజిక న్యాయాన్ని అమలు చేసి చూపారని తెలిపారు. దీనికి తార్కాణం రాబోయే ఎన్నికల రంగంలో ఉభయ గోదావరి జిల్లాల్లో అత్యధిక సీట్లు బీసీలకు కేటాయించడమేనని చెప్పారు. టీడీపీ ఎన్ని కేటాయిస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ.. పులిని చూసి నక్క వాతలు పెట్టుకొన్న చందంగా లోకేశ్ యువగళం పాదయాత్రంటూ ఆర్భాటం చేసి చతికిల బడ్డారన్నారు. రాష్ట్రంలో రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని పునరుద్ఘాటించారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథ రాజు, ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, ఏఎంసీ చైర్‌పర్సన్ చిల్లే లావణ్య, సర్పంచులు పాల్గొన్నారు.

మేలు మరచిన జంగా కృష్ణమూర్తి

నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట)/అనంతపురం కార్పొరేషన్: బీసీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చినన్ని పదవులు ఎవరూ ఇవ్వలేదని, ఆయన దయతో పదవులు పొందిన జంగా కృష్ణమూర్తి .. తిరిగి సీఎంపైనే చేసిన వ్యాఖ్యలు బాధ కలిగించాయని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. మంగళవారం నెల్లూరులో ఆయన మాట్లాడుతూ 2014లో ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ఆయనకు అవకాశం కల్పిస్తే ఎన్నికల్లో ఓడిపోయారని గుర్తు చేశారు. అయినా సీఎం జగన్ పెద్ద మనస్సుతో ఓడిపోయిన జంగా కృష్ణమూర్తికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారన్నారు. పార్టీలో అనేక మేలులు పొందిన జంగా ఇప్పుడు పార్టీపై బురదచల్లడం మంచిపద్ధతి కాదన్నారు. అనేక సందర్భాల్లో పార్టీలో ఆయనకు పెద్దపీట వేసి గౌరవం కల్పించారన్నారు. పదవుల్లో ఉన్నప్పుడు జగనన్న దేవుడని పొగిడిన వాళ్లు పార్టీ వదిలి వెళ్లేటప్పుడు ఇలాంటి మాటలు మాట్లాడడం అలవాటైపోయిందన్నారు. నరసరావుపేట ఎంపీగా పోటీ చేయడానికి తొలుత జంగాకే అవకాశమిచ్చారని, ఆయన కాదంటేనే తాను అక్కడ పోటీ చేసేందుకు వెళుతున్నానన్నారు. నాయకుడు చెప్పినట్లు పనిచేయడమే తనకు తెలుసని, పదవులు అనుభవించాక ఒక రకంగా మాట్లాడడం బాధాకరమన్నారు. చంద్రబాబు పంపిన స్క్రిప్ట్‌ను తమ అవసరాలకు అనుగుణంగా మార్చుకుని జగనన్నను విమర్శించేవారు పార్టీలో లేకపోయినా నష్టం లేదన్నారు.

జంగా వ్యాఖ్యలు అర్థరహితం: హరీష్‌కుమార్ యాదవ్

సీఎం వైఎస్ జగన్‌పై ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని, మరోసారి విమర్శలు చేస్తే ఊరుకోబోమని యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ హెచ్చరించారు. అనంతపురంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్... జంగా కృష్ణమూర్తికి ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్, ఆయన కుమారునికి జెడ్పీటీసీ, మరో కుమారుడికి సర్పంచ్‌గా అవకాశం ఇచ్చారని గుర్తుచేశారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలకు 50 శాతం నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించారన్నారు.

హైదరాబాద్‌లో స్టూడియోల మాటేంటి?

- తన సినీ దోస్తులకు బాబు వందల ఎకరాలు ధారాదత్తం
- సీమ అభివృద్ధికి మహి రాఘవ రెండెకరాలు అడిగితే రాద్ధాంతం
- పచ్చమీడియాలో తప్పుడు కథనాలపై సినీ ప్రముఖుల ఆగ్రహం
- ఎల్లోమీడియాను నిలదీసిన నటుడు, నిర్మాత ఓ.కల్యాణ్



సాక్షి, హైదరాబాద్: సినీ దర్శకుడు మహి వి.రాఘవకు ఏపీ ప్రభుత్వం రెండు ఎకరాల స్థలాన్ని సంతర్పణ చేయనుందంటూ ఎల్లోమీడియాలో వచ్చిన కథనంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెనుకబడిన తన ప్రాంత అభివృద్ధి కోసమే మదనపల్లి సమీపంలోని హార్సిలీ హిల్స్‌లో మినీ స్టూడియో నిర్మాణానికి స్థలం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి దరఖాస్తు చేశానని.. తన ప్రాంతానికి మంచి చేయాలనే సంకల్పం లేకపోతే హార్సిలీ హిల్స్‌లో ఎందుకు స్టూడియో నిర్మించాలనుకుంటాను? అని రాఘవ ఇప్పటికే స్పష్టం చేయగా.. ఆంధ్రజ్యోతి మాత్రం యాత్ర–2 సినిమా చేసినందుకు రెండెకరాలు కట్టబెడుతున్నారంటూ తన అక్కసునంతా వెల్లగక్కింది. ఈ కథనాన్ని పలువురు సినీ ప్రముఖులు తప్పుపడుతున్నారు. చంద్రబాబు హయాంలో ఆయన సినీ దోస్తులకు హైదరాబాద్‌లో వందల ఎకరాలకు ఎకరాలు కట్టబెట్టారని.. ఇప్పుడు రాయలసీమ ప్రాంత వాసులకు ఉపయోగపడేలా మినీ స్టూడియో కోసం రెండెకరాలు అడిగితే బాబుకు బాకా ఊదే ఎల్లోమీడియా రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడుతున్నారు. చంద్రబాబు ధారాదత్తం చేసిన భూముల గురించి ఎల్లోమీడియాకు ప్రశ్నించే దమ్ముందా? అని ప్రశ్నిస్తున్నారు.

హైదరాబాద్‌లో చంద్రబాబు ఇచ్చినవన్నీ ఒప్పేనా?: ఓ.కల్యాణ్

ఈ మేరకు నటుడు, నిర్మాత, ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు ఓ.కల్యాణ్ నిలదీశారు. ఈ మేరకు మంగళవారం ఒక వీడియో విడుదల చేశారు. రాయలసీమలోని హార్సిలీ హిల్స్‌లో మినీ స్టూడియో కోసం డైరెక్టర్ మహి వి.రాఘవ రెండు ఎకరాల స్థలాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరడం తప్పయితే.. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు సినిమా రంగానికి చెందిన పలువురికి హైదరాబాద్‌లో స్థలాలు ఇవ్వడం తప్పు అనిపించలేదా? అని ప్రశ్నించారు. హార్సిలీ హిల్స్‌లో రెండు ఎకరాలు సంతర్పణ అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని.. అసలు ఇంతవరకూ దానిపై ఎలాంటి జీవో రాలేదని.. ఎంత ధరకు ఇస్తున్నారు? దేనికోసం ఇస్తున్నారు? ఇల్లు కట్టుకోవడానికి ఇస్తున్నారా? లేదా స్టూడియో నిర్మాణానికా అన్నది ఆలోచించకుండా ఇష్టానుసారం రాయడం సరికాదన్నారు. హైదరాబాద్‌లో సినిమా వాళ్లకు చంద్రబాబు ఇచ్చినవన్నీ ఒప్పు అనుకున్నప్పుడు రాఘవకు ఇస్తే కూడా ఒప్పు అనుకోవాలి కదా? ఇక్కడ తప్పు అనుకున్నప్పుడు హైదరాబాద్‌లో స్థలాలు కట్టబెట్టడం కూడా తప్పే కదా? అని ప్రశ్నించారు. సినీ రంగం అభివృద్ధికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అక్కినేని నాగేశ్వరరావుకు ప్రభుత్వం 14 ఎకరాల స్థలాన్ని తక్కువ ధరకు స్టూడియో నిర్మాణానికి ఇచ్చిందని, ఎన్టీఆర్ కూడా ప్రభుత్వం ఇచ్చిన భూమిలో స్టూడియోలు కట్టుకున్నారని ఓ.కల్యాణ్ చెప్పారు. పద్మాలయ స్టూడియో, రామానాయుడు స్టూడియో, ఆనంద్ సినీ సర్వీసెస్(5 ఎకరాలు), ప్రసాద్ ల్యాబ్‌కు కూడా అప్పట్లో సబ్సిడీ ధరకు ప్రభుత్వం స్థలం ఇచ్చిందన్నారు. ప్రసాద్ ల్యాబ్‌కు ఎదురుగా కె.రాఘవేంద్రరావు, ఆయన సోదరుడు కృష్ణమోహన్‌కు కూడా స్థలం ఇచ్చారని, వారి వెనుక సంగీత దర్శకుడు చక్రవర్తికి కూడా స్థలం ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం ప్రసాద్ ఐ మ్యాక్స్‌కు నెక్లెస్ రోడ్డులో స్థలం ఇచ్చిన విషయం గుర్తులేదా? అని ప్రశ్నించారు. సినీ కార్మికుల కోసం చిత్రపురి కాలనీకి 67 ఎకరాల స్థలం ఇచ్చారని, తెలంగాణ ఏర్పడ్డాక డైరెక్టర్ ఎన్.శంకర్‌కు స్టూడియో నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలాన్ని ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. నిర్మాత రామానాయుడుకు వైజాగ్ రుషికొండలో దాదాపు 20 ఎకరాల స్థలం ఇచ్చిన విషయం తెలియదా? అని ప్రశ్నించారు.

కబ్జాలలో బాబు, రామోజీ దొందూ దొందే

ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



కొమ్మాది(విశాఖ జిల్లా): కబ్జాలలో చంద్రబాబు, రామోజీ దొందూ దొందేనని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి విమర్శించారు. టీడీపీని చంద్రబాబు కబ్జా చేస్తే తెలుగు రాష్ట్రాల్లో విలువైన భూములను రామోజీ కబ్జా చేశారన్నారు. పచ్చ మీడియా తప్పుడు రాతలతో ఉత్తరాంధ్ర ప్రజలను మభ్యపెట్టలేరన్నారు. టీడీపీ హయాంలో జరిగిన కబ్జాలపై ఆ పార్టీ నాయకులు చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎండాడలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. అసలు కబ్జాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు, రామోజీలేనన్నారు. విశాఖ, విజయవాడలో లీజుకు తీసుకున్న భూముల టీడీఆర్‌లను సొంతం చేసుకోవడానికి రామోజీ కుట్ర చేశారన్నారు. లోకేశ్ తోడల్లుడు 'గీతం' భరత్ 46 ఎకరాలు కబ్జా చేశారన్నారు. విశాఖలో 430 ఎకరాల కబ్జా భూములను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుందన్నారు. టీడీపీ అధికారంలో ఉండగా గంటా శ్రీనివాసరావు 1,700 ఎకరాలు కబ్జా చేశారని నాడు మంత్రి అయ్యన్నపాత్రుడే ఆరోపించారని తెలిపారు.

టీడీపీ, ఎల్లోమీడియాది తప్పుడు ప్రచారం

- తెలంగాణ ఎన్నికల్లో నేను, నా కుటుంబం ఓట్లు వేయలేదు
- ప్రస్తుతం ఉంటున్న మంగళగిరిలోనే ఓట్లు నమోదు చేయించాం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణా రెడ్డి



పొన్నూరు నియోజకవర్గంలోని తన ఓటును తొలగించాలని సజ్జల రామకృష్ణారెడ్డి చేసుకున్న దరఖాస్తు పత్రం

సాక్షి, అమరావతి: పచ్చ కామెర్లు ఉన్న వాడికి లోకమంతా పచ్చగా కనబడినట్టుగా ఒక తెలుగుదేశం నాయకుడు, ఆ పార్టీకి కొమ్ముకాస్తున్న మీడియా తనపై తప్పుడు ప్రచారం చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి దుయ్యబట్టారు. టీడీపీ మద్దతుదారులు తెలంగాణలో ఓట్లు వేసి, ఏపీలో ఓట్లకు దరఖాస్తు చేసుకున్నట్టుగా తాను ఎన్నడూ దిగజారి ప్రవర్తించలేదని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తెలంగాణ ఎన్నికల్లో తాను, తన కుటుంబం ఓట్లు వేయలేదని వెల్లడించారు. ప్రస్తుతం నివాసం ఉంటున్న రెయిన్‌ట్రీ కాలనీలో రోడ్డుకు ఒక వైపు ఉన్న అపార్ట్‌మెంట్లు పొన్నూరు నియోజకవర్గంలో, రెండో వైపు ఉన్న విల్లాలు మంగళగిరి నియోజకవర్గంలో ఉంటాయని చెప్పారు. ఓటర్ల జాబితాలో చేరిక సమయంలో పొన్నూరు నియోజకవర్గంలో పేర్లు నమోదు చేసినట్లు తెలిపారు. అసలు విషయం తెలిసిన తర్వాత మంగళగిరి నియోజకవర్గంలో ఓట్ల నమోదుకు దరఖాస్తు చేసుకున్నామన్నారు. మొదటగా దరఖాస్తు చేసిన పొన్నూరు నియోజకవర్గ ఓటర్ల జాబితా నుంచి తమ పేర్లను తొలగించాలని కోరుతూ జనవరి 31వ తేదీనే దరఖాస్తు చేసినట్టు వివరించారు. ఇప్పటికే ఆ జాబితా నుంచి తొలగించి ఉంటారని భావిస్తున్నానన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలను కూడా విడుదల చేశారు. ఇన్నాళ్ల ప్రజా జీవితంలో ఎన్నడూ టీడీపీ ముఠా మాదిరిగా అనైతిక చర్యలకు పాల్పడలేదన్నారు. తప్పుడు పద్ధతుల్లో కుప్పంలో వేలాది దొంగ ఓట్లు నమోదు చేయించుకున్న మాదిరిగా అడ్డదారులు తొక్కాల్సిన అవసరం తమకు లేదని అన్నారు.

రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యం

రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

పట్నంబజారు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రీజినల్ కో -ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం గుంటూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సమన్వయకర్తలతో సమీక్షాసమావేశం జరిగింది. అనంతరం ఎంపీ విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు, పరిశీలకులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలు, లోక్‌సభ స్థానం గెలుపే లక్ష్యంగా దృష్టి సారించి ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఏడు సీట్లలో విజయం తథ్యమని, మంగళగిరిని సైతం గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీకి అవకాశం ఇవ్వబోమని స్పష్టం చేశారు. సీట్ల మార్పు అంశంలో ఎవరైతే గెలుస్తారో, వారిని మార్పు చేశామని, మిగతా వారు అలాగే అభ్యర్థులుగా కొనసాగుతారని తెలిపారు. ఈ సమావేశంలో శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, మేకతోటి సుచరిత, అన్నాబత్తుని శివకుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవరప్రసాద్, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనిక్రిస్టినా, సమన్వయకర్తలు బలసాని కిరణ్‌కుమార్, షేక్ నూరిఫాతిమా, గంజి చిరంజీవి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, పార్టీ నేత రావెల కిషోర్‌బాబు, విడదల గోపి, పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, బత్తుల బ్రహ్మానందరెడ్డి, పలు కార్పొరేషన్ల చైర్మన్‌లు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

శంఖారావ సభలు వెలవెల



పాతపట్నం శంఖారావం సభలో లోకేశ్ మాట్లాడుతున్న సమయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

ఎల్.ఎన్.పేట/పాతపట్నం/మెళియాపుట్టి/పాలకొండ రూరల్/పాలకొండ/కురుపాం: తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంగళవారం పాతపట్నం, పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో చేపట్టిన శంఖారావం సభలు జనంలేక వెలవెలబోయాయి. పాతపట్నం సభలో ఎర్రబుక్, సీఎం జగన్ అవినీతి, ధరలు, మా నాన్న చంద్రబాబుని అన్యాయంగా జైల్లో వేశారు.. అంటూ పాత ప్రసంగాన్నే లోకేశ్ కొనసాగించారు. ఇది వినలేక చాలా మంది సభ మధ్యలోనే వెళ్లిపోయారు. టీడీపీ ప్రతిజ్ఞ చేస్తున్న సమయంలో సభంతా ఖాళీ అయిపోయింది. ముందు వరుసలో కేవలం ముఖ్యనాయకులే మిగిలారు. పాతపట్నం నియోజకవర్గంలో టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయారు.

పాలకొండలో గందరగోళం

పాలకొండ సభలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జయకృష్ణకు టికెట్ ఇవ్వద్దంటూ ఆయన వ్యతిరేక వర్గం బలప్రదర్శనకు దిగడంతో గందరగోళంగా మారింది. ఓ వైపు జయకృష్ణ, పడాల భూదేవి వర్గాలు టికెట్ తమకే ఇవ్వాలంటూ ఎవరికివారే ప్రయత్నిస్తే... మరోవైపు జనసేనకు అవకాశం కల్పించాలంటూ స్థానిక యువత నినదించారు. లోకేశ్ ప్రసంగం ఎప్పటిలా ఆరోపణలకే పరిమితమైంది. స్థానిక సమస్యలపై టీడీపీ నాయకులు అందించిన స్క్రిప్ట్‌ను చదవలేక లోకేశ్ ఆపసోపాలు పడ్డారు. వంశధార నదిని దోచేశారని, డిగ్రీ కళాశాల స్థలం ఆక్రమించారని అవగాహన లేని ఆరోపణలు చేశారు. కురుపాం సభలో టీడీపీ కార్యకర్తలు, నాయకుల్లో ఎక్కువ కేసులు ఎవరిపై నమోదైతే వారికే నామినేటెడ్ పదవి ఇస్తానంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. కురుపాంలో ఓ రౌడీ షీటర్‌ను ఆలింగనం చేసుకున్నారు. అయితే వేదికపైకి సీనియర్లను ఆహ్వానించకపోవడంతో, పార్టీ కోసం శ్రమించిన వారికి విలువ లేదంటూ వారు బహిరంగంగానే విమర్శలు చేయడం విశేషం.

నాన్ లోకల్ పొలిటీషియన్లు పెరిగారు

- పనీపాట లేనప్పుడు ఏపీకి వచ్చి విషం చిమ్మి వెళ్లిపోతున్నారు
- మంత్రి ఆర్కే రోజా




ఏయూ క్యాంపస్ (విశాఖ జిల్లా): ఎన్నికలు దగ్గరకు వచ్చేసరికి హైదరాబాద్ నుంచి రాష్ట్రానికి నాన్ లోకల్ పొలిటీషియన్ల రాక పెరిగిందని.. పనీపాట లేనప్పుడు ఇక్కడకు వచ్చి విషం చిమ్మి వెళ్లిపోతున్నారని రాష్ట్ర పర్యాటక, క్రీడల శాఖ మంత్రి ఆర్కే రోజా ఆగ్రహం వ్యక్తంచేశారు. పేదల అభివృద్ధిని ఓర్చుకోలేకపోతున్నారని.. అందుకే ప్రతిపక్షాలన్నీ సీఎం జగన్‌పై విషం చిమ్మడానికే పని చేస్తున్నాయని మండిపడ్డారు. 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను వీక్షించేందుకు మంగళవారం విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి వచ్చిన మంత్రి రోజా మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు వల్లే టీడీపీ హయాంలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని చెప్పారు. అధికారం కోసం ఆయన ఎవరి కాళ్లు, ఎన్నిసార్లు అయినా పట్టుకుంటారని ఎద్దేవా చేశారు. గతంలో కాంగ్రెస్, బీజేపీ.. ఆ తర్వాత కాంగ్రెస్.. మళ్లీ ఇప్పుడు బీజేపీ నాయకుల కాళ్లు పట్టుకుని అధికారం కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. ఆడుదాం ఆంధ్రా ద్వారా మట్టిలోని మాణిక్యాలను వెలికి తీసి.. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై వారంతా తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించే అవకాశాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం కల్పించిందన్నారు. రాష్ట్ర ప్రజల కోసం, క్రీడాకారుల కోసం ఏం చేశారో కూడా చెప్పుకోలేని పరిస్థితిలో చంద్రబాబు ఉన్నారని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్ చెప్పే మాటలు ప్రజలు నమ్మడం లేదని.. అందుకే ప్యాకేజ్ ఇచ్చి పవన్‌కళ్యాణ్‌ను తెచ్చుకున్నారని విమర్శించారు. ఆయనను కూడా ప్రజలు నమ్మకపోయేసరికి.. ఇప్పుడు షర్మిలను తీసుకువచ్చి చంద్రబాబు తన స్క్రిప్ట్‌ను చదివిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు స్క్రిప్ట్ పట్టుకొని ఒక్కొక్కరుగా హైదరాబాద్ నుంచి వచ్చి మాట్లాడి వెళ్లిపోతున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ ఆడబిడ్డనని, తెలంగాణ ప్రజలకు సేవ చేస్తానని మొన్నటి వరకు ఎన్నో మాటలు చెప్పిన షర్మిల.. ఎన్నికలకు ముందు ఏపీకి వచ్చి సీఎం జగన్‌ను ఎందుకు తిడుతున్నారో రాష్ట్ర ప్రజలంతా ఆలోచించాలని మంత్రి రోజా కోరారు.

బాబును నమ్మితే మోసపోవడమే

- బీసీలకు అధికారం జగన్‌తోనే సాధ్యం
- నా హయాంలో కులగణన జరగడం అదృష్టం: మంత్రి వేణు



రాజమహేంద్రవరం రూరల్: బీసీలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్ సమున్నత ఆశయానికి, బీసీలను మోసం చేసే చంద్రబాబు నాయుడి అత్యాశకు మధ్య పోటీ జరగబోతోందని రాష్ట్ర సమాచార పౌరసంబంధాలు, బీసీ సంక్షేమ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆయన మంగళవారం రాజమహేంద్రవరంలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి పోటీలో బాబును నమ్మితే బీసీలు మోసపోవడం తప్ప జరిగేదేమీ ఉండదన్నారు. మంజునాథ కమిషన్ వేసినప్పుడు బీసీల తరపున శెట్టిబలిజ సామాజిక వర్గం పెద్దన్న పాత్ర పోషించిందని మంత్రి వేణు గుర్తుచేశారు. రామచంద్రపురం టౌన్, రూరల్ అసెంబ్లీ స్థానాలు, రాజమహేంద్రవరం, నరసాపురం లోక్‌సభ స్థానాలను బీసీ వర్గానికి చెందిన శెట్టిబలిజలకు సీఎం జగన్ కేటాయించారన్నారు. రాజమహేంద్రవరం అసెంబ్లీ స్థానాన్ని గౌడ, రాష్ట్రంలో మిగిలిన చోట్ల మత్స్యకారులు, యాదవులకు సీట్లు ఇచ్చారని తెలిపారు. శెట్టిబలిజలకు జగన్ అన్యాయం చేశారని చంద్రబాబు తన మీడియాలో బాబు రాయిస్తూ బురద జల్లుతున్నారని మండిపడ్డారు. రాయలసీమలో బలిజలు ఓసీ వర్గంలోకి వస్తారని, ఈ విషయం పక్కన పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. గతంలో కాకినాడ పర్యటనకు వచ్చిన చంద్రబాబును శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన నాయకులు తమకు రెండు సీట్లు కేటాయించాలని అడిగితే, సీట్లు ఇస్తే గెలవగలరా అంటూ గేలి చేసిన విషయం ఎవరూ మర్చిపోలేదని మంత్రి వేణు గుర్తుచేశారు. బీసీలకు అధికారం ఇవ్వడానికి ఎవరు చొరవ చూపిస్తున్నారో అర్థం చేసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే 85శాతం కులగణన పూర్తయిందని చెబుతూ బలహీన వర్గాల భావజాలాన్ని ఎరిగిన ప్రభుత్వంగా జగన్ సర్కార్ నిలిచిందని తెలిపారు. తాను బీసీ మంత్రిగా ఉండగా కులగణన జరగడం తన అదృష్టమని మంత్రి చెల్లుబోయిన వేణు చెప్పారు.



శ్రీమతికి ప్రేమలేఖ

ఒకప్పటి ప్రేమలు వేరు.
కమ్యూనికేట్ చేయాలంటే ప్రేమలేఖ తప్ప
మరో మార్గం లేదు.
కాని అందుకు అమ్మాయి నోట్స్
అడగాలి. తీసుకుని అందులో లెటర్ పెట్టాలి.
పెట్టింది ఆమె చదవాలి. చదివి ఓకే చేయాలి.
ఈలోపు ఆ లెటర్ ఎవరి కంటైనా పడిందో...
ఇన్ని తిప్పలు పడి ప్రేమను పొంది భార్యను చేసుకున్నాక
ప్రేమను వ్యక్తం చేయడమే మానేస్తారు కొందరు భర్తలు.
మీ శ్రీమతికి ప్రేమలేఖ రాసి ఎంత కాలం అయ్యింది?
మీ భర్తను అడిగారా ఒక లవ్ లెటర్ రాయమని?

ప్రేమలేఖ! ఈ మాట వినగానే ఎన్ని జ్ఞాపకాలు చుట్టుముడతాయి. టైప్ ఇన్‌స్టిట్యూట్‌లో పరిచయాలు, కాలేజీ క్లాసుల్లో దొంగ చూపులు, వీధుల్లో అమ్మాయి ఇంటి మీదుగా అబ్బాయి సైకిల్ షికార్లు, సినిమా హాల్లో కనిపిస్తే వెనుక సీటులో కూచుని సినిమాను వదిలి ఆమెనే చూడటాలు, శుక్రవారం గుడికి వస్తుందని ఎదురు చూపులు, కళ్లు కలుస్తాయి... ఇష్టం తెలుస్తూనే ఉంటుంది... ఖాయపరుచుకోవాలంటే ప్రేమలేఖ రాయాలి... బదులు లేఖ అందుకోవాలి. అందుకు ఏం చేయాలి? దారిన వెళుతున్నప్పుడు ఎవరూ చూడకుండా కాళ్ల దగ్గర పడేయాలి. లేదంటే నోట్స్ అడిగి అందులో పెట్టి అందించాలి. ఇరుగింటి పొరుగింటి పిల్లలతో చేరవేయాలి... తీరా ఆమెకు అందించాక ఏం జవాబు వస్తుందోనని నిద్రపోక, రాత్రి కాచి, తెల్లారి కాలేజీకి పరిగెత్తాలి.

ప్రేమ ఎంత మధురం. ప్రేమలేఖ అంతకన్నా మధురం.

మరి యువతీ యువకులు కాస్తా భార్యాభర్తలుగా మారిపోతే ఆ ప్రేమ పోతుందా? ఎక్కడకు పోతుంది? ఎక్కడికీ పోదు. కాకుంటే మెప్పించే పని లేదని, చెప్పే పని ఇకపై లేదని మరుగున పడిపోతుంది. ప్రేమించి పెళ్లి చేసుకున్నా... పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకున్నా దంపతుల మధ్య ఉండే ప్రేమ కొబ్బరాకుల చాటున దాగిన వెన్నెల వంటిది. ఆగి ఆగి వీచే చల్లని గాలి వంటిది. దగ్గరగా కూచుని ధ్యాస లేనట్టుగా పట్టుకునే చేతి స్పర్శ వంటిది.


ఇవాళ వాలెంటైన్స్ డే.

తమలోని ప్రేమను భర్త భార్యకు, భార్య భర్తకు ఒక లేఖగా రాయగలిగితే? ఫోన్లు పక్కన పెట్టి, వాట్సప్‌లు చెత్తకు నెట్టి, అలా మనవైన అక్షరాలతో జీవిత భాగస్వామిపై ప్రేమ వెల్లడి చేస్తే... ఎంత బాగుంటుంది. ప్రేమిస్తున్నానని రాసి చెప్పండి, ఆ భావన భలే ఉంటుంది. మధురోహల వల కమ్ముకుంటుంది. కొన్ని లేఖలు ఇలా ఉండొచ్చు.

ఏవోయ్...

నీకో సంగతి చెప్పనా? నీకు లవ్ లెటర్ రాయాలని గంట సేపు పెన్ను వెతికాను. నిన్ను అడిగితే ఇప్పుడు పెన్నెందుకు అంటావని... నేనేదో రాయబోతున్నానని నీకు తెలిసిపోతుందని. నిజానికి నా గురించి నీకు తెలియనిది ఏముందని... నిన్ను చూస్తుంటే ప్రేమిస్తున్నానని గ్రహించావు... కానుక ఇవ్వలేకపోతే చిన్న ఉద్యోగినని సర్దుకున్నావు... అమాసకూ పున్నానికీ కూడా మూరెడు మల్లెపూలు తేకపోతే మీ మనసు పరిమళం చాలండీ అన్నావ్... నేను మౌనంగా పేపర్ చదువుకుంటుంటే నీతో మాట్లాడుతున్నట్టేనని పక్కన కూచుంటావు. మరి నాలో నీ కోసం సముద్రమంత ప్రేమ ఉందని ఇలా రాసి చెప్పాలా? సరేలే. రాస్తున్నానుగా. రేపెప్పుడైనా నీ మనవలకూ మనవరాళ్లకు దీనిని చూపించి మీ తాతగారి రైటింగ్ చూడండ్రా ఎలా కోడి గీతల్లా ఉందో... అని నవ్వుకోవడానికైనా ఉండాలిగా. మరోసారి ఏవోయ్... నిజంగా నిన్ను పెళ్లి చేసుకునేంత వరకూ నా రాత గజిబిజే. నిన్ను చేసుకున్నాకే అది అందంగా మారింది. అర్థంతో నిండింది. నేను 'ఏవోయ్' అని పిలిచినప్పుడల్లా నా జీవితాంతం నువ్వు పలుకుతూ ఉంటే చాలు. ఇంతకు మించి ఇంకేమి నాకు అక్కర్లేదు. నీక్కూడా నా 'ఏవోయ్' అని పిలుపే చాలనుకో.

లవ్ యూ.
ఇట్లు
నీ ఏమండీ.



నా ప్రియాతి ప్రియమైన దివాకర్...

అబ్బ.. ఎన్ని రోజులైంది మిమ్మల్ని ఇలా పిలిచి. పెళ్లికి ముందు ఆంధ్రా యూనివర్సిటీలో మనం ప్రేమించుకుంటున్న రోజుల్లో దివాకర్ అని పిలిచేదాన్ని. పెళ్లయ్యాక కూడా అలాగే పిలుస్తుంటే మీ అమ్మగారు 'ఏమిటి... ఇంకా పేరుపెట్టి పిలుస్తున్నావ్.. ఏమండీ అనలేవూ' అని దడిపించింది. మీరేమో అమ్మకూచి ఆయే. సరేనని కంటిన్యూ అయిపోయాను. మీరివ్వాళ అమెరికాలో స్థిరపడ్డ ఇద్దరు పిల్లలకు తండ్రయినా, పెద్ద అధికారిగా రిటైర్ అయినా, నాలో సగభాగమైన నా భర్తయినా, ప్రేమించుకునే రోజుల్లో షోగ్గా బైక్ మీద ఎక్కించుకుని నన్ను తిప్పిన దివాకర్‌గానే నాకు ఎక్కువ ఇష్టం. ఆ రోజుల్లో అనుక్షణం మీ కళ్లు నన్ను వెతికేవి. అనునిత్యం నన్ను కలవాలని పరితపించేవి. పరీక్షల టైమ్‌లో ప్రిపరేషన్ కోసం నేను పదిరోజులు కనిపించకపోతే వొళ్లెరగని జ్వరం తెచ్చుకున్న పిచ్చిప్రేమికుడు మీరు. మీ జీతం, మీ సంపాదన... తెచ్చి నా చేతుల్లో పడేసి ఏం పట్టించుకునేవారు కాదు... మీకున్నది ఒకటే పట్టింపు... నన్ను బాగా చూసుకోవడం. దివాకర్... మనం వైజాగ్ వెళ్లి చాలా రోజులైంది. ఒకసారి వెళదామా... రామకృష్ణబీచ్‌లో మీ పక్కన కూచుని కాల్చిన వేరుశనక్కాయలు మళ్లీ తినాలని ఉంది. వేలెంటైన్స్ డే నాడు నా ఈ కోరికను విని మీరు హడావిడిలో విమానం కొనేయాలని చూడకండి. చక్కగా గోదావరిలో వెళదాం. మన ప్రేమ ప్రయాణం సాగిద్దాం...

ఇట్లు
(మీరు నేనున్నప్పుడు మాత్రమే
నన్ను పిలిచే ముద్దు పేరును భర్తీ చేసుకోగలరు)

లవ్ పల్స్ 2024

'2024 లవ్‌ట్రెండ్స్'కు సంబంధించి గ్లోబల్ సర్వే నిర్వహించిన డేటింగ్ యాప్ 'హ్యాపెన్' 'ప్రేమను పునర్నిర్వచించే కాలం ఇది' అంటుంది. ఫ్రాన్స్, బ్రెజిల్, నార్వేలాంటి దేశాలతో పాటు మన దేశంలోనూ సర్వే చేశారు. ప్రేమకు సంబంధించి వయసు, సంస్కృతి సంప్రదాయాలను చాలామంది పరిగణనలోకి తీసుకోవడం లేదు. 86 శాతం మంది ప్రేమలో 'ఎమోషన్ బ్యాలెన్స్'ను ఆశిస్తున్నారు.

పాపులర్ యాప్ 'బంబుల్' మోడ్రన్ లవ్ రిపోర్ట్ ప్రకారం ప్రేమలేఖలు రాయడాన్ని 63 శాతం, క్యాండిల్ లైట్ డిన్నర్స్‌ను 66 శాతం, లవ్ గెశ్చర్స్‌ను 51 శాతం ఇష్టపడుతున్నారు. 54 శాతం కాన్‌స్టంట్ అటెన్షన్‌ను ఇష్టపడుతున్నారు. 'ప్రేమలో అవతలి వ్యక్తి ప్రతిభా సామర్థ్యాలు, ఆకర్షణీయ మాటల కంటే నిజాయితీనే ఎక్కువమంది ఇష్టపడుతున్నారు' అంటుంది బంబుల్ రీసెర్చ్ రిపోర్ట్.

'వాలెంటైన్స్ డే'ను జెన్ జెడ్, మిలీనియల్స్ ఎలా సెలబ్రేట్ చేసుకోవడానికి ఇష్టపడుతున్నారు అనే విషయానికి వస్తే...'క్వాక్ క్వాక్' యాప్ రిపోర్ట్ ప్రకారం 47 శాతం మంది బడ్జెట్-ఫ్రెండ్లీ సెలబ్రేషన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రాక్టికల్, మీనింగ్‌ఫుల్ గిఫ్టులను ఇచ్చిపుచ్చుకోవడానికి ఇష్టపడుతున్నారు.

'మేము రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నాము. వాలెంటైన్స్ డే హైప్‌కు ప్రాధాన్యత ఇవ్వను. వాలెంటైన్స్ డే పేరుతో వృథా ఖర్చు చేయవద్దని అతడికి చెప్పాను' అంటుంది ఢిల్లీకి చెందిన 24 సంవత్సరాల కృతి.

'25 నుంచి 30 ఏళ్ల లోపు వర్కింగ్ ప్రొఫెషనల్స్‌లో 37 శాతం మంది ఒంటరితనానికి దూరం కావడానికి రొమాంటిక్ రిలేషన్‌షిప్‌కు అతీతంగా స్నేహం చేస్తున్నారు' అని చెబుతుంది 'క్వాక్ క్వాక్' రిపోర్ట్.

వాలెంటైన్స్ డే అనగానే ప్రేమికుల సంగతే గుర్తొస్తుంది. మరి ప్రేమలో పడని వారి సంగతి ఏమిటి?

ప్రేమలో పడకపోయినా వాలెంటైన్స్ డేను హ్యాపీగా జరుపుకుంటున్న వారి సంఖ్య తక్కువేమీ కాదు. సెల్ఫ్-కేర్, సెల్ఫ్-లవ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. 'నేను ఇప్పటివరకు ప్రేమలో పడలేదు. అమ్మానాన్నలది ప్రేమ వివాహం. సరిగ్గా ప్రేమికుల రోజే వారి పెళ్లి జరిగింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రేమికుల రోజు, పెళ్లిరోజును కలుపుకొని ఆ రోజు ఇంట్లో వేడుక చేసుకుంటాం. ఇంటిని లవ్ షేప్‌డ్ బెలూన్లతో అలంకరిస్తాం. లవ్-షేప్‌డ్ బెలూన్‌ల బ్యాక్ డ్రాప్‌గా ఫోటోలు దిగడంతో పాటు ఫన్ యాక్టివిటీస్‌ను ప్లాన్ చేస్తాం. లవ్ సింబల్స్‌తో ఉన్న డిఐవై(డూ ఇట్ యువర్ సెల్ఫ్) గిఫ్ట్ బ్యాగ్‌లు పంచుతాం' అంటుంది చెన్నైకి చెందిన 22 సంవత్సరాల లిపిక.

సెలబ్రిటీల స్ఫూర్తితో 'లవ్'ను గోప్యంగా ఉంచే 'లో కీ స్టైయిల్' పెరుగుతోంది. 'ఎలాంటి సమస్యలు లేవు. మాది కమిట్‌మెంట్‌తో కూడిన ప్రేమ' అనే నమ్మకం వచ్చాకే తమ ప్రేమ గురించి నలుగురికి తెలియజేస్తున్నారు. నవతరం ప్రేమధోరణులను చూస్తుంటే 'ప్రేమకు చూపులేదు' అనే మాటకు సవరణ అవసరం అనిపిస్తుంది. పంచేంద్రియాలతో, ప్రాపంచిక స్పృహతో వారి ప్రేమప్రయాణం పచ్చగా కొనసాగుతుంది.

ప్రేమంటే అక్షరాలకి అలవోకగా అందేది.
ఎంతకూ అందనిది... సులభంగా అర్థమయ్యేది.
ఎంతకీ అర్థం కానిది. అయినప్పటికీ... కీ పాయింట్
ఏమిటంటే...
ప్రేమకు వైరుధ్యాలతో అట్టే పనిలేదు.
అదే ప్రేమ గొప్పతనం. శక్తి!
రెండు ముక్కల్లో చెప్పాలంటే...
ప్రేమంటే ఒక హృదయంపై మెరిసే
రెండు సంతకాలు. రెండు జీవితాలు.
ప్రేమికుల రోజు సందర్భంగా
ఈ కాలం ప్రేమ గురించి...

యూత్ పల్స్

పెద్ద బ్రాండ్ల ప్రేమ చరణాలు



'వాలెంటైన్స్ డే'కు సంబంధించి టాప్ బ్రాండ్స్ సోషల్ మీడియా పోస్టులు యూత్‌ను తెగ ఆకట్టుకుంటున్నాయి. వాటిని రీ-షేర్ చేస్తున్నారు. వాటిలో కొన్ని...

దిహార్ట్ వాంట్స్ వాట్ ఇట్ వాంట్స్ - పేటీయం
బ్లైండ్ టు లవ్, లవ్ టు బ్లైండ్ - స్పాటిఫై
లవ్ ఈజ్ ది రియల్ మ్యాజిక్ - కోకా-కోలా
యువర్ లవ్ విల్ టేక్ యూ టూ ప్లేసెస్ యూ లవ్ - టాటా మోటర్స్
ప్యార్ హ్యాజ్ ఏ లాంగ్వేజ్ ఆఫ్ ఇట్స్ వోన్ - క్లియర్ ట్రిప్
ఎట్ ది హార్ట్ ఆఫ్ యువర్ జర్నీ ఈజ్ ఏ లవ్ ఫర్ ది అన్‌నోన్ - టయోటా ఇండియా
లవ్ వాట్ యూ డూ. డూ వాట్ యూ లవ్ - కార్టూన్ నెట్‌వర్క్(సీఎన్)
లవ్ ఈజ్ ఏ ప్రామిస్ అండ్ ఐ ప్రామిస్ టు ఆల్వేస్ లవ్ యూ - ఇన్‌స్టాగ్రామ్

లవ్ లింగో



లవ్ హేజ్: ప్రేమికుడు/ప్రేమికురాలులో లోపాలను చూడలేని స్థితి
వ్యాల్యూ మ్యాచ్: భవిష్యత్‌లో సమస్యలు తలెత్తకుండా లైఫ్‌స్టైల్ చాయిస్, అభిరుచులు మ్యాచ్ కావడం.
ఐఎన్ఏ: ఐ హేట్ నథింగ్ ఎబౌట్ యూ
ఘోస్టింగ్: టెక్ట్స్‌కు రెస్పాండ్ కాకపోవడం, కమ్యూనికేషన్ బ్రేక్ కావడం
బ్రెడ్ క్రంబింగ్: దృష్టిలో పడడానికి, ఆకట్టుకోవడానికి ఫ్లర్ట్ టెక్ట్స్ పంపడం
పీఏడబ్ల్యూ: పేరెంట్స్ ఆర్ వాచింగ్
లవ్ బాంబింగ్: గిఫ్టులు, కాంప్లిమెంట్స్, సర్‌ప్రైజ్‌లతో ప్రేమను వ్యక్తం చేయడం
ఆర్బిటింగ్: లవ్ బ్రేక్ అయినప్పటికీ సోషల్ మీడియాలో ఆమె/అతడిని ఫాలో కావడం రహస్య ఆసక్తి

మొక్కలు నడిచొచ్చిన వేళ...

ప్రేమికుల రోజు పువ్వులతో ముడిపడి ఉన్న రోజు. లవర్‌కు గులాబీ లేదా అందమైన బొకేలను ఇస్తారు. అయితే ఈమధ్య కాలంలో





ఇండోర్ మొక్కలను కానుకగా ఇస్తున్నారు. గులాబీలు, బొకేలు ఇస్తే ఒకేరోజుకు పరిమితం అవుతాయి. ఇండోర్ ప్లాంట్స్ ఇస్తే ఎన్నో నెలలు ఉంటాయి. వాటిని నిద్ర నుంచి లేవగానే చూస్తే గాల్లో ప్రియరాగాలు ప్రతిధ్వనిస్తాయి. రకరకాల భావాలకు ప్రతీకగా నిలిచే ప్రేమ మొక్కలు ఇవి. మచ్చుకు కొన్ని...

అంత్యూరియం - హాస్పిటాలిటీ, లవ్
జైడ్-గుడ్‌లక్ అండ్ ఫార్చ్యూన్
హోయ కెర్రీ- లవ్ అండ్ డివోషన్
స్ట్రింగ్స్ ఆఫ్ హార్ట్స్- బ్యాలెన్స్ అండ్ కనెక్షన్
పీస్ లిల్లీ ప్లాంట్-ఇన్నోసెన్స్ అండ్ పీస్
మనీ ప్లాంట్-అందం, ఐశ్వర్యం

లవ్ యూ గూగుల్ లవ్ డూడుల్

సోషల్ మీడియా సంచారులైన యువతరానికి వాలెంటైన్స్ డే అనగానే గుర్తుకు వచ్చేది గూగుల్ వాలెంటైన్స్ డే డూడుల్స్. క్రియేటివిటీ ఉట్టిపడే ఈ లవ్ డూడుల్స్‌ను ఆల్బమ్‌లాగా తయారు చేసుకుంటున్నారు. వాటిపై తమకు తోచిన వాక్యాలను రాస్తున్నారు. గత సంవత్సరం గూగుల్ వాలెంటైన్స్ డే డూడుల్ 'వావ్' అనిపించింది. ఈ యానిమేటెడ్ డూడుల్‌లో పై నుంచి పడుతున్న నీటి చుక్కలు ఒక్కటై 'హార్ట్' షేప్‌లో ఏర్పడతాయి. మరింత ఆకట్టుకునేలా దీనికి 'రెయిన్ ఆర్ షైన్, విల్ యూ బీ మైన్' అనే కాప్షన్ ఇచ్చారు.





★ సినిమా ప్రేమలు...

ఎవరి స్టయిల్ వారిదే!

ప్రేమించడం నిజజీవితంలో కాస్త అరుదే. అక్కడెవరో వాళ్లెవరో ప్రేమించారట, ఇక్కడెవరో ప్రేమించి పెళ్లి చేసుకున్నారట అంటూ వినడం తప్ప వాస్తవంలో ప్రేమ అందరికీ అంతగా అనుభవంలోకి రాదు. (కాపోతే కాలేజీల్లో విరివిగా కనిపించినా... చదువు ముగిసేనాటికి, మురిగిపోయే జస్ట్ సీజనల్ ప్రేమలవి).

సినిమాల్లో అలా కాదు. ప్రతి మూవీలోనూ ప్రేమ ఉండనే ఉంటుంది. పట్టుబట్టి విషాదాంతం తీయాలని భీష్మించుకుంటే తప్ప... హీరో, హీరోయిన్ల ప్రేమ ఫలించి తీరుతుంది.

విచిత్రం ఏమిటంటే... హీరోను బట్టి లేదా దర్శకుడిని బట్టి వారి వారి ప్రేమలకూ ఓ శైలి ఉంటుంది. హీరో మ్యానరిజంలాగా అదీ ప్రత్యేకంగా కొట్టొచ్చినట్టు కనిపిస్తుంటుంది.

ఉదాహరణకు ఎన్టీఆర్ సినిమాల్లో అంతా జస్ట్ స్ట్రెయిట్ ఫార్వర్డ్ ప్రేమ. అక్కినేని వారి ప్రేమల్లా ఇక్కడ సంక్లిష్టతలుండవు. కాకపోతే అలనాటి గుండమ్మకథలో 'కోలుకోలోయమ్మ కోలో నాస్వామి' అంటూ పాడుతూ... 'హేయ్ బుల్లెమ్మా...' 'ఓయ్ బుల్లెమ్మా' అంటూ అరుపులు అరిచినా... ఆ తర్వాత 'త్రిఖ రేగి ధిమ్మిరెక్కి' అంటూ యమగోల చేసినా... అప్పటి అరుపులతో ఇప్పుడు నడుం మీద చరుపులూ కనిపిస్తాయి. వెరసి అవి... దట్టంగా, దిట్టంగా మిళాయించిన మసాలాలా, గ్యాసెక్కువైన సోడాలా ఘాటుగా నాటుగా ఉంటాయంతే. ఎన్టీఆర్ ప్రేమలన్నీ దాదాపుగా ఒక హీరోయిన్‌తోనే... సిక్స్ లేన్స్ హైవే మీద ఎదురెవ్వరూ రాని ట్రాఫిక్‌లా సాఫీగా, హాయిగా సాగిపోయే ప్రేమలే.

ఇక ఏఎన్నార్ దగ్గరికి వస్తే ఆయన సినిమా ప్రేమలన్నీ సంక్లిష్టంగా ఉంటాయ్. ఆయన ఎవరినో ప్రేమిస్తాడు... హీరోయిన్ కూడా యథాశక్తి ఏఎన్నార్‌ను లవ్ చేస్తుంది. కానీ మరెవరో సెకండ్ హీరోయిన్ కూడా నాగేశ్రావ్‌నే లవ్ చేయడంతో... కుటుంబంకోసమో, చెల్లెలి ప్రేమ కోసమో... తప్పనిసరి పరిస్థితుల్లో అక్కినేని కూడా ఆమెనే ప్రేమించాల్సొస్తుంది. అంతే...! పాపం అక్కడో ఓ త్రికోణ ప్రేమ ఏర్పడటంతో త్రికోణమితి సూత్రాలూ, లెక్కలూ సినిమాలోకి వచ్చేసి ఈక్వేషన్లను చిక్కుముడుల్లా సంక్లిష్టంగా మార్చేస్తుంది. దాంతో ప్రేక్షకులు కూడా ఆ బెర్ముడా ట్రయాంగిల్‌లో చిక్కి... పాపం గిలగిల్లాడతారు. జామెట్రీ భాషలో చెప్పాలంటే ఎన్టీఆర్‌వన్నీ సరళరేఖ ప్రేమలూ... ఏఎన్ఆర్‌వన్నీ ట్రిగనామెట్రీ లెక్కలూ!!

శోభన్‌బాబువి కూడా ఇంచుమించూ త్రికోణమితులేగానీ... ఆయన మనసు మరీ విశాలం కావడంతో ఇద్దరు హీరోయిన్లనీ మితిమీరి సమానంగా ప్రేమిస్తాడు. వారిద్దరి ప్రేమల్నీ తన మనసు సున్నితపు త్రాసులో సమానంగా తూస్తాడు. అద్దిగ్గో... అక్కడొస్తుంది కథలో బలం. నిజానికి ట్రిగనామెట్రీలన్నీ శోభన్‌బాబువే. నిజం చెప్పాలంటే ఏఎన్నార్‌వి 'సుడిగుండాలే'!

ఇక సూపర్‌స్టార్ కృష్ణ ప్రేమలు కూడా దాదాపు ఎన్టీఆర్ ప్రేమల్లా స్ట్రెయిట్‌గా ఉంటాయి. కాకపోతే హీరోయినే ప్రేమించి ప్రేమించి పైపైన పైపైన పడిపోతుంటుంది. ఈమె తప్పనిసరిగా విలన్ కూతురే అయి ఉంటుంది. అంతగా పైపైన పడిపోయినందుకు కృష్ణ కూడా రుణం ఉంచుకోడు. పరిహారంగా డ్యూయెట్లలో ఈయన కూడా ఏదో ఓ టైమ్‌లో ఆమె ఎద మీద తలవాల్చి బదులు తీర్చుకుంటాడు. ఆ దృశ్యమే వాల్‌పోస్టర్‌గా మారి ప్రేక్షకుల్ని సినిమాకు ఆహ్వానిస్తుంది.

చిరంజీవి హీరోయిన్ల తీరు కూడా ఇంచుమించూ సూపర్‌స్టార్ కృష్ణ స్టైల్లోనే ఉంటది. ఈయన కూడా కృష్ణలాగే హీరోయిన్‌ను 'హేయ్ తింగరిబుచ్చి' అంటూ తీసిపారేస్తూనో... 'చెయ్యి చూశావా.. ఎంత రఫ్‌గా ఉందో' అంటూ సరదా బెదిరింపులతో సందడి చేస్తుంటాడు. చిరంజీవి బెదిరిస్తాడు. హీరోయిన్ ప్రేమకోసం దేబిరిస్తుంది.

ఇంకో విశేషం... చిరంజీవి సినిమాల్లోనూ ఇద్దరు హీరోయిన్లు ఉంటారు. అయితే వాళ్లిద్దరూ తమ శక్తికొద్దీ హీరోని ప్రేమించినప్పటికీ... ఏఎన్నార్, శోభన్‌బాబు ప్రేమల్లోలా ఇక్కడ సంక్లిష్టతలుండవ్. ఆ ఇద్దరి ప్రేమలూ గ్లామర్ కోసమే. కాబట్టి ఈ ప్రేమల్లో సంఘర్షణలూ ఉండవు. ఇవన్నీ అందంగా చెదిరిపడ్డ సరళరేఖలే కావడంతో ప్రేక్షకులు అదిరిపడ్డానికి ఆస్కారాలుండవ్.

• • •

హీరోల ప్రేమలకే కాదు... తెర మీద ప్రేమను చూపడంలోనూ దర్శకులకూ ఓ స్టైలుంటుందీ, ఓ మేనరిజముంటుంది. కళాతపస్వి కె.విశ్వనాథ్ సినిమాలో హీరోయిన్ ప్రేమలన్నీ చాలా ఉదాత్తంగా ఉంటాయ్. నిజజీవితంలో ఏ హీరోయిన్‌లు కూడా ప్రవర్తించనంత ఉన్నతంగా ఉంటాయ్. అంతెందుకు... మన జీవితాల్లో మన చెల్లెలికో, మన కూతురికో విశ్వనాథ్ సినిమాలో లాంటి హీరో సంబంధం వస్తే స్ట్రెయిటవే వద్దనేస్తాం. అలాంటి హీరోకి మనింటి ఆడబిడ్డనివ్వం.

డైరెక్టర్ రాఘవేంద్రరావు సినిమాలకు వద్దాం. ఇక్కడ ప్రేమలన్నీ ఫ్రూట్ జ్యూసులంత మధురంగా, పండ్లు తింటే సమకూరేంత ఆరోగ్యంగా నవనవలాడుతూ ఉంటుంది. ముఖ్యంగా డ్యూయెట్లలో!. అప్పటిదాకా తీసిపారేసే హీరో కూడా... హీరోయిన్ ఎద మీద నడుములిరిగిపోయినట్టు వాలిపోయినట్టే... నడుములిరగకపోయినా ప్రేక్షకులూ ఆమె మీద అంతే మోతాదులో మనసు పారేసుకుంటారు.

• • •

హీరో హీరోయిన్లకు తోడు, సపోర్టింగ్ క్యారెక్టర్లూ మేమూ ఉన్నామంటూ తగుదునమ్మా అంటూ వచ్చేస్తారు. వాళ్లూ హీరోయిన్ని ప్రేమిస్తారు. హీరోయిన్ దక్కాల్సింది హీరోకే కదా. అందుకే ప్రేమించిన పాపానికి... పాపం వాళ్లు తగిన మూల్యం చెల్లించి శంకరగిరి మాన్యాలకు ట్రైన్ టిక్కెట్లు అడ్వాన్సు బుకింగ్ చేయించుకుంటారు. అందరికీ తెలిసినా క్లైమాక్స్ వరకూ వాళ్లకా విషయం తెలియకపోవడమే ఇక్కడ విశేషం.

ఉదాహరణకు... మాయాబజార్‌లో లక్ష్మణకుమారుడైన రేలంగి కూడా శశిరేఖ సావిత్రి మీద మనసు పడతాడు. కానీ నాగేశ్రావ్‌కే కదా సావిత్రి దక్కాల్సిందీ! కాబట్టి... దర్శకుడు రేలంగిని ముప్పుతిప్పలు పెట్టిస్తాడు. చేతులు తక్కువ అంటుకుపోవడంతో... చప్పట్లు కొట్టడానికి కూడా జంకేలా భయపడతాడు. పులిని చూసినట్టు భయపడటమనేది రేలంగికి నిజంగానే అనుభవంలోకొస్తుంది. అప్పుడు రేలంగైనా అంతే... ఇప్పుడు అదుర్స్‌లో బ్రహ్మానందానికైనా ఇంతే.

సినిమాలు మారతాయి. హీరోలూ, హీరోయిన్లలో కొత్త తరాలు వస్తాయి. కానీ ప్రేమ మాత్రం అజరామరంగా ఉండిపోతుంది. కాకపోతే ఒకనాటి పాత సినిమాల్లో ప్రేమ ఉదాత్తంగా ఉంటుంది. ఈ తర్వాత చిరంజీవి నాటి మధ్యయుగాల్లో కాస్త రఫ్‌గా ఉన్నా సరదా సరదాగా ఉంటుంది. ఇక ఈ తరం అర్జున్‌రెడ్డిలకు వచ్చేసరికి అప్పటి మేన్లీ మేన్ కాస్తా... ఇంకాస్త హార్ష్ అండ్ పవర్‌ఫుల్ అవుతాడు. యాంగ్రీ యంగ్ కాస్తా యానిమల్ అయిపోతాడు.

సినీ విమర్శకులంతా డార్విన్‌లాగా వచ్చేసి... పరిణామక్రమంలో ఆల్ఫీబ్రాలూ, ఆల్ కెన్ బి అఛీవ్‌డ్ బై హీరోలనే ఆ ధీరోదాత్తులు తమకు ఉన్న టైటిల్లోని ఉదాత్తత కోల్పోయి... ఆల్ఫా మేల్స్‌గా యానిమల్స్‌గా ప్రవర్తిస్తుంటారని సెలవిచ్చేస్తారు. హీరోయిన్లు మాత్రం అప్పుడూ ఇప్పుడూ డిల్లమొహంలేసుకుని, తెల్లబోతూ, జెల్లకొట్టే ఆ హీరోనే అనాదిగా, అనంతంగా, ఆత్రంగా అలా ప్రేమిస్తూనే ఉండిపోతారు.

– యాసీన్



ప్రిక్వార్టర్స్‌లో సుమిత్ నగాల్

భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ బెంగళూరు ఓపెన్ ఏటీపీ-100 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 98వ ర్యాంకర్ సుమిత్ 6-2, 6-2తో జెఫ్రీ బ్లాంకానెక్స్ (ఫ్రాన్స్)పై గెలుపొందాడు. 88 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో గంటా సాయికార్తీక్ రెడ్డి-మనీశ్ సురేశ్‌కుమార్ (భారత్) జోడీ 2-6, 6-7 (8/10)తో కుజ్మయిన్-జాన్వీర్ (ఫ్రాన్స్) జంట చేతిలో ఓడిపోయింది.

భారత మాజీ కెప్టెన్ దత్తాజీ రావు కన్నుమూత



వృద్ధాప్య సంబంధిత సమస్యలతో భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ దత్తాజీ రావు గైక్వాడ్ మంగళవారం బరోడాలో కన్నుమూశారు. ఆయన వయసు 95 ఏళ్లు. 1952 నుంచి 1961 వరకు భారత జట్టు తరఫున ఆయన 11 టెస్టులు ఆడి ఒక అర్ధ సెంచరీతో 350 పరుగులు చేశారు. దేశవాళీ క్రికెట్‌లో బరోడా తరఫున దత్తాజీ 14 సెంచరీలతో కలిపి 3,139 పరుగులు చేశారు. ఆయన సారథ్యంలోనే బరోడా 1958లో తొలిసారి రంజీ ట్రోఫీ గెలిచింది.

ఉమామహేశ్‌కు రెండో స్వర్ణ పతకం



పసిడి పతకాలతో ఉమామహేశ్, ఇషా

గ్రనాడా (స్పెయిన్): ప్రపంచకప్ జూనియర్ షూటింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ షూటర్ మద్దినేని ఉమామహేశ్ ఖాతాలో రెండో స్వర్ణ పతకం చేరింది. సోమవారం జూనియర్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో బంగారు పతకం నెగ్గిన ఉమామహేశ్... మంగళవారం 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో పసిడి పతకం సొంతం చేసుకున్నాడు. ఫైనల్లో ఉమామహేశ్-ఇషా తక్సాలె (భారత్) జోడీ 16-8 పాయింట్ల తేడాతో అన్వీ రాథోడ్-అభినవ్ షా (భారత్) జంటను ఓడించి విజేతగా నిలిచింది. ఈ టోర్నీలో ప్రస్తుతం భారత్ 3 స్వర్ణాలు, 2 రజతాలు, 2 కాంస్యాలతో కలిపి మొత్తం ఏడు పతకాలతో టాప్ ర్యాంక్‌లో ఉంది.

అనిరుధ్ జోడీ ఓటమి



ఫ్లోరిడా: డెల్‌రే బీచ్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీ నుంచి హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్-విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జోడీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో అనిరుధ్-విజయ్ జంట 3-6, 6-7 (5/7)తో గిడో ఆండ్రెజి (అర్జెంటీనా)-మిగెల్ రేయస్ వరేలా (మెక్సికో) ద్వయం చేతిలో ఓడిపోయింది. అనిరుధ్ జోడీకి 3,610 డాలర్ల (రూ. 3 లక్షలు) ప్రైజ్‌మనీ లభించింది.

దక్షిణాఫ్రికా 220/6

హామిల్టన్: న్యూజిలాండ్‌తో మంగళవారం మొదలైన రెండో టెస్టులో తొలి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు కోల్పోయి 220 పరుగులు చేసింది. రువాన్ డి స్వార్ట్ (55 బ్యాటింగ్; 9 ఫోర్లు), షాన్ బెర్గ్ (34 బ్యాటింగ్; 6 ఫోర్లు) ఏడో వికెట్‌కు అభేద్యంగా 70 పరుగులు జోడించారు. న్యూజిలాండ్ బౌలర్లలో రచిన్ రవీంద్ర 3 వికెట్లు పడగొట్టాడు.



రజత్ పటిదార్, యశస్వి, ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్

సర్ఫరాజ్, జురెల్ అరంగేట్రం!

నెట్స్‌లో ముమ్మర ప్రాక్టీస్

రాజ్‌కోట్: కీలక ఆటగాళ్లు గాయాల పాలవడం... కోహ్లి విశ్రాంతి కొనసాగిస్తుండటం... యువ బ్యాటర్లు సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్‌లకు వరంగా మారనుంది. మూడో టెస్టులో వీరిద్దరు బరిలోకి దిగడం దాదాపు ఖాయమైంది. మంగళవారం ప్రాక్టీస్ సెషన్‌లో వీరిద్దరు మాత్రం గంటల తరబడి చెమటోడ్చడం చూస్తుంటే వారి అరంగేట్రానికి సూచనగా కనిపిస్తోంది. కెప్టెన్ రోహిత్ శర్మ వారి ప్రాక్టీస్‌ను దగ్గరుండి పరిశీలించాడు. శ్రేయస్ అయ్యర్‌ను మిగతా మూడు టెస్టుల నుంచి తప్పించగా, ఎంపిక చేసిన కేఎల్ రాహుల్ పూర్తి ఫిట్‌గా లేకపోవడంతో అతనూ రాజ్‌కోట్ మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఇవన్నీ కూడా సర్ఫరాజ్, జురెల్‌లకు రాచబాటను పరిచింది. ఆంధ్ర వికెట్ కీపర్ శ్రీకర్ భరత్ వరుసగా విఫలమవడం కీపర్ జురెల్‌కు కలిసి రానుంది. గత మ్యాచ్ ఆడిన రజత్ పటిదార్‌తోపాటు సర్ఫరాజ్, జురెల్ మిడిలార్డర్‌లో బరిలోకి దిగుతారు. ఫామ్‌లో ఉన్న శుబ్‌మన్ గిల్ ప్రాక్టీస్ చేయలేదు. అతని కుడిచేతి చూపుడు వేలు నొప్పి కారణంగా ట్రెయినింగ్‌కు దూరంగా ఉన్నాడు. అయితే అతని గాయం ఏమాత్రం తీవ్రమైంది కాదని జట్టు వర్గాలు వెల్లడించాయి. ఆల్‌రౌండర్ జడేజా స్పిన్ బౌలింగ్ కంటే బ్యాటింగ్ ప్రాక్టీసే ఎక్కువ చేశాడు. పేసర్లు బుమ్రా, ఆకాశ్‌దీప్‌లు బౌలింగ్‌లో శ్రమించారు. భారత్, ఇంగ్లండ్‌ల మధ్య గురువారం నుంచి మూడో టెస్టు జరుగుతుంది.

కొత్త కెరటం...

బ్యాడ్మింటన్‌లో సత్తా చాటుతున్న తీగల సాయిప్రసాద్

- ఇరాన్ జూనియర్ ఇంటర్నేషనల్ సింగిల్స్ టైటిల్‌తో గుర్తింపు



సాక్షి, హైదరాబాద్: అసోంలోని గువహటిలో గత ఏడాది ఆగస్టులో బ్యాడ్మింటన్ నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎన్‌సీఈ) ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిభావంతులైన కుర్రాళ్లను గుర్తించి వారిని భవిష్యత్తు కోసం తీర్చిదిద్దడం కోసం భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేసిన శిక్షణా కేంద్రం ఇది. ముందుగా అండర్-17 స్థాయిలో సెలక్షన్స్ ప్రక్రియ జరిగింది. ఇందులో ఏకంగా 858 మంది యువ షట్లర్లు పాల్గొన్నారు. వీరిలో టాప్-4కి మాత్రమే అక్కడ చోటు లభించింది. ఈ సెంటర్‌లో మొదటి విద్యార్థిగా అడుగు పెట్టిన కుర్రాడే హైదరాబాద్‌కు చెందిన తీగల సాయిప్రసాద్. అప్పటికే తన ప్రతిభ తో ఆకట్టుకున్న సాయిప్రసాద్ ఎన్‌సీఈలో శిక్షణతో మరింత పదునెక్కాడు. తన ఆటలోని సత్తాను చూపిస్తూ ఇటీవల కీలక విజయంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. గత నెలలో ఇరాన్‌లో జరిగిన ఫజర్ జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్‌లో సాయి టైటిల్ సాధించి షటిల్ వేదికపై కొత్త కెరటంలా వెలుగులోకి వచ్చాడు.

తండ్రి ప్రోత్సాహంతో...

సాయి తండ్రి సూర్యారావు జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ ప్లేయర్. ఆటగాడిగా కెరీర్‌ను ముగించిన తర్వాత ఆయన కోచ్‌గా మారారు. సుదీర్ఘ కాలం పాటు న్యూజిలాండ్‌లో వేర్వేరు క్లబ్‌లలో కోచింగ్ ఇచ్చిన సూర్య ఆ తర్వాత భారత్‌కు తిరిగొచ్చారు. చిన్నప్పటినుంచి తండ్రి ఆటను చూస్తూ వచ్చిన సాయి సహజంగానే షటిల్‌పై ఆసక్తి పెంచుకున్నాడు. దాంతో సాయిని పూర్తిస్థాయిలో ఆటగాడిగా తీర్చిదిద్దాలని భావించిన సూర్య స్వయంగా తానే ఓనమాలు నేర్పించారు. ఆ తర్వాత మరింత మెరుగైన శిక్షణ కోసం ప్రతిష్టాత్మక పుల్లెల గోపీచంద్ అకాడమీలో సాయి చేరాడు. అదే అకాడమీలో తండ్రి సూర్య కూడా ఒక కోచ్‌గా ఉండటం సాయికి మరింత సానుకూలాంశంగా మారింది. అటు గోపీచంద్ మార్గనిర్దేశనం, ఇటు తండ్రి శిక్షణ వెరసి సాయి మంచి ఫలితాలు సాధించాడు. అండర్-13 స్థాయిలో జాతీయస్థాయి నంబర్‌వన్ కావడంతోపాటు అండర్-15, అండర్-17లలో సాయిప్రసాద్ టాప్-5లో కొనసాగాడు. జాతీయ జూనియర్ ర్యాంకింగ్ టోర్నీలతో పాటు అండర్-13 స్థాయిలో సింగపూర్, థాయ్‌లాండ్‌లలో జరిగిన టోర్నీల్లో టైటిల్స్ సాధించాడు. అనంతరం కెరీర్‌లో ఎదుగుతున్న కీలక దశలో అతను గువహటి ఎన్‌సీఈలో ప్రవేశంతో తన ఆటకు మెరుగులు దిద్దుకున్నాడు.

కెరీర్‌లో కీలక విజయం...

అగ్రశ్రేణి కోచ్‌లు, అత్యుత్తమ సౌకర్యాలతో ఉన్న ఎన్‌సీఈలో సాయిప్రసాద్ సాధనకు మరింత మంచి అవకాశం దక్కింది. ఈ క్రమంలో అతని పురోగతి వేగంగా సాగింది. గత ఏడాది ఆగస్టులో సాయి జూనియర్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో 1043వ స్థానంలో ఉన్నాడు. అక్కడి నుంచి మెరుగైన ప్రదర్శనతో ఈ ఏడాది జనవరి తొలి వారంలో మొదటి సారి టాప్-100లోకి అడుగు పెట్టాడు. మంగళవారం ప్రకటించిన తాజా బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ ర్యాంకింగ్స్‌లో అతను 37వ స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో జనవరిలో అతని కెరీర్‌లో చెప్పుకోదగ్గ విజయం దక్కింది. ఇరాన్‌లో జరిగిన జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్‌లో సాయిప్రసాద్ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్నాడు. ఫైనల్ చేరడానికి ముందు చక్కటి ప్రదర్శనతో అతను వరుసగా మూడు మ్యాచ్‌లలో స్థానిక ఇరాన్ ఆటగాళ్లను ఓడించడం విశేషం. గత వారమే 17 ఏళ్లు పూర్తి చేసుకున్న సాయి ఇకపై అండర్-19 స్థాయి టోర్నీల్లోనే పాల్గొనబోతున్నాడు. జూనియర్ విభాగంలో టాప్-10 ర్యాంకింగ్స్‌లోకి చేరడంపై సాయి దృష్టి పెట్టాడు. ఆపై జూనియర్ వరల్డ్‌లాంటి పెద్ద టోర్నీని గెలవడం అతని ముందున్న ప్రస్తుత లక్ష్యం. సాయి ప్రతిభకు తోడు ఎన్‌సీఈ శిక్షణ అతని ప్రదర్శన స్థాయిని పెంచింది. ఇదే ఆటను కొనసాగిస్తే ముున్ముందు ఈ అబ్బాయి అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో అద్భుత ఫలితాలు సాధించడం ఖాయం.

ప్లే ఆఫ్స్‌కు పట్నా పైరేట్స్ అర్హత



కోల్‌కతా: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు అర్హత పొందిన ఐదో జట్టుగా పట్నా పైరేట్స్ నిలిచింది. తెలుగు టైటాన్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 38-36తో గెలిచింది. పట్నా తరఫున మంజీత్ 8 పాయింట్లు, సందీప్ 7 పాయింట్లు స్కోరు చేశారు. టైటాన్స్ తరఫున కెప్టెన్ పవన్ సెహ్రావత్ 16 పాయింట్లతో ఆకట్టుకున్నా ఫలితం లేకపోయింది. ఈ టోర్నీలో 21 మ్యాచ్‌లు ఆడి 11 విజయాలు అందుకున్న పట్నా 68 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి ప్లే ఆఫ్స్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. 20 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న తెలుగు టైటాన్స్ 18వ పరాజయంతో 17 పాయింట్లతో చివరిదైన 12వ స్థానాన్ని ఖరారు చేసుకుంది. మిగిలి ఉన్న తమ చివరి రెండు మ్యాచ్‌ల్లో టైటాన్స్ గెలిచినా 29 పాయింట్లతో 11వ స్థానంలో ఉన్న యూపీ యోధాస్‌ను దాటే అవకాశం లేదు. ఇప్పటికే జైపూర్ పింక్ పాంథర్స్, పుణేరి పల్టన్, గుజరాత్ జెయింట్స్, దబంగ్ ఢిల్లీ, పట్నా పైరేట్స్ ప్లే ఆఫ్స్‌కు చేరుకోగా... చివరిదైన ఆరో బెర్త్ కోసం హరియాణా స్టీలర్స్, బెంగాల్ వారియర్స్ జట్లు రేసులో ఉన్నాయి. అయితే స్టీలర్స్ ఒక మ్యాచ్‌లో గెలిస్తే ప్లే ఆఫ్స్ బెర్త్‌ను దక్కించుకుంటుంది.

భారత రెజ్లింగ్ సమాఖ్యపై నిషేధం ఎత్తివేత

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)పై విధించిన సస్పెన్షన్‌ను యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) మంగళవారం ఎత్తివేసింది. మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై న్యాయపోరాటం చేసిన రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్‌లపై ఎలాంటి వివక్ష చూపరాదని, కక్ష్యసాధింపు చర్యలు చేపట్టకుండా అందరు రెజ్లర్లకు సమాన అవకాశాలు కల్పించాలని డబ్ల్యూఎఫ్ఐకి యూడబ్ల్యూడబ్ల్యూ సూచించింది. సస్పెన్షన్ తొలగిపోవడంతో పారిస్ ఒలింపిక్స్‌లో భారత రెజ్లర్లంతా మన జెండా కిందే పోటీపడొచ్చు. పతకం గెలిస్తే పోడియంలో మన పతాకమే రెపరెపలాడతుంది. గడువులోగా డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికల్ని నిర్వహించలేకపోవడంతో గత ఆగస్టులో సస్పెన్షన్ వేటు వేసింది.

రసెల్, రూథర్‌ఫర్డ్ మెరుపులు

చివరి టి20లో ఆస్ట్రేలియాపై వెస్టిండీస్ విజయం



పెర్త్: ఆస్ట్రేలియా పర్యటనను వెస్టిండీస్ జట్టు విజయంతో ముగించింది. మంగళవారం జరిగిన చివరిదైన మూడో టి20లో విండీస్ 37 పరుగుల తేడాతో గెలిచింది. సిరీస్‌ను ఆస్ట్రేలియా 2-1తో సొంతం చేసుకుంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆండ్రీ రసెల్ (29 బంతుల్లో 71; 4 ఫోర్లు, 7 సిక్స్‌లు), షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ (40 బంతుల్లో 67 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) మెరుపు అర్ధ సెంచరీలు చేయడంతో... మొదట బ్యాటింగ్‌కు దిగిన విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 220 పరుగులు చేసింది. 79 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడిన విండీస్‌ను రసెల్, రూథర్‌ఫర్డ్ ఆదుకున్నారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 139 పరుగులు జోడించి అంతర్జాతీయ టి20ల్లో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించారు. 221 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 183 పరుగులు చేసి ఓడిపోయింది. డేవిడ్ వార్నర్ (49 బంతుల్లో 81; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), టిమ్ డేవిడ్ (19 బంతుల్లో 41 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరిపించినా ఫలితం లేకపోయింది.

సినిమా

పడ్డారండి ప్రేమలో మరి...



ప్రభాస్



'తండేల్'లో నాగచైతన్య, సాయి పల్లవి



'టిల్లు స్క్వేర్'లో అనుపమ, సిద్ధు



'డెకాయిట్'లో శ్రుతీహాసన్, అడివి శేష్



ఆనంద్, వైష్ణవి



విశ్వక్ సేన్



కిరణ్ అబ్బవరం

ప్రతి మనిషికి ప్రాణం ఉన్నట్లే.... ప్రతి మనసుకు ఓ ప్రేమకథ ఉంటుంది. ఒకరి ప్రేమ సఫలం... మరొకరిది విఫలం... ఇంకొకరిది త్యాగం... ఇలా ఒక్కో ప్రేమ కథది ఒక్కో ముగింపు. మరి.. రానున్న ప్రేమ కథా చిత్రాల్లో ఏ కథ ముగింపు ఎలా ఉంటుందో వెండితెర పైనే చూడాలి. 'పడ్డారండి ప్రేమలో మరి..' అంటూ సిల్వర్ స్క్రీన్ కోసం కొందరు హీరోలు-హీరోయిన్లు ప్రేమలో పడ్డారు. ఈ ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఆ ప్రేమకథా చిత్రాల గురించి తెలుసుకుందాం.

సైనికుడి ప్రేమకథ... 'ఛత్రపతి', 'మిర్చి', 'బాహుబలి', 'సలార్'... ఇలా యాక్షన్ చిత్రాలే కాదు.. ప్రభాస్ కెరీర్‌లో 'వర్షం', 'మిస్టర్ పర్ఫెక్ట్', 'రాధేశ్యామ్' వంటి ప్రేమకథా చిత్రాలు కూడా ఉన్నాయి. తాజాగా ప్రభాస్ మరో ప్రేమకథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. 2022లో 'సీతారామం' వంటి బ్లాక్‌బస్టర్ ప్రేమకథను ఇచ్చిన హను రాఘవపూడి మరో ప్రేమకథను రెడీ చేశారు. పీరియాడికల్ లవ్‌స్టోరీగా తెరకెక్కనున్న ఈ సినిమాలో ప్రభాస్ హీరోగా నటిస్తారని టాక్. రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని, ఇందులో ప్రభాస్ ఆర్మీ ఆఫీసర్‌గా నటిస్తారనీ టాక్. అలాగే ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రాల్లో 'రాజా సాబ్' ఒకటి. ఫ్యాంటసీ హారర్ ఎలిమెంట్స్‌తో పాటు ఓ మంచి లవ్‌ట్రాక్ కూడా ఈ చిత్రంలో ఉందట. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మాళవికా మోహనన్, నిధీ అగర్వాల్, రిద్ధీ కుమార్ హీరోయిన్లు.

మరో లవ్‌స్టోరీ... 'లవ్‌స్టోరీ' (2021) చిత్రం తర్వాత నాగచైతన్య, సాయిపల్లవి కలిసి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న మరో ప్రేమకథా చిత్రం 'తండేల్'. నాగచైతన్యతో 'ప్రేమమ్' వంటి లవబుల్ సినిమా తీసిన చందు మొండేటి ఈ సినిమాకు దర్శకుడు. ఈ చిత్రంలో జాలరి రాజు పాత్రలో నాగచైతన్య, సత్య పాత్రలో సాయి పల్లవి నటిస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరంలకు చెందిన మత్స్యకారులు 2018లో గుజరాత్‌కు వలస వెళ్లి, సముద్రంలో చేపల వేటను కొనసాగిస్తుంటారు. ఓ 24 మంది మత్స్యకారులు పాకిస్తాన్ కోస్ట్ గార్డులకు బందీలుగా చిక్కుతారు. వీరిలో ఓ మత్స్యకారుడి వివాహం జరిగి ఏడాది మాత్రమే అవుతుంది. భార్య గర్భవతిగా ఉన్న సమయంలో ఆ మత్స్యకారుడు పాకిస్తాన్‌లో బందీ కాబడతాడు. ఈ వ్యక్తి జీవితం ఆధారంగా 'తండేల్'ను ప్రేమకథ ప్రాధాన్యంగా తీస్తున్నారు మేకర్స్.

ప్రేమికులే శత్రువులయితే... విడిపోయిన ప్రేమికులు శత్రువులుగా ఎదురుపడితే అనే కాన్సెప్ట్‌తో రూపొందుతున్న లవ్‌స్టోరీ మూవీ 'డెకాయిట్'. 'ఒక ప్రేమకథ' అనేది ఉపశీర్షిక. అడివి శేష్, శ్రుతీహాసన్ జంటగా నటిస్తున్న చిత్రమిది. ఈ సినిమాతో కెమెరామేన్ షానీ డియోల్ దర్శకుడిగా మారారు.

రెండు ప్రేమకథల్లో... గత ఏడాది 'బేబీ' అనే లవ్‌స్టోరీ మూవీతో హిట్ అందుకున్నారు హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవీ చైతన్య (విరాజ్ మరో లీడ్ రోల్ చేశారు). ఈ 'బేబీ' జోడీ రిపీట్ అవుతోంది. 'బేబీ' దర్శకుడు సాయి రాజేశ్ ఈ సినిమాకు కథ అందించగా, రవి నంబూరి దర్శకుడిగా పరిచయం కానున్నారు. అలాగే మరో లవ్‌స్టోరీ 'డ్యూయెట్' కూడా చేస్తున్నారు ఆనంద్ దేవరకొండ. ఈ ఎమోషనల్ లవ్‌స్టోరీ ఫిల్మ్‌లో రితికా సింగ్ కథానాయిక. మిథున్ వరదరాజ కృష్ణన్ దర్శకత్వం వహిసున్నారు. ఇలా ఒకేసారి రెండు ప్రేమకథా చిత్రాల్లో నటిస్తున్నారు ఆనంద్ దేవరకొండ.

డబుల్ లవ్... డీజే టిల్లు ఓ డిఫరెంట్ లవర్. పిచ్చిగా ప్రేమిస్తాడు. ఆ ప్రేమలో తేడా వస్తే ప్రేయసినైనా జైలుకు పంపిస్తాడు. అలాంటి డీజే టిల్లు మళ్లీ లవ్‌లో మునిగాడు. మరి.. ఈసారి అతని లవ్‌స్టోరీ ఏ టర్న్ తీసుకుంటుందో చూడాలంటే మార్చి 29వరకు ఆగాల్సిందే. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న చిత్రం 'టిల్లు స్క్వేర్'. అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్. ఈ చిత్రానికి మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. 'డీజే టిల్లు'కి సీక్వెల్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. మరో వైపు 'తెలుసు కదా' అనే లవ్‌స్టోరీ కూడా చేస్తున్నారు సిద్ధు జొన్నలగడ్డ. కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లు.


లైలా లవ్వు... 'అశోకవనంలో అర్జున కల్యాణం', 'ఓరి.. దేవుడా!', 'పాగల్' వంటి లవ్‌స్టోరీ చిత్రాల్లో నటించారు విశ్వక్ సేన్. ఈ యంగ్ హీరో రీసెంట్‌గా మరో లవ్‌స్టోరీకి పచ్చజెండా ఊపారు. ఆ సినిమా పేరు 'లైల'. ఈ సినిమాలో తానే టైటిల్ రోల్ చేస్తూ, స్వీయ దర్శకత్వం వహిస్తానని ఇటీవల ఓ సందర్భంలో చెప్పారు విశ్వక్.

దిల్ రుబా... కెరీర్‌లో తొలి సినిమానే 'రాజావారు రాణిగారు' వంటి లవ్‌స్టోరీ చేశారు కిరణ్ అబ్బవరం. ఆ తర్వాత కిరణ్ అబ్బవరం హీరోగా చేసిన 'ఎస్ఆర్ కళ్యాణ మండపం', 'సమ్మతమే', 'వినరో భాగ్యము విష్ణుకథ' చిత్రాల్లో మంచి లవ్‌ట్రాక్ ఉంది. ఇప్పుడు ఈ యంగ్ హీరో ఓ కంప్లీట్ లవ్‌స్టోరీ సినిమా చేస్తున్నారు. విశ్వ కరుణ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారని, రుక్సార్ థిల్లాన్ హీరోయిన్ అని తెలిసింది. ఈ సినిమాకు 'దిల్ రుబా' టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

- అభిషేక్ పచ్చిపాల, నజియ ఖాన్, జబర్దస్త్ ఫణి, సతీష్ సారిపల్లి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జస్ట్ ఏ మినిట్'. పూర్ణస్ యశ్వంత్ దర్శకత్వంలో అర్షద్ తస్వీర్, ప్రకాశ్ ధర్మపురి నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమా నుంచి తాజాగా 'నువ్వంటే ఇష్టం' అనే పాటను ప్రేమికుల దినోత్సవం సందర్భంగా మంగళవారం విడుదల చేశారు. యస్. కె భాజీ ఈ సినిమాకు స్వరకర్త.
- ఇంద్ర, కోమల్ నాయర్, దీపు, స్వాతి శర్మ, ఇమ్రాన్, శీతల్ భట్ లీడ్ రోల్స్ చేసిన చిత్రం 'ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారడు'. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ సినిమాలోని 'నా కల..' పాటను ప్రముఖ సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ విడుదల చేశారు. లక్ష్మణ్ జెల్ల దర్శకత్వంలో చంద్ర ఎస్. చంద్ర. డా. విజయ రమేష్ రెడ్డి నిర్మించిన చిత్రం ఇది. శ్రవణ్ భరద్వాజ్ ఈ సినిమాకు సంగీత దర్శకుడు.



'సీతారామం'లో మృణాల్, దుల్కర్



'ఓయ్'లో సిద్ధార్థ్, షామిలీ

ఈ ప్రేమికుల దినోత్సవం (ఫిబ్రవరి 14) సందర్భంగా ఇప్పటికే విడుదలైన కొన్ని ప్రేమకథా చిత్రాలు మళ్లీ రిలీజ్ కానున్నాయి. ఆ వివరాలు...

- సిద్ధార్థ్, షామిలీ హీరోహీరోయిన్లుగా ఆనంద్ రంగ దర్శకత్వం వహించిన 'ఓయ్!' (2009), దుల్కర్ సల్మాన్– మృణాల్ ఠాకూర్ జోడీగా హను రాఘవపూడి దర్శకత్వం వహించిన 'సీతారామం' (2022), గత ఏడాది విడుదలైన 'బేబీ' చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. సూర్య ద్విపాత్రాభినయం చేసిన తమిళ చిత్రం 'సూర్య సన్నాఫ్ కృష్ణన్' (2008) తెలుగు అనువాదం సైతం రీ రిలీజ్ అవుతోంది. ఇలా మరికొన్ని చిత్రాలు ఉన్నాయి.



రష్మిక

సాధారణంగా లవ్‌స్టోరీస్ ఎక్కువగా అబ్బాయిల దృష్టి కోణంలో నుంచి వస్తుంటాయి. ఓ అమ్మాయి తన ప్రేమకథను చెబితే ఎలా ఉంటుంది? అనే అంశం ఆధారంగా వస్తున్న చిత్రం 'ది గాళ్ ఫ్రెండ్'. 'చి.ల.సౌ' వంటి సినిమా తీసిన నటుడు–దర్శకుడు రాహుల్ రవీంద్రన్ ఈ కొత్త లవ్‌స్టోరీకి దర్శకుడు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది.

ఆ ఇద్దరి కోసమే వ్యూహం.. శపథం తీశా!


- రామ్‌గోపాల్ వర్మ



దాసరి కిరణ్ కుమార్, రామ్ గోపాల్ వర్మ

''దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డిగారి మరణం నుంచి ఆయన తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేవరకు 'వ్యూహం' చిత్రకథ ఉంటుంది. అలాగే జగన్‌గారు సీఎంగా ప్రమాణ స్వీకారం నుంచి చంద్రబాబు నాయుడు జైలుకు వెళ్లేవరకు 'శపథం' చిత్రకథ ఉంటుంది. నేను ఈ సినిమాలను జగన్‌గారి కోసం కాదు.. పవన్, చంద్రబాబు కోసం తీశాను'' అని రామ్‌గోపాల్ వర్మ అన్నారు. అజ్మల్, మానస ప్రధాన పాత్రల్లో రామ్‌గోపాల్ వర్మ 'వ్యూహం', 'శపథం' చిత్రాలు తెరకెక్కించారు. రామధూత క్రియేషన్స్‌పై దాసరి కిరణ్ కుమార్ నిర్మించిన 'వ్యూహం' ఈ నెల 23న, 'శపథం' మార్చి 1న రిలీజ్ అవుతున్నాయి. ఈ సినిమాల ట్రైలర్ రిలీజ్ వేడుకని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా **రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ–** ''ప్రజా జీవితంలో ఉన్న కొందరిపై మనకు కొన్ని అభిప్రాయాలుంటాయి. అలా నాకు ఉన్న అభిప్రాయాలతో వాస్తవ ఘటనల నేపథ్యంగా నేను వ్యక్తీకరించిన సినిమాలే 'వ్యూహం, శపథం'. ఈ సినిమాలు ఎవరి మీద ఎలాంటి ప్రభావం చూపిస్తాయనేది చెప్పలేను. ఈ చిత్రాలను గత డిసెంబరులో విడుదల చేయాలనుకున్నాం. నారా లోకేశ్ కోర్టుకు వెళ్లి మా సినిమా రిలీజ్‌ను అడ్డుకున్నారు. ఇప్పుడు సరిగ్గా ఎన్నికల ముందు మా రెండు సినిమాలు విడుదలయ్యేలా పరోక్షంగా సహాయం చేసిన ఆయనకు థ్యాంక్స్. ఎవరైనా ఏ సినిమా రిలీజ్‌ని అయినా కొన్నాళ్లు ఆపించగలరు గానీ శాశ్వతంగా ఆపలేరు. వారం రోజుల తేడాలో రెండు సినిమాలు రిలీజ్ కావడం వల్ల ఇబ్బందేం ఉండదు. నచ్చితే రెండు సినిమాలూ చూస్తారు.. నచ్చకుంటే రెండూ చూడరు. సెన్సార్ అనేది ఔట్ డేటెడ్ వ్యవస్థ. ఏ కథ తీసినా వాళ్లకు అభ్యంతరాలు ఉంటాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ప్రకారం ప్రతి ఫిలిం మేకర్‌కు వాస్తవ ఘటనలను తన కోణంలో తెరకెక్కించే స్వేచ్ఛ ఉందని హైకోర్టు మాకు ఇచ్చిన ఆర్డర్స్‌లో పేర్కొంది'' అన్నారు. **దాసరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ–** ''వ్యూహం, శపథం' సినిమాలు మొదలుపెట్టినప్పుడే విడుదలకు అడ్డంకులు వస్తాయని తెలుసు.. అయినా చేశాం. ఎన్నికలు సమీపిస్తున్నప్పటికీ నారా లోకేశ్ తన పార్టీ కార్యక్రమాలన్నీ వదిలి మా సినిమాలు రిలీజ్ కాకుండా కోర్టులకు, సెన్సార్ ఆఫీస్‌లకు ఫిర్యాదులు చేశాడు. రోడ్లపై ధర్నాలు చేయించాడు. ఆయన అంత పోరాటం చేశాడంటేనే మా సినిమాల్లో ఎంత బలమైన కథ ఉందో అర్థం చేసుకోవచ్చు. మా సినిమాల రిలీజ్ విషయంలో దేవుడు మాకు అన్నీ కలిసొచ్చేలా చేశాడనుకుంటున్నాం. ఈ సినిమాలను తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 500 థియేటర్స్‌లో రిలీజ్ చేయబోతున్నాం.. రెండూ విజయం సాధిస్తాయనే నమ్మకం ఉంది'' అన్నారు.

అందుకే ఈ కథ ఎంచుకున్నాను



రాజేష్ దండా

సందీప్ కిషన్ హీరోగా నటించిన చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో రాజేష్ దండా మాట్లాడుతూ– ''ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం', 'సామజ వరగమన' చిత్రాల తర్వాత మా బ్యానర్ నుంచి వస్తున్న మూడో చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. సందీప్ కిషన్, వీఐ ఆనంద్ నాకు మంచి మిత్రులు. 'టైగర్', 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'డిస్కో రాజా', 'ఒక్క క్షణం'.. ఇలా ఆనంద్ డైరెక్షన్‌లో వచ్చిన సినిమాలను నేను డిస్ట్రిబ్యూట్ చేశాను. నేను డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్న సమయంలో నా నిర్మాణంలో ఓ సినిమా చేస్తానన్నారు సందీప్‌గారు. వీఐ ఆనంద్‌గారు చెప్పిన రెండు కథల్లో కొత్త కంటెంట్‌తో తీసే సినిమా సక్సెస్ అవుతుందని భావించి 'ఊరి పేరు భైరవకోన' కథను ఎంచుకున్నాను. సందీప్‌గారి కెరీర్‌లో ఈ సినిమా నంబర్ వన్‌గా నిలుస్తుందని అనుకుంటున్నాను. 'భైరవకోన' అనే గ్రామంలో జరిగే విభిన్న ఘటనల సమాహారమే ఈ చిత్రం. ప్రస్తుతం అల్లరి నరేశ్‌తో 'బచ్చల మల్లి', కిరణ్ అబ్బవరంతో ఓ సినిమా చేస్తున్నాను'' అని చెప్పుకొచ్చారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
483	127
71,555	21,743

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	15,716	▽	227
డోజోన్స్	38,322	▽	475
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,512	▽	61
డాక్స్	16,881	▽	157
షాంఘై (శుక్రవారం ముగింపు)	2,866	▲	36
నికాయ్	37,964	▲	1,067

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.ల్లో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,394	▲	93
బంగారం (99.5 స్వచ్ఛత)	62,144	▲	94
వెండి (కేజీ)	71,042	▽	98

ఫారెక్స్ రేట్లు రూ.ల్లో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.59	83.61
£	బ్రిటన్ పౌండ్	103.55	106.09
€	యూరో	88.25	90.60
¥	జపాన్ ఎన్ (100)	55.39	56.64
AUS	ఆస్ట్రేలియా డాలర్	53.21	55.12
S$	సింగపూర్ డాలర్	59.09	63.08
SAR	సౌదీ రియాల్	21.26	22.77
UAE D	యూఏఈ దిర్హామ్	21.73	23.47
¥	చైనా యువాన్	10.42	12.39

హిండాల్కో లాభం జూమ్

క్యూ3లో రూ. 2,331 కోట్లు



న్యూఢిల్లీ: ఆదిత్య బిర్లా గ్రూప్ మెటల్ రంగ దిగ్గజం హిండాల్కో ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 71 శాతం జంప్‌చేసి రూ. 2,331 కోట్లను తాకింది. అల్యూమినియం, కాపర్ విభాగాలు పటిష్ట పనితీరు చూపడం లాభాలకు దోహదం చేసింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 1,362 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 53,151 కోట్ల నుంచి 52,808 కోట్లకు బలహీనపడింది. కఠిన మార్కెట్ పరిస్థితుల్లోనూ వృద్ధి బాటలో సాగినట్లు కంపెనీ ఎండీ సతీష్ పాయ్ తెలియజేశారు. అల్యూమినియం, కాపర్ బిజినెస్‌లు ఆకర్షణీయ ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఇందుకు మెరుగైన ప్రొడక్ట్ మిక్స్, తగ్గిన ముడివ్యయాలు సహకరించినట్లు వెల్లడించారు. ఈ రెండు విభాగాల విస్తరణపై పెట్టుబడులను కొనసాగిస్తున్నట్లు తెలియజేశారు. వెరసి ఈ ఏడాది రూ. 4,500 కోట్లు వెచ్చిస్తున్నట్లు ప్రస్తావించారు. వచ్చే ఏడాది(2024–25) పెట్టుబడులను రూ. 5,500 కోట్లకు పెంచనున్నట్లు తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో హిండాల్కో షేరు బీఎస్‌ఈలో 12.5 శాతం పతనమై రూ. 510 వద్ద ముగిసింది.

టాటా ఈవీలపై భారీ డిస్కౌంట్

రూ.1.2 లక్షల వరకు తగ్గింపు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రిక్ వెహికల్స్ అయిన నెక్సన్.ఈవీ, టియాగో.ఈవీ మోడళ్లపై రూ.1.2 లక్షల వరకు తగ్గింపు ప్రకటించింది. బ్యాటరీ వ్యయాలు తగ్గుముఖం పట్టడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు కంపెనీ మంగళవారం తెలిపింది. నెక్సన్.ఈవీ ధర రూ.1.2 లక్షల వరకు తగ్గింది. దీంతో ఈ మోడల్ ప్రారంభ ధర రూ.14.49 లక్షలు ఉంది. టియాగో.ఈవీ ధర రూ.70,000 వరకు తగ్గడంతో ఈ మోడల్ రూ.7.99 లక్షల నుంచి లభిస్తోంది. బ్యాటరీ వ్యయాలను దృష్టిలో పెట్టుకుని పంచ్.ఈవీ ధర నిర్ణయించడంతో తాజాగా ఎటువంటి సవరణ చేయలేదని టాటా మోటార్స్ వెల్లడించింది. దేశవ్యాప్తంగా 2023లో ప్యాసింజర్ వాహన పరిశ్రమ 8 శాతం వృద్ధి చెందింది. అయితే ఈవీ విభాగం 90 శాతం దూసుకెళ్లడం గమనార్హం. గతేడాదితో పోలిస్తే 2024 జనవరిలో ఈవీ విభాగం ఏకంగా 100%పెరగడం విశేషం. ఎలక్ట్రిక్ ప్యాసింజర్ కార్ల పరిశ్రమలో భారత్‌లో 70%పైగా వాటాతో టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ అగ్రస్థానంలో నిలిచింది.

గో ఫస్ట్‌కు ఎన్‌సీఎల్‌టీలో ఊరట

దివాలా పరిష్కార ప్రక్రియ గడువు మరో 60 రోజులకు పెంపు



న్యూఢిల్లీ: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న విమానయాన సంస్థ గో ఫస్ట్‌కి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో (ఎన్‌సీఎల్‌టీ) కొంత ఊరట లభించింది. కంపెనీ దివాలా పరిష్కార ప్రక్రియను (సీఐఆర్‌పీ) ముగించేందుకు గడువును ఎన్‌సీఎల్‌టీ మరో 60 రోజుల పాటు పెంచింది. పరిష్కార నిపుణుడు (ఆర్‌పీ) దివాకర్ మహేశ్వరి విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. గో ఫస్ట్‌పై మూడు సంస్థలు ఆసక్తి వ్యక్తం చేసినట్లు, ధరావత్తును కూడా డిపాజిట్ చేసినట్లు మహేశ్వరి తెలిపారు. దేశీ విమానయాన సంస్థ స్పైస్‌జెట్, షార్జాకి చెందిన స్కై వన్, ఆఫ్రికన్ సంస్థ సాఫ్రిక్ ఇన్వెస్ట్‌మెంట్స్ వీటిలో ఉన్నాయి. ఇవి త్వరలోనే తమ ప్రణాళికలను సమర్పించే అవకాశం ఉందని మహేశ్వరి పేర్కొన్నారు. గో ఫస్ట్ గతేడాది మే 3 నుంచి కార్యకలాపాలు నిలిపివేసింది. స్వచ్ఛందంగా దివాలా పరిష్కార ప్రక్రియ చేపట్టాలని కోరుతూ మే 10న ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది. గో ఫస్ట్ దివాలా పరిష్కార ప్రక్రియ డెడ్‌లైన్‌ను ఎన్‌సీఎల్‌టీ పొడిగించడం ఇది రెండోసారి. గతేడాది నవంబర్ 23న 90 రోజుల పాటు పొడిగించగా.. ఆ డెడ్‌లైన్ ఫిబ్రవరి 4తో ముగిసింది. దివాలా కోడ్ కింద సీఐఆర్‌పీని గరిష్టంగా 330 రోజుల్లోగా పూర్తి చేయాలి.

నాల్కో రూ. 2 డివిడెండు



న్యూఢిల్లీ: నవరత్న హోదా కలిగిన ప్రభుత్వ రంగ దిగ్గజం నేషనల్ అల్యూమినియం కంపెనీ (నాల్కో) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ. 471 కోట్ల నికర లాభం ప్రకటించింది. అంతక్రితం క్యూ3లో నమోదైన రూ. 256 కోట్లతో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు. సమీక్షాకాలంలో మొత్తం ఆదాయం రూ. 3,358 కోట్ల నుంచి రూ. 3,398 కోట్లకు పెరిగింది. షేరుకి రూ. 2 చొప్పున కంపెనీ రెండో మధ్యంతర డివిడెండును ప్రకటించింది.

ర్యాపిడో ఆటో.. జీరో కమీషన్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రైడ్ హెయిలింగ్ యాప్ ర్యాపిడో సరికొత్త పోటీకి తెరలేపింది. ర్యాపిడో ఆటో డ్రైవర్ల నుంచి జీవిత కాలంపాటు ఎటువంటి కమీషన్ తీసుకోకుండా సేవలు అందిస్తామని మంగళవారం ప్రకటించింది. అయితే డ్రైవర్లు లాగిన్ ఫీజు చెల్లిస్తే సరిపోతుందని వెల్లడించింది. నగరాన్నిబట్టి ఈ రుసుము రోజుకు రూ.9 నుంచి రూ.29 మధ్య ఉంటుంది.

ఫైనాన్స్, ఐటీ షేర్లలో కొనుగోళ్లు

- అరశాతానికి పైగా పెరిగిన సూచీలు
- సెన్సెక్స్ లాభం 483 పాయింట్లు
- కలిసొచ్చిన ద్రవ్యోల్బణ తగ్గుముఖం
- ఎఫ్‌ఐఐల పెట్టుబడులపై ఆశలు



ముంబై: ఫైనాన్స్, బ్యాంకింగ్ షేర్లలో రికవరీ ర్యాలీతో పాటు ఐటీ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు మంగళవారం అరశాతానికి పైగా లాభపడ్డాయి. రిటైల్ ద్రవ్యోల్బణం 3 నెలల కనిష్టానికి దిగిరావడం, దేశీయ మార్కెట్లోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం పుంజుకోవచ్చనే ఆశలు సెంటిమెంట్‌ను మెరుగుపరిచాయి. ఫలితంగా సెన్సెక్స్ 483 పాయింట్లు పెరిగి 71,555 వద్ద నిలిచింది. నిఫ్టీ 127 పాయింట్లు బలపడి 21,743 వద్ద నిలిచింది. స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ప్రారంభంలోనే కాస్త అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే వెంటనే తేరుకొని తిరిగి లాభాల బాట పట్టాయి. మెటల్ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు స్థిరమైన లాభాలతో కదిలాయి. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ అవుట్‌లుక్, రేట్ల తగ్గింపు సమయాన్ని నిర్ధారించే అమెరికా ద్రవ్యోల్బణ డేటా వెల్లడి నేపథ్యంలో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభ, నష్టాల మధ్య ట్రేడవుతున్నాయి.

- పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్)పై ప్రకటించిన చర్యలను పునఃసమీక్షించే ప్రసక్తే లేదని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేయడంతో పేటీఎం షేరు 10% లోయర్ సర్క్యూట్‌ను తాకి రూ.380 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ మెక్వారీ పేటీఎం షేరుకు డౌన్‌గ్రేడ్ రేటింగ్‌ను తగ్గించడం కూడా ప్రతికూల ప్రభావం చూపింది.

రిలయన్స్ @ రూ.20 లక్షల కోట్లు

రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ తొలిసారి రూ.20 లక్షల కోట్లను అందుకుంది. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారతీయ కంపెనీగా రికార్డు సృష్టించింది. ఈ షేరు ఇంట్రాడేలో 2% పెరిగి రూ.2,957 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.20,01,279 కోట్లుగా నమోదైంది. చివరికి షేరు 1% లాభంతో రూ.2,929 వద్ద ముగియడంతో కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.19.81 లక్షల కోట్ల వద్ద స్థిరపడింది. దేశంలో టాప్–10 మార్కెట్ క్యాప్ కలిగిన సంస్థల్లో రిలయన్స్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఎల్‌ఐసీ, ఎస్‌బీఐ, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌యూఎల్, ఐటీసీలు తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి.

ఐషర్ మోటార్స్ లాభం అప్

క్యూ3లో రూ. 996 కోట్లు



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం ఐషర్ మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 34 శాతం జంప్‌చేసి రూ. 996 కోట్లను తాకింది. దేశ, విదేశాలలో అమ్మకాలు ఊపందుకోవడం లాభాల్లో వృద్ధికి సహకరించింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 741 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 12 శాతం పుంజుకుని రూ. 4,179 కోట్లకు చేరింది. ఈ కాలంలో అనుబంధ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ 4 శాతం అధికంగా 2,29,214 మోటార్‌సైకిళ్లను విక్రయించింది. కొత్త 450 షెర్పా ప్లాట్‌ఫామ్‌పై అభివృద్ధి చేసిన హిమాలయన్ బైకులు సాహసిక ప్రపంచ పర్యాటక పరిస్థితుల్ని మార్చగలవని భావిస్తున్నట్లు కంపెనీ ఎండీ సిద్ధార్థ లాల్ పేర్కొన్నారు. వెరసి మిడిల్‌వెయిట్ మోటార్‌సైక్లింగ్ విభాగంలో భారీ పురోగతిని సాధించగలదని అంచనా వేశారు.

ఫలితాల నేపథ్యంలో ఐషర్ షేరు బీఎస్‌ఈలో 0.4 శాతం నీరసించి రూ. 3,857 వద్ద ముగిసింది.

నష్టాల్లోకి బీహెచ్ఈఎల్

క్యూ3లో రూ. 149 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇంజినీరింగ్ దిగ్గజం భారత్ హెవీ ఎలక్ట్రికల్స్(బీహెచ్ఈఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో లాభాలను వీడి రూ. 149 కోట్ల నికర నష్టం ప్రకటించింది. అధిక వ్యయాలు ప్రభావం చూపాయి. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 42 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 5,354 కోట్ల నుంచి 5,600 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 5,321 కోట్ల నుంచి రూ. 5,817 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో బీహెచ్ఈఎల్ షేరు 1.4% నష్టంతో రూ. 213 వద్ద ముగిసింది.

భవిత

జాబ్ పాయింట్

ఏపీలో 18 అనలిస్ట్ గ్రేడ్–2 పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో అనలిస్ట్ గ్రేడ్–2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 18
- » **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ(కెమిస్ట్రీ/బయో కెమిస్ట్రీ/బయాలజీ/ఇన్విరాన్‌మెంటల్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 01.07.2024 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **పే స్కేల్:** నెలకు రూ.48,440 నుంచి 1,37,220
- » **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 19.03.2024
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.04.2024
- » **వెబ్‌సైట్:** psc.ap.gov.in

ఏపీలో అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. ఏపీ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ సర్వీస్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 07
- » **అర్హత:**బీఆర్క్ లేదా బీఈ,బీటెక్(సివిల్) లేదా బీప్లానింగ్/బీటెక్(ప్లానింగ్) లేదా ఎంఏ(జాగ్రఫీ), పీజీ లేదా టౌన్ ప్లానింగ్‌లో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 01.07.2024 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **పే స్కేల్:** నెలకు రూ.61,960 నుంచి 1,51,370
- » **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 21.03.2024
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**10.04.2024
- » **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

ఇస్రో–యూఆర్ఎస్‌సీ, బెంగళూరులో 224 పోస్టులు

బెంగళూరులోని ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్, యూఆర్ శాటిలైట్ సెంటర్(యూఆర్ఎస్‌సీ), ఇస్రో టెలిమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 224.
- » **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్/ఇంజనీర్–ఎస్సీ–05, టెక్నికల్ అసిస్టెంట్–55, సైంటిఫిక్ అసిస్టెంట్–06, లైబ్రరీ అసిస్టెంట్–01, టెక్నీషియన్ బి/డ్రాఫ్ట్స్‌మ్యాన్ బి–142, ఫైర్‌మ్యాన్ ఎ–03, కుక్–04, లైట్ వెహికల్ డ్రైవర్ ఎ అండ్ వెహికల్ డ్రైవర్ ఎ–08.
- » **విభాగాలు:** మెకట్రానిక్, మెటీరియల్ సైన్స్, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ప్లంబర్, టర్నర్, కార్పెంటర్, వెల్డర్ తదితరాలు.
- » **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 12వ తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులవ్వాలి. డ్రైవింగ్ లైసెన్స్, పని అనుభవం ఉండాలి.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష/కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **దరఖాస్తులకు చివరితేది:** 01.03.2024
- » **వెబ్‌సైట్:** www.isro.gov.in

బెల్ పుణెలో డిప్యూటీ ఇంజనీర్ పోస్టులు

పుణెలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్) ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన డిప్యూటీ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 09.
- » **పోస్టుల వివరాలు:** డిప్యూటీ ఇంజనీర్(ఈ–2)–09.
- » **అర్హత:** బీఈ/బీటెక్(ఎలక్ట్రానిక్స్, మెకానికల్) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. వయసు: 27 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **దరఖాస్తులకు చివరితేది:** 28.02.2024
- » **వెబ్‌సైట్:** www.bel-india.in

యూనివర్శిటీ ఆఫ్ ముంబైలో జూనియర్ రీసెర్చ్ ఫెలోలు

యూనివర్శిటీ ఆఫ్ ముంబై, అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ డిపార్ట్‌మెంట్ జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్)ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 01
- » **అర్హత:** ఎంఎస్సీ(ఫిజిక్స్) ఉత్తీర్ణతతో పాటు యూజీసీ–సీఎస్ఐఆర్ నెట్/స్లెట్/గేట్/పెట్ స్కోరు కలిగి ఉండాలి.
- » **దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్:** registrar@cbs.ac.in.
- » **దరఖాస్తులకు చివరితేది:** 14.02.2024.
- » **వెబ్‌సైట్:** www.mu.ac.in

ఎన్ఐఏలో అసిస్టెంట్ కొలువులు

దేశంలో వేగంగా విస్తరిస్తున్న రంగాల్లో.. బీమా రంగం ముందుంటుంది. ప్రముఖ ప్రభుత్వ రంగ బీమా సంస్థ.. న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఎన్ఐఏ).. తాజాగా 300 అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏదైనా డిగ్రీ అర్హతతో ఈ ఉద్యోగాలకు పోటీపడొచ్చు. రెండు దశల రాత పరీక్షల్లో ప్రతిభ చూపితే బీమా రంగంలో ఉజ్వల కెరీర్ ఖాయమవుతుంది. ఈ నేపథ్యంలో..ఎన్ఐఏ పోస్టులు, ఎంపిక విధానం, రాత పరీక్షలో రాణించేందుకు ప్రిపరేషన్ తదితర వివరాలు..

- » న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీలో 300 ఉద్యోగాలు
- » రెండు దశల రాత పరీక్షల్లో ప్రతిభ ఆధారంగా ఎంపిక
- » ఎంపికైతే నెలకు రూ.37 వేల ప్రారంభ వేతనం



దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ బీమా కంపెనీలు తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలు సైతం ప్రైవేట్ రంగంతో పోటీ పడుతూ సేవలందిస్తున్నాయి. ఇందులో భాగంగానే సిబ్బందిని నియమించుకునేందుకు ఎన్ఐఏ క్రమం తప్పకుండా నియామకాలు చేపడుతోంది.

మొత్తం 300 పోస్టులు

ఎన్ఐఏ.. వివిధ రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలలోని తన శాఖల్లో 300 అసిస్టెంట్ పోస్టులను భర్తీకి ప్రకటన విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో ఆరు, తెలంగాణలో ఆరు పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. అభ్యర్థులు పదో తరగతి నుంచి డిగ్రీ వరకు ఏదో ఒక స్థాయిలో ఇంగ్లిష్‌ను ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.

వయసు: 2024, జనవరి 1 నాటికి 21–30 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

అసిస్టెంట్ పోస్టుల నియామకానికి సంబంధించి రెండు దశల ఎంపిక ప్రక్రియను నిర్వహించనున్నారు. తొలిదశలో ప్రిలిమినరీ పరీక్ష, రెండో దశలో మెయిన్ ఎగ్జామినేషన్ ఉంటాయి.

ప్రిలిమినరీ పరీక్ష

అసిస్టెంట్ పోస్టుల ఎంపిక ప్రక్రియలో తొలిదశ టైర్–1 ప్రిలిమినరీ రాత పరీక్ష మూడు విభాగాల్లో 100 మార్కులకు ఉంటుంది. టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలు–30 మార్కులు, టెస్ట్ ఆఫ్ రీజనింగ్ 35 ప్రశ్నలు–35 మార్కులు, టెస్ట్ ఆఫ్ న్యూమరికల్ ఎబిలిటీ 35 ప్రశ్నలు–35 మార్కులకు జరుగుతుంది. ప్రతి విభాగానికి 20 నిమిషాలు చొప్పున మొత్తం గంట వ్యవధిలో పరీక్ష ఉంటుంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే అడుగుతారు. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు లభిస్తుంది. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కును తగ్గిస్తారు.

250 మార్కులకు మెయిన్స్

ప్రిలిమినరీ పరీక్షలో ప్రతిభ ఆధారంగా.. కటాఫ్‌లను అనుసరించి మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి రెండో దశలో మెయిన్ ఎగ్జామినేషన్ ఉంటుంది. మెయిన్ పరీక్షను మొత్తం 5 విభాగాల్లో 250 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు–50 మార్కులు, టెస్ట్ ఆఫ్ రీజనింగ్ 40 ప్రశ్నలు–50 మార్కులు, టెస్ట్ ఆఫ్ న్యూమరికల్ ఎబిలిటీ 40 ప్రశ్నలు–50 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–50 మార్కులు, టెస్ట్ ఆఫ్ జనరల్ నాలెడ్జ్ 40 ప్రశ్నలు–50 మార్కులకు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. పరీక్షకు లభించే సమయం రెండు గంటలు. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కును తగ్గిస్తారు.

రీజనల్ లాంగ్వేజ్ టెస్ట్

మెయిన్‌లోనూ అర్హత సాధించిన వారికి తదుపరి దశలో రీజనల్ లాంగ్వేజ్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. తమ సొంత రాష్ట్రం కాకుండా..ఇతర రాష్ట్రాలలోని పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు..అక్కడి అధికార భాషలో ఈ టెస్ట్ ఉంటుంది. 50 మార్కులకు రీజనల్ లాంగ్వేజ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా అభ్యర్థులు ఒక ఎస్సే రైటింగ్, ఒక లెటర్ రైటింగ్ ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.

ఆకర్షణీయ వేతనం

మూడు దశల ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన వారికి.. మెరిట్ ఆధారంగా నియామకం ఖరారు చేస్తారు. ప్రారంభంలో క్లాస్–3 కేడర్‌లో నియమిస్తారు. వేతన శ్రేణి రూ.22,405–రూ.62,265 లభిస్తుంది. ప్రారంభంలోనే నెలకు రూ.37 వేల వేతనం అందుకునే వీలుంది.

ఆరు నెలల ప్రొబేషన్

ఎంపికైన అభ్యర్థులకు ముందుగా ఆరు నెలల ప్రొబేషన్ పిరియడ్ ఉంటుంది. ప్రొబేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి శాశ్వత నియామకం ఖరారవుతుంది. అసిస్టెంట్ కొలువులు సొంతం చేసుకున్న వారు భవిష్యత్తులో పదోన్నతుల ద్వారా సీనియర్ మేనేజర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. తొలుత ఏఏఓగా పదోన్నతి పొందొచ్చు. ఆ తర్వాత సర్వీసు నిబంధనలు అనుసరించి ఏఓ, ఎస్ఏఓ, అసిస్టెంట్ మేనేజర్, మేనేజర్, సీనియర్ మేనేజర్ స్థాయికి చేరుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** ఫిబ్రవరి15, 2024
- **టైర్–1 ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** మార్చి 2, 2024
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్:** పరీక్ష తేదీకి వారం రోజుల ముందు నుంచి;
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** http://www.newindia.co.in

రాత పరీక్షలో రాణించేలా

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌తో మొదలుపెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్, జంబుల్డ్ సెంటెన్సెస్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్, లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు చదవడం, ఎడిటోరియల్ లెటర్స్ చదవడం మేలు చేస్తుంది.

రీజనింగ్

ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలో కీలకమైన రీజనింగ్‌కు అభ్యర్థులు పటిష్ట ప్రిపరేషన్ సాగించాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్–డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై అవగాహన పెంచుకోవాలి.

న్యూమరికల్ ఎబిలిటీ

ఈ విభాగానికి సంబంధించి అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్‌పైనా పట్టు సాధిస్తే.. ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ మంచి మార్కులు పొందే అవకాశం ఉంటుంది.

జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగం కోసం అభ్యర్థులు ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. బీమా, ఆర్థిక రంగంలో మార్పులు, ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి.ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, మ్యూచువల్ ఫండ్స్, ఆర్థిక రంగంలో వినియోగించే పదజాలంపై పట్టు సాధించాలి.

కంప్యూటర్ నాలెడ్జ్

ఈ విభాగానికి సంబంధించి బేసిక్ కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ఎంఎస్ ఆఫీస్ టూల్స్‌పై పట్టు సాధించాలి. ముఖ్యంగా న్యూ ఫైల్ క్రియేషన్, ఎక్సెల్ షీట్, పీపీటీ వంటి వాటి గురించి తెలుసుకోవాలి. అదే విధంగా కీ బోర్డ్ షార్ట్ కట్స్, బేసిక్ హార్డ్‌వేర్ టూల్స్‌పైనా అవగాహన ఉండాలి.

జనరల్ నాలెడ్జ్

ఈ విభాగానికి సంబంధించి స్టాక్ జీకేతోపాటు ముఖ్యమైన వ్యక్తులు, సదస్సులు, క్రీడలు–విజేతలు, అవార్డులు–గ్రహీతలు తదితర అంశాలపై దృష్టి సారించాలి. హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీ తదితరాలపై అవగాహన పెంచుకోవాలి.

ఏపీలో ప్రభుత్వ గ్రంథాలయాలు అద్భుతం

బ్రిటీష్ కౌన్సిల్ లైబ్రరీస్ డైరెక్టర్ విజయలక్ష్మి



గ్రంథాలయంలో వసతులపై విజయలక్ష్మి, మేఘా కక్కర్‌కు వివరిస్తున్న ప్రసన్నకుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్‌లో గ్రంథాలయాలు అద్భుతంగా ఉన్నాయని చెన్నైలోని బ్రిటీష్ కౌన్సిల్‌కు చెందిన లైబ్రరీస్ డైరెక్టర్ టి.విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం గుంటూరు అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఢిల్లీలోని బ్రిటీష్ కౌన్సిల్ లైబ్రరీస్ విభాగాధిపతి మేఘా కక్కర్‌తో కలిసి ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో పుస్తక, పోటీ పరీక్షల విభాగాలతో పాటు ఇంటర్‌నెట్ విభాగాలను సందర్శించిన విజయలక్ష్మి, గ్రంథాలయాన్ని ఆధునికంగా తీర్చిదిద్దిన తీరును చూసి రాష్ట్ర ప్రభుత్వంపై ప్రశంసల వర్షం కురిపించారు. పౌర గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేయడంతో పాటు పేద విద్యార్థులకు బాసటగా ఉండడాన్ని ప్రశంసించారు. ఉచిత సాఫ్ట్‌వేర్ పాలసీపై పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్‌తో చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యులు జి. మహేశ్, డిప్యూటీ డైరెక్టర్ షేక్ పీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యే ఏలూరికి నోటీసులు

మార్టూరు: బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు 41 ఏ (1) కింద నోటీసులు జారీ చేసినట్లు మార్టూరు సీఐ ఎస్‌వీ రాజశేఖర్‌రెడ్డి మంగళవారం రాత్రి తెలిపారు. గత నెల 30వ తేదీన స్థానిక నాగరాజుపల్లి రోడ్డులోని అనంత గ్రానైట్ పరిశ్రమలో తనిఖీల నిమిత్తం వచ్చిన విజిలెన్స్ అండ్ మైనింగ్ అధికారులను ఎమ్మెల్యే ఏలూరి, ఆయన అనుచరులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తమ విధులకు ఆటంకం కలిగించారంటూ ఏడీ బాలాజీనాయక్ మార్టూరు పోలీస్ స్టేషన్‌లో ఏలూరి, అతని అనుచరులు ఏడుగురిపై ఫిర్యాదు చేశారు. ఈ కేసు నేపథ్యంలో ఏలూరి సాంబశివరావును ఈ నెల 22న మార్టూరు పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాలని నోటీసులు జారీ చేసినట్లు సీఐ తెలిపారు.

డీసీఐఎల్ క్యూ-3 లాభం రూ.27.22 కోట్లు

విశాఖ సిటీ: డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డీసీఐఎల్) మూడో త్రైమాసికంలో అద్భుత లాభాన్ని ఆర్జించింది. క్యూ-3లో రూ.69.59 కోట్ల ఆదాయం రాగా.. ఇందులో పన్నులు, వడ్డీలు, ఇతరత్రా ఖర్చులు మినహా రూ.27.22 కోట్ల లాభాన్ని గడించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే త్రైమాసికంలో రూ.13.84 కోట్ల లాభాన్ని మాత్రమే ఆర్జించింది. అలాగే ప్రతి షేరు సంపాదన (ఈపీఎస్) రూ.9.72కు చేరుకుంది. ప్రణాళికాబద్ధమైన వ్యయ నిర్వహణ, కస్టమర్లకు మంచి సేవలు అందిస్తూ సంస్థ ప్రగతి బాటలో పయనిస్తోందని డీసీఐఎల్ ఎండీ అండ్ సీఈవో కెప్టెన్ ఎస్.దివాకర్ తెలిపారు.

ప్రజల కోసం రోడ్డేసినా ఓర్వలేకపోతున్న రామోజీ

వైవీ సుబ్బారెడ్డి వ్యవసాయ క్షేత్రానికి రోడ్డంటూ ఈనాడు తప్పుడు రాతలు

- మూడు గ్రామాల రైతుల కోరిక మేరకు రోడ్డు నిర్మాణం
- వందలాది ఎకరాల పంటపొలాలకూ అదేదారి
- ఆ దారిలోనే మణికేశ్వరం గ్రామం, ప్రసిద్ధ శైవక్షేత్రం
- సౌకర్యవంతమైన రోడ్డుతో రైతులు, భక్తుల్లో ఆనందం
- పచ్చపత్రిక తప్పుడు కథనంపై ప్రజల మండిపాటు



అనమనమూరు నుంచి మణికేశ్వరం క్రాస్ వరకూ నిర్మించిన తారురోడ్డు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: రోడ్లపై గుంత కనబడితే చాలు అక్కడకి గద్దల్లా వాలిపోతున్న ఎల్లోమీడియా గ్యాంగ్.. ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులతో ప్రజలు సంతోషంగా ఉంటే చూసి ఓర్వలేకపోతోంది. తమకు రోడ్డు సౌకర్యం కలిగి ప్రజలు, రైతులు ఆనందంగా ఉంటే అక్కసుతో ప్రభుత్వంపై విషం చిమ్ముతోంది. అబద్ధాల్లో ఆరితేరిన రామోజీరావు అభివృద్ధి పనులకు వక్రభాష్యం చెబుతూ పనిగట్టుకొని ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు. ఈ పరంపరలో ఈనాడు పత్రిక మంగళవారం ''వైవీ సుబ్బారెడ్డి వ్యవసాయక్షేత్రానికి రూ. 30 లక్షలతో రోడ్డు'' అనే తప్పుడు కథనాన్ని ప్రచురించింది. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం అనమనమూరు వద్ద జనావాసాలు లేని, ప్రజలు తిరగని మార్గంలో రోడ్డు వేశారని, అధికారులు పెద్ద మొత్తంలో ధనాన్ని వెచ్చించి స్వామిభక్తి చాటుకున్నారంటూ ఆ కథనాన్ని అచ్చేశారు.

రైతులకు, భక్తులకు సౌకర్యంగా..

వాస్తవానికి మేదరమెట్ల అనమనమూరు రోడ్డులో అనమనమూరు నుంచి మణికేశ్వరం క్రాస్‌రోడ్డు వరకూ 2.5 కిలో మీటర్ల మేర ఉపాధిహామీ నిధులతో రెండు సంవత్సరాల క్రితం తారురోడ్డు వేశారు. ఈ రహదారి పరిధిలో కొరిశపాడు మండలం అనమనమూరు, అద్దంకి మండలం మణికేశ్వరం గ్రామాలున్నాయి. మణికేశ్వరం వద్ద దక్షిణకాశీగా పేరుగాంచిన శైవక్షేత్రం ఉంది. ఇక్కడికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. ఇక మూడు గ్రామాల పరిధిలో సుమారు నాలుగు వందల ఎకరాల పొలాలు ఉన్నాయి. ఈ పొలాల్లో రైతులు వరి, మామిడి, పుచ్చ తదితర పంటలు పండిస్తున్నారు. నిత్యం రైతులు రాకపోకలు సాగిస్తారు. గతంలో ఈ ప్రాంతానికి సరైన రోడ్డు సౌకర్యం కూడా లేదు. చిన్నపాటివర్షం కురిసినా రాకపోకలకు వీలుకాని పరిస్థితి.

గతంలో గ్రావెల్ రోడ్డు వేసినప్పుడూ తప్పుడు రాతలే..

వైవీ సుబ్బారెడ్డి మేదరమెట్లకు చెందిన వారు కావడంతో అనమనమూరు, కొంగపాడు, మణికేశ్వరం గ్రామాల రైతులు, ప్రజలు దారి సౌకర్యం ఏర్పాటు చేయాలని గతంలో వైవీ సుబ్బారెడ్డిని కోరారు. దీంతో 2005లో మేదరమెట్ల నుంచి అనమనమూరు వరకూ తారురోడ్డును మంజూరు చేయించిన సుబ్బారెడ్డి.. అనమనమూరు నుంచి మణికేశ్వరం క్రాస్ వరకూ గ్రావెల్ రోడ్డును సైతం మంజూరు చేయించారు. రెండు సంవత్సరాల క్రితం అనమనమూరు నుంచి మణికేశ్వరం క్రాస్ వరకూ రెండేళ్ల క్రితం తారురోడ్డు పూర్తికావడంతో మణికేశ్వరం, శైవక్షేత్రంలకు వెళ్లే భక్తులకు నాలుగు కిలోమీటర్ల దూరం తగ్గింది. దూరాభారం తగ్గి, మెరుగైన రోడ్డు రావడంతో స్థానికులు ఆనందంగా ఉండటం.. రామోజీకి కంటగింపుగా మారింది. వైవీ సుబ్బారెడ్డి కుటుంబీకులకు నలభై ఎకరాలు కూడా లేని చోట.. ఏకంగా వంద ఎకరాలు ఉన్నాయంటూ ఈనాడు వక్రీకరించింది. ఇలాంటి అబద్ధపు రాతలు రాసిన ఈనాడుపై స్థానికులు మండిపడుతున్నారు. గతంలో గ్రావెల్ రోడ్డు వేసినప్పుడూ ఇలాంటి రాతలే రాశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మణికేశ్వర ఆలయం

రోడ్డు వేసింది ప్రజలకోసం



అనమనమూరు గ్రామం నుంచి మణికేశ్వరం క్రాస్ వరకూ రోడ్డు నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని చాలా సార్లు వైవీ సుబ్బారెడ్డి గారిని కోరాం. పొలాలకు వెళ్లేందుకు పడుతున్న కష్టాలను ఆయనకు చెప్పాం. దీంతో ఆయన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అనమనమూరు నుంచి మణికేశ్వరం క్రాస్ వరకూ తారు రోడ్డు వేయించారు. గతంలో మేదరమెట్లనుంచి అనమనమూరువరకూ రోడ్డును కూడా సుబ్బారెడ్డి కుటుంబమే వేయించింది. ఈ రోడ్డుతో మా గ్రామాలకు వెళ్లడంతో పాటు పొలాలకు వెళ్లేందుకు అనుకూలంగా ఉంది. ప్రజలకు మంచి జరగడం చూసి ఓర్వలేక ఈనాడు పత్రిక తప్పుడు రాతలు రాసింది.

– జంపు హరిబాబు, అనమనమూరు సర్పంచ్

భక్తులకు రోడ్డు సౌకర్యంగా ఉంది



గతంలో మాగ్రామాలకు, పంట పొలాలకు దారిలేక ఇబ్బందులు పడ్డాం. ప్రఖ్యాత మణికేశ్వర ఆలయానికీ సరైన దారిలేక భక్తులు ఇబ్బందులు పడాల్సివచ్చేది. ఈ విషయాన్ని మా గ్రామాల ప్రజలు వైవీ సుబ్బారెడ్డి గారికి చెప్పడంతో వారు రోడ్డు వేయించారు. దీంతో రైతులు, భక్తులకు ఇబ్బందులు తప్పాయి. అది చూడకుండా సుబ్బారెడ్డి పొలాలకు దారి వేసుకున్నారంటూ ఈనాడు తప్పుడు వార్త రాయడం దుర్మార్గం.

– మందా నాగయ్య, మణికేశ్వరం సర్పంచ్ భర్త

సాగర్‌ను సందర్శించిన ఎన్డీఎస్‌ఏ అథారిటీ



నాగార్జున సాగర్ ప్రాజెక్టు వద్ద నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ బృందం

విజయపురిసౌత్: నేషనల్‌డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) బృందం మంగళవారం నాగార్జున సాగర్ ప్రాజెక్టును సందర్శించింది. ఈ నెల 13వ తేదీ నుంచి15 వరకు ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పరిశీలించనుంది. మొదటగా విజయ విహార్ బోర్డు రూములో ఎన్డీఎస్‌ఏ బృందం సభ్యులు రమేష్‌కుమార్, తెలంగాణ ఇంజనీర్లతో పాటు సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీ, సీఎస్ఎంఆర్ఎస్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఏఏ ప్రాంతాలను సందర్శించాలో రూట్‌మ్యాపును డ్యాం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన డ్యాం, ప్రాజెక్టు అంతర్భాగంలోని గ్యాలరీలు, గ్యాలరీ లోపలగల సీపేజీ (జాలునీరు)లను సందర్శించారు.420, 250గ్యాలరీలతో పాటు స్పిల్‌వే పైభాగాన గల వాక్‌వే బ్రిడ్జి మీదుగా దిగువనున్న స్పిల్‌వేను సందర్శించారు. స్పిల్‌వే మరమ్మతుల గురించి అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ స్టేట్ డ్యాం సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్‌డీఎస్‌వో) సీఈ ప్రమీల, ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ విజయలక్ష్మి, డీఈఈ సతీష్, ఏఈలు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఇంజనీర్ మురళీధరరెడ్డి , ఎస్ఈ వరలక్ష్మీ, ఈఈ శ్రీహరి, డీఈఈ మురళీధర్, ఏఈఈలు, తెలంగాణ చీఫ్ ఇంజనీర్ వి.అజయ్‌కుమార్, డ్యాం ఎస్ఈ పి.వి.ఎస్ నాగేశ్వర్‌రావు, ఈఈ మల్లకార్జున్‌రావు, డీఈఈలు శ్రీనివాసరావు, పాపారావు, ఏఈఈలు కృష్ణయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు. కాగా ఎన్డీఎస్‌ఏ బృందం బుధవారం సాగర్‌డ్యాం దిగువన గల జల విద్యుదుత్పాదన కేంద్రాన్ని సందర్శించనుంది.

రాజధాని ఫైల్స్ ప్రదర్శనను ఆపండి

- వైఎస్ జగన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతీసేందుకే ఈ చిత్రం
- అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టడమే దీని ఉద్దేశం
- ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ చిత్రాన్ని తీశారు
- సీఎం, కొడాలి నాని ఇతరుల్ని పోలిన పాత్రలున్నాయి
- భావ ప్రకటన స్వేచ్ఛకూ పరిమితులున్నాయి
- కోర్టు పరిధిలో ఉన్నా మూడు రాజధానుల అంశాన్ని సినిమాగా మలిచారు
- హైకోర్టును అభ్యర్థించిన వైఎస్సార్‌సీపీ న్యాయవాది ప్రశాంత్
- వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య
- మధ్యంతర ఉత్తర్వులపై నిర్ణయం వాయిదా

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోపాటు రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాల్జేయాలన్న ఏకైక ఉద్దేశంతో తీసిన 'రాజధాని ఫైల్స్' సినిమా ప్రదర్శనను నిలుపుదల చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ న్యాయ పోరాటం ప్రారంభించింది. ఆ సినిమాను థియేటర్లలో ప్రదర్శించేందుకు వీలుగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని కోరుతూ పార్టీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది.

ప్రజల్ని మభ్యపెట్టేందుకే ఈ సినిమా

వైఎస్సార్‌సీపీ తరఫున న్యాయవాది వీఆర్ఎస్ ప్రశాంత్ వాదనలు వినిపిస్తూ.. రాజధాని ఫైల్స్ పేరుతో తీసిన సినిమా ఏకైక లక్ష్యం ముఖ్యమంత్రిని, రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాల్జేయడమేనన్నారు. అవాస్తవాలతో ప్రజలను మభ్యపెట్టేందుకే ఈ చిత్రాన్ని నిర్మించారని తెలిపారు. ఈ చిత్ర నిర్మాణం వెనుక ప్రజల్లో వైఎస్సార్‌సీపీని పలుచన చేయాలన్న ఉద్దేశం కూడా ఉందన్నారు. వ్యక్తిగతంగా ముఖ్యమంత్రి సహా పార్టీ పెద్దలందరినీ అప్రతిష్ట పాల్జేయడమే ఈ సినిమా ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే కొడాలి నాని, ఇతర సభ్యులను పోలి ఉన్నాయని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. పాత్రల పేర్లు కూడా నిజ జీవితంలో ఆయా వ్యక్తుల పేర్లను పోలి ఉన్నాయన్నారు. అమరావతి పేరును ఐరావతి, ప్రధాని పేరును సురేంద్ర మోదీ, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పేరును రాంబాబు వంటి నిజ జీవితంలో పోలి ఉండే పేర్లను ఆయా పాత్రలకు పెట్టారన్నారు.

స్వీయ, రాజకీయ ప్రయోజనాల కోసమే..

ఈ నెల 5వ తేదీన రాజధాని ఫైల్స్ ట్రైలర్ విడుదల చేశారని, అందులో ముఖ్యమంత్రి, ప్రభుత్వాన్ని తక్కువ చేసి చూపించారని న్యాయవాది ప్రశాంత్ వివరించారు. చిత్ర నిర్మాతలు తమ స్వీయ, రాజకీయ ప్రయోజనాల కోసం వైఎస్సార్‌సీపీని బలిపశువును చేస్తున్నారన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛ ఎప్పుడూ కూడా పరిమితులకు లోబడి ఉంటుందని వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రతిష్టను దెబ్బతీయడం ద్వారా చిత్ర నిర్మాతలు హక్కుల ఉల్లంఘనలకు పాల్పడ్డారన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ చిత్రాన్ని నిర్మించారని వివరించారు. ఈ చిత్రం నిర్మాణం వెనుక ఉన్న వ్యక్తులెవరు, వారి ఉద్దేశాలు ఏమిటి తదితర వివరాలను సీబీఎఫ్‌సీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కోర్టు పరిధిలో ఉన్న మూడు రాజధానుల అంశంపై సినిమా తీయడం ఎంతమాత్రం సరికాదని కూడా వివరించామన్నారు. అయినా తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా రాజధాని ఫైల్స్ చిత్ర ప్రదర్శనకు సీబీఎఫ్‌సీ అధికారులు ధ్రువీకరణ పత్రం జారీ చేశారన్నారు. ఈ నెల 15న సినిమా విడుదల కానుందని, అందువల్ల ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని, చిత్ర ప్రదర్శనను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోర్టును కోరారు.

కించపరిచేలా సన్నివేశాల్లేవు

చిత్ర నిర్మాతల తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపిస్తూ.. మొదట తమ చిత్రాన్ని ఎగ్జామిన్ కమిటీ చూసి పలు సన్నివేశాలను తొలగించాలని చెప్పిందని, దీనిపై తాము రివిజన్ కమిటీని ఆశ్రయించామని చెప్పారు. రివిజన్ కమిటీ కూడా పలు సన్నివేశాలను తొలగించాల్సిందేనని చెప్పిందని, దీంతో ఆ సన్నివేశాలను తొలగించామన్నారు. ఆ తరువాతే సీబీఎఫ్‌సీ తమకు చిత్ర ప్రదర్శనకు అనుమతినిస్తూ సర్టిఫికెట్ జారీ చేసిందన్నారు. తమకు గత ఏడాది డిసెంబర్‌లో సర్టిఫికెట్ ఇస్తే వైఎస్సార్‌సీపీ ఇప్పుడు అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించిందన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులపై నిర్ణయాన్ని వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ఉత్తర్వులు జారీ చేశారు.

'ఊరు పేరు భైరవ కోన' హక్కుల వివాదం

సాక్షి, హైదరాబాద్: 'ఊరు పేరు భైరవ కోన' చిత్రం హక్కుల వివాదానికి సంబంధించి దాఖలైన పిటిషన్‌లో నిర్మాతలు, సెన్సార్ బోర్డుకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ అభ్యంతరాలపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. తమ వినతి పత్రాన్ని పరిష్కరించే వరకు చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ విశాఖపట్టణానికి చెందిన గాయత్రీ దేవి ఫిల్మ్స్ తరఫున బత్తుల సత్యనారాయణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా మంగళవారం విచారణ చేపట్టారు. చిత్ర హక్కులకు సంబంధించి పిటిషనర్, నిర్మాతల మధ్య వివాదం ఉందని, దీనిపై సివిల్ కోర్టులో విచారణ సాగుతోందని పిటిషనర్ న్యాయవాది తెలిపారు. సీబీఎఫ్‌సీ తరఫు న్యాయవాది వాదిస్తూ.. ఆర్థిక లావాదేవీలతో బోర్డుకు సంబంధం లేదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. అడ్వంచర్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్, అనిల్‌కుమార్ సుంకర, కృష్ణకిశోర్ గరికిపాటి, రామబ్రహ్మం సుంకరతో పాటు సీబీఎఫ్‌సీ చైర్మన్ తదితరులకు నోటీసులు జారీ చేశారు. సర్టిఫికెట్ జారీ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించారు.

అడవి సంరక్షణకు ఫైర్‌లైన్స్

- వేసవిలో అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు
- 50 కిలోమీటర్ల పరిధిలో ఫైర్‌లైన్స్ ఏర్పాటు
- అటవీ శాఖ అధికారుల ప్రత్యేక శ్రద్ధతో తగ్గుతున్న అగ్నిప్రమాదాలు

బుట్టాయగూడెం: వేసవికాలం వచ్చిందంటే ఏటా అడవులు తగలబడిపోవడం సర్వసాధారణమైంది. దీనివల్ల వృక్ష సంపదకు, వన్యప్రాణులకు హాని కలిగే పరిస్థితులు నెలకొంటున్నాయి. అడవుల్లో అగ్నిప్రమాదాల వల్ల వాతావరణ సమతుల్యం కూడా దెబ్బతినే ప్రమాదం నెలకొంటుందని నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వేసవిలో సంభవించే అగ్నిప్రమాదాల నివారణకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. అటవీ సంరక్షణలో భాగంగా సుమారు 50 కిలోమీటర్ల పరిధిలో ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా ఫైర్ బ్లోయర్స్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు.

జిల్లాలో విస్తరించి ఉన్న అటవీప్రాంతం

జాతీయ అటవీ విధానం ప్రకారం మూడో వంతు భూభాగంలో చెట్లు ఉండాలి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో సుమారు 1.32 లక్షల హెక్టార్ల పరిధిలో అటవీప్రాంతం విస్తరించి ఉంది. ఇందులో 85 శాతం పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోనే ఉందని అధికారులు చెబుతున్నారు. బుట్టాయగూడెం మండలంలో 21,879 హెక్టార్లు, పోలవరం 27,927 హెక్టార్లు, జీలుగుమిల్లి 8,903 వేలేరుపాడు 29,476, కుక్కునూరు 22,259, టి.నర్సాపురం 4384, చింతలపూడి 6,780, కామవరపుకోట 1,178, లింగపాలెం 2,119, గోపాలపురం 649, ద్వారకాతిరుమల 813, నల్లజర్ల 2,174, పెదవేగి 1332 హెక్టార్లు, ఉంగుటూరు మండలంలో 1226 హెక్టార్లలో అడవి విస్తరించి ఉన్నట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

అడవిలో అగ్నిప్రమాదాలు ఇలా..

వేసవికాలంలో చెట్ల ఆకులు ఎక్కువగా రాలిపోతుంటాయి. అటవీప్రాంతంలోకి పశువులను తీసుకువెళ్లిన కాపరులు, తునికాకు, చింతపండు, ఇప్పపూలు, అడ్డపిక్కలు, తదితర వాటి సేకరణ కోసం వెళ్లినవారిలో ఎవరైనా అనుకోకుండా చుట్ట, సిగరెట్, బీడీ వంటివి తాగి పడేస్తే అవి ఎండిన ఆకులకు అంటుకొని మంటలు వ్యాప్తి చెంది పెద్ద మొత్తంలో అడవులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. అలాగే ఆకతాయిల చేష్టల వల్ల కూడా అడవుల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. గిరిజన ప్రాంతంలో అడవుల్లో ఏటా ఏదో ఒక ప్రాంతంలో అడవికి నిప్పు రాజుకుని మంటలు చెలరేగుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.



వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు తీసుకుంటున్న అటవీ సిబ్బంది

అటవీప్రాంతంలో ప్రత్యేక నిఘా

వేసవికాలంలో అటవీప్రాంతంలో సంభవించే అగ్ని ప్రమాదాల నివారణకు రాత్రి పగలు తేడాలేకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని ఫారెస్ట్ అధికారులు చెప్తున్నారు. ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేసి ఎండిన ఆకులను పరిచి అవి పూర్తిగా కాలిపోయే వరకూ కాపలా ఉంటారు. అలాగే అనుకోకుండా మంటలు వ్యాప్తి చెందితే అందుబాటులో ఉన్న సిబ్బంది ఆ మంటలను అదుపు చేస్తారు. వీటి వల్ల అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉంటాయి.



అటవీ ప్రాంతంలో ఫైర్‌లైన్స్ పనులు చేస్తున్న దృశ్యం

శాటిలైట్ ద్వారా సమాచారం

అటవీప్రాంతంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంటే వెంటనే సమాచారం అందించేందుకు అటవీశాఖ ప్రధాన కార్యాలయంలో ఫైర్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. శాటిలైట్ ద్వారా వచ్చే సమాచారాన్ని తక్షణమే అటవీశాఖ అధికారులకు సమాచారాన్ని చేరవేస్తుంది. జిల్లాలో ఎక్కడైనా అటవీప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించి మంటలు చెలరేగితే ఆ ప్రాంతానికి తక్షణమే సమాచారం అందించే వీలుంటుంది. దీనితో ఫారెస్ట్ అధికారులు అప్రమత్తమై ఆయా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువస్తారు.

ఫైర్‌లైన్స్ ఏర్పాటు ఇలా



ఫైర్ బ్లోయర్స్ ద్వారా మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణలో భాగంగా ఫారెస్టు అధికారులు అటవీ ప్రాంతంలో ఫైర్ లైన్స్ ఏర్పాటు చేస్తారు. అటవీ ప్రాంతంలో కాలిబాటలో ఐదు మీటర్ల వెడల్పుతో వీటిని ఏర్పాటు చేయడం జరుగుతుంది. చుట్టు పక్కల ఉన్న ఎండిన ఆకులను కాలి బాటలో పరిచి నిప్పు పెడతారు. ఒకవేళ ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి మంటలు చెలరేగినా ఈ దారివరకే మంటలు వ్యాప్తి చెంది ఆరిపోతాయి. మిగతా ప్రాంతానికి మంటలు వ్యాప్తి చెందకుండా ఫైర్‌లైన్స్ అరికడతాయి. అడవుల సంరక్షణకు ఏటా అటవీ అధికారుల ఆధ్వర్యంలో వేసవి ప్రారంభంలో ముందస్తు చర్యలు చేపడతారు. ఫైర్‌లైన్స్ దాదాపు 2 కిలోమీటర్ల మేర ఏర్పాటు చేయడం ద్వారా అగ్నిప్రమాదాలు రాకుండా అరికట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. పశ్చిమ ఏజెన్సీలో అటవీ విస్తరణ అధికంగా ఉండటం వల్ల సుమారు 50 కిలోమీటర్లమేర ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం

అడవులు, జంతువుల సంరక్షణ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో సంభవించే అగ్ని ప్రమాదాల నివారణకు ఫైర్ వాచర్స్ ద్వారా కృషి చేస్తున్నాం. 50 కిలోమీటర్ల పరిధిలో ఫైర్ లైన్స్ ఏర్పాటు చేస్తున్నాం. వీటి ద్వారా మంటలను వ్యాప్తి చెందకుండా నివారించేలా కృషి చేస్తున్నాం. అలాగే అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణపై పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు పూర్తి అవగాహన కలిగించే విధంగా కృషి చేస్తున్నాము.

– దావీదు రాజు, డీఆర్‌వో, వైల్డ్‌లైఫ్, పోలవరం

ఇంటర్న్‌షిప్ కోసం ప్రముఖ కంపెనీలతో ఒప్పందాలు

- వేలాది మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు లబ్ధి
- అలాగే ఎడెక్స్ నుంచి ఉచితంగా 2 వేల ఆన్‌లైన్ కోర్సులు
- జేఎన్‌టీయూ జీవీలో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో మంత్రి బొత్స సత్యనారాయణ



వర్సిటీ వార్షికోత్సవ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స, కలెక్టర్ నాగలక్ష్మి, వర్సిటీ అధికారులు

విజయనగరం అర్బన్: స్టైఫెండ్ ఇస్తూ ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించే మల్టీనేషనల్ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. దీనివల్ల 40 వేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు లబ్ధి కలుగుతుందని చెప్పారు. జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం(జీవీ) యూనివర్సిటీలోని వివిధ అభివృద్ధి పనులను మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్న్‌షిప్ కోసం ఇంజినీరింగ్ విద్యార్థుల(4వ సంవత్సరం) నమోదు ప్రక్రియ ప్రారంభించామని.. 12 వేల మంది విద్యార్థులు ఇప్పటికే వివరాలు నమోదు చేసుకున్నారని చెప్పారు. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ప్రఖ్యాతి గాంచిన ఎడెక్స్ సంస్థ ద్వారా సుమారు 2 వేల ఆన్‌లైన్ కోర్సులను రాష్ట్ర విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ కోర్సులకు ఫీజులను సైతం ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 16న సీఎం వైఎస్ జగన్ ప్రారంభిస్తారని తెలిపారు. విద్యా సంస్థల్లో పూర్తి స్థాయి సదుపాయాలు కల్పించడంతో పాటు అవసరమైనంత మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులను కూడా నియమిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా సుమారు 2,200 ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అధ్యాపకుల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకున్నామని వివరించారు. విజయనగరంలోని జేఎన్‌టీయూ వర్సిటీని అత్యున్నత వర్సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ జి.నాగలక్ష్మి, జేఎన్‌టీయూ(జీవీ) వీసీ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ జి.జయ సుమ, ప్రిన్సిపాల్ కె.శ్రీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో రథ సప్తమికి విస్తృత ఏర్పాట్లు

తిరుమల: సూర్య జయంతి సందర్భంగా ఈ నెల 16న రథసప్తమిని తిరుమలలో ఘనంగా నిర్వహించేందుకు టీటీడీ విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టింది. ఒకే రోజు స్వామి వారు ఏడు వాహనాలపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ నేపథ్యంలో ఈ రథ సప్తమిని అర్ధ బ్రహ్మోత్సవం, ఒక రోజు బ్రహ్మోత్సవంగా పేర్కొంటున్నారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చకచకా పూర్తి చేస్తున్నారు. రథసప్తమి రోజున ప్రొటోకాల్ ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనం ఉంటుంది. వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనాలు రద్దు చేశారు. సామాన్య భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు తిరుపతిలోని కౌంటర్లలో సర్వదర్శనం టోకెన్ల జారీ నిలిపివేశారు. భక్తులు నేరుగా వైకుంఠం క్యూకాంప్లెక్స్-2 ద్వారా శ్రీవారిని దర్శించుకోవచ్చు. 14 నుంచి 16 వరకు గదుల కేటాయింపు కోసం సీఆర్వో జనరల్ కౌంటర్లు పనిచేస్తాయి.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

శంకరాచార్య మఠంలో పూజలు



విశేష పూజల్లో పాల్గొన్న స్వామీజీ, భక్తులు

గంగావతి: నగరంలోని జయనగర్‌లో ఉన్న శంకరాచార్య మఠంలో సమానత ధర్మ ప్రవచకులు విధుశేఖర మహాస్వామీజీ సన్యాసం పుచ్చుకున్న రోజున విశేష పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి పలు రకాల అభిషేకాలు, విశేష అలంకరణ, పారాయణం లాంటి ధారిృక కార్యక్రమాలను జరిపారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ నేటితో సన్యాసం స్వీకరించి 9వ సంవత్సరం పూర్తయినందున విశేష పూజలు జరిపామన్నారు. భక్తులకు స్వామి వారు ప్రవచనాలను వల్లించారు. కార్యక్రమంలో శంకరాచార్య మఠం ప్రముఖులు ఎస్‌బీహెచ్ నారాయణరావ్ తదితర ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

కందగల్లులో ఈశ్వర రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

హొసపేటె: తాలూకాలోని కందగల్లులో వెలసిన ఈశ్వర స్వామి రథోత్సవం వేలాది మంది భక్తుల జయజయ ధ్వానాల మధ్య ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో ఈశ్వర విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామ న్యాయవాది మల్లనగౌడ సిద్దనగౌడ రూ.11,500లకు స్వామివారి రథోత్సవ బాణసంచాను వేలంలో దక్కించుకున్నారు. అనంతరం వేలాది మంది భక్తులు స్వామి వారి రథాన్ని లాగారు. భక్తులు రథంపైకి అరటిపండ్లు, పూలు విసిరి భక్తిని చాటుకున్నారు.

వాసవీ కన్యకా పరమేశ్వరికి విశేష పూజలు



అమ్మవారి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న ఆర్యవైశ్య నేతలు

కంప్లి: సండూరు తాలూకా ఆర్యవైశ్య సమాజం పరంగా మంగళవారం సోవేనహళ్లి గ్రామంలోని ఆంజనేయ దేవస్థానంలో మాత వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఉత్సవ మూర్తికి విశేష పూజలు సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం అన్న సంతర్పణ సమితి, ఆర్యవైశ్య ఛత్ర నిర్మాణ సమితి తరఫున గ్రామంలో సామూహికంగా చిత్రపటంతో పాదయాత్ర, మృత్యుంజయ హోమం, హవనం నిర్వహించినట్లు తాలూకా అధ్యక్షుడు రామశెట్టి తెలిపారు.

క్రీడాంగణం నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సిద్దనగౌడ తదితరులు

కంప్లి: కురుగోడు తాలూకా కోళూరులోని ప్రభుత్వ పాఠశాలకు భూదానం చేసిన సిద్దనగౌడ చేతుల మీదుగా మంగళవారం క్రీడాంగణం నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. నరేగ తాలూకా సహాయక డైరెక్టర్ పీ.శివరామరెడ్డి మాట్లాడుతూ భూదాత ఉదారతకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు ఇకపై క్రీడాంగణంలో హాయిగా ఆడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పీడీఓ జుబేదా, సాంకేతిక సహాయకురాలు అరుణ తదితరులు పాల్గొన్నారు.

పైవంతెన నిర్మాణానికి స్థల పరిశీలన



రైల్వే గేట్ వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎంపీ కరడి సంగణ్ణ, అధికారులు

గంగావతి: కొప్పళ తాలూకా కిడదాళ సమీపంలోని 68వ రైల్వే గేట్ వద్ద పైవంతెన నిర్మాణానికి డీపీఆర్ తయారీకి పరిశీలన బృందం విచ్చేసింది. వీరి వెంట కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ విచ్చేసి రైల్వే గేట్ వద్దకు బృందాన్ని తీసుకెళ్లి పరిశీలన చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వంతెన నిర్మాణానికి రూ.35 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసిన అనంతరం పనులను ప్రారంభిస్తారన్నారు. కుష్టిగి వద్ద నిర్మించిన వంతెనలా నిర్మించాలని అధికారులకు సూచించారు.

అడవులు వెలవెల.. వన్యప్రాణులు విలవిల



ఉమ్మడి జిల్లాలో తిరుగుతున్న చిరుత



జనావాసాల్లోకి ప్రవేశిస్తున్న ఎలుగుబంటి



సండూరు అడవిలో తాత్కాలికంగా నిర్మిస్తున్న నీటితొట్టి

- ఆహారం, నీటి కోసం జనావాసాల్లోకి చొరబాట్లు
- బిక్కుబిక్కుమంటున్న సమీప గ్రామాల ప్రజలు

సాక్షి,బళ్లారి: వరుణుడు ముఖం చాటేస్తే ప్రజలకే కాకుండా పశుపక్షాదులు, అడవి జంతువుల జీవన మనుగడపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడటం వల్ల రైతన్నలు పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల పాలై, రబీలో పంటలు పెట్టడానికి నీటి సదుపాయం లేక వలసలు వెళుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు తలెత్తుతున్నాయి. గ్రామాలే కాకుండా పట్టణాలు, నగరాల్లో కూడా వర్షాభావ పరిస్థితులతో కరువు ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులతో అడవుల్లో జీవించే వన్యప్రాణులు, పశుపక్షాదులు కూడా తాగునీరు, ఆహారం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఉమ్మడి బళ్లారి జిల్లాలో సండూరు, కుడితిని, తోరణగల్లు, విజయనగర జిల్లాలోని గుడేకోటె తదితర ప్రాంతాల్లో వేల ఎకరాల్లో అటవీ ప్రాంతాలు విస్తరించాయి. అడవుల్లో చిరుతలు, ఎలుగుబంట్లు, జింకలు, నక్కలు తదితర ఎన్నో జంతువులు నివాసం ఉంటున్నాయి. వర్షాలు బాగా కురిస్తే వన్యప్రాణులకు నీటి సమస్య ఉండదు. అడవుల్లో అక్కడక్కడ ఉన్న నీటి గుంతలు, చెరువులు, సెలయేళ్ల ద్వారా దాహం తీర్చుకుంటాయి.

నీటి కొరత నివారణకు చర్యలు

ఈ ఏడాది వర్షాలు పూర్తిగా తగ్గిపోవడం వల్ల అటవీ ప్రాంతాల్లో చెట్లు పూర్తిగా ఎండిపోవడంతో పాటు నీటి గుంతల్లో చుక్క నీరు కూడా లేకుండా పోయాయి. దీంతో అడవుల్లో జీవించే జంతువులు ఆహారం కొరతతో పాటు ముఖ్యంగా నీటి సమస్య ఏర్పడటంతో అడవులను వీడి జనావాసాల్లోకి వచ్చే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సాధారణంగా ఎండాకాలం వచ్చిందంటే అటవీ ప్రాంతాల చుట్టుపక్కల గ్రామాల్లో ప్రతి ఏటా ఎలుగుబంట్లు, చిరుత దాడుల్లో ప్రజలు గాయపడడం ప్రతి ఏటా చూస్తున్నాం. ఈ ఏడాది కరువు ఛాయలు వన్య ప్రాణులపై కూడా పడడంతో విస్తారంగా అటవీ భూముల చుట్టుపక్కల గ్రామాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వన్యప్రాణులు ఎక్కువగా నివసించే అటవీ భూముల్లో నీటి తొట్లెలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. నీటి తొట్లెలకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసి వన్యప్రాణుల దాహం తీర్చేందుకు అటవీ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నా అడవుల్లో జీవించే వన్య ప్రాణులకు ఆహార, నీటి సమస్యతో పాటు విపరీతమైన ఎండలు ఏర్పడే అవకాశం ఉండటంతో అవి విచ్చలవిడిగా తిరిగే ప్రమాదం ఉందని, జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

తప్పుడు హామీలతో అప్పుల ఊబిలోకి రాష్ట్రం



మాట్లాడుతున్న చెన్నబసవనగౌడ పాటిల్

హొసపేటె: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రభుత్వం అసలు రంగు బట్టబయలైందని, ప్రజలకు తప్పుడు హామీలు ఇస్తూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెన్నబసవనగౌడ పాటిల్ ఆరోపించారు. నగరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హంపీ ఉత్సవాల అనంతరం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహమ్మద్‌ను మంత్రి పదవి నుంచి తప్పించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడే స్వయంగా చెప్పారన్నారు. వెంటనే జిల్లా ఇన్‌చార్జి మంత్రిని పదవి నుంచి తొలగించాలన్నారు. వసూళ్ల కోసం మంత్రి జమీర్ ప్రతి శాఖలోనూ ఏజెంట్లను పెట్టుకున్నారని కాంగ్రెస్ వారే ఆరోపిస్తున్నారన్నారు. వచ్చే లోకసభ ఎన్నికల్లో బీజేపీని తప్పకుండా గెలిపించేందుకు కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా నడుం బిగించాలని కోరారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై జాగృతి జాతా



కురుగోడులో చేపట్టిన అధికారులు, విద్యార్థుల జాతా

కంప్లి: బాదనహట్టి గ్రామం నుంచి కురుగోడు పట్టణం వరకు మంగళవారం రాజ్యాంగ జాగృతి జాతా నిర్వహించారు. దొడ్డ బసవేశ్వర దేవస్థానానికి చేరిన జాతా అనంతరం గెణికెహాళ్, ముష్టగట్టి, వీరాపుర తదితర గ్రామాల మీదుగా సాగింది. సమాజ కళ్యాణ అధికారి మమత జాతాను ప్రారంభించారు. తహసీల్దార్ మల్లేశప్ప, బీఈఓ సిద్దలింగమూర్తి, ముఖ్యాధికారి దురుగణ్ణ, టీపీ ఈఓ నిర్మల, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, పురసభ, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

విజయవంతంగా చైతన్య జాతా

హొసపేటె: జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న రాజ్యాంగంపై చైతన్య జాతా విజయవంతంగా సాగుతోందని జిల్లాధికారి దివాకర్ తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 90 జీపీలు, 9 పట్టణాల్లో ఈ జాతాను చేపట్టామన్నారు. రాజ్యాంగం గురించి కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహిస్తామన్నారు. జెడ్పీ సీఈఓ సదాశివప్రభు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి మంజునాథ్ పాల్గొన్నారు.

ఈడీ దాడిలో రూ.31 లక్షలు స్వాధీనం

సాక్షి,బళ్లారి: నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాలపై ఈడీ అధికారులు రెండు రోజులుగా సోదాలు చేసి ఎలాంటి ఆధారాలు లేకుండా నిల్వ ఉంచిన రూ.31 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు బెంగళూరులో సంబంధిత అధికారులు మంగళవారం వెల్లడించారు. బళ్లారి నగరంలోని ఎమ్మెల్యే, ఆయన తండ్రి మాజీ ఎమ్మెల్యే నారా సూర్యనారాయణరెడ్డి, ఆయన చిన్నాన్న, మాజీ బుడా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, వ్యక్తిగత కార్యదర్శితో పాటు చెన్నై, ఆంధ్రప్రదేశ్‌లో ఏకకాలంలో ఆయనకు సంబంధించిన కార్యాలయాల్లో ఆదివారం రాత్రి వరకు సోదాలు చేశారు. రెండు రోజుల పాటు జరిపిన సోదాల వివరాలను ఈడీ అధికారులు ప్రకటించారు. సోదాల్లో పలు రికార్డులను, స్థిర, చర ఆస్తులకు సంబంధించి లెక్కకు దొరకని రూ.31లక్షలు నగదు స్వాధీనం చేసుకోవడంతో పాటు గత ఎన్నికలకు ముందు దాదాపు రూ.42 కోట్ల నిధులు సేకరించి చట్టవ్యతిరేకంగా ఉపయోగించుకున్నట్లు రుజువైందని తెలిపారు. ఆయన సోదరుడు శరత్‌రెడ్డి అనే వ్యక్తి విదేశీ కంపెనీల ద్వారా రహస్యంగా నిధులు సేకరిస్తున్నారని, బంధువుల పేరుతో బ్యాంకు ఖాతాలను తెరిచి వారికి తెలియకుండా లావాదేవీలు జరిపినట్లు తేలిందని ఈడీ పేర్కొంది.

కమనీయం.. పండితారాధ్య రథోత్సవం



పండితారాధ్య రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం

రాయచూరు రూరల్: యాదగిరి తాలూకా అబ్బె తుమకూరులో పండితారాధ్య రథోత్సవం, జాతర వైభవంగా జరిగాయి. సోమవారం రాత్రి ఆలయం వద్ద భక్తులు విశేష పూజలు జరిపారు. వేలాది మంది భక్తుల సమక్షంలో రథాన్ని లాగారు. రథోత్సవంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఐకమత్యమే బలం



మాట్లాడుతున్న తత్వరూపానంద స్వామీజీ

కంప్లి: భావసార క్షత్రియులు ఐకమత్యంతో సంఘాన్ని బలోపేతం చేయాలని ముంబైకి చెందిన రామకృష్ణ పరమహంస ఆశ్రమం తత్వరూపానంద స్వామీజీ తెలిపారు. హూవినహడగలి పట్టణంలో పాండురంగ, రుక్మిణి ఇతర దేవతా మూర్తుల ప్రతిష్టాపన సందర్భంగ భావసార క్షత్రియ సమాజం ఏర్పాటు చేసిన ధర్మసభలో ఆయన మాట్లాడారు. భావసార క్షత్రియులు మైనార్టీలతో సహా అన్ని సముదాయాల వారితో కలిసిమెలిసి జీవిస్తూ సౌహార్థత పెంచుకున్నారన్నారు.

సేవాలాల్ మాలధారుల పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న సేవాలాల్ భక్తులు

హొసపేటె: బంజారా సామాజిక వర్గానికి చెందిన సంత సేవాలాల్ జయంతిలో భాగంగా తాలూకాలోని లింగనాయకనహళ్లి తండాకు చెందిన సేవాలాల్ మాలధారులు సంత సేవాలాల్ జన్మస్థలం సూరగొండనకొప్పకు పాదయాత్రను ప్రారంభించారు. 19వ సంవత్సరం పాదయాత్ర ప్రారంభించిన తాండా భక్తబృందానికి గ్రామస్తులు పూలమాలలు వేసి ఘనంగా వీడ్కోలు పలికారు. గ్రామంలో 60 మందికి పైగా భక్తులు పవిత్ర సేవాలాల్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫిబ్రవరి 15న దావణగెరె జిల్లా న్యామతి తాలూకా సూరగొండనకొప్పలో సేవాలాల్ 285వ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఆ రోజు తీర్థయాత్రకు వెళ్లిన మాలధారులు పూలదండను కప్పి సాధువుల ఆశీస్సులు పొంది తిరిగి పట్టణానికి చేరుకుంటారు.

కర్ణాటక రెడ్డి జన సంఘం డైరెక్టర్‌గా ఐనాథరెడ్డి



ఐనాథరెడ్డి

సాక్షి,బళ్లారి: కర్ణాటక రెడ్డి జన సంఘం డైరెక్టర్‌గా గణపాల ఐనాథరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బెంగళూరులో ప్రధాన కార్యాలయం ఉన్న సంఘం కార్యాలయంలో పదాధికారులు, డైరెక్టర్ల ఎంపిక జరిగింది. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన ఈయన్ను సంఘం డైరెక్టర్‌గా ఎంపిక చేశారు. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో ఉంటారు. పలు విద్యా సంస్థలు, సేవా కార్యక్రమాలు, అన్నదానాలు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్న సంఘం పదాధికారులు ఈ ఎంపిక పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో డైరెక్టర్‌గా ఎంపిక చేయడం హర్షణీయమని, సంఘం అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

వింత దూడ జననం



పుట్టిన వింత దూడ ఇదే

కంప్లి: కురుగోడు తాలూకా వద్దట్టి గ్రామంలో రైతు బసప్ప ఇంట్లో పెంచుకుంటున్న ఆవుకు మంగళవారం 2 తలలు, 6 కాళ్లుగల వింత ఆవుదూడ జన్మించింది. అయితే పుట్టిన కొద్దిసేపటికే దూడ మృతి చెందింది. ఈ విషయం దావానలంలా వ్యాపించడంతో వింతను తిలకించేందుకు గ్రామస్తులు బారులు తీరారు.

బెళగావి జిల్లా విభజనకు సర్కార్ సంసిద్ధత

రాయచూరు రూరల్: కర్ణాటక పరిపాలనలో ప్రజలకు సత్వర సేవలు అందించాలనే సదాశయంతో రాష్ట్ర ప్రభుత్వం బెళగావి జిల్లా విభజనకు సంసిద్ధతను వ్యక్తం చేసింది. అందులో భాగంగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో 31వ జిల్లా ఏర్పాటుకు సంబంధించి పూర్తి స్థాయి పరిపాలన వ్యవహారాలపై నివేదిక అందించాలని కోరుతూ బెళగావి ప్రాంతీయ కమిషనర్ సంజయ్ శెట్టన్నవర్‌ను ఆదేశించింది. 2023 ఆగస్టులో అథణిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలంటూ నాడు ఆందోళనలు చేపట్టారు. జిల్లా విభజన, నూతన జిల్లా ఆవిర్భావానికి సంబంధించి భౌగోళిక విస్తీర్ణం, జనాభా, ఉప విభాగాలు, తాలూకాలు, మౌలిక సౌకర్యాలు, ఇతర అంశాలపై నివేదిక రూపొందించి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. అథణి జిల్లా ఏర్పాటు విషయంలో మోటగి మఠాధిపతి ప్రభు చెన్నబసవ స్వామీజీ, గచ్చిన మఠద శివబసవశ్రీ, శెట్ర మఠాధిపతి మరుళ సిద్ద స్వామీజీలు, రైతులు, సంఘ సంస్థలు, విద్యాలయాలు, సైనికులు మద్దతు పలికారు.

నిందితుల అరెస్ట్‌కు డిమాండ్



వినతిపత్రం సమర్పిస్తున్న నేతలు

రాయచూరు రూరల్: జిల్లాలో అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్‌ను అడ్డుకున్న పోలీస్ కానిస్టేబుల్‌పై దాడి చేసిన నిందితులను అరెస్ట్ చేయాలని కన్నడ పర సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో సంచాలకుడు అశోక్ కుమార్ జైన్ మాట్లాడారు. కృష్ణా నదీ తీరంలోని దొడ్డంబళి, గోపాలపురల నుంచి ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక రవాణ చేస్తుండగా ట్రాక్టర్‌ను అడ్డుకున్న పోలీస్ కానిస్టేబుల్ హన్మంతరాయపై ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు సంతోష్, రామణ్ణ నాయక్, తిమ్మారెడ్డి దాడి చేసి గాయపరిచారన్నారు. వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

లోక్‌సభ ఎన్నికల్లో 28 స్థానాల్లో గెలుస్తాం



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరాములు

కంప్లి: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో జిల్లాతో పాటు రాష్ట్రంలో 28 సీట్లు దక్కించుకుంటామని మాజీ మంత్రి శ్రీరాములు తెలిపారు. హగరిబొమ్మనహళ్లి పట్టణంలో ఏర్పాటు చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షునికి అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో మార్పు గాలులు వీస్తున్నాయన్నారు. తాము రాష్ట్రంలో బీజేపీ పటిష్టానికి తాలూకా స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు గట్టిగా కృషి చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పరిస్థితిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కేవలం గ్యారెంటీ మాటలకు మోసపోయామని నేడు అందరూ తెలుసుకున్నారన్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఘనవిజయం కట్టబెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

బీజేపీ నేతలపై చర్యలు చేపట్టాలి

రాయచూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వంలోని మంత్రులపై బీజేపీ నేతలు విమర్శలు చేయడాన్ని కేపీసీసీ ప్రధాన కార్యదర్శి వసంత్ కుమార్ ఖండించారు. మంగళవారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రులు ప్రియాంక ఖర్గే, ఇతర సహచర మంత్రులను ఇష్టానుసారం దూషించిన మాజీ ఉప ముఖ్యమంత్రి ఈశ్వరప్ప తదితరులపై చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలో కుల మతాల మధ్య చిచ్చు పెట్టే కుట్ర పన్నుతున్నారన్నారు. కరువు సహాయక పరిహారం కింద రైతులకు ఎకరాకు రూ.2 వేలను ఖాతాలో జమ చేశారన్నారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎలాంటి కరువు సహాయం అందించ లేదన్నారు. పేదలు, రైతులు, కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించిందన్నారు. నేతలు దరూరు బసవరాజ, ఈశప్ప, బాబర్, అబ్దుల్ కరీంలున్నారు.

16న పంపావిరుపాక్షేశ్వర జాతరకు సెలవు ఇవ్వండి



అధికారికి వినతిపత్రాన్ని అందిస్తున్న కరవే నేతలు

గంగావతి: నగరంలోని జంతకల్‌లో ఈనెల 16న పంపా విరుపాక్షేశ్వర జాతర మహోత్సవం జరుగనున్నందున ఆ రోజు సెలవు ప్రకటించాలని కర్ణాటక రక్షణ వేదిక డిమాండ్ చేసింది. ఈమేరకు వారు జిల్లాధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. రాయల కాలం నాటి పంపా విరుపాక్షేశ్వర దేవస్థానానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని, ఇలాంటి జాతర మహోత్సవానికి విద్యార్థులకు సైతం సెలవు ప్రకటించాలని వారు వినతిపత్రంలో కోరారు. ఈసందర్భంగా కరవే జిల్లాధ్యక్షులు పంపణ్ణ నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే ప్రధాని లక్ష్యం



భారత్ బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

రాయచూరు రూరల్: పేదల ఆకలి తీర్చడమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యమని బీజేపీ జిల్లాధ్యక్షుడు, ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం ఏపీఎంసీ భవనంలో కేంద్ర ప్రభుత్వ పథకపు భారత్ బియ్యాన్ని పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో క్వింటాల్ బియ్యం ధర రూ.6 వేలు ఉండగా ప్రధాని మోదీ పేదలకు రూ.29 కేజీ చొప్పున బియ్యాన్ని అందుబాటులోకి తెచ్చారన్నారు. ఎంపీ రాజా అమరేశ్వర నాయక్ మాట్లాడుతూ కళ్యాణ కర్ణాటకలో సోనా మసూరి బియ్యాన్ని పండించే రైతులు సిరి ధాన్యాల సాగుపై అధిక శ్రద్ధ కనబరచాలన్నారు.

గబ్బూరు ఎస్‌ఐగా మంజునాథ్



మంజునాథ్

రాయచూరు రూరల్: నగరంలోని పశ్చిమ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న మంజునాథ్ దేవదుర్గ తాలూకా గబ్బూరు పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా నియమితులయ్యారు. ఆయన ఇప్పటికే ప్రొబేషనరీ ఎస్‌ఐగా సదర్ బజార్, గ్రామీణ, బెంగళూరు లోకాయుక్త, పశ్చిమ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా విధులు నిర్వహించారు.

ఆరోగ్య శిబిరాలతో పేదలకు మేలు



రోగులకు ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తున్న దృశ్యం

బళ్లారిఅర్బన్: కర్ణాటక మురికివాడల అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య పరీక్ష శిబిరంతో సామాన్య ప్రజలకు ఎంతో అనుకూలం అవుతుందని 35వ వార్డు కార్పొరేటర్ మించు శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. మంగళవారం తన వార్డులోని ఇందిరా నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. మండలి ఈఈ తిమ్మన్న, ప్రకాష్, పాఠశాల హెచ్‌ఎం హనుమక్క, ఉపాధ్యాయులు మల్లికా బేగం, ఎస్‌డీఎంసీ అధ్యక్షులు మారుతీ, వైద్యులు మంజునాథ, సంగీత, మండలి సిబ్బంది పాండు, జయతీర్థ, నీలమ్మలతో పాటు స్థానికులు రమేష్, హంపీ మల్లి, శశికుమార్, నాగరాజ్ పాల్గొన్నారు.

సుజయీంద్ర తీర్థుల ఉత్సవాలు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయచూరు రూరల్: మంత్రాలయంలోని రాఘవేంద్ర స్వామి మఠంలో మంగళవారం సుజయీంద్ర తీర్థుల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. రాఘవేంద్ర స్వామి మఠంలో మూల విరాట్‌కు మఠాధిపతి సుబుధేంద్ర తీర్థ శ్రీపాదంగళ్ ఊంజల సేవ నెరవేర్చారు. భక్తుల సందడి మధ్య రథోత్సవం నిర్వహించారు.

ఉద్యమ నాయకుడు మృతి



రమేష్(ఫైల్)

హొసపేటె: నగర విద్యార్థి, యువజన ఉద్యమ నాయకుడు కే.రమేష్(50) మంగళవారం మృతి చెందారు. గత కొన్నేళ్ల నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఆయన ఉమ్మడి బళ్లారి జిల్లాలో ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యుడుగా గత కొన్నేళ్లుగా వ్యవహరించారు. నగరంలోని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారు. పేదలకు ఇళ్ల స్థలాలు, యువతకు ఉపాధి విషయంలో గత కొన్ని దశాబ్దాలుగా ఆయన రాజీలేని పోరాటం చేస్తున్నారు. ఉద్యమం కోసం కుటుంబాన్ని త్యాగం చేశారు. అవిభక్త బళ్లారి జిల్లాలో యువతకు, విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

వ్యక్తి హత్య



రసూల్‌సాబ్(ఫైల్)

రాయచూరు రూరల్: తాలూకాలో ఓ వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసిన ఘటన వెలుగు చూసింది. కుర్తకుందలో ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు యాపలదిన్ని పోలీస్ స్టేషన్‌లో ఈనెల 4న కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అయితే సోమవారం సాయంత్రం గ్రామానికి కిలోమీటర్ దూరంలోని దర్గా వద్ద, కొండపై వ్యక్తి పుర్రె, శరీర అవయవాలు కనిపించడంతో అందరూ అవాక్కయ్యారు. మృతుడిని రసూల్‌సాబ్(45)గా గుర్తించిన యాపలదిన్ని పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

హుబ్లీ: జిల్లాలోని నవలగుంద తాలూకా కన్నూర గ్రామంలో మోట బసవేశ్వర దేవస్థానం దగ్గర మినీ వాహనం, ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాద స్థలంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మృతురాలిని టీపీ సభ్యురాలు శాంతవ్వ(65)గా గుర్తించారు. మినీ వాహనం డ్రైవర్ నాగరాజ్ తీవ్రంగా గాయపడి హుబ్లీ కిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. గాయపడిన మరో నలుగురిని నవలగుంద ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మినీ వాహనంలో ఉన్న వారంతా ఆ తాలూకా తడహాళ గ్రామ వాసులే. ఒకే కుటుంబానికి చెందిన ప్రశాంత్, రత్నవ్వ, పారవ్వ, శకుంతల ఇబ్రహింపుర నుంచి తడహాళకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటన తర్వాత ట్రాక్టర్ డ్రైవర్ పరారయ్యాడు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆలయ చోరుడికి దేహశుద్ధి



శరణ బసవ

రాయచూరు రూరల్: ఆలయంలో చోరీకి పాల్పడ్డ నిందితుడికి దేహశుద్ధి చేసిన ఘటన రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకాలో చోటు చేసుకుంది. తాలూకాలోని నాగోలిలో వెలసిన ద్యావమ్మ, బీరలింగేశ్వర, బసవేశ్వర ఆలయంలో దొంగ చొరబడి రూ.10 లక్షలు విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలను దొంగలించుకెళుతుండగా గ్రామస్తులు యువకుడిని పట్టుకొని చితకబాది పోలీసులకు అప్పగించారు. నిందితుడిని మాన్వి తాలూకా కప్పగల్ గ్రామానికి చెందిన శరణ బసవగా పోలీసులు గుర్తించారు. ఘటనపై దేవదుర్గ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.